

'రాష్ట్రాన్ని దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 165

శుక్రవారం 5-9-2025



మా సారు.. తగ్గేదే లే!
తన గురువు సుకుమార్ గురించి డైరెక్టర్ బుచ్చిబాబు చెప్పిన విశేషాలు -13లో



గెలిచి నిలిచిన భారత్
ఆసియాకప్ హాకీ టోర్నీ 'సూపర్–4' మ్యాచ్‌లో మలేసియాపై విజయం -15లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



బెంగాల్ అసెంబ్లీలో రగడ
పశ్చిమబెంగాల్ శాసనసభ రణరంగాన్ని తలపించింది. టీఎంసీ, బీజేపీ మధ్య తీవ్ర వాగ్వాదం, ఘర్షణ చోటుచేసుకున్నాయి.
వివరాలు 6లో ▸



యుద్ధం ఆగాలంటే...
టారిఫ్‌లతో పలు దేశాలను భయపెడుతున్న ట్రంప్ సర్కార్ .. యూఎస్ సుప్రీంకోర్టునూ భయపెట్టే దుస్సాహసానికి ఒడిగట్టింది.
వివరాలు 6లో ▸



చెట్ల నరికివేతతోనే చేటు
విపరీతంగా, విచ్చలవిడిగా వృక్షాల నరికివేతే ప్రకృతి వినాశనానికి అసలు కారణమని సుప్రీంకోర్టు ధర్మాసనం అభిప్రాయపడింది.
వివరాలు 6లో ▸



డిసెంబర్‌కల్లా స్వేచ్ఛా వాణిజ్యం
స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని ఈ ఏడాది డిసెంబర్‌కల్లా కుదుర్చుకోవాలని భారత్, ఈయూ నిర్ణయించాయి.
వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

ఎన్నికల హామీని నిలబెట్టుకున్నాం



గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని గ్రామ పాలనాధికారుల (జీపీవో) నియామకం ద్వారా నిలబెట్టుకున్నట్టు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు.
- వివరాలు 3లో▶

మొత్తం కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరిపించాలి



కాళేశ్వరానికి సంబంధించి బరాజ్‌లపైనే కాకుండా మొత్తం ప్రాజెక్ట్‌లో అవినీతిపై సీబీఐ విచారణ జరిపించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు అన్నదమ్ముల వంటివని ఎద్దేవా చేశారు.
- వివరాలు 3లో▶

ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ కేన్సర్ వైద్యం



రాష్ట్రంలో పెరుగుతున్న కేన్సర్ రోగులకు జిల్లా కేంద్రాల్లోనే చికిత్స అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రతీ జిల్లాలో డే కేర్ కేన్సర్ సెంటర్లు, పల్లియేటివ్ కేర్ సెంటర్లను ఏర్పాటు చేస్తోంది. ఇందుకోసం ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేశారు.
- వివరాలు 12లో▶

కన్నతండ్రి కర్కశత్వం



భార్యపై కోపంతో ముగ్గురు కన్నబిడ్డలపై పెట్రోల్ పోసి కాల్చి చంపిన ఓ తండ్రి... ఆపై తనూ పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ అమానవీయ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటుచేసుకుంది.
- వివరాలు 5లో▶

వరద నష్టాలకు శాశ్వత పరిష్కారం

బాధితులందరినీ ఆదుకునే బాధ్యత ప్రభుత్వానిది: కామారెడ్డి జిల్లాలో సీఎం రేవంత్ భరోసా

- వందేళ్లలో రాని వరదలొచ్చి భారీ నష్టం జరిగింది.. మళ్లీ వరదలు వచ్చి ఇబ్బందులు రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటాం
- దీనికోసం అధికారులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలి
- విపత్తు నిర్వహణలో కామారెడ్డి జిల్లాలో అమలు చేసే విధానం రాష్ట్రమంతటికీ విస్తరిస్తాం
- మీ కష్టాలు చూసి తగిన సాయం అందించేందుకే వచ్చా..
- ఇళ్లు కూలిపోయిన పేదలకు ప్రత్యేక కోటా కింద ఇళ్లు మంజూరు చేస్తాం
- కొడంగల్‌తో సమానంగా కామారెడ్డి అభివృద్ధి చేస్తామని వెల్లడి
- కామారెడ్డి జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రులతో కలిసి పర్యటన
- వరద నష్టంపై అధికారులతో సమీక్ష



పంట నష్టపోయిన రైతులతో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి. చిత్రంలో మహేశ్ కుమార్ గౌడ్, మదన్‌మోహన్‌రావు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: 'వందేళ్లలో రాని వరదలొచ్చి పెద్ద నష్టమే జరిగింది. తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది. ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలి. విపత్తు నిర్వహణలో కామారెడ్డి జిల్లాలో అమలు చేసే విధానం రాష్ట్రమంతటికీ విస్తరిస్తాం. ఇందుకు ఆయా శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి శాశ్వత పరిష్కారానికి సమగ్ర నివేదిక రూపొందించాలి' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కామారెడ్డి జిల్లాలో గురువారం వరద ప్రభావిత ప్రాంతాల్లో సీఎం పర్యటించి బాధితులతో మాట్లాడారు. నష్టపోయిన రైతులందరినీ ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. మీ కష్టాలు చూసి తగిన సాయం అందించాలన్న ఉద్దేశంతోనే
మిగతా 3వ పేజీలో ▶

2027 డిసెంబర్ 9న ఎస్ఎల్‌బీసీ అంకితం

సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన

- ఆ లోగా శ్రీశైలం ఎడమ గట్టు సొరంగం పూర్తి చేయాలి
- పనులు ఒక్కరోజు కూడా ఆలస్యం కావొద్దు ఇది నల్లగొండకే కాదు.. యావత్ తెలంగాణకు కీలకమని వెల్లడి

- వివరాలు 2లో

అమిత్‌షాకు పుష్పగుచ్ఛం అందిస్తున్న భట్టి. చిత్రంలో తుమ్మల, జితేందర్‌రెడ్డి



వరద సాయం రూ.16,732 కోట్లివ్వండి

తెలంగాణలో వరదలను జాతీయ విపత్తుగా గుర్తించండి

- ప్రాథమిక అంచనా ప్రకారం రూ.5018.72 కోట్ల నష్టం
- గతేడాది రూ.11,713 కోట్ల నష్టానికీ సాయం అందలేదు
- గత, ప్రస్తుత సాయం కింద 16,732 కోట్లు అందించండి
- కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల విజ్ఞప్తి
- త్వరలోనే కేంద్ర బృందాలను రాష్ట్రానికి పంపుతామని అమిత్ షా హామీ
- ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు సాయం చేయాలని
- కేంద్ర మంత్రి నిర్మలకు భట్టి, తుమ్మల వినతి

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో ఇటీవల కురిసిన భారీ వర్షాలను జాతీయ విపత్తుగా పరిగణించి ప్రత్యేక సాయం అందించాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షాను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కోరారు. వర్షాలతో భారీగా పంట, ఆస్తి, ప్రాణ నష్టం జరిగిందని, కేంద్రం తక్షణమే సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. గురువారం ఢిల్లీలో అమిత్ షా అధికారిక నివాసంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆగస్టు 25 నుంచి 28వ తేదీ వరకు రాష్ట్రంలో భారీ వర్షాలు కురిశాయని.. కామారెడ్డి, మెదక్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో భారీ విధ్వంసం జరిగిందని తెలిపారు. ప్రాథమిక అంచనా ప్రకారం రూ.5,018 కోట్ల మేర
మిగతా 2వ పేజీలో ▶

లారెన్స్‌వాంగ్, మోదీ ఆలింగనం



భారత్–సింగపూర్ మధ్య సుదృఢ బంధం

ప్రధాని మోదీతో సింగపూర్ ప్రధాని లారెన్స్ భేటీ

వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని విస్తరింపజేసుకోవాలని నిర్ణయం.. పలు అవగాహన ఒప్పందాలపై సంతకాలు

శాంతి, సౌభాగ్యాలే ఇరుదేశాల ఉమ్మడి లక్ష్యమని ప్రకటన

- వివరాలు 6లో▶

ఓయూ 53.. జేఎన్టీయూ 94..

- ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకుల్లో రాష్ట్ర సంస్థలకు మిశ్రమ ఫలితాలు
- ఓవరాల్ ర్యాంకుల్లో ఉస్మానియాకు 53వ ర్యాంకు
- గత ఏడాదితో పోల్చితే ఏకంగా 17 ర్యాంకుల పైకి
- ఇంజనీరింగ్ విద్యలో జేఎన్టీయూహెచ్‌కు 94వ స్థానం
- 25 నుంచి 26కు తగ్గిన యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్
- మెరుగుపడిన ఐఐటీ హైదరాబాద్ స్థానం

సాక్షి, హైదరాబాద్

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) ర్యాంకుల్లో ఉస్మానియా యూనివర్సిటీ సత్తా చాటింది. ఓవరాల్ కేటగిరీలో 2024లో 70వ స్థానంలో ఉన్న ఓయూ.. 2025లో ఏకంగా 17 ర్యాంకులు ఎగబాకి 53వ స్థానానికి చేరింది. రాష్ట్రంలో సాంకేతిక విద్యలో కీలకంగా ఉన్న జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూహెచ్) ఇంజనీరింగ్ విద్య విభాగంలో 88 ర్యాంకు నుంచి 94వ స్థానానికి పడిపోయింది. 2025 సంవత్సరానికి సంబంధించిన ర్యాంకులను ఎన్ఐఆర్ఎఫ్ విడుదల చేసింది. బోధన, శిక్షణ, మౌలిక వసతులు, పరిశోధన, వృత్తి నైపుణ్యం మెళకువలు, ఉపాధి అవకాశాలు, ఆర్థిక పరమైన అంశాలతోపాటు ఇతర కొలమానాలను పరిగణనలోకి తీసుకుని ఈ ర్యాంకులు కేటాయిస్తారు. హైదరాబాద్ ట్రిపుల్ ఐటీ కూడా ర్యాంకుల్లో సత్తా చాటింది. 2018–19 నుంచి 2023–24 సంవత్సరాల మధ్య ఆయా సంస్థల
మిగతా 12వ పేజీలో ▶



నేర చరితుల్లో నంబర్ వన్!



ఏపీ కేబినెట్‌లో 96 % మందిపై క్రిమినల్ కేసులు

ఏపీ సీఎం చంద్రబాబుపై 19.. నారా లోకేశ్‌పై 17 క్రిమినల్ కేసులు

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై ఎనిమిది..

రూ.5,705 కోట్లతో అత్యంత సంపన్న మంత్రిగా పెమ్మసాని

ఏడీఆర్ - ఎన్ఈడబ్ల్యూ తాజా నివేదికలో వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలోనే అత్యధికంగా ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గంలో నేర చరితులు ఉన్నట్లు అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్), నేషనల్ ఎలక్షన్ వాచ్ (ఎన్ఈడబ్ల్యూ) సంయుక్త నివేదిక వెల్లడించింది. ఏపీలో 96 % మంది మంత్రులపై క్రిమినల్ కేసులు నమోదైనట్లు ఎన్నికల అఫిడవిట్లను విశ్లేషించి రూపొందించిన తాజా నివేదికలో పేర్కొంది. కేంద్ర ప్రభుత్వంతోపాటు 27 రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లో మంత్రులకు సంబంధించిన వివరాలు ఇందులో పొందుపరిచారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై 19 క్రిమినల్ కేసులు ఉండగా మంత్రి నారా లోకేశ్‌పై 17 క్రిమినల్ కేసులు నమోదైనట్లు తెలిపింది. ఇక దేశంలో అత్యధిక ఆస్తులు కలిగిన టాప్ 10 అధికార పార్టీల ప్రజా ప్రతినిధుల్లో టీడీపీకి చెందిన కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ రూ.5,705 కోట్లతో మొదటి స్థానంలో నిలవగా రూ.931 కోట్ల సంపదతో సీఎం చంద్రబాబు నాయుడు మూడో స్థానంలో ఉన్నారు. రూ.824 కోట్లతో మునిసిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ నాలుగో స్థానంలో, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రూ.542 కోట్లతో ఏడో స్థానంలో ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. అతి తక్కువ
మిగతా 12వ పేజీలో ▶

ఇదండీ సంగతి



ఇక నుంచి మన మెనూ.. బ్రేక్‌ఫాస్ట్‌లో బ్రెడ్డు, లంచ్‌లో పరోటా–పప్పు, డిన్నర్‌లో చపాతి–ఆలూకూర్మా..!!

ఈఎంఐ... విలాసమే విలాపమై!

- జెన్ జీ, మిలేనియల్స్‌లో పెరుగుతున్న రుణాలు
- అందుబాటులో ఎన్‌బీఎఫ్‌సీలు, లోన్ యాప్‌లు
- కొనేముందు 3 ప్రశ్నలు వేసుకుంటే మంచిది
- అప్పు భవిష్యత్తుకు ముప్పు అంటున్న నిపుణులు

2లో





మహబూబాబాద్‌లోని మన గ్రోమోర్ ఎరువుల దుకాణం ఎదుట నిప్పు పెట్టి.. రాళ్లు రువ్వుతున్న రైతులు. అనంతరం ఎరువుల దుకాణం గోడౌన్ తలుపులు పగలగొట్టి యూరియా బస్తాలను తీసుకెళ్తున్న రైతులు

రైతన్న కన్నెర్ర

- యూరియా కోసం రైతుల ఆగ్రహావేశాలు
- మన గ్రోమోర్ సెంటర్‌పై రాళ్లదాడి.. బోర్డు పీకి నిప్పు
- యూరియా బస్తాల లూటీకి యత్నం.. మహిళల సిగపట్లు
- ఆందోళనలతో ఉద్రిక్తంగా మారిన మహబూబాబాద్

దొరుకుతుందో..లేదో

- పలు జిల్లాల్లో యూరియా కోసం తెల్లవారుజాము నుంచే క్యూలైన్లు..
- యూరియా దొరక్క నిరాశతో ఇంటి ముఖం.. పలు చోట్ల రైతుల ధర్నాలు.. రాస్తారోకోలు

12లో

ఆపరేషన్.. అటవీ భూములు

జిల్లా స్థాయిలో సిట్, రెవెన్యూ డివిజన్లలో స్పెషల్ టీమ్‌లను ఏర్పాటు చేసిన ప్రభుత్వం

- రిజర్వ్ ఫారెస్టులో అటవీయేతర అవసరాలకు వ్యక్తులు, సంస్థలకిచ్చిన భూములను స్వాధీనం చేసుకునేందుకే టీమ్‌ల ఏర్పాటు
- ఈనెల 15లోగా ఫారెస్ట్, సీఏ బ్లాక్‌లు, నోటిఫై చేయని బ్లాక్‌లలో ఇచ్చిన పట్టాలు, అటవీ ఆక్రమణలపై పూర్తి నివేదికకు ఆదేశాలు

- వివరాలు 16లో▶



కవ్వాల్ అటవీ ప్రాంతంలో ఆక్రమణలు (ఫైల్)

ఈఎంఐ.. విలాసమే.. విలాపమై!

'అప్పు'డే తెల్లారిందా.. పాత సినిమాలో ఒక డైలాగ్. మిలేనియల్స్ (1981-96 మధ్య పుట్టినవారు).. జెన్ జీ (1997-2012 మధ్య జన్మించినవారు).. పరిస్థితి ఇలాగే ఉంది. అనవసరాలు, విలాసాల కోసం విపరీతంగా అప్పులు చేసేస్తున్నారు. లోన్‌యాప్‌లు.. సులభ వాయిదాలు.. వారిని 'ఈజీగా' అప్పుల బాట పట్టేలా చేస్తున్నాయి. 'అప్పు చేయడం రోగం.. తీర్చకపోవడం ప్రమాదకరం అనేది గుర్తించకపోతే సమస్యలు తప్పవు' అంటున్నారు నిపుణులు.

క్రెడిట్ ఇన్ఫర్మేషన్ కంపెనీ 'ట్రాన్స్ యూనియన్ సిబిల్' ప్రకారం.. ఈ ఏడాది మార్చి 31 నాటికి దేశంలో వ్యక్తిగతంగా రుణాలు తీసుకున్న వారు (యునిక్ ఇండివిడ్యువల్ బారోవర్స్) 28 కోట్ల మంది. ఆర్బీఐ లెక్కల ప్రకారం.. వ్యక్తిగత రుణాలు లేదా వ్యాపారం కోసం లేదా ఇతర అవసరాల కోసం రుణాలు తీసుకునేవారి సంఖ్యతోపాటు, తీసుకునే మొత్తం కూడా పెరిగింది. 2018 మార్చి నాటికి తలసరి రుణం రూ.3.41 లక్షలు ఉంటే 2023 మార్చికి రూ.3.8 లక్షలకు, 2025 మార్చి నాటికి రూ.4.77 లక్షలకు పెరిగింది.

- సాక్షి, స్పెషల్ డెస్క్



- జెన్ జీ, మిలేనియల్స్‌లో పెరుగుతున్న రుణాలు
- అందుబాటులో ఎన్‌బీఎఫ్‌సీలు, లోన్ యాప్‌లు
- కొనేముందు 3 ప్రశ్నలు వేసుకుంటే మంచిది
- అప్పు భవిష్యత్తుకు ముప్పు అంటున్న నిపుణులు

కనీసం 3 రుణాలతో..

ఫిన్‌టెక్ సంస్థల వంటి బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీ) చిన్నచిన్న మొత్తాల్లో ఇచ్చే రుణాలను జెన్ జీ, మిలేనియల్స్ ఎక్కువగా తీసుకుంటున్నారు. రూ.50వేల కంటే తక్కువ రుణాల్లో.. ఈ సంస్థలు ఇచ్చినవే 84.3 శాతం. ముఖ్యంగా ఇలా రుణం తీసుకుంటున్నవారిలో సుమారు 10 శాతం మంది సమయానికి చెల్లించడం లేదట. మరీ ముఖ్యంగా.. గత త్రైమాసికంలో ఇలా రుణం తీసుకున్నవారిలో 66 శాతానికిపైగా అప్పటికే కనీసం 3 రుణాలు తీసుకుని ఉన్నారని ఆర్బీఐ చెబుతోంది.

అనవసర ఖర్చులకు 29 శాతం

'భారత్ ఎలా ఖర్చు చేస్తోంది: వినియోగదారుల వ్యయాల తీరుతెన్నులపై లోతైన అధ్యయనం' పేరుతో కన్సల్టింగ్, ఫైనాన్షియల్ అడ్వైజరీ సేవల్లో ఉన్న పీడబ్ల్యూసీ ఇండియా సహకారంతో ఫిన్‌టెక్ సాఫ్ట్‌వేర్ కంపెనీ పర్ఫియోస్ ఇటీవల ఒక నివేదికను రూపొందించింది. 30 లక్షల మంది టెక్-ఫస్ట్ వినియోగదారుల లావాదేవీల సమాచారాన్ని, వారు చేసే ఖర్చులను పరిశీలించింది.

- ప్రజలు చేసే మొత్తం వ్యయంలో హంగులు, ఆర్భాటాలు వంటి అనవసర ఖర్చులకు చేసేది 29 శాతం ఉంటోంది. ఈ ఖర్చుల్లో 62 శాతం కంటే ఎక్కువ ఫ్యాషన్, వ్యక్తిగత సంరక్షణ వస్తువుల షాపింగ్‌కు చేస్తున్నారు.
- తప్పనిసరి ఖర్చులకు చేసే వ్యయం 39% కాగా, అవసరాలకు 32% ఖర్చు చేస్తున్నారు.
- అన్ని నగరాల్లోనూ వ్యక్తులు తమ ఆదాయంలో 33 శాతానికి పైగా నెల వాయిదాల (ఈఎంఐ) చెల్లింపులకు కేటాయిస్తున్నారు.

ఈఎంఐ.. ఆదాయాన్ని మింగేస్తూ

నెల వాయిదాలు (ఈఎంఐలు).. చాలా ఆకర్షణీయంగా కనిపిస్తాయి. కానీ, దీర్ఘకాలంలో ప్రమాదకరమైనవి. ఎప్పుడు ఎంత ఖర్చు పెడుతున్నామో తెలీదు. - ఇందులోని మరో ముఖ్యమైన విషయం. ఈఎంఐల మాటున ఉండే వడ్డీ.

- ఒకేసారి చెల్లించకుండా భవిష్యత్తులో చెల్లించడం వల్ల.. భవిష్యత్తు లక్ష్యాలు, ఖర్చులు, అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు అప్పులు చేయాల్సిన దుస్థితి దాపురిస్తుంది.
- ఉద్యోగం పోయినా.. తక్కువ జీతం వచ్చే ఉద్యోగానికి మారినా.. ఏదైనా అనారోగ్య సమస్యలాంటిది వచ్చి ఆర్థిక అత్యవసర పరిస్థితి వచ్చినా.. ఈఎంఐలు గుదిబండలా మారతాయి. ఒకటికి మించి ఈఎంఐలు ఉంటే ప్రతినెలా తీవ్రమైన ఒత్తిడి ఉంటుంది.

జీరో కాస్ట్ ఈఎంఐ

చాలామంది 'జీరో కాస్ట్ ఈఎంఐ' ఉందిగా అని ఈ మధ్య విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారు. పేరుకే జీరోకానీ, ఇది కూడా ఖరీదైనదే.

- చాలా సందర్భాల్లో ఆయా కంపెనీలు / వేదికలు ప్రాసెసింగ్ ఫీజు వసూలు చేస్తాయి.
- ఈ లావాదేవీ జరిగిన తరువాత.. ఒకవేళ మనకు ఏదో విధంగా డబ్బు చేతికి అంది ఆ అప్పు తీర్చేద్దామంటే కుదరదు. ముందస్తు చెల్లింపులమీద చార్జీ ఉంటుంది.
- మామూలు ఈఎంఐలానే, ఏదైనా ఒక్క నెలలో చెల్లింపు చేయలేకపోయినా.. ఆలస్యంగా చేసినా.. మొత్తం బకాయిపై వడ్డీ చెల్లించాలి. అలాగే ఆ రుణం తీసుకున్నప్పటి నుంచి జరిపే అలాంటి అన్ని లావాదేవీలపైనా వడ్డీ చెల్లించాలి. ఇలాంటి రకరకాల చార్జీల భారం పడుతుంది.
- ఆలస్యంగా చెల్లించడం వల్ల క్రెడిట్ స్కోర్‌పైనా ప్రభావం పడుతుంది.

ఏమిటి పరిష్కారం?



ఏది కొనాలని అనిపించినా.. ఒక 10 నిమిషాల పాటు ఆలోచించాలి. మూడు ప్రశ్నలు వేసుకోవాలి.

- ఇది అత్యవసరమా? లేక విలాసం కోసం కొంటున్నానా?
- దీనిపై చేస్తున్న ఖర్చు నెలవారీ బడ్జెట్‌ను ఎలా ప్రభావితం చేస్తుంది?
- ఇది లేకుండా నేను ఉండలేనా?

ఈ ప్రశ్నలకు మీ మనసు చెప్పే సమాధానాలతో మీరు సంతృప్తి చెందాక కొనుగోలు చేయాలా వద్దా అనే నిర్ణయం తీసుకోండి.

- వస్తువుల్లో కాకుండా మనుషుల్లో.. అనుబంధాలు, ఆప్యాయతలు, స్నేహాలలో ఆనందాన్ని వెతుక్కోవడం మొదలుపెట్టండి.

అంతిమంగా.. అప్పు లేదా ఈఎంఐలు మీ జీవితాన్ని శాసించకుండా చూసుకోండి. ఆనందం, విలాసం కావాల్సిందే.. కానీ, దాని కోసం మీ ఆర్థిక హద్దులు దాటకండి.. పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్న చందంగా ఇతరులను చూసి నిర్ణయాలు తీసుకోకండి.

ఈఎంఐ.. తత్వం అర్థమై..

ఈఎంఐల తత్వం తెలిసిన వాళ్లు వీటికి కొత్త రూపాలు ఇచ్చారు. అవి..

- ఎండింగ్ మై ఇన్‌కమ్ లేదా ఎంప్టీయింగ్ మై ఇన్‌కమ్ లేదా ఈటింగ్ మై ఇన్‌కమ్ (నా ఆదాయాన్ని తినేస్తోంది)
- ఎవ్రీ మంత్ అయామ్ బ్రోక్ (ప్రతినెలా నన్ను ఏడిపిస్తోంది)
- ఎక్స్‌క్యూజ్ మై ఇగ్నోరెన్స్ (నా అజ్ఞానాన్ని మన్నించు)
- ఎండ్‌లెస్ మంత్లీ ఇన్‌కన్వీనియన్స్ (అంతులేని నెలవారీ అసౌకర్యం)
- ఎవ్రీ మంత్ ఇంటరప్టెడ్ (ప్రతినెలా అంతరాయం)
- ఎవ్రీ మంత్ ఇన్ డెటెడ్ (ప్రతినెలా అప్పులు)



క్లుప్తంగా...

గవర్నర్ మిలాద్-ఉన్-నబీ శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్: మిలాద్-ఉన్-నబీ పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ శుభాకాంక్షలు తెలిపారు. ప్రవక్త బోధనలైన కరుణ, సహనం, సామరస్యం, విశ్వ మానవ సోదరభావం.. శాంతి, సౌభ్రాతృత్వానికి నిరంతరం దిశానిర్దేశం చేస్తూ ఉంటాయన్నారు. ఈ సందర్భంగా సమాజంలో ఐక్యత, శాంతి, సామరస్యం కోసం పునరంకితం అవుదామని పిలుపునిచ్చారు.

ప్రవక్త బోధనలు ఆచరణీయం: సీఎం

సాక్షి, హైదరాబాద్: మిలాద్-ఉన్-నబీ సందర్భంగా ముస్లింలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. మహమ్మద్ ప్రవక్త బోధనలు సకల మానవాళికి సదా ఆచరణీయమని సీఎం అభిప్రాయపడ్డారు.

ప్రవక్త బోధనలతో స్ఫూర్తి: మహేశ్ గౌడ్

సాక్షి, హైదరాబాద్: మిలాద్-ఉన్-నబీ పర్వదినాన్ని పురస్కరించుకొని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ ఒక ప్రకటనలో ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో మానవతా విలువలను పెంపొందించే దిశగా ప్రవక్త బోధనలు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు.

11న 'రజాకార్' సినిమా తిలకించండి

గవర్నర్‌కు బీజేపీ తెలంగాణ విమోచన కమిటీ ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: ఈనెల 11న ప్రసాద్ సినీ థియేటర్‌లో 'రజాకార్'సినిమా ప్రత్యేక ప్రదర్శనను తిలకించాలని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు బీజేపీ తెలంగాణ విమోచన కమిటీ విజ్ఞప్తి చేసింది. నిజాం నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాట చరిత్ర ఆధారంగా తీసిన ఈ చిత్రాన్ని.. సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రదర్శించనున్నట్లు తెలిపింది. గురువారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ అంజి రెడ్డి కలిశారు.

2027 డిసెంబర్ 9న ఎస్‌ఎల్‌బీసీ అంకితం

సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన

- ఆలోగా శ్రీశైలం ఎడమ గట్టు సొరంగం పూర్తి చేయాలి
- సొరంగం పనులు ఒక్కరోజు కూడా ఆలస్యం కావొద్దు
- ఇది నల్లగొండకే కాదు.. యావత్ తెలంగాణకు కీలకమని వెల్లడి
- మంత్రి ఉత్తమ్‌తో కలిసి ఉన్నతస్థాయి సమీక్ష

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం ఎడమ గట్టు సొరంగం (ఎస్ఎల్‌బీసీ) పనులు ఒక్కరోజు కూడా ఆగడానికి వీల్లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ 2027 డిసెంబర్ 9 నాటికి పూర్తి చేసి ప్రజలకు అంకితం చేయాలని స్పష్టంచేశారు. ఆ గడువులోగా పనులు పూర్తి చేసేందుకు ప్రతీ మూడు నెలల ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టుకు అవసరమైన నిధులను గ్రీన్ చానెల్ ద్వారా విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. గురువారం తన నివాసంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, అధికారులతో సీఎం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ టన్నెల్ పూర్తవడం ఫ్లోరోసిస్ బాధిత జిల్లా అయిన నల్లగొండకు మాత్రమే కాకుండా తెలంగాణకు కీలకమని రేవంత్ చెప్పారు. గ్రావిటీ ద్వారా నీటిని ఇవ్వడానికి వీలున్న ఈ టన్నెల్ పనులు చాలా కాలంగా పెండింగ్‌లో పడటం వల్ల ఇబ్బందులు వచ్చాయన్నారు. ప్రణాళిక ప్రకారం అత్యంత నైపుణ్యంతో సొరంగం తవ్వకాల పనులు చేపట్టాలని సూచించారు. గతంలో జరిగిన తప్పులు, లోటుపాట్లు పునరావృతం కాకుండా పకడ్బందీగా రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అనుభవం ఉన్న ఆర్మీ అధికారుల సేవలను వినియోగించుకోవాలని ఈ సందర్భంగా నిర్ణయించారు.

కేస్ స్టడీగా ఉండాలి

ఎస్ఎల్‌బీసీ ఏళ్లకేళ్లుగా తెలంగాణ ప్రజలు ఎదురు చూస్తున్న కలల ప్రాజెక్ట్ అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. భవిష్యత్‌లో దేశ విదేశాల్లో చేపట్టే టన్నెల్ ప్రాజెక్టులకు ఆదర్శంగా ఉండేలా దీని నిర్మాణం పూర్తి చేయాలన్నారు. ఇదొక కేస్ స్టడీగా ఉండాలని ఆకాంక్షించారు. అటవీ శాఖ, ఇంధన శాఖ, ఇరిగేషన్ విభాగంతో సమన్వయం చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎస్ఎల్‌బీసీ పునరుద్ధరణ పనులకు అవసరమైన అన్ని అనుమతులు, నిర్ణయాలు తీసుకునేందుకు ఈ నెల 15లోగా కేబినెట్ సమావేశం ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును ఆదేశించారు. ఒక్క సమావేశంలోనే అన్ని సమస్యలకు పరిష్కారం తీసుకురావాలని నిర్ణయించారు. సొరంగం పనులను వేగంగా పూర్తి చేసేందుకు కాంట్రాక్టు సంస్థ జేపీ అసోసియేట్స్ అన్ని పరికరాలను సిద్ధం చేసుకోవాలని.. కాంట్రాక్టు సంస్థ ఒక్క రోజు పనులు ఆలస్యం చేసినా ఒప్పుకునేది లేదని సీఎం స్పష్టం చేశారు. అవసరమైన యంత్ర పరికరాలతోపాటు సరిపడేంత మంది నిపుణులు, కార్మికులను రంగంలోకి దింపాలని సూచించారు. స్పెషల్ సెక్రటరీ, ఇండియన్ ఆర్మీ కల్నల్ పరీక్షిత్ మెహ్రా మాట్లాడుతూ.. మొత్తం 44 కి.మీ. సొరంగమార్గానికిగాను ఇప్పటికే 35 కి.మీ. సొరంగం తవ్వడం పూర్తయిందని మిగిలిన సొరంగ మార్గం తవ్వడానికి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనున్నట్లు వివరించారు. ప్రతి నెలా 178 మీటర్ల సొరంగం తవ్వడం లక్ష్యంగా పెట్టుకుని జనవరి 2028 నాటికి పూర్తి చేయనున్నట్లు తెలిపారు. అత్యాధునిక సాంకేతికతతో కూడిన హెలీ-బోర్న్ సర్వే నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. దీంతో సొరంగం తవ్వకాల సమయంలో ముందుగానే ప్రమాదాలను పసిగట్టే వీలుంటుందని తెలిపారు. సమీక్షలో నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఆర్మీ రిటైర్డ్ ఇంజనీర్ ఇన్‌చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ హర్ పాల్ సింగ్, ఎన్జీఆర్ఐ డైరెక్టర్ ప్రకాశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఎల్‌బీసీపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్. చిత్రంలో హర్‌పాల్ సింగ్, పరీక్షిత్ మెహ్రా తదితరులు

నేడు గురుపూజోత్సవం

శిల్పకళా వేదిక ఆడిటోరియంలో కార్యక్రమం

- 49 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు
- ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఉత్తమ ఉపాధ్యాయుడు, భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం గురుపూజ దినోత్సవాన్ని నిర్వహించనుంది. హైదరాబాద్ శిల్పకళా వేదిక ఆడిటోరియంలో జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని విద్యాశాఖ వెల్లడించింది. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి , మంత్రి శ్రీధర్‌బాబు, కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కార్యక్రమంలో పాల్గొంటారని విద్యాశాఖ తెలిపింది. ఈ సందర్భంగా 49 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులు ఇవ్వనున్నారు.

ఆహ్వానంపై సర్వేపల్లి పేరేది?

ఇదిలా ఉండగా ఉపాధ్యాయుడి స్థాయి నుంచి రాష్ట్రపతి వరకూ ఎదిగిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరును విద్యాశాఖ రూపొందించిన ఆహ్వాన పత్రికపై ముద్రించలేదని సమాచారం. ముఖ్యమంత్రి, ఇతర మంత్రుల పేర్లను ముద్రించేందుకు ఆరాట పడ్డ విద్యాశాఖ.. సర్వేపల్లి ఫొటోను మాత్రమే ప్రచురించి వదిలేసిందని విమర్శలు వస్తున్నాయి. దీనిపై విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మదన్‌ను వివరణ కోరగా.. గత ఏడాది ఆహ్వాన పత్రికలో కూడా లేదని, అందుకే ముద్రించలేదని తెలిపారు.

టీచర్లకు మంత్రి జూపల్లి క్లాస్

- ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి టీచర్ల గైర్హాజరుపై మంత్రి అసంతృప్తి
- ప్రసంగించకుండానే సన్మానాలతో ముగించిన జూపల్లి



ప్రసంగం కొనసాగించాలని మంత్రి జూపల్లికి విజ్ఞప్తి చేస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

సాక్షి, నాగర్‌కర్నూల్: 'జిల్లాలో సుమారు 3,600 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉన్నారు. ఉపాధ్యాయుల కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి 800 మంది టీచర్లు కూడా రాలేదు. మీరంతా ఎప్పుడు వస్తారో.. అప్పుడే కార్యక్రమంలో మాట్లాడతాను'అంటూ ప్రభుత్వ ఉపాధ్యాయుల తీరుపై మంత్రి జూపల్లి కృష్ణారావు అసంతృప్తి వ్యక్తం చేశారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి తక్కువ సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరుకావడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు హాజరయినప్పుడే తన సందేశం వారికి చేరుతుందన్నారు. '15 రోజుల్లో మరోసారి కార్యక్రమం నిర్వహించండి. జిల్లాలోని ఉపాధ్యాయులందరూ రావాలి. అప్పుడే మాట్లాడుతాను. ఉపాధ్యాయులపై నాకు ఎప్పుడూ గౌరవం ఉంటుంది. కానీ టీచర్లు నిబద్ధతతో పనిచేయాలి'అని అన్నారు. ప్రసంగాన్ని కొనసాగించాలని అధికారులు విజ్ఞప్తి చేసినా మంత్రి అంగీకరించలేదు. అనంతరం జిల్లాస్థాయి ఉత్తమ టీచర్లుగా ఎంపికైన 52 మందిని సన్మానించారు.

అమిత్ షా హైదరాబాద్ పర్యటన రద్దు

ఉపరాష్ట్రపతి ఎన్నిక నేపథ్యంలో రద్దయినట్టు సమాచారం



సాక్షి, హైదరాబాద్: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హైదరాబాద్ పర్యటన రద్దయింది. దీనికి సంబంధించి తెలంగాణ బీజేపీ నేతలకు అధికారికంగా సమాచారం అందినట్టు తెలుస్తోంది. శనివారం నగరంలో వినాయక నిమజ్జనం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొనాల్సి ఉంది. తమ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి రావాల్సిందిగా అమిత్‌షాను భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి (బీజేయూఎస్) ఆహ్వానించగా, బుధవారంరాత్రి పర్యటన షెడ్యూల్‌ను కూడా ఖరారు చేశారు. అయితే, ఉప రాష్ట్రపతి ఎన్నికల పనుల్లో బిజీగా ఉండటంతో తన పర్యటనను అమిత్ షా రద్దుచేసుకున్నట్లు తెలిసింది. శనివారం సాయంత్రానికి ఎన్డీయే భాగస్వామ్య పార్టీల ఎంపీ (లోక్‌సభ, రాజ్యసభ)లు ఢిల్లీకి చేరుకోవాలనే ఆదేశాలు వెళ్లాయి. 9న ఉప రాష్ట్రపతి ఎన్నికకు ఓటింగ్ జరగనుంది. అమిత్ షా నేతృత్వంలో ఎంపీల అభ్యాస్ కార్యక్రమం జరగాల్సి ఉండడంతో హైదరాబాద్ పర్యటన రద్దయినట్టుగా పార్టీ వర్గాలు తెలిపాయి.

మూసీ ప్రక్షాళన కేసు విచారణ వాయిదా

కేటీఆర్ కౌంటర్‌పై రిజాయిండర్ దాఖలుకు గడువు కోరిన ఆత్రం సుగుణ తరపు న్యాయవాది

సాక్షి, న్యూఢిల్లీ: మూసీ ప్రక్షాళనపై అవినీతి ఆరోపణల కేసులో సుప్రీంకోర్టు విచారణను ఈ నెల 23కు వాయిదా వేసింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై కాంగ్రెస్ నేత ఆత్రం సుగుణ దాఖలు చేసిన పిటిషన్ శుక్రవారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. మూసీ ప్రక్షాళన విషయంలో కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టకు భంగం కలిగేలా వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో గతేడాది సెప్టెంబర్ 30న ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరులో కేటీఆర్‌పై ఎఫ్ఐఆర్ నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసు అక్రమమని కేటీఆర్ రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించగా, హైకోర్టు ఈ ఏడాది ఏప్రిల్ 21న ఎఫ్ఐఆర్‌ను రద్దు చేసింది. ఆ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఆత్రం సుగుణ మే 19న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆత్రం సుగుణ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ప్రతివాది కేటీఆర్ తాజాగా కౌంటర్ దాఖలు చేశారని, దానికి రిజాయిండర్ సమర్పించేందుకు వారం గడువు ఇవ్వాలని అభ్యర్థించారు. కౌంటర్ దాఖలుకు మూడు వారాల సమయం కావాలని ప్రభుత్వ ఏఓఆర్ ధర్మాసనాన్ని కోరారు. దీంతో కోర్టు తదుపరి విచారణను వాయిదా వేసింది.

వరద సాయం రూ.16,732 కోట్లివ్వండి

▶ మొదటి పేజీ తరువాయి

నష్టం జరిగిందని వివరించారు. గతేడాది ఖమ్మంతోపాటు పరిసర జిల్లాల్లో భారీవర్షాల కారణంగా రూ.11,713 కోట్ల మేరకు నష్టం వాటిల్లగా, అప్పుడే దీనికి సంబంధించిన నష్టం అంచనా నివేదికను కేంద్రానికి పంపామని గుర్తుచేశారు. ఈ రెండేళ్లకు కలిపి రూ.16,732 కోట్ల సాయాన్ని తక్షణమే అందించాలని కోరారు.

ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌కు నిధులివ్వండి

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలకు ఆర్థిక సాయం అందించాలని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వర్‌రావు కోరారు. ఢిల్లీలో ఆమె కార్యాలయంలో గురువారం కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో విద్యా నాణ్యత, పిల్లల పోషకాహారం అనే రెండు సవాళ్లను పరిష్కరించడానికి ప్రవేశపెట్టిందే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రోగ్రాం అని వివరించారు. 105 అత్యాధునిక రెసిడెన్షియల్ క్యాంపస్‌లు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని తెలిపారు. ఈ సమగ్ర విద్యా విధానం కోసం రూ.30 వేల కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశామని చెప్పారు.

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి రూ.110 కోట్లు ఇవ్వండి

రూరల్ రోడ్ కనెక్టివిటీ ప్రోగ్రాం కింద ఖమ్మంలోని గిరిజన ప్రాంతాల అభివృద్ధికి రూ.110 కోట్లు ఇవ్వాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కోరారు. ఢిల్లీలో గురువారం పెమ్మసానితో తుమ్మల భేటీ అయ్యారు. ఖమ్మం నియోజకవర్గంలోని రఘునాథపాలెం మండలంలో గిరిజనులు అధికంగా నివసిస్తున్నారని, ఈ ప్రాంతంలో సిమెంట్ కాంక్రీట్ డ్రైనేజింగ్ నెట్‌వర్క్ నిర్మాణానికి ఆర్థిక సాయం అందించాలని కోరారు. కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని తుమ్మల మీడియాకు వెల్లడించారు.



ఢిల్లీలో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌తో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

నివేదికలో పేర్కొన్న వివిధ విభాగాల నష్టం అంచనా

రంగం	నష్టం (రూ.కోట్లలో)
రోడ్లు (ఆర్ అండ్ బి)	785.59
ఇంధన శాఖ (విద్యుత్)	40.73
పంట నష్టం	236
నీటిపారుదల శాఖ	655.70
పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి	377.43
వైద్య, ఆరోగ్య శాఖ	14.84
పశుసంవర్ధక శాఖ	10
మున్సిపల్ పరిపాలన	1,025
అత్యవసర మరమ్మతులకు	1,500
ఇతర శాఖలు, ప్రభుత్వ ఆస్తులు	300
గృహనిర్మాణం	25
మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ	23.43
మొత్తం (ప్రాథమిక అంచనా)	5,018.72

పాటిబండ్ల ప్రసాద్‌కు 'ఏఐ' అవార్డు

సైబర్ భద్రత నిపుణుడికి ప్రతిష్టాత్మక పురస్కారం



అవార్డు అందుకుంటున్న పాటిబండ్ల ప్రసాద్

సాక్షి, హైదరాబాద్: సైబర్ భద్రత నిపుణుడు డాక్టర్ పాటిబండ్ల ప్రసాద్‌కు గ్లోబల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో ప్రతిష్టాత్మక అవార్డు దక్కింది. ఏఐ, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ ఫోరెన్సిక్, ఇన్సిడెంట్ రెస్పాన్స్ వినియోగ విధానం, లా ఎన్‌ఫోర్స్‌మెంట్, ఐటీ తదితర రంగాల్లో డాక్టర్ పాటిబండ్ల చూపిన ప్రతిభకు కేంద్ర ప్రభుత్వం, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) సంయుక్తంగా 'ఏఐ మోస్ట్ ఇన్నోవేటివ్ అవార్డు'ను ప్రకటించాయి. ఢిల్లీలో గురువారం సీఐఐ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్లోబల్ ఏఐ సమ్మిట్ అవార్డ్స్ 2025 కార్యక్రమంలో కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ అదనపు కార్యదర్శి, ఇండియా ఏఐ మిషన్ సీఈఓ అభిషేక్ సింగ్ చేతుల మీదుగా పాటిబండ్ల ప్రసాద్ అవార్డు అందుకున్నారు. పాటిబండ్ల ప్రసాద్ స్వస్థలం ఏపీలోని బాపట్ల జిల్లా మోపర్రు గ్రామం. సైబర్ సెక్యూరిటీ, సైబర్ క్రైమ్ పరిశోధన, డిజిటల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో అంతర్జాతీయ నిపుణుడిగా డాక్టర్ పాటిబండ్ల సుపరిచితులు. ఇంటర్ పోల్, కొలంబో సెక్యూరిటీ కాంక్లేవ్, యూఎస్ఏ డిప్లొమాట్ సెక్యూరిటీ తదితర సంస్థలకు శిక్షణ నిపుణుడిగా ఆయన వ్యవహరించారు. అమెరికా, ఇజ్రాయెల్, మారిషస్, శ్రీలంక, కంబోడియా, యూరప్ దేశాల్లో అంతర్జాతీయ సంస్థల అధికారులకు తర్ఫీదు ఇచ్చారు.

సాక్షి, స్పెషల్ డెస్క్: టీవీలో సినిమా అయినా, సీరియల్ అయినా.. నిమిషాల వ్యవధిలో ప్రకటనలు ప్రత్యక్షం అవుతూనే ఉంటాయి. ఏదైనా ఉత్పాదన జనంలోకి సులభంగా చొచ్చుకుపోవాలంటే ప్రముఖులు ఆమోదించాల్సిందే. ప్రముఖ నటుడు, బాలీవుడ్ బాద్‌షాగా పేరున్న షారూక్ ఖాన్ టీవీ ప్రకటనల్లో ఎక్కువగా కనిపించిన సెలబ్రిటీగా నిలిచారు. ఆ తరువాతి స్థానంలో భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ ఎం.ఎస్.ధోని ఉన్నారు.

ప్రకటనల్లోనూ బాద్‌షా!

- యాడ్స్‌లో తరచూ కనిపించిన సెలెబ్రిటీగా షారుఖ్
- బ్రాండ్స్ పరంగా టాప్‌లో క్రికెట్ దిగ్గజం ఎం.ఎస్.ధోని
- టీవీ ప్రకటనల్లో ఆహారం, పానీయాలవే అత్యధికం



టీఏఎం మీడియా రీసెర్చ్‌కు చెందిన యాడ్‌ఎక్స్ ఇండియా విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం.. 2025 జనవరి–జూన్ కాలంలో ప్రసారం అయిన టెలివిజన్ ప్రకటనలలో షారూక్ ఖాన్ 8 శాతం వాటాతో అత్యధికంగా కనిపించిన సెలెబ్రిటీగా మొదటి స్థానంలో ఉన్నారు. వివిధ బ్రాండ్లకు సంబంధించి రోజుకు అన్ని చానెళ్లలో కలిపి సగటున ఆయన 27 గంటలు వీక్షకుల ముందు ప్రత్యక్షమయ్యారు. 7 శాతం వాటాతో తరువాతి స్థానంలో పోటీపడుతున్న ఎం.ఎస్.ధోని సగటున రోజుకు 22 గంటలు కనిపించారు. మొదటి పది స్థానాల్లో నిలిచిన ఇతర ప్రముఖులలో అక్షయ్ కుమార్, రణ్‌వీర్ సింగ్, అమితాబ్ బచ్చన్, అనన్య పాండే, రణ్‌బీర్ కపూర్, అనుష్క శర్మ, రాహుల్ ద్రవిడ్, విరాట్ కోహ్లీ ఉన్నారు.

ఎక్కువ బ్రాండ్లతో ధోని



2025 మొదటి అర్ధభాగంలో టీవీల్లో ప్రసారం అయిన 43 బ్రాండ్ల ప్రకటనలతో ఎంఎస్ ధోని అగ్రస్థానంలో ఉన్నారు. షారూక్ 35, బిగ్ బి 28 బ్రాండ్స్ యాడ్స్‌లో దర్శనమిచ్చారు.

సినీతారలవే అధికం

టీవీలో ప్రసారం అయిన ప్రకటనలలో 29 శాతం వాటా సెలెబ్రిటీలది. సెలెబ్రిటీల ప్రకటనల్లో సినీ తారల వాటా ఏకంగా 74 శాతం ఉంది. క్రీడాకారులు 4 శాతం, టీవీ తారలు 3 శాతం ఉన్నారు. 2025 జనవరి–జూన్ లో సెలెబ్రిటీలతో కూడిన ప్రకటనల సంఖ్య 2023 జనవరి–జూన్‌తో పోలిస్తే 12 శాతం, గత ఏడాదితో ఇదే కాలంతో పోలిస్తే 20 శాతం తగ్గాయి.

ఆహారం, పానీయాలు

సెలెబ్రిటీల యాడ్స్‌లో 23 శాతం వాటాతో తొలి స్థానంలో ఆహారం, పానీయాల రంగం ఉంది. వ్యక్తిగత సంరక్షణ, పరిశుభ్రత సంబంధ ఉత్పత్తులు 17 శాతం, గృహ ఉత్పత్తుల విభాగం 8 శాతం వాటాతో తరువాతి స్థానాల్లో ఉన్నాయి. ఇక ఉత్పత్తులవారీగా చూస్తే టాయిలెట్, ఫ్లోర్ క్లీనర్స్ 8 శాతం, శీతల పానీయాలు 6 శాతం, సబ్బులు 6 శాతం వాటాతో పోటీపడుతున్నాయి. ప్రముఖుల యాడ్స్‌లో 40 శాతం వాటా కేవలం 10 రకాల ఉత్పత్తులదే. వీటిలో టాయిలెట్–ఫ్లోర్ క్లీనర్స్, శీతల పానీయాలు, వాషింగ్ పౌడర్స్–లిక్విడ్స్, నిర్మాణ సామగ్రి, పెయింట్స్, జీర్ణ సంబంధ ఉత్పత్తులు (డైజెస్టివ్స్), టూత్‌పేస్టులు, పాల ఆధారిత పానీయాలు ఉన్నాయి.

ఆన్‌లైన్ గేమింగ్‌లో..



ఆహారం, పానీయాల యాడ్స్‌లో పురుష సెలెబ్రిటీలు ఎక్కువగా కనిపించగా, వ్యక్తిగత సంరక్షణ ప్రకటనల్లో మహిళా సెలెబ్రిటీలు ఆధిపత్యం చెలాయించారు. ఆన్‌లైన్ గేమింగ్ విభాగంలో వచ్చిన ప్రకటనల్లో అత్యధిక సంఖ్యలో 38 మంది తారలు తళుక్కుమన్నారు. జంటలతో కూడిన యాడ్స్‌లో దీపికా పదుకోన్–రణ్‌వీర్ సింగ్, అనుష్క శర్మ–విరాట్ కోహ్లీలదే హవా. జంటల ప్రకటనల్లో వీరి వాటా దాదాపు 30 శాతం ఉంది. అక్షయ్ కుమార్–ట్వింకిల్ ఖన్నా, రణ్‌బీర్ కపూర్–ఆలియా భట్ సైతం యాడ్స్‌లో ప్రముఖంగా కనిపించారు.

క్లుప్తంగా...

అందరితో తాగించేలా మద్యం విధానం ఉంది

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: ఊరుకో కంపెనీ పెట్టి అందరితో బీర్లు తాగించేలా మద్యం విధానం ఉందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. గురువారం ఆయన తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. వంద గజాల స్థలం ఉంటే చాలు మైక్రో బ్రూవరీలను పెట్టుకోవచ్చునని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. ఎక్సైజ్ పాలసీ తెస్తామని అంటే మద్య నిషేధం ప్రకటిస్తారేమో అనుకుంటే.. కొత్తగా మైక్రో బ్రూవరీలను తెరుస్తామని ప్రకటించారని ధ్వజమెత్తారు. యువతను మద్యం మత్తులోకి దించేలా విధానం ఉందని, నీరాకేఫ్‌లు తెరవాలని మేముఅంటే ఊరూరా బీరు షాపులు తెరుస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బెల్ట్ షాపులు ఎత్తి వేస్తామని చెప్పి వాటి సంఖ్య పెంచుతున్నారని విమర్శించారు. మైక్రో బ్రూవరీల ఏర్పాటు ఆలోచనను తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. మద్యం పాలసీకి యువత ప్రాణాలు బలిపెడతామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కాగా, కవిత చేసిన ఆరోపణలు దురదృష్టకరమని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు.

మోదీ ఓబీసీ అయినా బీసీలకు అన్యాయం

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్



సాక్షి, హైదరాబాద్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఓబీసీ అయినా బీసీలకు అన్యాయం జరుగుతోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ఆరోపించారు. గురువారం ఆయన తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రిజర్వేషన్లు పెంచకుండా బీసీ విద్యార్థులకు అన్యాయం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. ప్రతిష్టాత్మక న్యాయ విశ్వవిద్యాలయం నల్సార్‌లో బీసీలకు రిజర్వేషన్లు అమలు కావడం లేదని అన్నారు. 2020లో అనేక ఉద్యమాల తర్వాత జాతీయ బీసీ కమిషన్ అన్ని న్యాయ విశ్వవిద్యాలయాల్లో 27 శాతం ఓబీసీ రిజర్వేషన్లతో పాటు స్థానిక రిజర్వేషన్లు అమలు చేయాలని ఆదేశాలు ఇచ్చినా నల్సార్‌లో రిజర్వేషన్లు అమలు కాకపోవడం సిగ్గుచేటన్నారు. దీనిపై కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు లేఖ రాశామని తెలిపారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి సహా అనేక మంది ఉద్దండులు నల్సార్ బోర్డు లో ఉన్నా.. బీసీ రిజర్వేషన్లు అమలు కావడం లేదని దాసోజు ఆవేదన వ్యక్తం చేశారు.

బీసీ బిల్లు ఆమోదించండి

బీసీ నేత లింగంగౌడ్



సాక్షి, హైదరాబాద్: బీసీ బిల్లును ఆమోదించాలని కోరుతూ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు గురువారం ఈ–మెయిల్ ద్వారా లేఖ పంపినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ తెలిపారు. రిజర్వేషన్లపై సీలింగ్ ఎత్తివేస్తూ శాసనసభ, శాసనమండలి పంపిన పంచాయతీరాజ్ మున్సిపల్ చట్ట సవరణ బిల్లులను ఆమోదించాలని లేఖలో విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు.

పోలీసులను ఆశ్రయించిన నేరెళ్ల బాధితులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): బీఆర్ఎస్ మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్‌రావుపై నేరెళ్ల ఘటన బాధితులు గురువారం తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత ఆరోపణల నేపథ్యంలోనే నేరెళ్ల బాధితులు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. నేరెళ్ల ఘటన బాధితుడు కోల హరీశ్‌ను 'సాక్షి'సంప్రదించగా.. తనతోపాటు మిగతా బాధితులైన పెంట బానయ్య, పసుల ఈశ్వర్‌కుమార్, బత్తుల మహేశ్ కలసి తంగళ్లపల్లి పోలీసులను కలిసినట్లు తెలిపారు. మాజీ ఎంపీ సంతోష్‌రావు, అప్పటి ఎస్పీ విశ్వజిత్ కంపాటి, ఎస్సై రవీందర్, ఆరోజు విధుల్లో ఉన్న పోలీస్ అధికారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రాజన్నసిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేశ్ బి.గీతేను శుక్రవారం కలసి మరో ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన చెప్పారు.

వరద నష్టాలకు శాశ్వత పరిష్కారం

▶ మొదటి పేజీ తరువాయి

తాను వచ్చానని చెప్పారు. మళ్లీ వరదలు వచ్చి ఇబ్బందులు రాకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటామని సీఎం భరోసా ఇచ్చారు. జిల్లా అధికారులంతా క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి వాస్తవ నివేదికలు రూపొందించాలని ఆదేశించారు. ఇక్కడ అమలు చేసే ప్రణాళిక రాష్ట్రమంతటికీ విస్తరించేందుకు ఉపయోగపడుతుందని, విపత్తు నిర్వహణలో కామారెడ్డి జిల్లా మోడల్‌గా నిలవాలని చెప్పారు. మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్‌రావ్‌లతో కలిసి సీఎం హెలికాప్టర్ ద్వారా ఏరియల్ రివ్యూ చేశారు.

రైతులను ఓదార్చిన సీఎం

సీఎం రేవంత్‌రెడ్డి మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి ప్రత్యేక బస్సులో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. లింగంపేట మండలంలోని లింగంపల్లి కుర్దు వద్ద వరదలతో దెబ్బతిన్న వంతెనను, బూరుగిద్ద వద్ద కొట్టుకుపోయిన పంటలను పరిశీలించి రైతులను ఓదార్చారు. అక్కడి నుంచి కామారెడ్డి పట్టణంలో ముంపునకు గురైన జీఆర్ కాలనీకి వెళ్లి బాధిత కుటుంబాలతో మాట్లాడారు. ఇప్పటికే ప్రభుత్వపరంగా సాయం అందించామని, ఫార్మా, బీడీ కంపెనీల ద్వారా పిల్లల అవసరాలు తీరుస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సమీకృత కలెక్టరేట్‌లో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, ఎంపీ సురేశ్ షెట్కార్, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, మదన్మోహన్‌రావ్, లక్ష్మీకాంతరావ్, భూపతిరెడ్డి, జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌తో వరద నష్టంపై సుదీర్ఘంగా సమీక్షించారు. వరద నష్టంపై కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతిపాదనలు రూపొందించాలని సీఎం ఆదేశించారు. నివేదికలు మార్గదర్శకాలకు లోబడి ఉంటేనే కేంద్రం నుంచి వీలైనంత ఎక్కువ సాయం తీసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. లేకపోతే మన ప్రతిపాదనలు తిరస్కారానికి గురై మొత్తం భారం రాష్ట్ర ప్రభుత్వం మీదే పడుతుందన్నారు. వరదలతో మైనర్, మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు దెబ్బతిన్నాయని, పోచారం ప్రాజెక్టు వరదలకు తట్టుకుని నిలబడిందని, తక్షణమే మరమ్మతులు చేశామన్నారు. అంతకుముందు తాడ్వాయి మండలం ఎర్రాపహాడ్ శివారులోని హెలిప్యాడ్ వద్ద దిగిన రేవంత్‌రెడ్డికి షబ్బీర్‌అలీ, జిల్లా కలెక్టర్ సాంగ్వాన్ స్వాగతం పలికారు.



వరదల్లో చనిపోయిన వారి కుటుంబాలకు పరిహారం అందిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క. చిత్రంలో సురేశ్ షెట్కార్, లక్ష్మీకాంతారావు, షబ్బీర్‌అలీ, మదన్‌మోహన్‌రావు, కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

పక్షం రోజుల్లో పూర్తి స్థాయిలో రివ్యూ

కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు సంబంధించి పదిహేను రోజుల్లో పూర్తి స్థాయిలో రివ్యూ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ లోపు అధికారులు క్షేత్రస్థాయిలో తిరిగి జరిగిన నష్టాలపై సరైన నివేదిక రూపొందించాలన్నారు. అలాగే, శాశ్వత పరిష్కారం చూపడానికి అయ్యే వ్యయానికి సంబంధించిన నివేదికలు కూడా తయారు చేయాలని ఆదేశించారు. వారం రోజుల్లో రెండు జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులతో కలిసి మంత్రి సీతక్క సమీక్ష చేస్తారని, ఆ లోపు నివేదికలు రూపొందించాలన్నారు. ఆ తరువాత తాను అందరితో కలిసి సమీక్ష చేస్తానని తెలిపారు. వరదలతో ఇసుక మేటలు వేసిన పొలాలను సరి చేయడానికి అధికారులంతా సమన్వయం చేసుకుని ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు.

కొడంగల్‌తో సమానంగా కామారెడ్డి

కామారెడ్డి నియోజకవర్గాన్ని కొడంగల్‌తో సమానంగా అభివృద్ధి చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తాను రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలు చూడాలి కాబట్టి ప్రజలు స్థానిక ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డికి చెబితే తనకు చెప్పినట్టేనని, ఆయన సహకారంతో కామారెడ్డిని అభివృద్ధి చేస్తామని చెప్పారు. జిల్లాలో వరదల కారణంగా దెబ్బతిన్న చెరువులను, రోడ్లను పునరుద్ధరిస్తామని భరోసా ఇచ్చారు. ఇళ్లు కూలిపోయిన పేదలకు ప్రత్యేక కోటా కింద ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. వరదల్లో చనిపోయిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల సాయం అందిస్తున్నామని, అలాగే పశువులు చనిపోయిన వారి కుటుంబాలను కూడా ఆదుకుంటామని చెప్పారు.

యూరియా పంపిణీలో మార్పులు చేయాలి

సహకార సంఘంలోనే యూరియా పంపిణీ చేయడం వల్ల వేలాది మంది రైతులు రావడం, వారికి సరిపోవడం లేదంటూ నెగెటివ్ ప్రచారం జరుగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. అలాకాకుండా రెండు మూడు గ్రామాలకు ఒక కేంద్రాన్ని తెరిచి అక్కడి రైతులకు అక్కడే యూరియా పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. అధికారుల మధ్య సరైన సమన్వయం, సరైన ప్రణాళిక లేకపోవడంతో ప్రభుత్వం బద్నాం అవుతోందన్నారు. ఆస్పత్రుల్లో వైద్యుల హాజరుకోసం ఫేస్ రికగ్నిషన్ సిస్టం అమలు చేయాలని వైద్యశాఖ అధికారులను సీఎం ఆదేశించారు. వైద్యులు ఎప్పుడు వస్తున్నారు, ఎప్పుడు పోతున్నారో తెలియాల్సిన అవసరం ఉందన్నారు.

లండన్‌లో హరీశ్‌రావు

అంబేడ్కర్ హౌస్ సందర్శన



సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి హరీశ్‌రావు లండన్‌లోని కింగ్ హెన్రీస్ రోడ్‌లో చారిత్రక అంబేడ్కర్ హౌస్‌ను గురువారం సందర్శించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 1921–22లో లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ (ఎల్ఎస్ఈ)లో విద్యార్థిగా ఉన్నప్పుడు ఈ ఇంటిలో నివసించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు అంబేడ్కర్‌కు ఘన నివాళులర్పించారు. అక్కడి సందర్శకుల పుస్తకంలో ఆయన వారసత్వం, దార్శనికతను కొనియాడుతూ సందేశం రాశారు. ఈ విషయాన్ని గురువారం ఎక్స్‌లో హరీశ్ పంచుకున్నారు.

మొత్తం కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరిపించాలి

కవితను బీజేపీలో చేర్చుకోం ● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి కేవలం బరాజ్‌లపైనే కాకుండా మొత్తం ప్రాజెక్ట్‌లో అవినీతిపై సీబీఐ విచారణ జరిపించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ కుమ్మక్కు అయ్యాయని.. ఆ రెండు పార్టీలు అన్నదమ్ముల వంటివని వ్యాఖ్యానించారు. గురువారం ఆయన బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో యూరియా కృత్రిమ కొరతను సృష్టిస్తోందని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా అవసరమైన యూరియాను పంపిణీ చేస్తోందని, రాష్ట్రప్రభుత్వం మాత్రం ఇక్కడ బ్లాక్ మార్కెట్‌ను అడ్డుకోలేకపోతోందని అన్నారు. కేంద్రం సామాన్యులు, రైతులు, మధ్యతరగతి, యువతకు నేరుగా ఆర్థిక ఊరట కలిగించేలా జీఎస్టీ శ్లాబ్‌లను సులభతరం చేసి చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. కేంద్రం నిర్ణయాన్ని రాష్ట్ర శాఖ స్వాగతిస్తోందన్నారు. మోదీ ప్రభుత్వం జీఎస్టీ శ్లాబ్‌లు తగ్గించి ఊరట ఇచ్చినందుకు రాష్ట్ర పార్టీ ఆధ్వర్యంలో ప్రధాని ఫొటోలకు క్షీరాభిషేక కార్యక్రమం చేపడుతున్నట్టు తెలిపారు. మహిళా, కిసాన్, యువమోర్చాల ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని మండలాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కాగా, బీజేపీలో అవినీతిపరులకు స్థానం లేదని, బీఆర్ఎస్ బహిష్కృత నేత కవితని తమ పార్టీలోకి తీసుకోబోమని ఆయన స్పష్టంచేశారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నాం

- గ్రామస్థాయి వరకు రెవెన్యూ సేవలు... ఐదువేల మంది జీపీవోల నియామకం
- నేడు ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియామక పత్రాలు: మంత్రి పొంగులేటి



సాక్షి, హైదరాబాద్: గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని గ్రామపాలనాధికారుల (జీపీవో) నియామకం ద్వారా నిలబెట్టుకున్నట్టు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. భూసమస్యలపై తెలంగాణ ప్రజలకు ముఖ్యంగా రైతులకు మరింత మెరుగైన సేవలందించడానికి రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా గ్రామస్థాయిలో జీపీవో సేవలను ఒకటి రెండు రోజుల్లో అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం సాయంత్రం 4 గంటలకు జీపీవోలకు హైటెక్స్‌లో నియామక పత్రాలను అందజేస్తామన్నారు. గురువారం సచివాలయంలో రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి మాట్లాడారు. జీపీవోలుగా విధులు నిర్వర్తించడానికి ఆసక్తి చూపిన వీఆర్వో, వీఆర్ఏలకు రెండు విడతల్లో నిర్వహించిన రాత పరీక్షల్లో 5,106 మంది ఎంపికయ్యారని తెలిపారు. సీఎం ఆలోచనకు అనుగుణంగా గ్రామస్థాయి వరకు రెవెన్యూ సేవలు అందించాలనే లక్ష్యంతో గ్రామ పరిపాలనాధికారులను నియమిస్తున్నట్టు తెలిపారు. భూభారతి చట్టం ద్వారా రాష్ట్రంలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న భూసమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టినట్టు చెప్పారు. సర్వే విభాగాన్ని కూడా బలోపేతం చేస్తున్నట్టు తెలిపారు. మొదటి విడతలో 7వేల మందికి లైసెన్స్‌డ్ సర్వేయర్ శిక్షణ ఇవ్వడంతోపాటు అర్హత పరీక్ష నిర్వహించామన్నారు. గత నెల 18వ తేదీ నుంచి రెండో విడతలో మూడు వేల మందికి 21 జిల్లాల్లో శిక్షణ ప్రారంభించినట్టు మంత్రి వివరించారు.



అభివాదం చేస్తున్న జాగృతి నాయకులు...

జాగృతికి రాజీనామా చేసి కేసీఆర్‌తోనే ఉంటాం

- కవిత ఏ ప్రలోభాలకు గురైందో అర్థం కావడంలేదు.
- తెలంగాణ జాగృతి వ్యవస్థాపక సభ్యుల ఆవేదన

పంజగుట్ట (హైదరాబాద్): తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బీఆర్ఎస్, కేసీఆర్‌ను బద్నాంచేసే వారి చేతుల్లో కీలుబొమ్మలా మారిందని తెలంగాణ జాగృతి సీనియర్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ అస్థిత్వాన్ని దెబ్బతీసేందుకు చంద్రబాబునాయుడు, నరేంద్ర మోదీ, రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్న ఈ సమయంలో కవిత ఎవరి పక్షాన మాట్లాడుతుందో అర్థం కావడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం విఫల ప్రాజెక్టుగా చూపేందుకు రేవంత్, మోదీ ప్రయత్నిస్తుంటే దానికి సన్నాయి నొక్కులు నొక్కుతున్నట్లు కవిత మాటలు ఉన్నాయని వారు విమర్శించారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాగృతి వ్యవస్థాపకుడు, ఉపాధ్యక్షుడు, మాజీ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ మేడే రాజీవ్‌సాగర్, మాజీ రాష్ట్ర ట్రేడ్ డెవలప్‌మెంట్ చైర్మన్ మఠం భిక్షపతి, గ్రేటర్ హైదరాబాద్ జాగృతి నాయకుడు ప్రశాంత్, బీఆర్ఎస్ నాయకుడు రాజారామ్ యాదవ్‌లు మాట్లాడుతూ.. 2006లో ఉద్యమం ఊపందుకున్నప్పుడు తెలంగాణ జాగృతి ఏర్పాటు చేశామని, అప్పటినుంచి కేసీఆర్ ఏ పిలుపు ఇచ్చినా జాగృతి తరఫున కవిత ఆధ్వర్యంలో పనిచేసుకుంటూ వచ్చామని గుర్తు చేశారు. కేవలం కేసీఆర్ ఉన్నందువల్లే 18 సంవత్సరాలుగా జాగృతి తరఫున తాము పనిచేశామని, ఎప్పుడైతే కవిత పార్టీని వ్యతిరేకించారో ఇక మాకు జాగృతితో సంబంధం లేదన్నారు. కవిత ఇప్పుడు ఎవరి ఒత్తిడి మేరకు, ఏ ప్రలోభానికి లోనై ఇలా మాట్లాడుతుందో అర్థం కావడంలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇంకెన్నాళ్లు బీఆర్ఎస్‌కు దోచిపెడతారు?

- సభ్యత్వం పేరుతో వసూలు చేసిన పైసల లెక్కలన్నీ తీస్తా
- చైనాతో సంబంధాలు మెరుగుపర్చినా మోదీకి థ్యాంక్స్ చెప్పరా?
- గ్రానైట్ వ్యాపారులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ చురకలు



గ్రానైట్ వ్యాపారి తిరుపతిగౌడ్‌తో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

కొత్తపల్లి (కరీంనగర్): గ్రానైట్ వ్యాపారులు గత 20 ఏళ్లుగా బీఆర్ఎస్ పార్టీకి దోచిపెడుతూనే ఉన్నారని, ఇలా ఇంకెన్నాళ్లు దోచిపెడతారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. ఒక్కో గ్రానైట్ కటింగ్ మిషన్ ఇండస్ట్రీ నుంచి సభ్యత్వం పేరుతో గ్రానైట్ అసోసియేషన్ రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షలదాకా.. దాదాపు 350 నుంచి 500 షాపుల వరకు డబ్బులు వసూలు చేసినట్లు సమాచారం ఉందని, ఆ సొమ్మును ఏం చేశారో చెప్పాలని అన్నారు. గ్రానైట్ వ్యాపారుల నుంచి రూ.వెయ్యికోట్లు తీసుకున్నట్లు తనపై కొందరు దుష్ప్రచారం చేసినా ఎవరూ ఖండించలేదని వ్యాపారులపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని మానకొండూర్, చింతకుంటలో గురువారం గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించేందుకు వచ్చిన సంజయ్‌కు పలువురు గ్రానైట్ వ్యాపారులు ఎదురుపడ్డారు. ప్రధాని మోదీ చైనా పర్యటనకు వెళ్లొచ్చాక ఆ దేశంతో వ్యాపార సంబంధాలు మెరుగుపడ్డాయని, గ్రానైట్ వ్యాపారం పుంజుకునే అవకాశం ఉందని అసోసియేషన్ నేతలు చెప్పగా.. సంజయ్ స్పందిస్తూ కనీసం ప్రెస్‌మీట్ పెట్టి మోదీకి థ్యాంక్స్ అయినా చెప్పారా? ఎందుకు చెప్పలేదు? అంటూ నిలదీశారు. 20 ఏళ్లుగా బీఆర్ఎస్‌కు దోచిపెడుతూనే మీలో కొందరు వ్యాపారాల కోసం రాజకీయాలను వాడుకుంటుండగా.. మరికొందరు రాజకీయ నాయకులై వ్యాపారాలను పెంచుకుంటూ ఆ సొమ్ముతో రాజకీయాలు చేస్తూ.. మాలాంటోళ్లను ఓడగొట్టాలని చూస్తారని చురకలంటించారు. గ్రానైట్ అసోసియేషన్ కేంద్రానికి చెల్లించింది రూ. 300 కోట్లకు మించి లేదని, కానీ రూ.వెయ్యి కోట్లు ఇచ్చినట్లు ప్రచారం చేసుకుంటున్నారని ఆగ్రహించారు. ఎవ్వరికీ పైసలు ఇవ్వాల్సిన అవసరం లేకుండా స్వేచ్ఛగా వ్యాపారం చేసుకునే పరిస్థితిని కల్పిస్తానని, సమాజానికి సేవ చేసే కార్యక్రమాలు చేయాలని సంజయ్ సూచించారు.

(ఓ మానవుడా!) అల్లాహ్ కారుణ్య చిహ్నాలను చూడు: ఆయన నిర్జీవంగా ఉన్న భూమిలో ఏ విధంగా ప్రాణం పోస్తాడో! నిశ్చయంగా, ఇదే విధంగా ఆయన (మరణానంతరం) మృతులకు కూడా ప్రాణం పోస్తాడు!

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 5 సెప్టెంబర్ 2025

మారిన శ్లాబుల మురిపెం

ఎటు చూసినా నిరాశామయ వాతావరణమే అలుముకుని అంతటా నిర్లిప్తత ఏర్పడిన తరుణంలో బుధవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన ప్రకటన అందరిలోనూ ఉత్సాహం నింపింది. ఈ క్షణం కోసం సామాన్యులు మొదలుకొని రైతులూ, చిరు వ్యాపారులూ, చిన్నా చితకా పరిశ్రమలవారూ ఎనిమిదేళ్లుగా ఎదురుచూస్తున్నారు. సరుకులు, సేవల పన్ను (జీఎస్టీ)ను హేతుబద్ధీకరిస్తూ, సాధారణ ప్రజానీకం వాడే అనేకానేక నిత్యావసరాలకు పన్ను తగ్గించటం లేదా పూర్తిగా ఎత్తేయటం... ఆరోగ్య బీమాకు పన్నుపోటు నుంచి మినహాయించటం తదితరాలు ఇప్పుడున్న గడ్డు పరిస్థితుల్లో ఊరట నిస్తాయి. సామాన్యుల్లో జీఎస్టీ 'గబ్బర్‌సింగ్ టాక్స్'గా అపకీర్తి పాలైందంటేనే వారిని ఎంతగా కష్టపెట్టిందో అర్థం చేసుకోవచ్చు. త్వరలోనే పన్నుల హేతుబద్ధీకరణను అమలు చేయబోతున్నామని పదే పదే ప్రకటించటంతో జీఎస్టీ మండలి సమావేశమైనప్పుడల్లా అందరిలోనూ ఆశలు చిగురించేవి. తీరా మరిన్ని సరుకుల్ని జీఎస్టీ పరిధిలోకి తీసుకురావటంతో వారంతా బిత్తరపోయేవారు. ప్రధాన రాష్ట్రాల ఎన్నికలు జరిగినప్పుడూ, వార్షిక బడ్జెట్‌లు ప్రవేశపెట్టినప్పుడూ జీఎస్టీ తగ్గింపుపై ఊహాగానాలు రావటం, చివరకు నిట్టూర్చటం రివాజైపోయింది. ఈ దశలో మొన్నటి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ప్రధాని నరేంద్ర మోదీ జీఎస్టీని సరళీకృతం చేయబోతున్నామని వెల్లడించారు. మొత్తానికి ఇప్పుడిక 5 శాతం, 18 శాతం పన్నుల విధానం అమలు కాబోతోంది.

ఆరంభమైన మొదలుకొని జీఎస్టీని ఎవరూ మెచ్చింది లేదు. తమ ఆదాయ వనరులకు గండి కొట్టిందని రాష్ట్రాలూ, తమ జేబులు కత్తిరిస్తోందని మధ్యతరగతి జీవులూ, ఎంతో కష్టపడి సంపాదిస్తున్నది కాస్తా జీఎస్టీ పేరు మీద ప్రభుత్వం తన్నుకుపోతున్నదని వ్యాపారులూ ఆక్రోశిస్తూనే ఉన్నారు. జీఎస్టీ చిత్రవిచిత్రాలు పోయింది. వడాపావ్ వెన్నతో తింటే ఒక రకమైన పన్ను, అది లేకుండా తింటే వేరే రకం పన్ను వేయటాన్ని జనం జీర్ణించుకోలేకపోయారు. ఆ మధ్య నిర్మలా సీతారామన్ సమక్షంలో ఒక వ్యాపారవేత్త జీఎస్టీపై వెటకారంగా వ్యాఖ్యానించటం, ఆ వీడియో కాస్తా వైరల్ కావటంతో ఆయన కంగారుపడి మంత్రిని కలిసి క్షమాపణలు చెప్పటం అందరికీ తెలుసు. జీఎస్టీ అరాచకం అంతా ఇంతా కాదు. సబ్బు, షాంపూలపై 18 శాతం, స్కూలు పుస్త కాలు, పెన్సిళ్లు, రంగు పెన్సిళ్లు తదితరాలపై 12 శాతం, ఆఖరికి కోచింగ్ తీసుకుంటే 18 శాతం పన్నులతో ఎడాపెడా బాదటం అందరినీ దిగ్భ్రాంతి పరిచింది. అయినా కేంద్రంలో కదలిక రాలేదు. అమెరికా విధించిన 50 శాతం సుంకాల వల్ల ఎదురుకాగల సమస్యల్ని దృష్టిలో ఉంచుకునే కేంద్రంలో కదలిక వచ్చిందని ఆర్థిక నిపుణులంటున్నారు. ఆ సంగతలా ఉంచితే ప్రజల్లో వినిమయాన్ని పెంచి ఆర్థిక వ్యవస్థకు జవజీవాలు తీసుకురావటానికి తాజా నిర్ణయాలు దోహదపడతాయి.

ప్రభుత్వాలు ఆదాయాన్ని పెంచుకోవటానికి ఎంతసేపూ పరోక్ష పన్నులపైనే ఆధారపడతాయి. ప్రత్యక్ష పన్నుల ద్వారా వచ్చే ఆదాయంతో పోలిస్తే నిజానికిది చాలా తక్కువ. కానీ పారిశ్రామికవేత్తలనూ, సంపన్నులనూ నొప్పించటం ప్రభుత్వాలకు ఇష్టం ఉండదు. వాళ్లంతా ఉపాధి కల్పనలో పాలుపంచుకుంటున్నారన్న కారణం చెబుతారు. పరోక్ష పన్నుల్ని 'తిరోగమనం'గా అభివర్ణించేవారు కూడా ఉన్నారు. సినిమా టిక్కెట్లపై విధించే వినోదపు పన్నునే వారు ఉదాహరిస్తారు. సామాన్యుడికైనా, కోట్లకు పడగెత్తిన సంపన్నుడికైనా ఆ పన్ను ఒకేలా ఉంటుంది. అయితే పన్ను విధింపులో కాస్తంత హేతుబద్ధత చూపటం ద్వారా సామాన్యుల్ని కూడా సంతుష్టి పరచవచ్చు. అర్థశాస్త్రంలోని 'లేఫర్ కర్వ్' భావన అటువంటిదే. పన్నులు తక్కువగా ఉంటే సామాన్య జనం అధికంగా కొని ఖజానా ఆదాయాన్ని పెంచుతారని ఈ భావన చెబుతుంది. కానీ ప్రభుత్వాలు ఎంతసేపూ అధిక పన్నుల ద్వారా అధికాదాయం అనే ఆలోచనలోనే ఉంటాయి. అధిక పన్నులూ, వాటిని చెల్లించలేదంటూ వేధింపులూ వగైరాలను 'ట్యాక్స్ టెర్రరిజం'గా కొందరు అభివర్ణిస్తున్నారు. ఈ సంస్కరణలు మైలురాయి వంటివా... కాదా అన్నది రానున్న కాలంలో తేలిపోతుంది. పనిలో పనిగా జీఎస్టీ వల్ల రాష్ట్రాలకు కలుగుతున్న నష్టాన్ని భర్తీ చేసే యోచన కూడా చేస్తే దేశంలో ఫెడరలిజం వర్ధిల్లుతుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** శు.త్రయోదశి రా.1.36 వరకు, తదుపరి చతుర్దశి, **నక్షత్రం:** శ్రవణం రా.11.11 వరకు, తదుపరి ధనిష్ఠ, **వర్జ్యం:** రా.3.10 నుండి 4.46 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.15 నుండి 9.06 వరకు, తదుపరి ప.12.22 నుండి 1.11 వరకు, **అమృత ఘడియలు:** ప.12.30 నుండి 2.01 వరకు.

సూర్యోదయం : 5.49
సూర్యాస్తమయం: 6.09
రాహుకాలం : ఉ.10.30 నుండి 12.00 వరకు
యమగండం : ప.3.00 నుండి 4.30 వరకు

సోషల్ టాక్

నవ్వారు!



నా విషయానికొస్తే, అసాధ్యం అంటూ ఏమీ ఉండదని గట్టిగా చెప్పగలను. నా ఏడు లేదా ఎనిమిదేళ్ల వయసులో నేను–ప్రపంచంలోనే నంబర్ 1 అవ్వాలనుకుంటున్నాను అని చెప్పినప్పుడు, చాలా మంది నన్ను చూసి నవ్వారు. కానీ, నేను సాధించాను.

– నోవాక్ జొకోవిచ్, టెన్నిస్ ప్లేయర్

ఆటుపోట్లు



బరిలో బాక్సర్‌గా మాత్రమే నన్ను నేను ఎప్పుడూ భావించలేదు. నా కలలను నిజం చేసుకోవటం కోసం పోరాడాను. జీవితంలోని ఆటుపోట్లతో తలపడి నిలిచాను. ఇది గెలవడం గురించి కాదు, ముందుకు సాగడానికి ధైర్యం ఉండాలంటున్నాను.

– మేరీ కోమ్, ప్రొఫెషనల్ బాక్సర్

విశ్వాసం



కొత్తగా ఏదైనా ప్రారంభించటానికి, కలను నిజం చేసుకునే ప్రయత్నంగా తొలి అడుగు వేయటానికి మొదట మీ శక్తి సామర్థ్యాలను మీరు విశ్వసించవలసి ఉంటుంది. ఇది చిన్న విషయం కాదు. కానీ అదే మీరు చేయవలసింది!

– విజయ్ శేఖర్ శర్మ, 'పేటీఎం' ఫౌండర్

రిస్క్



చాలా వేగంగా మారుతున్న ప్రపంచంలో, మీకున్న అతిపెద్ద రిస్క్... ఏ రిస్కూ తీసుకోకపోవడం! మీరేదైనా సాధించదలచుకుంటే స్థిరత్వంలోని సౌకర్యాన్ని వీడండి. సవాళ్లను ఎదుర్కోవటం సరే, వాటిని కొని తెచ్చుకోవడం కూడా బాగుంటుంది.

– రిషభ్ అగర్వాల్, ఏఐ సైంటిస్ట్

స్నేహం



పేరెంటింగ్ ఆపి, మీ పిల్లలతో పార్టనరింగ్ మొదలు పెట్టండి. వారితో మంచి స్నేహితులుగా మెలగండి. మానసికంగా ఆరోగ్యవంతులైన, ఆత్మవిశ్వాసం కలిగిన, విజయవంతమైన వ్యక్తులుగా వారిని పెంచిన వారవుతారు.

– సచిన్ చావ్లా, పెర్ఫార్మెన్స్ మెంటార్

మార్పు



విజయం అంటే కేవలం ఉన్నతస్థానంలో ఉండటం కాదు. అత్యంత ముఖ్యమైన చోట అవసరమైన మార్పును తీసుకురావటం, టీమ్‌ని శక్తిమంతం చేయటం, వారితో కలిసి అసాధారణమైన దానిని నిర్మించటం కూడా ఆ విజయంలో భాగంగా ఉండాలి.

– పీయూష్ బన్సల్, 'లెన్స్‌కార్ట్' సీఈవో

అన్నీ మంచి శకునములే...

విశ్లేషణ



టంకశాల అశోక్

భారతదేశంపై సుంకాలను అమెరికా అధ్యక్షుడు 50 శాతానికి పెంచిన ఐదు రోజులకు జరిగిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సమావేశాల నుంచి దేశానికి అన్నీ మంచి శకునాలే లభించాయి. చైనా, రష్యాలతో సంబంధాలు మరింత బలోపేతమయ్యాయి. ఈ కొత్త స్థితి వెంటనే అమెరికన్ అధ్యక్షుడు ట్రంప్, ఆయన వాణిజ్య సలహాదారు పీటర్ నవారోలు, ఇండియాపై చేసిన అనుచితమైన వ్యాఖ్యలలో ప్రతిఫలించింది. ప్రధాని మోదీ తమపై కొంత అలిగినా తిరిగి వైఖరి మార్చుకోగలరని వారు చివరి వరకూ ఆశించారు. ఆయనకు తాము తప్ప గత్యంతరం లేదనుకున్నారు. కానీ, మోదీ వైఖరి మరింత దృఢంగా మారినట్లు తియాన్‌జిన్‌లో అడుగడుగునా కనిపించింది.

అర్థాలు–అంతరార్థాలు

ఈ సందర్భంగా మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్ అన్న మాటలేమిటో యథాతథంగా చూడటం అవసరం. జిన్‌పింగ్‌తో సమావేశం అనంతరం మోదీ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేస్తూ, రెండు దేశాలూ అభివృద్ధిలో భాగస్వాములే తప్ప ప్రత్యర్థులు కాదనీ, భిన్నాభిప్రాయాలు వివాదాలుగా మారరాదనీ భావించినట్లు పేర్కొన్నది. పరస్పర గౌరవం, ఉభయుల ప్రయోజనాలు, ఇరువురి సున్నితమైన మనోభావాల గుర్తింపు అవసరమన్నది. ఇటువంటి అవగాహనలు 21వ శతాబ్దపు ధోరణులకు అనుగుణంగా బహుళ ధ్రువ ప్రపంచంతోపాటు బహుళ ధ్రువ ఆసియా రూపు తీసుకునేందుకు ఆవశ్యకమని పేర్కొన్నది. చైనాతో సంబంధాల మెరుగుదల నిరుటి కజాన్–బ్రిక్స్ సమావేశాల నుంచే మొదలైందని పలుమార్లు గుర్తు చేస్తున్న మోదీ, ఇపుడు రెండు దేశాల మధ్య 'శాంతి, సుస్థిరతల వాతావరణం ఏర్పడింద'న్నారు.

జిన్‌పింగ్ మాటలను కూడా కొంత చెప్పుకొన్న తర్వాత ఇరువురి అభిప్రాయాల అర్థాలు, అంతరార్థాలు చూద్దాము: రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన 80 సంవత్సరాల తర్వాత కూడా ప్రచ్ఛన్న యుద్ధ కాలపు మనస్తత్వం, ఆధిపత్య ధోరణి, ప్రొటెక్షనిజం కొనసాగుతున్నాయి. కొద్ది దేశాల అంతర్గత విధానాలను ఇతరులపై రుద్దకూడదు. అంతర్జాతీయ నియమ నిబంధనలన్నవి పరీక్షాత్మక దశకు చేరుకున్నాయి. సమ్మిళితమైన ఆర్థిక ప్రపంచీకరణ అవసరం. భారతదేశం, చైనాలు పరస్పర విశ్వాసాన్ని బలపరచుకుని, పరస్పర అభివృద్ధికి అవకాశాలను పెంచుకోవాలి. వ్యూహాత్మకమైన, దీర్ఘకాలిక దృక్కోణంతో వ్యవహరించాలి.



◆ బహుళ ధ్రువ ప్రపంచం అన్నమాటతో పాటు, బహుళ ధ్రువ ఆసియా అనే మాటను కొత్తగా ఉపయోగంలోకి తేవటం గమనించదగ్గది. అనగా, చైనాయే గాక ఇండియా కూడా ఒక ధ్రువమనేది గుర్తించటమన్నమాట. 21వ శతాబ్దపు ధోరణులలోకి అది కూడా వస్తుంది.

నాయకులిద్దరూ చెప్పినవి ఇంకా ఉన్నాయిగానీ, అన్నీ ఈ ప్రధానమైన మాటల చుట్టూ తిరిగేవే. సరిహద్దు వివాదాన్ని, పాకిస్తాన్ అంశాన్ని ప్రధానంగా ముందుకు తెచ్చుకుని అభివృద్ధి సహకార అవకాశాలను విస్మరించవద్దన్నది మొదటి అంతరార్థం. ఇరువురి సున్నిత మనోభావాలన్నది ఇందుకు సంబంధించినదే గాక, ఆసియాతో పాటు ప్రపంచంలోనూ ఒక శక్తిగా ఎదగజూస్తున్న ఇండియాకు ఆటంకాలు కల్పించరాదనే అర్థం వస్తుంది. ఇక్కడ, బహుళ ధ్రువ ప్రపంచం అన్నమాటతో పాటు, బహుళ ధ్రువ ఆసియా అనే మాటను కొత్తగా ఉపయోగంలోకి తేవటం గమనించదగ్గది. అనగా, చైనాయేగాక ఇండియా కూడా ఒక ధ్రువమనేది గుర్తించటమన్న మాట. 21వ శతాబ్దపు ధోరణులలోకి అది కూడా వస్తుంది.

సుంకాలకు ముందు నుంచే...

చైనాతో సంబంధాల మెరుగుదల కజాన్ నుంచే మొదలైన మాట నిజమే అయినా ఆ విషయాన్ని మోదీ పదేపదే ఎందుకు ప్రస్తావిస్తున్నట్లు? కేవలం ట్రంప్ సుంకాలు అందుకు కారణమని అమెరికాలో, బయటా జరుగుతున్న ప్రచారం నిజం కాదనీ, భారతదేశం తన ప్రయోజనాల కోసం స్వతంత్ర నిర్ణయాలు గతం నుంచే తీసుకుంటున్నదనీ ప్రకటించేందుకు!

చైనా అధ్యక్షుని ఉద్దేశం... రెండు దేశాల మధ్య సరిహద్దుల వంటి కొన్ని సమస్యలు ఉన్నప్పటికీ, అందుకు పరిష్కార ప్రయత్నాలు జరుగుతున్నందున, అందుకు బందీ కాకుండా, పరస్పర అభివృద్ధి అవకాశాలపై దృష్టి పెట్టాలని! అందుకు అనుగుణంగా తాము భారతదేశంతో కలిసి పనిచేయగలమనటం! ఆయన ఉపయోగించిన డ్రాగన్, ఏనుగు కలిసి నాట్యం చేయటమనే మాటలో ఈ అంతరార్థాలన్నీ కనిపిస్తాయి. మారుతున్న పరిస్థితులు, అందువల్ల రెండు దేశాలకు కలుగుతున్న సమస్యలు, వాటి నుంచి బయటపడేందుకుగానీ, భవిష్యత్తులో అభివృద్ధి కోసం గానీ అవసరమైనవేమిటో రెండు దేశాల నాయకులకు స్పష్టమైన అవగాహన ఏర్పడినట్లు కనిపిస్తున్నది. రెండు దేశాల మధ్య చాలా కాలంగా నిలిచిపోయిన ఒప్పందాలు ఒక్కటొక్కటిగా ఇప్పటికే జరుగుతుండటం తెలిసిందే.

స్పష్టమైన సందేశం

రష్యా విషయానికి వస్తే, ప్రధాని మోదీ రష్యా అధ్యక్షునితో జరిపిన సమావేశం, అనూహ్యంగా ఆయన కారులో ప్రయాణించటం, హోటల్‌కు చేరిన తర్వాత కూడా కారులోనే ఉండి ముప్పావు గంట సేపు చర్చించి ఆ ఫొటోను పోస్ట్ చేయటం, బయట కూడా పుతిన్‌తో కలిసి వెళ్లి జిన్‌పింగ్‌తో చేసిన సంభాషణల వంటివన్నీ ఇటు భారతీయులకు, ప్రపంచ దేశాలకు, అటు అమెరికా శిబిరానికి పంపవలసిన సందేశాలనే పంపాయి. దేశ ప్రయోజనాల కోసం రష్యా నుంచి చమురు కొనుగోలు కొనసాగటమే గాక, ఉభయుల మధ్యగల చిరకాలపు సాన్నిహిత్యం ఇంకా బలపడగలదని, సుంకాలకు వెరవబోమనే సంకేతాలను భారత ప్రధాని అమెరికా శిబిరానికి 50 శాతం నాటి ముందుకన్నా బలంగా పంపటం విశేషం. ఇప్పటికైనా వివేకం కలిగితే ఆ శిబిరం చేయవలసింది తమ తీరును అన్ని విధాలా మార్చుకుని, మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా వ్యవహరించటం!

షాంఘై సంస్థ నిజానికి రక్షణ, తీవ్రవాదం అంశాలకు సంబంధించినది. కానీ, మొదటిసారిగా తియాన్‌జిన్‌లో ఆర్థిక, రాజకీయ, భౌగోళిక వ్యూహాల గురించి చర్చించటం మారుతున్న పరిస్థితులకు, పాశ్చాత్య ప్రపంచానికి బయటి దేశాల ఆందోళనలు, అవసరాలకు అద్దం పడుతున్నది. ఈ విధంగా 'బ్రిక్స్'కు అదనంగా మరొక సంస్థ క్రమంగా బలపడుతున్నది. కజాన్‌లో వలెనే తియాన్‌జిన్‌లోనూ పాశ్చాత్య ఆధిపత్య వ్యతిరేకత, బహుళ ధ్రువ ప్రపంచ నిర్మాణం, డాలర్‌ను క్రమంగా బలహీనపరచటం, ప్రత్యామ్నాయ ఆర్థిక వ్యవస్థలు, ప్రస్తుతం గల అంతర్జాతీయ వ్యవస్థలపై అమెరికా కూటమి నియంత్రణ స్థానే సంస్కరణలతో ప్రజాస్వామికీకరణ, వర్ధమాన దేశాల మధ్య అవగాహనలను, మైత్రీ సహకారాలను బలపరచుకోవటం ప్రధానాంశాలయ్యాయి.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సాంకేతికత ఉంటే సరిపోతుందా?

సందర్భం



ఎమ్.ఎస్.కె. కృష్ణజ్యోతి

తరగతి గది అనగానే మన కళ్ల ముందుకు వచ్చే సజీవ చిత్రం... చాక్ ముక్కతో బ్లాక్ బోర్డు మీద తెల్లని అక్షరాలు రాసే ఉపాధ్యాయులూ, గదంతా ప్రతిధ్వనించే వారి స్వరమూ. అయితే చాక్, నల్లబల్లతో సహా ఈ కృత్రిమ మేధ యుగంలో ఉపాధ్యాయుల భవిష్యత్తు గురించి కూడా చర్చ మొదలయింది. 'మార్పు ఒక అప్రతిహతమైన చారిత్రక సత్యం. విద్య నేర్చే – నేర్పే విధానం కూడా కాలానుగుణంగా మారుతూ వస్తోంది. ఒకప్పుడు చదువు పూర్తిగా 'ఉపాధ్యాయ' కేంద్రితంగా ఉండేది. ఇవాళ 'విద్యార్థి' కేంద్రిత విద్య ఆదరణ పొందుతోంది. ఆ కాలం నుంచీ, ఇటీవలి కాలం వరకూ చాక్ పీసు, నల్లబల్లలు.. ఉపాధ్యాయుల ఆలోచనలను అక్షర రూపంలో విద్యార్థుల ముందుకు తీసుకొచ్చే ప్రధాన సాధనాలుగా నిలిచాయి.

1801లో స్కాట్లాండ్‌లోని ఎడిన్‌బరో ప్రధానోపాధ్యాయుడు జేమ్స్ పిలన్స్ మొదటిసారిగా పెద్ద పలకను గోడకు అమర్చి నల్లబల్లగా వాడాడు. అదే సంవత్సరం అమెరికాలోని వెస్ట్ పాయింట్ మిలిటరీ అకాడమీలో జార్జ్ బారన్ గణిత పాఠం బోధించడానికి నల్లబల్లను ఉపయోగించాడని అంటారు. నల్లబల్ల వల్ల ఒకేసారి ఎక్కువ మందికి బోధించడం సులభమైంది. దీని వినియోగం పెరిగే కొద్దీ, చాక్‌పీసు ప్రధాన బోధనా సాధనంగా విస్తరించింది. భారతదేశంలో బ్రిటిష్ పాలన కాలంలో 'ఉడ్స్ డిస్పాచ్' (1854) తర్వాత నల్లబల్లలు, చాక్‌పీసులు విస్తృతంగా వాడుకలోకి వచ్చాయి.

తరగతి గది గుండెల్లో చిరకాలంగా ముద్ర వేసిన చాక్, నల్లబల్లలు నెమ్మదిగా మసకబారుతున్నాయి. స్మార్ట్ బోర్డులు, డిజిటల్ స్క్రీన్లు, ఆన్‌లైన్ బోధన వంటి కొత్త విధానాలు తరగతి గదిని ఆక్రమిస్తున్నాయి. భారత్‌లో సుమారుగా ప్రభుత్వ స్కూల్స్‌లో 21.1% ప్రైవేట్ పాఠశాలల్లో 34.6% ఫంక్షనల్ స్మార్ట్ క్లాసులు ఉన్నాయి. ఈ వివరాలను గమనిస్తే, అనేక ప్రాంతాల్లో టెక్నాలజీ ఇంకా పూర్తి స్థాయిలో అందుబాటులో లేదని తెలుస్తోంది. కానీ, అత్యంత వేగంగా డిజిటల్ సాంకేతిక విస్ఫోటనం జరుగుతోంది. అది పూర్తిగా తరగతి గదిని ఆక్రమించడానికి మరీ ఎక్కువ సమయం పట్టకపోవచ్చు.



◆ బోధనలో సాంకేతికత భాగస్వామ్యం అవుతుందిగానీ, ఉపాధ్యాయుని మానవీయ స్పర్శను భర్తీ చేయలేదు.

ఈ పరిణామానికి సంబంధించి, ప్రపంచవ్యాప్తంగా అనేక మంది పరిశోధకులు 'ఉపాధ్యాయులు ఉన్న తరగతి గది' (టీచర్–లెడ్ లెర్నింగ్), 'ఉపాధ్యాయులు లేని తరగతి గది' (టీచర్ లెస్) బోధన ప్రభావాల గురించి అధ్యయనాలు చేశారు. ఉదాహరణకు 'యునెస్కో' 2021లో విడుదల చేసిన నివేదిక ప్రకారం, ఆన్‌లైన్ వనరులు విద్యార్థుల్లో స్వీయ నియంత్రిత అభ్యసనాన్ని ప్రోత్సహించినా, ఉపాధ్యాయుని మార్గదర్శకత్వం లేకుండా దీర్ఘకాలిక విద్యా ఫలితాలు రావడం కష్టం. ఇదే విషయాన్ని న్యూజిలాండ్ విద్యా పరిశోధకుడు జాన్ హ్యాటీ పరిశోధనలూ నిరూపిస్తున్నాయి. ఆయన 'ప్రత్యేక అభ్యాసం' అనే అధ్యయనంలో విద్యార్థుల విజయంపై అత్యధిక ప్రభావం చూపే అంశం 'ఉపాధ్యాయుల సమూహ సామర్థ్యం' అని తేల్చారు. అంటే, పరికరాలు ఉన్నా, అభ్యసనలో నాణ్యమైన ఉపాధ్యాయుల దిశానిర్దేశం, ప్రేరణలు ముఖ్యమైనవి.

మరొక ప్రముఖ అమెరికన్ విద్యా శిక్షణ–ఆర్థికవేత్త ఎరిక్ హానుషెక్ కూడా ఉపాధ్యాయుని నాణ్యతే విద్యా ఫలితాలను ప్రభావితం చేసే ముఖ్య కారకం అని తెలిపాడు. డిజిటల్ టెక్నాలజీలు తక్షణం జ్ఞానాన్ని పొందగలిగే కొత్త వేదికలను ఆవిష్కరించిన ఈ కాలంలో సైతం ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గదర్శకులుగా అనితరసాధ్యమైన పాత్ర పోషిస్తున్నారు. 'బోధనలో సాంకేతికత భాగస్వామ్యం అవుతుంది గానీ, ఉపాధ్యాయుని మానవీయ స్పర్శను ఎప్పటికీ భర్తీ చేయలేదు.'

అమెరికన్ భౌతిక శాస్త్రవేత్త, శిక్షకుడు ఫ్రాంక్ ఓపెన్ హైమర్ 'నేర్చుకోవడానికి ఉత్తమ మార్గం బోధించడం, బోధించడానికి ఉత్తమ మార్గం విద్యార్థుల అన్వేషణకు ఉపయోగపడే పరికరాలను ఉపయోగించడం' అని చెప్పారు. పరికరాలు మారుతూనే ఉంటాయి. అధునాతన అంశాలు ఎన్ని వచ్చినా, తరగతి గదిలో ఉపాధ్యాయుని స్థానం ఎప్పటికీ పదిలమే!

వ్యాసకర్త హిస్టరీ లెక్చరర్, కథకురాలు
(నేడు ఉపాధ్యాయ దినోత్సవం)

హుందాగా జరగాల్సిన ఎన్నిక

ఇన్ బాక్స్

భారతదేశంలో రెండవ అతిపెద్ద రాజ్యాంగబద్ధ పదవి 'ఉపరాష్ట్రపతి'. దీనికి ఎన్నికలు జరగబోతున్న సందర్భంలో రెండు ప్రధాన జాతీయ పక్షాలైన బీజేపీ కూటమి (ఎన్డీఏ), కాంగ్రెస్ కూటమి (ఇండియా) తమ తమ అభ్యర్థులను ప్రకటించాయి. ఎన్డీఏ సి.పి. రాధాకృష్ణన్‌ను, ఇండియా కూటమి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డిని తమ తమ అభ్యర్థులుగా ప్రకటించాయి. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి పదవులకు ఎన్నికల నిర్వహణ హుందాగా జరగాలి. కానీ ఎన్డీఏ కూటమి పెద్దలు అనుచిత విమర్శలతో ప్రత్యర్థి పక్షం అభ్యర్థిపై దుష్ప్రచారానికి పాటు పడటం బాధాకరం. పార్టీల ఎత్తులు ఎలా ఉన్నా... ప్రజాస్వామ్యాన్నీ, రాజ్యాంగ స్ఫూర్తినీ కాపాడుతూ పక్షపాత ధోరణిని వహించకుండా స్వతంత్రంగా నిర్ణయం తీసుకోగల అభ్యర్థినే ఎలక్టోరల్ కాలేజీ (రాజ్యసభ, లోక్‌సభ సభ్యులు) ఎన్నుకోవాలి.



జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి




సి.పి. రాధాకృష్ణన్

జస్టిస్ సుదర్శన్ రెడ్డి 2011లో సల్వాజుడుంపై ఇచ్చిన తీర్పును బట్టి ఆయన్ని మావోయిస్టు అనుకూలునిగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆరోపణలు చేయడం కోర్టు ధిక్కరణ కిందకు వస్తుంది. ఎన్డీఏ అభ్యర్థిగా ఉన్న సీపీ రాధాకృష్ణన్ నాలుగు దశాబ్దాల రాజకీయ జీవితంలో తమిళనాడులో రాష్ట్రీయ స్వయం సేవక్, భారతీయ జన సంఘ్‌ల రాష్ట్ర శాఖల్లో బాధ్యులుగా, తర్వాత భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా, రెండు పర్యాయాలు కోయంబత్తూర్ నుండి భారతీయ జనతా పార్టీ తరఫున లోక్‌సభ సభ్యునిగా గెలిచారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి సాధారణ రైతు కుటుంబం నుండి ఎదిగి హైదరాబాద్ హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జిగా, గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా పనిచేశారు. అనేక ప్రగతిశీలమైన తీర్పులు ఇచ్చారు. అందులో మావోయిస్టులను అణచడానికి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం స్థానిక ఆదివాసీ యువకులతో స్థాపించిన 'సల్వాజుడుం'ను రద్దుచేయమని ఇచ్చిన తీర్పు ఒకటి. ఈ తీర్పు ఇచ్చిన ధర్మాసనంలో జస్టిస్ రెడ్డి ఒకరు మాత్రమే. మిగతా న్యాయమూర్తులను వదిలేసి ఆయనను మాత్రమే నక్సల్స్‌కు మద్దతుదారుగా చిత్రించడం వెనుక రాజకీయ దురుద్దేశం తప్ప మరొకటి లేదు. తీర్పును విమర్శించవచ్చుగానీ, జడ్జీలపై వ్యక్తిగత విమర్శలు తగవు.

– డా॥ బాదావత్ రాజు
మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు, తెలంగాణ

డేటా పాయింట్



ఆదర్శనీయుడు

రుజుమార్గం

మానవ జాతి సంస్కరణ కోసం, సాఫల్యం కోసం ప్రపంచంలో అనేకమంది ప్రవక్తలు ప్రభవించారు. వారిలో చివరిగా వచ్చినవారు ముహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహివసల్లం. దాదాపు 1,450 సంవత్సరాల క్రితం అరేబియా దేశంలోని మక్కా నగరంలో ఆయన జన్మించారు. పుట్టక ముందే తండ్రినీ, ఆరేళ్ళ ప్రాయంలో అమ్మనూ కోల్పోయారు. తాతయ్య ఆయన్ని పెంచి పెద్దచేశారు. చిన్నతనం నుంచే అనేక సుగుణాలను పుణికిపుచ్చుకున్న ముహమ్మద్ ప్రవక్త, 'అమీన్' (విశ్వసనీయుడు – అమానతుదారుడు)గా, 'సాదిఖ్' (సత్యసంధుడు)గా వినుతికెక్కారు.

ఆయన బోధనల ప్రకారం... మానవులు తమ సృష్టికర్తను మాత్రమే ఆరాధించాలి. తోటి మానవున్నీ, సమాజాన్నీ ప్రేమించాలి. నీతికీ, న్యాయానికీ కట్టుబడి ఉండాలి. అనాథలను, వృద్ధులను ఆదరించాలి. తల్లితండ్రులను సేవించాలి. విధేయత కలిగి ఉండాలి. బంధువులు, బాటసారులు, వితంతువులు, నిస్సహాయుల పట్ల తారసిల్లే బాధ్యతలను సక్రమంగా నెరవేర్చాలి. సంఘంలో ఒక మనిషికి మరో మనిషిపై పడే విద్యుక్త ధర్మాల పట్ల ఉపేక్ష వహించకూడదు. అన్యాయం, అధర్మ సంపాదనకు ఒడిగట్టవద్దు. వ్యభిచారం దరిదాపులకు పోవద్దు. పలికే ప్రతి మాటకూ, చేసే ప్రతి పనికీ సమాధానం చెప్పుకోవలసి ఉంటుంది. లెక్కా పత్రాలు, కొలతలు, తూనికలు చాలా కచ్చితంగా ఉండాలి. స్వార్థాన్నీ, అహాన్నీ త్యజించాలి. ఇతరులను తమకన్నా తక్కువగా చూడకూడదు.

జ్ఞానం జీవితం... అజ్ఞానం మరణం! ఇటువంటి బాధ్యతాభావాన్నీ, జవాబుదారీతనాన్నీ ప్రవక్త (స) ప్రజల మనసుల్లో నూరిపోసి, మానవీయ విలువలతో తులతూగే ఓ చక్కని సత్సమాజాన్ని ఆవిష్కరించారు.

– మదీహా అర్జుమంద్ ('మిలాద్ ఉన్ నబీ' పర్వదినం సందర్భంగా)

రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం లంచం డిమాండ్

- సీబీఐకి చిక్కిన జీఎస్టీ, కస్టమ్స్ సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ ప్రకాశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: రిటైర్మెంట్ బెనిఫిట్స్ సెటిల్ చేసేందుకు లంచం తీసుకుంటూ జీఎస్టీ, కస్టమ్స్ డిపార్ట్‌మెంట్ సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ సీబీఐకి చిక్కాడు. రిటైర్ అయిన అధికారి నుంచి రూ.25 వేలు లంచం తీసుకున్న ప్రకాశ్‌రావును సీబీఐ అధికారులు మంగళవారం అరెస్ట్ చేశారు. నాంపల్లిలోని స్పెషల్ కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు. జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేసిన విజయ్‌కుమార్ కొంతకాలంక్రితం పదవీ విరమణ పొందారు. రూ.14.45 లక్షలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని జీఎస్టీ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. ఈ బిల్స్‌ను క్లియర్ చేసేందుకు సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ ప్రకాశ్‌రావు రూ.30 వేలు డిమాండ్ చేశాడు. ఇందుకుగాను ఆగస్టు 18 నుంచి 25 వరకు ప్రకాశ్‌రావు పలుమార్లు ఫోన్ కాల్స్ చేశాడు. ఈ క్రమంలో రూ.25 వేలకు అంగీకరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీబీఐ హైదరాబాద్ రీజనల్ అధికారులు మంగళవారం నిందితుడిని అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు చేసేందుకు డీఎస్‌పీఈ (ఢిల్లీ స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్)సెక్షన్ 6 కింద రాష్ట్ర ప్రభుత్వ అనుమతి తీసుకున్నారు. ఆమోదం లభించిన వెంటనే దర్యాప్తు ప్రారంభించారు. ప్రకాశ్‌రావు ఫోన్‌కాల్‌డేటా సహా బాధితుడు అందించిన వివరాల ఆధారంగా విచారణ జరిపారు.



దవాఖానా కిటకిట

సీజనల్ వ్యాధులు ప్రబలుతుండటంతో రోగులు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వైద్య సేవల కోసం పెద్ద ఎత్తున వస్తున్నారు. నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఓపీ కేంద్రం వద్ద గురువారం రోగులు ఇలా బారులు తీరారు..
-సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ.

కన్నతండ్రి కర్కశత్వం

- ముగ్గురు పిల్లలపై పెట్రోల్ పోసి కాల్చి చంపి... ఆపై తనూ ఆత్మహత్య
- భార్యతో గొడవపడి దారుణానికి పాల్పడిన భర్త
- నాగర్‌కర్నూల్ జిల్లాలో వెలుగు చూసిన ఘటన
- మృతులది ఏపీలోని ప్రకాశం జిల్లా పెద్దబోయలపల్లి
- విషాదంగా ముగిసిన మిస్సింగ్ కేసు



వెల్టూరు వద్ద పిల్లలతో కలిసి బైక్‌పై వెళుతున్న వెంకటేశ్వర్లు (సీసీ ఫుటేజీ)



వెంకటేశ్వర్లు(ఫైల్)

సాక్షి, నాగర్‌కర్నూల్: భార్యపై కోపంతో ముగ్గురు కన్నబిడ్డలపై పెట్రోల్ పోసి కాల్చి చంపిన ఓ తండ్రి...ఆపై తనూ పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ అమానవీయ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లాలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఏపీలోని ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలం పెద్దబోయలపల్లి గ్రామానికి చెందిన గుత్తా వెంకటేశ్వర్లు (36) ఫెర్టిలైజర్ దుకాణం నిర్వహిస్తున్నాడు. గత నెల 30న ఇంట్లో భార్య దీపికతో గొడవ పడ్డాడు. పిల్లలు మోక్షిత (8), వర్షిణి (6), శివధర్మ (4) పాఠశాల నుంచి ఇంటికి రాగానే ముగ్గురిని బైక్‌పై ఎక్కించుకొని బయటకు వెళ్లాడు. శ్రీశైలం మీదుగా హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారిపై దోమలపెంటకు చేరుకున్నాడు. ఆగస్టు 31న ఉదయం 8 గంటల ప్రాంతంలో నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం సూర్యతండా వద్ద హైదరాబాద్- శ్రీశైలం రహదారి పక్కన వర్షిణి, శివధర్మలను చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి వారిపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. పెద్ద కుమార్తె మోక్షితను బైక్‌పై ఎక్కించుకొని కల్వకుర్తి మండలం తాండ్ర సమీపంలో రహదారి పక్కకు తీసుకెళ్లి పెట్రోల్ పోసి దహనం చేశాడు. అనంతరం వెల్దండ మండలం పెద్దాపూర్ శివారులో రహదారి పక్కన పొలంలో పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు.

సీసీ ఫుటేజీ ఆధారంగా..

వెల్దండ మండలం పెద్దాపూర్ వద్ద వెంకటేశ్వర్లు మృతదేహం బుధవారం లభ్యం కాగా.. ముగ్గురు పిల్లల ఆచూకీ లభించలేదు. పోలీసులు వంగూరు మండలం కోనేటిపూర్ టోల్‌ప్లాజా వద్ద సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించారు. ఇద్దరు పిల్లలతో బైక్‌పై వెళుతూ వెంకటేశ్వర్లు సీసీ కెమెరాలో కనిపించాడు. దీంతో పోలీసులు పరిసర ప్రాంతాల్లో గాలింపు ముమ్మరం చేశారు. గురువారం ఉదయం ఉప్పునుంతల మండలం సూర్యతండా వద్ద వర్షిణి, శివధర్మ మృతదేహాలు, కల్వకుర్తి మండలం తాండ్ర సమీపంలో మోక్షిత మృతదేహాలు పూర్తిగా దహనమై కనిపించాయి. ప్రకాశం జిల్లాలో మిస్సింగ్ కేసు నమోదు కాగా, నాగర్‌కర్నూల్ పోలీసులు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి ఏపీ పోలీసులకు అప్పగించారు.

ఇక్ఫాయ్‌లో గంజాయి కలకలం!

- 8 మంది వర్సిటీ విద్యార్థులకు డ్రగ్ పరీక్షలు
- అందరికీ పాజిటివ్
- ర్యాపిడో డ్రైవర్‌తో పాటు మరో యువకుడి అరెస్ట్

శంకర్‌పల్లి: మండల పరిధిలోని ఇక్ఫాయ్ డీమ్డ్ యూనివర్సిటీలో గురువారం గంజాయి కలకలం రేపింది. విశ్వవిద్యాలయానికి చెందిన ఎనిమిది మంది విద్యార్థులు గంజాయి తీసుకున్నట్లు తేలడం సంచలనంగా మారింది. పోలీసుల కథనం ప్రకారం.. ఒడిశాకు చెందిన బీటెక్ సెకండ్ ఇయర్ విద్యార్థి వర్షిత్ కొంపల్లిలో ఉంటూ, నిత్యం కళాశాల బస్సులో తరగతులకు హాజరవుతున్నాడు. వివిధ రాష్ట్రాలకు చెందిన పలువురు విద్యార్థులను పరిచయం చేసుకున్నాడు. ఒడిశా నుంచి ఎండు గంజాయి తీసుకొచ్చి రూ.వెయ్యికి పది గ్రాముల చొప్పున విక్రయిస్తున్నాడు. యూనివర్సిటీలో చదువుతూ సమీపంలోని ఎస్ఆర్ హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థులకు గంజాయి అమ్ముతున్నాడు. మండలంలోని మహారాజ్‌పేట్ గ్రామానికి చెందిన ర్యాపిడో డ్రైవర్ అంబూరీ వంశీ (19)ని గంజాయి సరఫరా కోసం వినియోగిస్తున్నాడు. యూనివర్సిటీకి చెందిన బీటెక్ విద్యార్థులు అభినవ్‌సింగ్ (20), సయ్యద్ మొయినొద్దీన్ ఖాద్రి (19), పీయూష్ సింగ్ (20), ఎల్ఎల్‌బీ విద్యార్థులు సొరజ్ నస్కర్ (22), గౌరవ్ దాగా (21), నిమ్మ సుమిత్‌రెడ్డి(22), సాస్వత్ చతుర్వేది (21), ఎంబీఏ సెకండ్ ఇయర్ విద్యార్థి అనురాగ్ గిరీష్ (27)తో పాటు ఓ ప్రైవేటు హాస్టల్‌లో పని చేస్తున్న ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన రవి గైక్వాడ్ (19) గురువారం కాలేజీ సమీపంలో గంజాయి తీసుకుంటుండగా.. పక్కా సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ ఎస్ఓటీ, మోకిల పోలీసులు దాడులు చేశారు. విద్యార్థులకు డ్రగ్ పరీక్షలు నిర్వహించగా.. అందరికీ పాజిటివ్ వచ్చింది. అభినవ్‌సింగ్ వద్ద లభించిన 300 గ్రాముల ఎండు గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీరికి గంజాయి సరఫరా చేస్తున్న వర్షిత్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. పట్టుబడిన పది మందిపై ఎన్‌డీపీఎస్ యాక్టు కింద మోకిల పోలీసులు కేసు నమోదు చేశారు.

- సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌లో ఉంటూ.. టీడీపీ గురించి మాట్లాడటమేమిటని, దీనిపై కాంగ్రెస్ శ్రేణులు ఆలోచించాలని బీఆర్ఎస్ నేత జి.దేవీప్రసాద్ అన్నారు. ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ టీడీపీ పుట్టిందే కాంగ్రెస్‌పై వ్యతిరేకతతో అనే విషయం తెలియదా అని ప్రశ్నించారు.

చెట్ల నరికివేతతోనే చేటు!

వరద విలయానికి కారణమిదే

- వృక్షాల నరికివేత అరికట్టండి
- ఏం చేస్తారో వివరణ ఇవ్వండి
- కేంద్రం సహా వరద బాధిత రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: వరద విలయంలో తరచూ ఉత్తరాది రాష్ట్రాలు చిక్కుకుపోతున్న ఘటనలపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం, ఆవేదన వ్యక్తంచేసింది. విపరీతంగా, విచ్చలవిడిగా వృక్షాలను నేలకూల్చడమే ఈ ప్రకృతివినాశనానికి అసలు కారణమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌ల సుప్రీంకోర్టు ధర్మాసనం అభిప్రాయపడింది. వరద నీటిని బలంగా ఎదుర్కొనే భారీ వృక్షాలను విపరీతంగా నరికేయడం వల్లే వరదల ప్రభావం అత్యధిక స్థాయిలో ఉంటోందని, చెట్ల అక్రమ నరికివేత పర్వానికి ఇకనైనా ముగింపు పలకాలని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. వరదల బారినపడి అవస్థలు పడుతున్న హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్మూకశ్మీర్, పంజాబ్ ప్రభుత్వాలతోపాటు కేంద్ర పర్యావరణ, అడవులు, వాతావరణ మార్పులు, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీచేసింది. చెట్ల నరికివేతను అడ్డుకునేలా ఏమేం చర్యలు తీసుకుంటున్నారో వివరిస్తూ సంజాయిషీ ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. ఇటీవల హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్‌లో కొండచరియలు విరిగిపడటం, వరదల విలయం సర్వసాధారణంగా మారిన విషయం తెల్సిందే. దీంతో కొండప్రాంతాల్లో చెట్ల అక్రమ నరికివేత కారణంగానే వరద ప్రభావం అధికమైందని, ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను అప్రమత్తం చేయాలంటూ అనామికా రాణా వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు గురువారం విచారణచేపట్టింది. ఈ సందర్భంగా వరద విలయంపై కోర్టు పలు వ్యాఖ్యలు చేసింది. '' ఉత్తరాఖండ్, హిమాచల్, పంజాబ్‌లో కొండచరియలు పడటం, వరదల వార్తలు మనందరం చూస్తూనే ఉన్నాం. వరద నీటిలో ఎన్నడూలేనంతటి భారీ స్థాయిలో పెద్ద దుంగలు కొట్టుకుపోవడం మీడియా కథనాల్లో గమనించాం. ఇన్ని దుంగలు ఎక్కడి నుంచి కొట్టుకొస్తున్నాయి? అక్రమంగా భారీ చెట్లను నరికివేసి ప్రకృతి విలయానికి కారణమవుతున్నారు. ఈ విషయంలో బాధిత రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రం తక్షణం స్పందించాల్సిందే'' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.



సీరియస్‌గా తీసుకోండి

వేరే కేసు విచారణ నిమిత్తం అదే కోర్టు హాల్‌లో ఉన్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు కేంద్రం సూచనలు చేసింది. కేంద్రం తగు చర్యలు తీసుకునేలా చూడాలని ఆయనను ఆదేశించింది. '' ఇది చాలా తీవ్రమైన అంశం. అందుకే కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై ప్రధానంగా దృష్టిసారించాలి. చెట్లను నరికేస్తుండటంతో ఆ దుంగలన్నీ వరద ప్రవాహంలో దిగువకు కొట్టుకొస్తున్నాయి. పంజాబ్‌లో వరదనష్టానికి సంబంధించిన ఫొటోలను చూశాం. లక్షల ఎకరాల్లో పంట పాడైంది. కొండప్రాంతాల్లోనూ అభివృద్ధి జరగాల్సిందే. కానీ పర్యావరణం పాడవకుండా అభివృద్ధిని సుసాధ్యంచేయాలి. పర్యావరణానికి, అభివృద్ధికి మధ్య సమతుల్యత దెబ్బతినకుండా చూడాలి'' అని మెహతాకు కోర్టు సూచించింది. దీంతో మెహతా స్పందించారు. '' ప్రకృతితో మనం అనవసరంగా అతిగా జోక్యం చేసుకున్నాం. అందుకే ప్రకృతి మన విషయాల్లోనూ జోక్యం చేసుకుంటోంది. ఇలాంటి విలయాలను సాధ్యమైనంతమేరకు నివారించేందుకు ప్రయత్నిస్తాం. ఈరోజే నేను కేంద్ర పర్యావరణ మంత్రికి విషయాన్ని వివరిస్తా. బాధిత రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులతోనూ మాట్లాడతా'' అని మెహతా కోర్టుకు హామీ ఇచ్చారు. పిటిషనర్ అనామికా రాణా తరఫున న్యాయవాదులు ఆకాశ్ వశిష్ట, శుభం ఉపాధ్యాయ్ వాదించారు. ''ఆకస్మిక వరదల కారణంగా కొందరు సొరంగమార్గాల వద్ద చిక్కుకుపోతున్నారు. మరికొందరి పరిస్థితి ప్రాణసంకటంగా మారింది. ఈ అంశంలో ప్రభుత్వాలు వెంటనే కార్యాచరణతో ముందుకురావాలి. విపత్తులు సంభవించకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి. బాధిత పౌరులకు నష్టపరిహారం, పునరావాసం, సాయం అందించాలి'' అని న్యాయవాదులు వాదించారు. వీరి వాదనలపై కోర్టు స్పందించింది. సీరియస్ విషయం కాబట్టే ఈ కేసును మరో రెండువారాల్లో మళ్లీ విచారిస్తామని ధర్మాసనం తెలిపింది.



జేఎన్‌పోర్ట్ టెర్మినల్ రెండో దశను బటన్ నొక్కి ప్రారంభిస్తున్న సింగపూర్ ప్రధాని వాంగ్, మోదీ

భారత్–సింగపూర్ మధ్య సుదృఢ బంధం

- సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని విస్తరింపజేసుకోవాలని నిర్ణయం
- ప్రధాని నరేంద్ర మోదీతో సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్ భేటీ
- పలు అవగాహనా ఒప్పందాలపై సంతకాలు

న్యూఢిల్లీ: సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని విస్తరింపజేసుకోవాలని భారత్, సింగపూర్ నిర్ణయించుకున్నాయి. ఇందుకోసం ఒక రోడ్‌మ్యాప్‌ను ఆవిష్కరించాయి. ప్రస్తుతం ప్రపంచ భౌగోళిక రాజకీయాలు అస్తవ్యస్తంగా మారిన తరుణంలో ఉమ్మడి ప్రయోజనాల పరిరక్షణ కోసం ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని ఇరుదేశాలు తీర్మానించాయి. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్ గురువారం ఢిల్లీలో సమావేశమయ్యారు. రెండు దేశాల మధ్య సంబంధాలు, ప్రస్తుత పరిణామాలపై విస్తృతంగా చర్చించుకున్నారు. ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని ఏకాభిప్రాయానికి వచ్చారు. భారత్–సింగపూర్ మధ్య దౌత్యానికి మించిన గొప్ప అనుబంధం ఉన్నట్లు ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. కృత్రిమ మేధ(ఏఐ), క్వాంటమ్‌తోపాటు ఇతర డిజిటల్ టెక్నాలజీల్లో భాగస్వామ్యాన్ని పెంపొందించుకోవాలని నిర్ణయించినట్లు చెప్పారు.

ఉగ్రవాదంపై ఐక్యంగా పోరాడాలి

మానవాళికి పెనుముప్పుగా మారిన ఉగ్రవాదంపై సింగపూర్‌తో కలిసి పోరాడుతున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. లారెన్స్ వాంగ్‌తో భేటీ అనంతరం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రెండు దేశాలు ఉగ్రవాదం వల్ల ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నాయని చెప్పారు. ఉగ్రవాదంపై ఐక్యంగా పోరాడడం మానవత్వాన్ని విశ్వసించే అన్ని దేశాల బాధ్యత అని స్పష్టంచేశారు. భారత్–సింగపూర్ సంబంధాలకు కలిసి పంచుకుంటున్న విలువలు, ప్రయోజనాలే ప్రాతిపదిక అని పేర్కొన్నారు. శాంతి, సౌభాగ్యాలే రెండుదేశాల ఉమ్మడి లక్ష్యమని వివరించారు. ప్రస్తుత ప్రపంచ పరిణామాల నేపథ్యంలో భారత్–సింగపూర్ భాగస్వామ్యానికి ప్రాధాన్యం ఎన్నో రెట్లు పెరిగిందని లారెన్స్ వాంగ్ స్పష్టంచేశారు. మోదీ, వాంగ్ భేటీ నేపథ్యంలో ఇరుదేశాల నడుమ పలు అవగాహనా ఒప్పందాలపై(ఎంఓయూ) సంతకాలు జరిగాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్బీఐ), మానిటరీ అథారిటీ ఆఫ్ సింగపూర్ మధ్య డిజిటల్ అస్సెట్ ఇన్నోవేషన్ ఒప్పందం కుదిరింది. అలాగే గ్రీన్ షిప్పింగ్ ఒప్పందంలో భాగంగా రెండు దేశాలు కలిసికట్టుగా గ్రీన్ అండ్ డిజిటల్ షిప్పింగ్ కారిడార్(జీడీఎస్సీ)ను ఏర్పాటు చేయబోతున్నాయి.

జేఎన్‌పోర్ట్ పీఎస్‌ఏ టెర్మినల్ రెండో దశ ప్రారంభం

భారత, సింగపూర్ ప్రధానమంత్రులు మోదీ, లారెన్స్ వాంగ్ గురువారం ముంబైలో జేఎన్‌పోర్ట్ పీఎస్‌ఏ టెర్మినల్ రెండో దశను వర్చువల్‌గా ప్రారంభించారు. దీనివల్ల ఈ టెర్మినల్ కంటైనర్ హ్యాండ్లింగ్ సామర్థ్యం 4.8 మిలియన్ టీఈయూలకు పెరగనుంది.

డిసెంబర్‌కల్లా స్వేచ్ఛా వాణిజ్యం!

- భారత్, ఈయూ నిర్ణయం
- కోస్టా, ఉర్సులాకు మోదీ ఫోన్

న్యూఢిల్లీ: ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని(ఎఫ్‌టీఏ) ఈ ఏడాది డిసెంబర్‌కల్లా కుదుర్చుకోవాలని, అందుకోసం చర్చలను త్వరగా ముగించాలని భారత్, యూరోపియన్ యూనియన్(ఈయూ) నిర్ణయించుకున్నాయి. ప్రధాని మోదీ గురువారం 27 దేశాల ఈయూ కూటమి ముఖ్యనేతలు ఆంటోనియో కోస్టా, ఉర్సులా వాన్ డెర్ లెయన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. అమెరికా భారీ టారిఫ్‌ల నేపథ్యంలో నిబంధనల ఆధారిత ప్రపంచ క్రమాన్ని(గ్లోబల్ ఆర్డర్) ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని మోదీ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న సమస్యల పరిష్కారంలో భారత్–ఈయూ వ్యూహాత్మక భాగస్వామ్యం పాత్ర కీలకమని మోదీ, ఆంటోనియో కోస్టా, ఉర్సులా వాన్ డెర్ లెయన్ నిర్ణయానికొచ్చారు. త్వరలో ఇండియాలో జరుగనున్న ఇండియా– ఈయూ సదస్సు గురించి ముగ్గురు నేతలు చర్చించుకున్నారు. ఈ సదస్సుకు హాజరు కావాలని ఆంటోనియో కోస్టా, ఉర్సులాను మోదీ ఆహ్వానించారు.

దేశ ప్రగతికి 'డబుల్ డోసు'

- ప్రజలకు డబ్బు ఆదా.. దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం
- జీఎస్టీ సంస్కరణలతో అన్ని వర్గాలకూ లబ్ధి: మోదీ

న్యూఢిల్లీ: వస్తు సేవల పన్ను(జీఎస్టీ)లో ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణల పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తంచేశారు. దేశ అభివృద్ధికి ఇది 'డబుల్ డోసు' మద్దతు అని తేల్చిచెప్పారు. 2004 నుంచి 2014 దాకా కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ హయాంలో పన్నుల విధానం గందరగోళం ఉండేదని చెప్పారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత పన్నుల వ్యవస్థను సంస్కరించి, సరళీకృతం చేశామని పేర్కొన్నారు. జీఎస్టీలో తాజా సంస్కరణలను ప్రసార మాధ్యమాలు 'జీఎస్టీ 2.0'గా అభివర్ణిస్తున్నాయని తెలిపారు. తాజా మార్పులతో రెండు విధాలుగా లబ్ధి కలుగుతుందని వివరించారు. సాధారణ ప్రజలకు డబ్బు ఆదా కావడంతోపాటు దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని.. అందుకే ఇది డబుల్ డోసు అని స్పష్టంచేశారు. గురువారం ఢిల్లీలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన విజేతలతో మోదీ మాట్లాడారు. జీఎస్టీలో సంస్కరణలతో సమాజంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని తెలియజేశారు.



ఆయన ఇంకా ఏం చెప్పారంటే...

''దేశం స్వయం సమృద్ధి సాధించాలి. అందుకోసం తదుపరి తరం సంస్కరణలను ఆపే ప్రసక్తేలేదు. దేశ ప్రజలకు డబుల్ ధమాకా ఇస్తానని ఎర్రకోట నుంచి హామీ ఇచ్చా. సెప్టెంబర్ 22న నవరాత్రుల తొలి రోజు నుంచే ఈ ధమాకా అందుబాటులోకి రాబోతోంది. దేశ చరిత్రలో ఇదొక మైలురాయి. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజలపై అధిక పన్నులు విధించాయి. వంట గదిలో వాడుకొనే వస్తువులను, ఆఖరికి ఔషధాలను కూడా వదిలిపెట్టలేదు. అప్పటి పాలన ఇంకా కొనసాగుతూ ఉంటే రూ.100 విలువైన వస్తువు కొనుగోలుపై రూ.25 పన్ను చెల్లించాల్సి వచ్చేది. ప్రజల చేతుల్లో డబ్బులు మిగిల్చి, వారి జీవితాలను మెరుగుపర్చాలన్న ధ్యేయంతో మేము పని చేస్తున్నాం. ఆన్‌లైన్ మనీ గేమింగ్‌ను నియంత్రించడానికి కొత్త చట్టం తీసుకొచ్చాం. ఈ విషయంలో మాపై ఒత్తిళ్లు వచ్చినా వెనక్కి తగ్గలేదు. యువత భవిష్యత్తుకు భద్రత కల్పించాలని నిర్ణయించాం. గేమింగ్ అనేది చెడ్డది కాకపోయినా అదే పేరుతో జూదం ఆడడం ప్రమాదకరమే. ఆన్‌లైన్ గేమింగ్ సరైన రీతిలో నిర్వహిస్తే గ్లోబల్ మార్కెట్‌లో మన దేశమే నంబర్ వన్ అవుతుంది. మన దేశ ప్రగతి కోసం విద్యార్థులు, ఉపాధ్యాయులు స్వదేశీ ఉత్పత్తులే ఉపయోగించుకోవాలని మరోసారి కోరుతున్నా'' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

యుద్ధం ఆగాలంటే

భారత్‌పై టారిఫ్‌ల మోత తప్పదు!



అమెరికా సుప్రీంకోర్టు

- పలు దేశాలపై టారిఫ్‌లు అమల్లో లేకపోతే అమెరికా ఆర్థికవినాశనం తప్పదు
- యూఎస్ సుప్రీంకోర్టునే పరోక్షంగా బెదిరించిన అమెరికా ప్రభుత్వం
- ప్రతిష్టంబన వీడేలా కేసును త్వరగా తేల్చాలని డిమాండ్

న్యూయార్క్/వాషింగ్టన్: టారిఫ్‌ల బూచి చూపి పలు దేశాలను భయపెడుతున్న ట్రంప్ సర్కార్ చివరకు యూఎస్ సుప్రీంకోర్టును సైతం టారిఫ్‌లు తగ్గిస్తే అమెరికా వాణిజ్యలోటు సంక్షోభంలో కూరుకుపోతుందని భయపెట్టే దుస్సాహసానికి ఒడిగట్టింది. ఉక్రెయిన్‌లో శాంతిస్థాపనే జరగాలంటే భారత్‌పై టారిఫ్‌ల మోత మోగాల్సిందేనని ట్రంప్ ప్రభుత్వం గురువారం అమెరికా సుప్రీంకోర్టులో వితండవాదానికి దిగింది. భారత్‌సహా ఇతర దేశాలపై అధిక టారిఫ్‌ల భారం మోపకపోతే ఆర్థికలోటు సుడిగుండంలో అమెరికా చిక్కుకోక తప్పదని ట్రంప్ సర్కార్ అనవసరంగా ఆందోళన వ్యక్తంచేసింది. అప్పీళ్ల కోర్టులో తమకు వ్యతిరేకంగా ఉత్తర్వులు రావడంతో ఇతర దేశాలతో టారిఫ్‌ల చర్చల్లో ప్రతిష్టంబన నెలకొందని, అందుకే కేసును వీలైనంత త్వరగా తేల్చాలని యూఎస్ సుప్రీంకోర్టులో గురువారం డిమాండ్‌చేసింది. ఈ మేరకే ఏకంగా 251 పేజీల అఫిడవిట్‌ను కోర్టుకు ట్రంప్ సర్కార్ సమర్పించింది. ''ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణకు దిగడంతో ప్రత్యక్షంగా అమెరికాలో జాతీయ అత్యయిక పరిస్థితి ఏర్పడింది. దీనిని పరిష్కరించేందుకే భారత్‌పై టారిఫ్‌ల మోత మోగించాల్సి వచ్చింది. ఇందుకోసం అధ్యక్షుడు తన '1977 అంతర్జాతీయ అత్యయిక ఆర్థిక అధికారాల చట్టం'ను ప్రయోగించారు. అధిక టారిఫ్‌లతో భారత్‌పై ఆర్థికపరంగా ఒత్తిడి తెస్తేనే భారత్ మరో గత్యంతరంలేక చివరకు రష్యా యుద్ధవిరామం చేసేలా ఒప్పించగల్గుతుంది. ఉక్రెయిన్‌లో శాంతి స్థాపనకు, అమెరికా ఆర్థికవ్యవస్థ పటిష్టతకు భారత్‌పై 50 శాతం టారిఫ్ అవశ్యం''అని ట్రంప్ ప్రభుత్వం వాదించింది. ''టారిఫ్‌ల విధింపును కోర్టులు అడ్డుకుంటే, అన్ని దేశాలపై టారిఫ్‌లు విధించే అసాధారణ అధికారం అధ్యక్షుడికి లేదని మీరు తేలిస్తే వాణిజ్యలోటు కష్టాల నుంచి అమెరికా బయటపడటం చాలా కష్టమవుతుంది. చివరకు అమెరికా ఆర్థికవినాశనం సంభవిస్తుంది''అంటూ తమకు వ్యతిరేక తీర్పు రావొద్దనే ధోరణిలో ఏకంగా యూఎస్ సుప్రీంకోర్టునే భయపెట్టేలా ట్రంప్ సర్కార్ దుస్సాహసానికి ఒడిగట్టింది.

ఆరు కీలక దేశాలు దారికొచ్చాయి

''టారిఫ్‌ల కొరడా ఝుళిపించడంతో ప్రపంచంలోనే ఆరు ప్రధాన ఆర్థికవ్యవస్థలు(దేశాలు) మా దారికొచ్చాయి. అమెరికాతో 27 సభ్యదేశాలున్న ఐరోపా సమాఖ్య సైతం టారిఫ్‌ల ఒప్పందంచేసుకుంది. ఈ ఒప్పందం అమెరికాకు భారీగా మేలు చేకూర్చేదే. దీంతోపాటు 2 ట్రిలియన్ డాలర్ల కొనుగోళ్లు, అమెరికా ఆర్థిక వ్యవస్థలోకి భారీ పెట్టుబడులు సాధ్యంకానున్నాయి. ఆయా దేశాలపై మేం విధించే టారిఫ్‌లు అనేవి అమెరికా మరింతగా 1.2 ట్రిలియన్ డాలర్ల వార్షిక వాణిజ్యలోటు అగాధంలో పడకుండా కాపాడే రక్షారేకులు. టారిఫ్‌లు విధించే అధికారం అధ్యక్షుడికి ఉండదన్న 'అప్పీల్స్ ఫర్ ది ఫెడరల్ సర్క్యూట్ కోర్టు'అభిప్రాయాన్ని పట్టించుకోకండి. ఇతర దేశాలపై అధిక టారిఫ్‌లు మోపితేనే అమెరికా సంపన్న దేశంగా కొనసాగుతుంది. లేదంటే పేదదేశంగా పతనమవుతుంది. ట్రంప్ అధికారంలోకి రాకమునుపు అమెరికా ఆర్థిక వ్యవస్థ స్తబ్దుగా ఉండిపోయింది. ఇప్పుడు అధిక టారిఫ్‌లతో బిలియన్ల కొద్దీ డబ్బు వచ్చిపడుతోంది. ఇప్పుడు అమెరికా మళ్లీ బలపడుతోంది. ఆర్థికంగా పటిష్టమవుతూ విశ్వవ్యాప్తంగా గౌరవమర్యాదలను పొందుతోంది''అని ట్రంప్ ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ డి. జాన్ సాయెర్ వాదించారు. నవంబర్‌లోపు కేసులో వాదోపవాదనలను ముగించి తీర్పు చెప్పాలని కోర్టును సాయెర్ కోరారు.

ఆంక్షలతో లొంగదీసుకోలేరు

ఇండియా, చైనాలపై అమెరికా టారిఫ్‌లను తప్పుబట్టిన పుతిన్

మాస్కో: భారత్, చైనాలపై అమెరికా విధిస్తున్న టారిఫ్‌లు, ఆంక్షలను రష్యా అధ్యక్షుడు పుతిన్ తప్పుపట్టారు. ఆ రెండు దేశాలను ఆంక్షల కొరడాతో లొంగదీసుకోవాలని చూడడం సరైంది కాదని తేల్చిచెప్పారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్, చైనాలతో మాట్లాడే విధానమే సరిగ్గా లేదని, వలసవాద పాలన కాలం నాటి మాటలను ట్రంప్ మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. పుతిన్ తాజాగా మీడియా సమావేశంలో పాల్గొన్నారు. అమెరికా సర్కార్ వైఖరిపై ఘాటుగా స్పందించారు. ఆసియాలో రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన భారత్, చైనాలపై ఆర్థిక ఒత్తిడిని పెంచి, దారికి తెచ్చుకోవాలని చూస్తే అది సాధ్యం కాదని అభిప్రాయపడ్డారు. ఆర్థిక అంశాన్ని ఒక ఆయుధంగా వాడుకోవడం ఏమిటని ప్రశ్నించారు. భారత్, చైనాలు చక్కటి భాగస్వామ్య దేశాలని పుతిన్ గుర్తుచేశారు. అమెరికా విధిస్తున్న టారిఫ్‌లను ఆ రెండు దేశాల్లో నాయకత్వాన్ని బలహీనపర్చేందుకు జరుగుతున్న ప్రయత్నాలుగా అభివర్ణించారు. భారత్, చైనాలు కలిసి అమెరికాను శిక్షిస్తాయని ఎవరైనా చెబితే ఆ విషయం సీరియస్‌గా ఆలోచించాల్సిందేనని ట్రంప్ ప్రభుత్వానికి సూచించారు. 140 కోట్లకుపైగా జనాభా ఉన్న ఇండియాను, శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థ కలిగిన చైనాను బలహీన దేశాలుగా ఎలా భావిస్తారని ప్రశ్నించారు. వలసవాద ప్రభుత్వాల హయాం ఎప్పుడో ముగిసిపోయిందని, భాగస్వామ్య దేశాలతో మాట్లాడేటప్పుడు అప్పటి పద జాలం ఉపయోగిస్తామంటే కుదరదని, ఈ విషయం అమెరికా తెలుసుకోవాలని హితవు పలికారు. అమెరికా, భారత్, చైనాల మధ్య మళ్లీ సాధారణ సంబంధాలు నెలకొంటాయన్న నమ్మకం తనకు ఉందని పుతిన్ స్పష్టంచేశారు.



కారులో మోదీతో సంభాషణ రహస్యం కాదు

చైనాలో ఇటీవల జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సు సందర్భంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధినేత పుతిన్ ప్రత్యేకంగా సమావేశమైన సంగతి తెలిసిందే. వారిద్దరూ ఒకే కారులో ప్రయాణించారు. కారులోనే 45 నిమిషాలకుపైగా మాట్లాడుకున్నారు. దీనిపై వస్తున్న ఊహాగానాలపై పుతిన్ స్పందించారు. మోదీతో కారులో సంభాషించడం వెనుక రహస్యం ఏమీ లేదన్నారు. అది రహస్య సంభాషణ కాదని స్పష్టంచేశారు. అలస్కాలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో జరిగిన భేటీ విశేషాలను మోదీకి వివరించానని చెప్పారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో

బ్యాలెట్ పేపరే

రాష్ట్ర ఎన్నికల సంఘానికి సిఫార్సు చేయనున్న కర్ణాటక ప్రభుత్వం

బెంగళూరు: ఓటరు జాబితాల్లో అవకతవకల ఆరోపణల నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలకు బ్యాలెట్ పేపర్‌ను ఉపయోగించాలని కర్ణాటక మంత్రి వర్గం గురువారం నిర్ణయించింది. అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధం చేసిన ఓటర్ల జాబితాలపై ఆధారపడకుండా, జిల్లా, తాలూకా, గ్రామ పంచాయతీల్లో ఓటరు జాబితాల తయారీ అధికారం రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్‌ఈసీ)కే ఇవ్వాలని కూడా కేబినెట్ నిర్ణయించింది. 'స్థానిక సంస్థలకు జరగబోయే అన్ని ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎంలు) కాకుండా బ్యాలెట్ పత్రాలు ఉంటాయని, అందుకు అవసరమయ్యే చట్టాలు, నియమాలను రాబోయే 15 రోజుల్లో సవరించనున్నామని మంత్రి ఏఓ పాటిల్ అన్నారు.

అది జీఎస్టీ 1.5 మాత్రమే: కాంగ్రెస్

న్యూఢిల్లీ: జీఎస్టీలో సంస్కరణలపై విపక్ష కాంగ్రెస్ పార్టీ అంతృప్తి వ్యక్తం చేసింది. అది జీఎస్టీ1.5 మాత్రమేనని, జీఎస్టీ 2.0 కోసం ఎదురు చూస్తున్నామని పేర్కొంది. వస్తు సేవల పన్నును సరళతరం చేయాలని తాము ఎన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నామని, ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోలేదని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే విమర్శించారు. వన్ నేషన్, వన్ ట్యాక్స్‌ను మోదీ ప్రభుత్వం వన్ నేషన్, 9 ట్యాక్స్‌లుగా మార్చిందని ఆరోపించారు. ఇప్పుడు తీసుకొచ్చిన సంస్కరణలు ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేలా లేవన్నారు. ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టాలని కోరారు.

బెంగాల్ అసెంబ్లీలో రగడ

- అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర ఘర్షణ
- మార్షల్స్ బలవంతంగా లాక్కెళ్లడంతో బీజేపీ చీఫ్ విప్‌కు గాయాలు
- బీజేపీ అవినీతి పార్టీ, దొంగల పార్టీ అంటూ సీఎం మమతా బెనర్జీ మండిపాటు
- బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బెంగాలీలపై దాడులు జరుగుతున్నాయని ఆగ్రహం

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ శాసనసభ రణరంగాన్ని తలపించింది. అధికార తృణమూల్ కాంగ్రెస్, విపక్ష బీజేపీ సభ్యుల మధ్య గురువారం తీవ్ర వాగ్వాదం, ఘర్షణ చోటుచేసుకున్నాయి. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బెంగాల్ వలస కార్మికులపై దాడులు జరుగుతున్నాయని తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆరోపించారు. ఈ దాడులను ఖండిస్తూ తీర్మానం ఆమోదించాలని పట్టుబట్టారు. తీర్మానంపై తొలుత ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మాట్లాడారు. బీజేపీ తీరుపై విరుచుకుపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా బెంగాల్ ప్రజలపై కక్షగట్టారని మండిపడ్డారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బెంగాలీలపై దాడులు జరుగుతున్నా వారు పట్టించుకోవడం లేదని విమర్శించారు. బెంగాలీతోపాటు ఇతర భాషలను వారు వ్యతిరేకిస్తున్నారని ఆక్షేపించారు. బీజేపీ అవినీతి పార్టీ, దొంగల పార్టీ అంటూ నిప్పులు చెరిగారు. ఓట్ల దొంగతనం చేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. పార్లమెంట్‌లో తమ పార్టీ ఎంపీలపై సీఐఎస్‌ఎఫ్ జవాన్లను ఉసిగొల్పిందని అన్నారు. దేశాన్ని రక్షించుకోవాలంటే బీజేపీని నామరూపాల్లేకుండా చేయాలని వ్యాఖ్యానించారు. మమతా బెనర్జీ వ్యాఖ్యలపై బీజేపీ సభ్యులు అభ్యంతరం వ్యక్తంచేశారు. ఆమెకు వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. వారిని హెచ్చరిస్తూ మమతా బెనర్జీ మాట్లాడారు. ఈ సభలో ఒక్క బీజేపీ ఎమ్మెల్యే కూడా ఉండని రోజు వస్తుందన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం త్వరలో కూలిపోతుందని తేల్చిచెప్పారు. ప్రజలు మిమ్మల్ని అధికారం నుంచి కూలదోస్తారని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో బెంగాలీలపై జరుగుతున్న అరాచకాలపై అసెంబ్లీలో చర్చించడానికి బీజేపీ సభ్యులకు భయమెందుకని ప్రశ్నించారు. దాంతో సభలో అలజడి మొదలైంది. అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పరస్పరం దూషించుకున్నారు. ఓట్ల దొంగ బీజేపీ అంటూ తృణమూల్ కాంగ్రెస్, ఉద్యోగాల దొంగ తృణమూల్ కాంగ్రెస్ అంటూ బీజేపీ సభ్యులు నినదించారు. నీళ్ల సీసాలు విసురుకున్నారు. ఒకరిపై ఒకరు దూసుకెళ్లేందుకు ప్రయత్నించగా భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. సభలో సీఎం మమతా బెనర్జీకి వ్యతిరేకంగా నినాదాలు మిన్నంటాయి.

బీజేపీ సభ్యుల సస్పెన్షన్

సభలో పరిస్థితి అదుపు తప్పడంతో బీజేపీ చీఫ్ విప్ డాక్టర్ శంకర్ ఘోష్‌ను సభ నుంచి రోజంతా సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ బీమన్ బెనర్జీ ప్రకటించారు. మార్షల్స్‌ను సభలోకి పిలిపించారు. తమ పార్టీ చీఫ్ విప్ సస్పెన్షన్ పట్ల బీజేపీ సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు. జైశ్రీరామ్ అని నినదిస్తూ వెల్‌లోకి దూసుకొచ్చారు. బయటకు వెళ్లేందుకు నిరాకరించిన శంకర్ ఘోష్‌ను మార్షల్స్ బలవంతంగా లాక్కెళ్లారు. ఈ క్రమంలో ఆయనకు గాయాలయ్యాయి. బీజేపీ సభ్యులు అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని, రాక్షసుల మాదిరిగా ప్రవర్తిస్తున్నారని, బెంగాలీ వలస కార్మికుల హక్కులు, భద్రతపై జరుగుతున్న కీలకమైన చర్చను అడ్డుకొనేందుకు ప్రయత్నిస్తున్నారని మమతా బెనర్జీ ధ్వజమెత్తారు. సభలో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో బీజేపీ ఎమ్మెల్యేలు అగ్నిమిత్ర పాల్, మిహీర్ గోస్వామి, బంకిం ఘోష్, అశోక్ దిండాను స్పీకర్ సస్పెండ్ చేశారు. ఇదిలా ఉండగా, విపక్ష సభ్యుల వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన తమ పార్టీ ఎమ్మెల్యేలను మమతా బెనర్జీ మందలించారు. పద్ధతి మార్చుకోకపోతే మిమ్మల్ని కూడా సస్పెండ్ చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. మరోవైపు అసెంబ్లీ చరిత్రలో నేడు చీకటి రోజు అని బీజేపీ నేతలు పేర్కొన్నారు. సభలో తృణమూల్ కాంగ్రెస్ సభ్యులు గూండాల మాదిరిగా వ్యవహరించారని తప్పుపట్టారు.

దిగొచ్చిన కుకీ గ్రూపులు

న్యూఢిల్లీ: మణిపూర్‌లో ప్రధాని మోదీ పర్యటనకు ముందు కీలకమైన సానుకూల పరిణామం చోటుచేసుకుంది. రాష్ట్రంలోని రెండు ప్రధానమైన సాయుధ గ్రూపులతో కేంద్రం ఒప్పందం కుదుర్చుకుంది. గురువారం ఢిల్లీలో మణిపూర్ ప్రభుత్వం, కుకీ నేషనల్ ఆర్గనైజేషన్(కేఎన్‌వో), యునైటెడ్ పీపుల్స్ ఫ్రంట్(యూపీఎఫ్)లతో కేంద్ర హోం శాఖ కార్యకలాపాల నిలిపివేత (సస్పెన్షన్ ఆఫ్ ఆపరేషన్స్)కు సంబంధించిన త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. గత కొద్ది రోజులుగా కొనసాగుతున్న చర్చలు గురువారం మూడు పక్షాలు ఒప్పందంపై సంతకాలు చేయడంతో ముగిశాయని హోం శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఏడాదిపాటు అమల్లో ఉండే ఒప్పందంతో మణిపూర్ ప్రాదేశిక సమగ్రతకు ఎటువంటి భంగం కలగదని స్పష్టం చేసింది. ఏడు వర్గాలు కలిగిన యూపీఎఫ్, 13 వర్గాలున్న కేఎన్‌వోలు తమ కార్యకలాపాలను నిలిపివేస్తాయని తెలిపింది. చర్చలతో సమస్యకు పరిష్కారం కనుగొనేందుకు ముందుకు వచ్చాయని పేర్కొంది. ఒప్పందం ప్రకారం రెండు సాయుధ గ్రూపులు సంక్షోభ ప్రాంతాల్లోని ఏడు క్యాంపులను వేరే చోటుకు మార్చడంతోపాటు మొత్తమ్మీద క్యాంపుల సంఖ్యను తగ్గించేందుకు అంగీకరించాయి. తమ వద్ద ఉన్న ఆయుధాలను బీఎస్‌ఎఫ్, సీఆర్‌పీఎఫ్ క్యాంపుల్లో అప్పగించడం, ఈ గ్రూపుల్లో ఎవరైనా విదేశీయులుంటే గుర్తించేందుకు భద్రతా బలగాలకు సహకారం అందించడం కూడా ఉన్నాయి. ఒప్పందం అమలు, ఉల్లంఘనలను గుర్తించేందుకు ఉమ్మడి పర్యవేక్షణ బృందం ఏర్పాటైంది. ఈ బృందమే ఒప్పందాన్ని సమీక్షిస్తుందని హోం శాఖ తెలిపింది. మరో వైపు అత్యవసర వస్తువుల సరఫరాకు వీలుగా, వాహనాల రాకపోకలకు మణిపూర్ మీదుగా వెళ్లే రెండో నంబర్ జాతీయ రహదారిని తెరవాలని కుకీ–జో కౌన్సిల్(కేజెడ్‌సీ) నిర్ణయం తీసుకుంది. ఈ విషయంలో భద్రతా బలగాలతో సహకరించేందుకు కేజెడ్‌సీ అంగీకరించిందని హోం శాఖ పేర్కొంది.

సాక్షి
హైదరాబాద్
శుక్రవారం । 5 । సెప్టెంబర్ । 2025



ఛీ ఛీ కోచ్
రైళ్ల బోగీలు, మరుగుదొడ్లు సకాలంలో శుభ్రం చేయకపోవడం వల్ల దుర్వాసన వ్యాపిస్తోందని ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. -10లో



మైక్రో బ్రూవరీ న్యూ స్టోరీ
నగరంలో విస్తృతంగా మైక్రో బ్రూవరీల ఏర్పాటుకు అనుమతిస్తూ ప్రభుత్వం నిర్ణయించడం క్రాఫ్ట్ బీర్ రంగానికి కొత్త ఉత్సాహం అందించింది. - సిటీప్లస్‌లో

గరిష్ఠం/కనిష్ఠం
31.0/22.0

వాతావరణం
నగరంలో శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షం కురవొచ్చు. గరిష్ఠంగా 31, కనిష్ఠంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

పోటెత్తిన భక్తజనం





ఖైరతాబాద్‌లో కొలువుదీరిన శ్రీ విశ్వశాంతి మహాశక్తి గణపతి దర్శనానికి గురువారం భక్తులు పోటెత్తారు. గురువారం అర్ధరాత్రి వరకే భక్తుల దర్శనాలు ఉంటాయని చెప్పడంతో ఉదయం నుంచి భారీగా భక్తులు క్యూ కట్టారు. వినాయక చవితి నుంచి మొదలుకొని గురువారం వరకు తొమ్మిది రోజులపాటు ఏకంగా 40 లక్షల మంది భక్తులు దర్శించుకున్నారు. శనివారం ఉదయం 6:30 గంటలకు శోభాయాత్ర ప్రారంభిస్తామని, మధ్యాహ్నం ఒంటి గంటకు ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు. - ఖైరతాబాద్

సవాళ్లను వ్యూహాత్మకంగా అధిగమిద్దాం

రానున్న రెండు రోజులు అత్యంత కీలకం

- ఏమాత్రం ఏమరుపాటుకు తావివ్వొద్దు
- వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులకు స్పష్టం చేసిన సీపీ



సాక్షి, సిటీబ్యూరో: గణేశ్ నిమజ్జనంతోపాటు మిలాద్ ఉన్ నబీ ఒకే విడతలో రావడం పోలీసు బందోబస్తుకు సవాల్ లాంటిదని నగర కొత్వాల్ సీపీ ఆనంద్ అన్నారు. వ్యూహాత్మకంగా వ్యవహరించి దీన్ని అధిగమిద్దామని పేర్కొన్నారు. ఏ దశలోనూ ఏ మాత్రం ఏమరుపాటుకు తావు ఇవ్వవద్దని స్పష్టం చేశారు. ఈసారి నిమజ్జనాన్ని వీక్షించడానికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వస్తుండటం, ఎంజే మార్కెట్‌లో స్టేజ్ పై నుంచి ప్రసంగించనుండటంతో పోలీసు విభాగం అత్యంత అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలోనే కొత్వాల్ సీపీ ఆనంద్ గురువారం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. శుక్రవారం మిలాద్ ఉన్ నబీ, మరుసటిరోజు సామూహిక నిమజ్జనం ఉండటంతో ఈ రెండు సందర్భాలకూ ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నిమజ్జన ప్రక్రియ దాదాపు 40 గంటలపాటు కొనసాగే అవకాశం ఉందని, దాని కోసం అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతూ ఆ వ్యూహాన్నీ నిర్దేశించారు.

పెట్రోలింగ్ వాహనాల పర్యవేక్షణ పెరగాలి..
గస్తీ బృందాలైన బ్లూ కోల్ట్స్, పెట్రోలింగ్ వాహనాల పర్యవేక్షణ పెరగాలని ఆదేశించారు. ప్రధాన నిమజ్జనం జరిగే రోజు బషీర్‌బాగ్, ఎంజే మార్కెట్ వంటి పెద్ద కూడళ్ల వద్ద ట్రాఫిక్ ప్రణాళికను పటిష్ఠం చేయాలని సీపీ ఆనంద్ సూచించారు. మండప నిర్వాహకులు సైతం ఆలస్యం లేకుండా విగ్రహాలను నిమజ్జనం చేయాలని కోరారు. విగ్రహాలను తీసుకువచ్చిన వారికి అవసరమైన అన్ని రకాలైన సహాయసహకారాలు అందించాలని పోలీసులకు కొత్వాల్ సూచించారు. పోలీసులకు సమాచార లోపం లేకుండా ఉండేందుకు అదనంగా వాకీటాకీలు సమకూర్చాలన్నారు. ఊరేగింపు మార్గాల్లోని ప్రతి కూడలి, బ్రిడ్జిల వద్ద వాటి ఎత్తుకు సంబంధించిన బ్యానర్లు ఏర్పాటు చేయాలని సూచించడమే కాకుండా, ఊరేగింపులో పాల్గొనే ప్రతి వాహనం డ్రైవర్ సమాచారం సేకరించుకోవాలని సంబంధిత సెక్టార్ అధికారులను ఆదేశించారు. ఆయా మార్గాల్లో అడ్డంకులు లేకుండా జీహెచ్‌ఎంసీ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. స్వాగత స్టేజీలు రోడ్డును పూర్తిగా ఆక్రమించుకోకుండా, ఊరేగింపునకు ఆటంకం కలిగించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

నిమజ్జనానికి 600 ప్రత్యేక బస్సులు

సాక్షి, సిటీబ్యూరో: ఈ నెల 6వ తేదీన ట్యాంక్‌బండ్‌లో జరిగే గణేశ్ నిమజ్జనం సందర్భంగా ఆర్టీసీ విస్తృత రవాణా ఏర్పాట్లు చేపట్టింది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ట్యాంక్‌బండ్‌కు చేరుకొనేందుకు వీలుగా 600 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. నిమజ్జనానికి తరలివెళ్లనున్న విగ్రహాల మార్గాలను దృష్టిలో ఉంచుకొని బస్సుల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు కాచిగూడ, రాంనగర్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే బస్సులను, హయత్‌నగర్, వనస్థలిపురం, ఎల్‌బీనగర్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే బస్సులను హిమాయత్‌నగర్ ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ వరకు నడుపుతారు. ఉప్పల్, సికింద్రాబాద్ వైపు నుంచి వచ్చే బస్సులను ఇందిరా పార్కు వరకు అందుబాటులో ఉండేవిధంగా చర్యలు చేపట్టారు. బీహెచ్‌ఈఎల్, పటాన్‌చెరు, మియాపూర్, కూకట్‌పల్లి తదితర ప్రాంతాల నుంచి నడిచే బస్సులు ఖైరతాబాద్ వరకు రాకపోకలు సాగిస్తాయి. బోడుప్పల్ వైపు నుంచి వచ్చే కొన్ని బస్సులను లిబర్టీ వరకు నడిపేందుకు ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. మెహదీపట్నం వైపు నుంచి వచ్చే వాటిని లక్డీకాపూల్ వరకు నడుపుతారు. నిమజ్జనం వేడుకలు ముగిసే వరకు ఈ బస్సులు అందుబాటులో ఉంటాయి. వీటి నిర్వహణ కోసం ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశారు.



ఈ బస్సుల సమాచారం కోసం ప్రయాణికులు **9959226160, 9959226154** ఫోన్ నెంబర్‌లలో సంప్రదించవచ్చు.

జంక్షన్లు... 'చావు'రస్తాలు!

డేంజర్ స్పాట్స్‌గా మారుతున్న కూడళ్లు



- వీటి వద్దే 2023లో 2 వేలకుపైగా ప్రమాదాలు
- మృత్యుఒడికి చేరినవారి సంఖ్య 218
- ఎంఓఆర్‌టీహెచ్ తాజా నివేదికలో వెల్లడి

జంక్షన్ టైప్	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
'టీ' జంక్షన్	361	49	325
'వై' జంక్షన్	270	24	254
చౌరస్తా	322	31	306
స్టాగర్డ్ జంక్షన్	626	67	586
రౌండ్ ఎబౌట్	487	47	410
మొత్తం	2,066	218	1,881

జంక్షన్ వైలేషన్స్ కేసులు ఇలా...

ఉల్లంఘన	2023	2024
సిగ్నల్ జంపింగ్	76,140	95,433
స్టాప్‌లైన్ క్రాసింగ్	4,58,109	2,87,331
ఫ్రీలెఫ్ట్ బ్లాకింగ్	97,169	71,491

సాక్షి, సిటీబ్యూరో

రాజధానిలోని అనేక జంక్షన్లు, చౌరస్తాలు డేంజర్ స్పాట్స్‌గా మారుతున్నాయి. ట్రాఫిక్ జామ్స్‌కే కాదు ప్రమాదాలకు కూడా కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. చావు'రస్తాలు'గా నిలుస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ హైవేస్(ఎంఓఆర్‌టీహెచ్) ఇటీవల విడుదల చేసిన రోడ్ యాక్సిడెంట్స్ ఇన్ ఇండియా–2023 నివేదిక ఈ విషయాన్ని స్పష్టం చేస్తోంది. ఆ ఏడాది గణాంకాల ప్రకారం హైదరాబాద్‌లోని జంక్షన్లు, చౌరస్తాల్లో 2,066 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. వీటిలో 218 మంది మృత్యువాత పడగా, 1,881 మంది క్షతగాత్రులయ్యారు. ప్రభుత్వ విభాగాల వైఫల్యం, వాహన చోదకుల నిర్లక్ష్యంసహా పలు అంశాలు ఈ ప్రమాదాలకు కారణాలు అవుతున్నాయి.

ఇప్పటికీ 'కంట్రోల్'లో లేనివెన్నో...
అనివార్య కారణాల వల్ల జంక్షన్ల వద్ద సిగ్నల్ పని చేయకపోయినా, పక్కాగా లేకపోయినా ఆ ప్రాంతంలో భారీ ట్రాఫిక్ జామ్స్ ఏర్పడతాయి. ఈ ప్రభావం ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లోని అన్ని రోడ్లపై ఉంటుంది. ట్రాఫిక్ సిగ్నల్స్, సిబ్బంది ఉండి వాహనాలను నియంత్రించే వాటిని కంట్రోల్డ్ జంక్షన్స్ అని, అలా కాని వాటిని అన్‌కంట్రోల్డ్ జంక్షన్స్ అని అంటారు. అన్‌కంట్రోల్డ్ జంక్షన్లు, చౌరస్తాల్లో ట్రాఫిక్ జామ్స్‌తోపాటు రోడ్డు ప్రమాదాలకు ఆస్కారం ఎక్కువ. ప్రస్తుతం రాజధానిలో మొత్తం 216 జంక్షన్లు ఉన్నాయి. వీటిలో 91 అన్ కంట్రోల్డ్ జంక్షన్లు ఉన్నాయి. చార్మినార్, మలక్‌పేట, అంబర్‌పేట్, ఆసిఫ్‌నగర్, ఫలక్‌నుమా తదితర ప్రాంతాల్లో ఇవి ఎక్కువగా ఉన్నాయి.



నిబంధనలు.. ఉల్లంఘనలు..
మోటారు వాహనాల చట్టంలోని నిబంధనలను చాలామంది ఎడాపెడా ఉల్లంఘిస్తుంటారు. చౌరస్తాల్లో జరిగే ఇలాంటి ఉల్లంఘనలే రోడ్డు ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. ప్రధానంగా సిగ్నల్ జంపింగ్, స్టాప్‌లైన్ క్రాసింగ్ తదితర ఉల్లంఘనల వల్ల రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఎంఓఆర్‌టీహెచ్ గణాంకాల ప్రకారం 2023లో సిగ్నల్ జంపింగ్ వల్ల 600 రోడ్డు ప్రమాదాలు జరగ్గా... 45 మంది ప్రాణాలు కోల్పోయారు. ముందు ప్రయాణిస్తున్న వాహనచోదకుడు రెడ్ సిగ్నల్ చూసి ఆగినప్పటికీ వెనుక వచ్చేవాళ్లు వీరిపైకి దూసుకుపోవడం కూడా ప్రమాదాలకు కారణం అవుతోంది. ఈ రకమైన ఉదంతాల్లో మరో 16 మంది ప్రాణాలు వదిలారు.

కంటికి కనిపిస్తేనే కంట్రోల్‌లో....
అంతర్జాతీయంగా అమలులో ఉన్న విధానాల ప్రకారం... ట్రాఫిక్ సిగ్నల్స్ లేని జంక్షన్లలో మాత్రమే సిబ్బంది విధుల్లో ఉండాలి. సిగ్నల్ ఆధారంగా పనిచేసే వాటిని అన్‌మ్యాన్డ్, సిబ్బంది పర్యవేక్షించే వాటిని మ్యాన్డ్ జంక్షన్స్ అని పిలుస్తుంటారు. వాస్తవానికి సిగ్నల్స్ ఉన్నచోట మ్యాన్ పవర్‌లో పని ఉండకూడదు. అయితే దేశంలోని అనేక ప్రధాన నగరాల్లో పరిస్థితి పూర్తి భిన్నం. జంక్షన్‌లో సిగ్నల్ ఉన్నా, లేకున్నా సిబ్బంది మాత్రం ఉండాల్సిందే. ఏ చౌరస్తాలో ట్రాఫిక్ పోలీసులు కనిపించరో అక్కడ ఉల్లంఘనలు, ప్రమాదాలు ఎక్కువగా జరుగుతూ ఉంటాయి. దీనికి హైదరాబాద్ సైతం భిన్నం కాదు. ఎంఓఆర్‌టీహెచ్ గణాంకాల ప్రకారం నగరంలో ట్రాఫిక్ సిగ్నల్స్ మాత్రమే ఉన్న జంక్షన్స్‌లో 403 రోడ్డు ప్రమాదాలు జరగ్గా... 45 మంది చనిపోయారు. మరో 355 మంది క్షతగాత్రులయ్యారు. సిగ్నల్‌తోపాటు కచ్చితంగా పోలీసులు ఉండే చౌరస్తాల్లో 249 ప్రమాదాలు జరిగాయి. వీటిలో 22 మృతి చెందగా 232 మంది క్షతగాత్రులయ్యారు.

బ్లాక్ స్పాట్స్‌లో 40 శాతం అక్కడే...
నగర పోలీసు విభాగం అధికారులు పదే పదే రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకునే ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించారు. గత ఏడాది గణాంకాల ప్రకారం.. అలా గుర్తించిన 54 బ్లాక్‌స్పాట్స్‌లో దాదాపు 40 శాతం చౌరస్తాల్లో ఉన్నవే. రెండు రోడ్ల కూడలికి 'టీ'జంక్షన్ అని, మూడు రోడ్లు కలిస్తే 'వై'జంక్షన్ అని, నాలుగు రోడ్లు కలిసే ప్రాంతాన్ని చౌరస్తా అని, ఎదురెదురు రోడ్లు ఒకే లైనులో లేని వాటిని స్టాగర్డ్ జంక్షన్ అని, నాలుగు కంటే ఎక్కువ రోడ్లు కలిసే మార్గాన్ని రౌండ్ ఎబౌట్ అని అంటారు. నగరంలోని బ్లాక్‌స్పాట్స్‌లో ఇవన్నీ ఉండటం గమనార్హం. ప్రధానంగా డెయిరీ ఫాం, బోయిన్‌పల్లి, తాడ్‌బండ్, బహదూర్‌పురా, ఎంజే మార్కెట్, అఫ్జల్‌గంజ్, చాదర్‌ఘాట్, మూసారాంబాగ్ తదితర చోట్ల ఉన్న జంక్షన్లు, చౌరస్తాలు ప్రమాదాలను నెలవుగా మారాయి.

విద్యుత్ శాఖ కంట్రోల్ రూమ్ ప్రారంభం

గణేశ్ నిమజ్జనం నేపథ్యంలో నిరంతరాయంగా కరెంటు సరఫరాకు చర్యలు

సాక్షి, సిటీబ్యూరో: గణేశ్ నిమజ్జనం సందర్భంగా అంతరాయాలకు ఆస్కారం లేకుండా నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు గురువారం ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను సంస్థ ఆపరేషన్స్ డైరెక్టర్ నరసింహులు ప్రారంభించారు. శోభాయాత్ర మార్గాల్లో రోడ్డుకు అడ్డుగా ఉన్న లైన్లను ఇప్పటికే తొలగించినట్లు తెలిపారు. నిమజ్జన ప్రదేశాలపై హుస్సేన్ సాగర్, ట్యాంక్‌బండ్, సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్‌పై ప్రత్యేక ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఇప్పటికే అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లు ఏర్పాటు చేశామన్నారు. ఆపరేషన్స్, మెయింటెనెన్స్ విభాగాలకు చెందిన సుమారు తొమ్మిది వేలమంది విధులు నిర్వర్తించనున్నట్లు తెలిపారు. విద్యుత్ శాఖ ఏర్పాటు చేసే ప్రత్యేక కంట్రోల్ రూంలకు తోడు, జాయింట్ కంట్రోల్ రూమ్‌లలో కూడా విద్యుత్ సిబ్బంది అందుబాటులో ఉంటారని, విద్యుత్ సరఫరాలో ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాల్సిందిగా సూచించారు. ఎన్‌టీఆర్ మార్గ్ కంట్రోల్ రూమ్: 8712468535, 8712469909, 8712469897 ఫోన్ నంబర్లుసహా ట్యాంక్‌బండ్ కంట్రోల్ రూమ్: 8471246994, 8712469892, 8712470026 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాల్సిందిగా సూచించారు.

'మై హోమ్ భుజ' లడ్డూ రూ.51 లక్షలు

గతేడాది రూ.29 లక్షలు

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని మైహోమ్ భుజ గేటెడ్ కమ్యూనిటీ గణేశ్ లడ్డూ వేలం పోటాపోటీగా, ఉత్కంఠభరితంగా సాగింది. చివరకు ఖమ్మం జిల్లా ఇల్లందు రియల్ ఎస్టేట్ వ్యాపారి కొండపల్లి గణేశ్ రూ.51,07,777 లకు పాడుకొని రికార్డును నెలకొల్పారు. గత ఏడాది మైహోమ్ భుజ లడ్డూను ఆయనే రూ.29 లక్షలకు పాడారు. అది ఈ ఏడాది రూ. 51 లక్షలు దాటడం విశేషం. పోటాపోటీగా గణేష్, శ్రీకాంత్ ఇద్దరూ వేలంపాటలో కొనసాగుతూ అందరినీ ఉత్కంఠకు గురిచేశారు.

భక్తి, సెంటిమెంట్ వల్లే వేలంలో పాల్గొన్నా..
'గణేశుడిపై ఉండే భక్తి, సెంటిమెంట్ వల్లే వేలంపాటలో పాల్గొన్నాను'అని రియల్ ఎస్టేట్ వ్యాపారి ఇల్లందు గణేశ్ తెలిపారు. 'మొదటిసారిగా రూ.29 లక్షలకు లడ్డూను గెలుచుకోగా నాకు వ్యాపారపరంగా ఎంతో లాభించింది. అందుకే సెంటిమెంట్‌తో ఈసారి మళ్ళీ వేలంపాటలో పాల్గొన్నాను. 25 ఏళ్ళుగా లడ్డూ వేలంపాటలో పాల్గొంటున్నా. ఇల్లందు స్టేషన్‌బస్తీలో వినాయక ఆలయాన్ని కట్టించాం. మా నాన్న, అమ్మ 20 ఏళ్ళుగా గణేశ్ మాల ధరిస్తున్నారు. మైహోం భుజ కమిటీ వారు పారదర్శకంగా ఈ లడ్డూ వేలం నిర్వహించడం సంతోషంగా ఉంది'అని అన్నారు.



లడ్డూను దక్కించుకున్న గణేశ్ దంపతులు

వ్యయం కోట్లు.. తప్పని పాట్లు

వరుస వర్షాలతో దెబ్బతిన్న నగర రోడ్లు

- అడ్డగోలుగా పూడ్చివేతలు వాహనదారులకు అవస్థలు..

సాక్షి,సిటీబ్యూరో: వరుస వర్షాలకు నగర రోడ్లు దారుణంగా దెబ్బతిన్నాయి. ప్రధాన రహదారులు, కాలనీ రోడ్లు అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల రహదారులు గుంతలమయంగా మారాయి. ప్యాచ్‌వర్క్‌ల పేరిట కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నా ప్రజలకు, ద్విచక్ర వాహనదారులకు మాత్రం అవస్థలు తప్పడంలేదు. వర్షాలకు రోడ్లపై పడుతున్న గుంతల్ని(పాట్ హోల్స్) ఎప్పటికప్పుడు పూడ్చివేస్తున్నామని, ఎక్కువగా దెబ్బతిన్న ప్రాంతాల్లో ప్యాచ్‌వర్క్స్ చేస్తున్నామని జీహెచ్‌ఎంసీ చెబుతోంది. పాట్‌హోల్స్‌ను అడ్డగోలుగా, నామమాత్రంగా పూడ్చారు. దీంతో రోడ్లు ఎగుడుదిగుడులుగా మారి మరిన్ని సమస్యలు సృష్టిస్తున్నాయి. వర్షాలకు ఏ రోడ్డుపై ఎన్ని గుంతలు పడుతున్నాయో కచ్చితమైన లెక్కల్లేవు. జీహెచ్‌ఎంసీ గణాంకాల మేరకు దాదాపు 14 వేల గుంతలు పడగా, 11 వేలకుపైగా పూడ్చి వేసినట్లు ప్రకటించింది.



జోన్ల వారీగా వివరాలిలా ఉన్నాయి

జోన్	గుంతలు	పూడ్చినవి
ఎల్‌బీనగర్	2977	2509
చార్మినార్	2339	1940
ఖైరతాబాద్	1888	1520
శేరిలింగంపల్లి	1938	1303
కూకట్‌పల్లి	2074	1837
సికింద్రాబాద్	2834	2333

పెరగనున్న వ్యయం
పాట్‌హోల్స్ మరమ్మతులను బీటీ మిక్స్, రోడ్‌బాండ్(షెల్‌మాక్)తో చేస్తుంటారు. బీటీ మిక్స్‌తో మరమ్మతులు ఎండ ఉన్నప్పుడే సాధ్యమవుతుంది. రోడ్‌బాండ్‌తో రోడ్లు తడిగా ఉన్నప్పుడు కూడా పనులు చేయవచ్చు. బీటీ మిక్స్ కంటే రోడ్‌బాండ్ పనులకు దాదాపు మూడు రెట్లు ఎక్కువ వ్యయమవుతుంది. ఒక్కో పాట్‌హోల్ పూడ్చేందుకు సగటున వెయ్యి రూపాయలు వ్యయమవుతుంది. జీహెచ్‌ఎంసీ గణాంకాల మేరకే దాదాపు రూ. 1.40 కోట్లు ఖర్చవుతుంది. వర్షాకాలం ముగియలేదు. నగరంలో అక్టోబర్ వరకు కూడా వర్షాలు కురవడం తెలిసిందే. ఈ లెక్కన పాట్‌హోల్స్ మరమ్మతుల వ్యయం ఇంకా పెరగనుంది. గతంలో సీఆర్‌ఎంపీ అమలులో ఉన్నప్పుడు కనీసం ప్రధాన రహదారుల మార్గాల్లోని గుంతల్ని సంబంధిత ఏజెన్సీలు ఎప్పటికప్పుడు పూడ్చివేసేవి. వాటి గడువు ముగిసి ఏడెనిమిది నెలలైనా ఇంకా కొత్త ఏజెన్సీలను నియమించలేదు. జీహెచ్‌ఎంసీ స్థానిక ఇంజినీర్లు రోడ్ల నిర్వహణను పట్టించుకోవడం లేదు. అది కూడా గుంతల సమస్యలు పెరగడానికి ఒక కారణం.

'రింగు'పై రైతులు భగ్గు

ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌పై తీవ్ర ఆందోళన

- హెచ్‌ఎండీఏ కార్యాలయానికి తరలివస్తున్న బాధితులు
- వెల్లడించిన సర్వే నెంబర్లపై వివిధ ప్రాంతాల్లో గందరగోళం
- అభ్యంతరాల స్వీకరణ అనంతరం తుది ప్రకటన

సాక్షి, సిటీబ్యూరో: ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్‌పై రైతాంగం భగ్గుమంటోంది. రీజినల్ రింగ్‌రోడ్డు కోసం తమ భూములను ఇవ్వబోమంటూ ఆందోళనకు దిగుతోంది. హైదరాబాద్ చుట్టూ వంద మీటర్ల వెడల్పుతో నిర్మించనున్న రీజనల్ రింగ్‌రోడ్డు వల్ల ప్రభావితం కానున్న భూముల వివరాలతో హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్‌ఎండీఏ) ఇటీవల ప్రాథమిక నోటిఫికేషన్ వెలువరించిన సంగతి తెలిసిందే. డిజిటల్ రూట్ మ్యాప్‌ను కూడా అధికారులు రూపొందించి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. ట్రిపుల్ ఆర్ నిర్మాణం వల్ల 8 జిల్లాల్లోని 163 గ్రామాల్లో రైతులు కోల్పోనున్న భూముల సర్వే నెంబర్లను కూడా ఈ నోటిఫికేషన్‌లో నమోదు చేశారు. దీంతో ఆందోళన చెందిన రైతులు రెండు రోజులుగా అమీర్‌పేట్‌లోని హెచ్‌ఎండీఏ ప్రధాన కార్యాలయానికి తరలివస్తున్నారు. అలైన్‌మెంట్ పట్ల తమ అభ్యంతరాలను తెలియజేస్తూ వినతిపత్రాలను అందజేస్తున్నారు. ట్రిపుల్‌ఆర్ కోసం ఎట్టి పరిస్థితుల్లోను తమ భూములను ఇవ్వబోమని స్పష్టం చేస్తున్నారు. రీజనల్ రింగ్‌రోడ్డు వల్ల ప్రభావితం కానున్న మహబూబ్‌నగర్, మెదక్, నల్లగొండ, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట్, వికారాబాద్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లోని 33 మండలాలు, 163 గ్రామాల రైతులు హెచ్‌ఎండీఏతోపాటు వివిధ ప్రాంతాల్లోని మండల రెవెన్యూ కార్యాలయాలు, ఆర్డీఓ ఆఫీసులు, కలెక్టరేట్‌ల వద్ద ఆందోళనలు చేస్తున్నారు.

సర్వే నెంబర్లపైన గందరగోళం....
హెచ్‌ఎండీఏ వెబ్‌సైట్‌లో ప్రకటించిన సర్వే నెంబర్లపై రైతుల్లో గందరగోళం నెలకొంది. వివిధ సర్వే నెంబర్‌లలో ఉన్న భూములు ఏ మేరకు ట్రిపుల్ ఆర్‌లో కోల్పోవలసి వస్తుందనే దానిపై స్పష్టత లేదు. ఒక్కో సర్వే నెంబర్లో వందల ఎకరాల భూములు ఉన్నాయి. వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట్ మండలం చిడిగిద్ద గ్రామానికి చెందిన 160వ సర్వే నెంబర్‌లో 30 ఎకరాలకుపైగా భూములున్నాయి. చాలామంది రైతులు హక్కుదారులుగా ఉన్నారు. కానీ, ఈ సర్వే నెంబర్లో ఎక్కడ నుంచి ఎక్కడి వరకు అలైన్‌మెంట్ ఉంటుందో తెలియదు. అదే గ్రామానికి చెందిన 135వ సర్వే నెంబర్‌లో 12 ఎకరాల భూమి ఉంది. ఐదుగురు రైతులు వాటికి హక్కుదారులుగా ఉన్నారు. ఇప్పుడు వారిలోనూ ఆందోళన నెలకొంది. ఒక్క చిడిగిద్ద రైతులే కాదు. 163 గ్రామాల రైతుల్లో ఈ నోటిఫికేషన్ తీవ్ర అలజడి రేపింది. ఈ నేపథ్యంలో నవాబ్‌పేట్ మండలానికి చెందిన పలువురు రైతులు గురువారం హెచ్‌ఎండీఏ అధికారులను కలిసి ఆందోళనను వ్యక్తం చేశారు. ఆమన్‌గల్, షాద్‌నగర్, శంకర్‌పల్లి ప్రాంతాల బాధితులు కూడా భారీగా తరలివచ్చారు.

ఔటర్ తరహాలో ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్..
హైదరాబాద్ చుట్టూ 354 కి.మీ.మార్గంలో నిర్మించనున్న రీజినల్ రింగ్‌రోడ్డు నిర్మాణానికి సైతం ఔటర్ రింగ్‌రోడ్డు తరహాలో అలైన్‌మెంట్‌ను రూపొందించనున్నారు. ఈ మేరకు హెచ్‌ఎండీఏ, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ) సంస్థలు సమన్వయంతో కార్యాచరణ చేపట్టాయి. 100 మీటర్ల వెడల్పుతో నిర్మించనున్న ట్రిపుల్ ఆర్‌కు 15 మీటర్ల వరకు బఫర్‌జోన్‌ను ఏర్పాటు చేయనున్నారు. 30 అడుగుల వెడల్పుతో గ్రోత్ కారిడార్ రోడ్లను డిజైన్ చేయనున్నారు. హెచ్‌ఎండీఏ పరిధి 7,257 చ.కి.మీ. నుంచి 10,472.723 చ.కి.మీ. వరకు పెరిగింది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సిద్దిపేట్, సంగారెడ్డి, మెదక్, యాదాద్రి, కొత్తగా నల్లగొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్‌లతో కలిపి మొత్తం 11 జిల్లాల్లో 1,355 గ్రామాలు, 104 మండలాలు దీని పరిధిలో ఉన్నాయి. ఈ మేరకు రీజినల్ రింగ్‌రోడ్డు వరకు అన్ని ప్రాంతాలతో హెచ్‌ఎండీఏ కొత్త మాస్టర్‌ప్లాన్–2050 రూపొందిస్తోంది.

రోడ్డున పడాల్సిందే..



ఒకే సర్వే నెంబర్‌లో 12 ఎకరాల భూములు ఉన్నాయి. ఐదుగురు రైతులం ఉన్నాం. ఇప్పుడు ఈ భూములు రింగ్ రోడ్డులో కోల్పోవలసి వస్తే ఈ కుటుంబాలన్నీ రోడ్డున పడాల్సిందే. మా భూములను ఎట్టి పరిస్థితుల్లోనూ ట్రిపుల్ ఆర్‌కు ఇవ్వబోము.
- చాంద్‌పాషా, చిడిగిద్ధ, వికారాబాద్

బడా రియల్టర్ల కోసమే..



గతంలో నిర్ధారించిన రీజినల్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చి ఇప్పుడు కొత్తగా హెచ్‌ఎండీఏ మరో అలైన్‌మెంట్‌ను ముందుకు తెచ్చింది. ఇది కేవలం బడా రియల్టర్ల వెంచర్లను కాపాడేందుకు ఈ మార్పు చేసినట్లుగా కనిపిస్తోంది. ఇది చాలా అన్యాయం.
- పద్మారావు, ఘనపురం, వికారాబాద్



హెచ్చుమ్‌డీఏ కార్యాలయానికి తరలివచ్చిన బాధిత రైతులు

నిమజ్జన ఘట్టం సాఫీగా సాగేలా...

శోభాయాత్ర నేపథ్యంలో ట్రాఫిక్ ఆంక్షలు

- నగర వ్యాప్తంగా 66 ప్రాంతాల్లో అమలు
- ఖాళీ వాహనాలు వెళ్లేందుకూ ఓ మార్గం
- సందర్శకుల కోసం పార్కింగ్ ఏర్పాట్లు
- ఉత్తర్వులు జారీ చేసిన కొత్వాల్ ఆనంద్



సాక్షి, సిటీబ్యూరో: గణేష్ ఉత్సవాల్లో కీలక ఘట్టమైన సామూహిక నిమజ్జనం శనివారం హుస్సేన్‌సాగర్‌లో జరుగనుంది. ఈ నేపథ్యంలో భారీ ఊరేగింపులు సైతం ఉంటాయి. వీటి కారణంగా నగర శివార్లతో పాటు సిటీ వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు, మళ్లింపులు విధిస్తూ నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ గురువారం ఆదేశాలు జారీ చేశారు. మొత్తం 66 ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను మళ్లించడమో, పూర్తిగా ఆపేయడమో చేస్తారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి ఆదివారం ఉదయం 6 వరకు ఇవి అమలులో ఉంటాయి. అవసరాన్ని బట్టి వీటిని పొడిగించే అవకాశం ఉంది. నిమజ్జనానికి వచ్చే ప్రజలు వ్యక్తిగత వాహనాలను వదిలి ఆర్టీసీ బస్సులు, ఎంఎంటీఎస్‌లను ఆశ్రయించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

ప్రధాన ఊరేగింపు మార్గం:

కేశవగిరి–నాగుల్‌చింత–ఫలక్‌నుమ–చార్మినార్–మదీనా–అఫ్జల్‌గంజ్–ఎంజే మార్కెట్–అబిడ్స్–బషీర్‌బాగ్–లిబర్టీ–అప్పర్ ట్యాంక్/ఎన్టీఆర్ మార్గ్‌ల్లో నిమజ్జనం జరుగుతుంది.

సికింద్రాబాద్ వైపు నుంచి..

ఆర్పీ రోడ్–ఎంజీ రోడ్–కర్బాలామైదాన్–ముషీరాబాద్ చౌరస్తా–ఆర్టీసీ క్రాస్‌రోడ్స్– నారాయణగూడ 'ఎక్స్' రోడ్–హిమాయత్‌నగర్ 'వై' జంక్షన్ ద్వారా వచ్చి లిబర్టీ వద్ద ప్రధాన ఊరేగింపులో చేరుతుంది.

ఈస్ట్‌జోన్ నుంచి..

- ఉప్పల్–రామాంతపూర్–అంబర్‌పేట్–ఓయూ ఎన్‌సీసీ–డీడీ హాస్పిటల్‌ల మీదుగా ప్రయాణించి ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ వద్ద సికింద్రాబాద్ రూట్ దాంతో కలుస్తుంది.
- వెస్ట్ జోన్ వైపు నుంచి వచ్చే ఊరేగింపు ఎంజే మార్కెట్ లేదా సెక్రటేరియేట్ వద్ద ప్రధాన ఊరేగింపుతో కలుస్తాయి.
- నిమజ్జనం ఊరేగింపు జరిగే మార్గాల్లో చిన్న వాహనాలకు అనుమతి ఉండదు. ఈ మార్గానికి అటు ఇటు ప్రాంతాల్లో ఉన్న వారు ప్రయాణించడానికి కేవలం బషీర్‌బాగ్ చౌరస్తా వద్ద మాత్రమే అవకాశం ఇచ్చారు. సాధారణ ప్రజలు రింగ్‌రోడ్, బేగంపేట్ మార్గాలను ఆశ్రయించడం ఉత్తమం.
- వెస్ట్–ఈస్ట్ జోన్ల మధ్య రాకపోకలు సాగించే వారికి కేవలం బషీర్‌బాగ్ వద్దే అవకాశం ఉంటుంది.

ట్రాఫిక్ డైవర్షన్ పాయింట్స్:

- **సౌత్ జోన్:** కేశవగిరి, మొహబూబ్‌నగర్ ఎక్స్‌రోడ్స్, ఇంజన్ బౌలి, నాగుల్‌చింత, హిమ్మత్‌పుర, హరిబౌలి, ఆశ్రా హాస్పిటల్, మొఘల్‌పుర, లక్కడ్ కోటి, మదీనా చౌరస్తా, ఎంజే బ్రిడ్జ్, దారుల్‌షిఫా చౌరస్తా, సిటీ కాలేజ్
- **ఈస్ట్ జోన్:** చంచల్‌గూడ జైల్ చౌరస్తా, మూసారాంబాగ్, చాదర్‌ఘాట్ బ్రిడ్జ్, సాలార్జంగ్ బ్రిడ్జ్, అఫ్జల్‌గంజ్, పుత్లిబౌలి చౌరస్తా, ట్రూప్‌బజార్, జాంబాగ్ చౌరస్తా, కోఠి ఆంధ్రాబ్యాంక్
- **వెస్ట్ జోన్:** టోపి ఖానా మాస్క్, అలాస్కా హోటల్ చౌరస్తా, ఉస్మాన్ జంగ్, శంకర్‌బాగ్, శీనా హోటల్, అజంతాగేట్, ఆబ్కారీ లైన్, తాజ్ ఐలాండ్, బర్తన్ బజార్, ఏఆర్ పెట్రోల్ పంప్
- **సెంట్రల్ జోన్:** ఛాపెల్ రోడ్ ఎంట్రీ, జీపీఓ దగ్గరి గద్వాల్ సెంటర్, శాలిమార్ థియేటర్, గన్ ఫౌండ్రీ, స్కైలైన్ రోడ్ ఎంట్రీ, హిమాయత్‌నగర్ 'వై' జంక్షన్, దోమల్‌గూడలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ చౌరస్తా, కంట్రోల్ రూమ్ దగ్గరి కళాంజలి, లిబర్టీ చౌరస్తా, ఎంసీహెచ్ ఆఫీస్ 'వై' జంక్షన్, బీఆర్‌కే భవన్, ఇక్బాల్ మీనార్, రవీంద్రభారతి, ద్వారకా హోటల్ చౌరస్తా, వీవీ స్టాట్యూ చౌరస్తా, చిల్డ్రన్స్ పార్క్, వైశ్రాయ్ హోటల్ చౌరస్తా, కవాడీగూడ జంక్షన్, కట్టమైసమ్మ టెంపుల్, ఇందిరాపార్క్
- **నార్త్‌జోన్:** కర్బాలామైదాన్, బుద్ధభవన్, సెయిలింగ్ క్లబ్, సెయిలింగ్ క్లబ్, నల్లగుట్ట చౌరస్తా వైపు నుంచి అప్పర్ ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్‌ల్లోకి ఎలాంటి ట్రాఫిక్‌ను అనుమతించరు. శనివారం ఉదయం నుంచి సీటీఓ, వైఎంసీఏ, ప్యారడైజ్ చౌరస్తా, ప్యాట్నీ జంక్షన్, బాటా 'ఎక్స్' రోడ్, ఆదివాసీ చౌరస్తా, ఘాన్స్‌మండీ చౌరస్తాల మధ్య ఆంక్షలు అమలులో ఉంటాయి.

సందర్శకులకు పార్కింగ్:

హుస్సేన్‌సాగర్‌లో జరిగే నిమజ్జనాన్ని వీక్షించడానికి వచ్చే సందర్శకుల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాలు కేటాయించారు. ఖైరతాబాద్ ఎంఎంటీఎస్ స్టేషన్, ఆనంద్‌నగర్ కాలనీ నుంచి రంగారెడ్డి జెడ్పీ ఆఫీస్ మధ్య, బుద్ధ భవన్ పక్కన, ఎన్టీఆర్ స్టేడియం, నిజాం కాలేజీ, పబ్లిక్ గార్డెన్స్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్, లోయర్ ట్యాంక్‌బండ్, గో సేవా సదన్, కట్టమైసమ్మ టెంపుల్. ఇక్కడ నుంచి సందర్శకులు కాలినడకనే ట్యాంక్‌బండ్ పరిసరాలకు చేరుకోవాలి.

నిమజ్జనం తరవాత:

విగ్రహాలను తెచ్చిన లారీలు/ట్రక్కులు నిమజ్జనం పూర్తి చేసిన తరవాత తిరిగి వెళ్లేందుకు ప్రత్యేక రూట్లు కల్పించారు. ఎన్టీఆర్ మార్గ్‌లో నిమజ్జనం చేసినవి నెక్లెస్‌రోటరీ, ఖైరతాబాద్ ఫ్లైఓవర్, వీవీ స్టాట్యూ, కేసీపీల మీదుగా వెళ్లాలి. వీటిని తెలుగుతల్లి స్టాట్యూ, మింట్ కాంపౌండ్స్‌లోకి అనుమతించరు. అప్పర్ ట్యాంక్‌బండ్ నుంచి నిమజ్జనం చేసిన లారీలు/ట్రక్కులు చిల్డ్రన్స్‌పార్క్, డీబీఆర్ మిల్స్, కవాడీగూడ, ముషీరాబాద్ మీదుగా వెళ్లాలి. బైబిల్‌హౌస్ రైల్ ఓవర్ బ్రిడ్జ్ మీదుగా అనుమతించరు.

ఇంటర్ డిస్ట్రిట్/స్టేట్ లారీలకు:

ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి హైదరాబాద్ వచ్చే లారీలను నగరంలోకి అనుమతించరు. ఔటర్ రూట్లను వినియోగించుకొని వెళ్లాల్సి ఉంటుంది.

ఆర్టీసీ బస్సులకూ:

ట్రాఫిక్ ఆంక్షలు ఆర్టీసీ బస్సులకూ వర్తిస్తాయి. నిమజ్జనం నేపథ్యంలో మాసబ్‌ట్యాంక్, వీవీ స్టాట్యూ, సీటీఓ, వైఎంసీఏ, రెతిఫైల్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, క్లాక్ టవర్, చిలకలగూడ చౌరస్తా, ఛే నెంబర్, గడ్డిఅన్నారం, చాదర్‌ఘాట్, బహదూర్‌పుర, నల్గొండ చౌరస్తాలను దాటి ముందుకు రానీయరు.

ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే బస్సులకు...

నిమజ్జనం పూర్తయ్యే వరకు ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే బస్సుల్ని నగరంలోకి అనుమతించరు. వీటిని శివార్లలోనే ఆపేసి అటునుంచే మళ్లిస్తారు.

హెల్ప్‌లైన్స్ ఏర్పాటు:

ఈ ఆంక్షలపై ప్రజలకు అవగాహన కల్పించడం, సహకరించడం కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్స్‌ను సైతం ఏర్పాటు చేశారు. ఎలాంటి సహాయం కావాలన్నా 040–27852482, 8712660600, 9010203626 నెంబర్లలో సంప్రదించవచ్చు.

100 మందికి పైగా విద్యార్థినుల ఫోన్లు హ్యాక్

- మహిళా యూనివర్శిటీ విద్యార్థులకు సైబర్ నేరగాళ్ల వేధింపులు
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

సుల్తాన్‌బజార్: వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయానికి చెందిన దాదాపు 100 మంది విద్యార్థుల ఫోన్లను సైబర్ నేరస్తులు హ్యాక్ చేశారు. విశ్వవిద్యాలయంలో చదివే ఓ విద్యార్థికి ఓ సైబర్ నేరస్థుడు ఫోన్‌చేసి తాము ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని ఓటీపీ చెప్పమనడంతో ఆమె ఓటీపీ చెప్పింది. ఇలా ఫోన్లను 100 మందికిపైగా విద్యార్థినుల ఫోన్లను హ్యాక్ చేశారు. తరచూ మెసేజ్‌లు, కాల్స్ చేస్తుండడంతో సదరు విద్యార్థినులు భయభ్రాంతులకు గురయ్యారు. వేళాపాలా లేకుండా గుర్తుతెలియని నెంబర్లతో ఫోన్లు వస్తుండడంతో వీసీ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం గురువారం సుల్తాన్‌బజార్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆయా ఫోన్ నంబర్లపై ఆరా తీస్తున్నారు. విద్యార్థినులకు సైబర్ నేరస్థులు ఫోన్లు చేసి తాము పరీక్షల్లో పాస్ చేయిస్తామని, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని చెబుతూ... వారికి కొన్ని ప్రాంతాల లోకేషన్లు షేర్‌చేస్తూ అక్కడకు రావాలని సూచిస్తుండడంతో విద్యార్థినీలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. సైబర్ నేరగాళ్లు తరచూ ఫోన్లు చేస్తుండడంతో పోలీసులను ఆశ్రయించారు.

కూతురి బీటెక్ ఫీజు కోసం చోరీ చేసిన తల్లి



వివరాలు వెల్లడిస్తున్న టోలిచౌకీ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్

గోల్కొండ: కూతురు ఇంజనీరింగ్ ఫీజు కట్టడానికి తాను పని చేసే ఇంట్లోనే ఓ పని మనిషి ఆభరణాలను తస్కరించింది. టోలిచౌకీ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ గురువారం టోలిచౌకీ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. షబీయాబేగం(34) నిజాం కాలనీలోని షఫీఅలీఖాన్ ఇంట్లో పని చేస్తోంది. రెండు దశాబ్దాలకు పైగా ఇంట్లో పని మనిషిగా ఉండడంతో ఆమె యజమానులు కూడా బాగా నమ్మేవారు. యజమానులు బయటకు వెళ్లినా షబీయాబేగంను ఇంట్లో ఉంచి వెళ్లే వారు. ఇదిలా ఉండగా షబీయాబేగం కూతురుకు ఈ సంవత్సరం ఇంజినీరింగ్ సీటు వచ్చింది. ఫీజులు, ఇతర ఖర్చులకు తగినంత డబ్బు లేకపోవడంతో దొంగతనం చేయాలని నిర్ణయించుకుంది. పని చేస్తున్న ఇంట్లోనే చోరీకి స్కెచ్ వేసింది. ఈ నెల 20న యజమాని కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వచ్చారు.అదే రోజు రాత్రి బీరువాలోని బంగారు ఆభరణాలు కనిపించకపోవడంతో బాధితుడు టోలిచౌకీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. 30 తులాల బంగారు ఆభరణాలు చోరీ అయ్యాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. విచారణ చేపట్టిన పోలీసులు షబీయాబేగంను అదుపులోకి తీసుకొని విచారించగా చోరీ విషయం ఒప్పుకుంది. ఫీజు కట్టడానికి మెహిదీపట్నంలోని ఓం జువెలర్స్ మణపురం ఫైనాన్స్‌లలో తాకట్టుపెట్టినట్లు తెలిపింది.దీంతో షబీయాబేగంను గురువారం రిమాండ్‌కు తరలించారు.

హైడ్రా పేరు చెప్పే వారి చేతిలో మోసపోవద్దు : హైడ్రా కమిషనర్

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) పరిధి విస్తరించి ఉన్న ఓఆర్ఆర్ వరకు ఉన్న ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా, ఫిర్యాదు చేయాలన్నా నేరుగా తమనే సంప్రదించాలని కమిషనర్ ఏవీ రంగనాథ్ కోరారు. ప్రతి సోమవారం హైడ్రా ప్రధాన కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిలోనూ ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. హైడ్రా అధికారులు తమ బంధువులని, మిత్రులని, తమకు బాగా తెలుసంటూ ఎవరైనా చెబితే నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. హైడ్రాకు సంబంధించి ఫిర్యాదులు ఉన్నా తనను సంప్రదించవచ్చని స్పష్టం చేశారు. హైడ్రా పేరుతో మోసాలు చేసే వారిపై గతంలో కేసులు నమోదు చేయించామని, తాజాగా మరో ముఠాపై పహాడీషరీఫ్ ఠాణాలో ఫిర్యాదు చేశామని వివరించారు. హైకోర్టు బార్ కౌన్సిల్ ఇటీవల వేటు వేసిన ఓ న్యాయవాది ఇద్దరు డిజిటల్ మీడియా ప్రతినిధులు కలిసి తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని మంఖాల్‌లో ఉన్న వర్టెక్స్ రియల్ ఎస్టేట్ సంస్థ సూరం చెరువును ఆక్రమించడంతో పాటు కొత్తకుంటలో మట్టిపోసి, బాక్స్ డ్రైన్ నిర్మించింది. దీనిపై ఫిర్యాదు అందుకున్న హైడ్రా విచారించి ఆ సంస్థపై రెండు కేసులు నమోదు చేయించిందన్నారు. అదే సమయంలో చైతన్య రెడ్డి అనే బాధితురాలు వర్టెక్స్ సంస్థ తమ స్థలాన్ని ఆక్రమించి రోడ్డు వేసిందంటూ హైడ్రాను ఆశ్రయించారు. దీనిపై హైడ్రా విచారణ చేస్తుండగా సదరు బాధితురాలు ఓ వ్యక్తికి రూ.50 లక్షలు ఇచ్చినట్లు తేలింది. దీంతో సదరు న్యాయవాది, ఇద్దరు డిజిటల్ మీడియా ప్రతినిధులతో పాటు చైతన్యరెడ్డిని హైడ్రా కమిషనర్ విచారించారు. ఆ ముగ్గురూ హైడ్రా అధికారులతో మాట్లాడతామని, వర్టెక్స్‌పై చర్యలు తీసుకోలేదని ప్రచారం చేస్తామని ఈ మొత్తం తీసుకున్నట్లు వెలుగులోకి వచ్చింది. దీంతో హైడ్రా ఆ త్రయంపై పహాడీషరీఫ్ ఠాణాలో కేసు నమోదైంది.

ఫిర్యాదు చేయాలంటే : టోల్‌ఫ్రీ నంబర్ 1070, 8712406899, **వాట్సప్ :** 8712406901, 9000113667

ద్విచక్రవాహనాలు చోరీ చేస్తున్న జంట అరెస్ట్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న చిలకలగూడ పోలీసులు

చిలకలగూడ : ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద పార్కింగ్ చేసిన బైక్‌లను టార్గెట్ చేసుకుని చోరీలకు పాల్పడుతన్న భార్యభర్తలను అరెస్ట్ చేసి వారినుంచి రూ. 5 లక్షల విలువైన ఆరు ద్విచక్రవాహనాలను పోలీసులను స్వాధీనం చేసుకున్నారు. చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్, డీఐ రమేష్‌గౌడ్, డీఎస్ఐ రాకేష్ తెలిపిన మేరకు.. యాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన వినోద్‌గౌడ్ (30), పావని(19)లు భార్యభర్తలు. సులభంగా డబ్బులు సంపాదించేందుకు ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద పార్కింగ్ చేసిన బైక్‌లు చోరీ చేయాలని నిర్ణయించుకున్నారు. వినోద్ పార్కింగ్ ఏరియాలోకి వెళ్లి మారుతాళాలతో బైక్‌ను చోరీ చేయగా, పరిసర ప్రాంతాల్లోకి వచ్చేవారిని భార్య పావని గమనించి సిగ్నల్ ఇచ్చేంది. చోరీ చేసిన వాహనాన్ని తక్కువ డబ్బులకు విక్రయించి జల్సాలు చేసేవారు. ఈ విధంగా భువనగిరి ఠాణా పరిధిలోని ఆస్పత్రి వద్ద రెండు, చిలకలగూడ ఠాణా పరిధి గాంధీఆస్పత్రి వద్ద నాలుగు బైక్‌లను చోరీ చేశారు. ఈ క్రమంలో బాధితులు తమ వాహనాలు చోరీ అయ్యాయని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారణ ప్రారంభించారు. ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించగా ఓ జంట బైక్‌ను చోరీ చేసినట్లు నిర్ధారణ అయింది. ఈనెల 3న నిందితులను అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా చేసిన నేరాలను అంగీకరించారు. వీరి వద్ద నుంచి రూ. 5 లక్షల విలువైన ఆరు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

యువ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవయవదానం

బంజారాహిల్స్: నగరంలో నివసిస్తున్న నెల్లూరుకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ డెవలపర్ ఆగస్టు 30న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడటంతో స్టార్ హాస్పిటల్స్‌కు చికిత్స నిమిత్తం తీసుకువచ్చారు. ఈ క్రమంలో అతని బ్రెయిన్ డెడ్ అయింది. దీంతో ఆయన కుటుంబం అవయవదానం చేయాలని నిర్ణయించింది. ముగ్గురు రోగులకు కాలేయం, మూత్రపిండం వైద్యులు అమర్చారు. దీంతో ఇద్దరు రోగులకు విజయవంతంగా అమర్చారు. కొత్త జీవితాన్ని ఇచ్చినట్లు అయిందని స్టార్ ఆస్పత్రి వైద్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.



యువకుడి పార్థీవ దేహం వద్ద నివాళులు అర్పిస్తున్న వైద్యులు

డ్రగ్స్ వినియోగిస్తున్న పలువురి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి

అంబర్‌పేట: డ్రగ్స్, హోమోసెక్స్‌వల్ కార్యకాలపాలు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులతో పాటు డ్రగ్స్ వినియోగిస్తున్న మరో ఏడుగురిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం అంబర్‌పేటలోని ఈస్ట్‌జోన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ డాక్టర్ బి. బాలస్వామి వివరాలు వెల్లడించారు. కర్నూలుకు చెందిన ఎం.రామకాంత్ అలియాస్ కిరణ్(44) జీవనోపాధి కోసం 15 ఏళ్ల క్రితం నగరానికి విచ్చేసి చిలకలగూడలో నివాసం ఉంటున్నాడు. ఇతను మొదట ప్రైవేటు ఉద్యోగం చేసి హోమోసెక్స్‌వల్ జీవితానికి అలవాటు పడ్డాడు. అంతేకాకుండా హోసెక్స్‌వల్ అభిరుచి ఉన్న వారిని గ్రిండర్ యాప్‌తో నెట్ వర్క్‌ను ఏర్పాటు చేసాడు. నెట్ వర్క్‌లో చేరిన వారికి ఎల్‌బీనగర్‌కు చెందిన ముదావత్ ప్రసాద్(30) సహకారంతో డ్రగ్స్ విక్రయించడం ప్రారంభించాడు. నైజీరియన్స్ నుంచి రూ.10వేలకు ఒక గ్రాము కొనుగోలు చేస్తూ రూ.15వేలక ఒక గ్రాము ఎండీఎంఏ డ్రగ్‌ను విక్రయిస్తున్నాడు. చిలకలగూడ పోలీసు స్టేషన్ పరిధిలో సీతాఫల్‌మండి ప్రాంతంలో ఇద్దరు కలిసి ఈ అనైతిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. రామాకంత్‌కు హెచ్ఐవీ కూడ సోకడంతో ఆనారోగ్యం ఉన్నాడు. వీరి చర్యలపై విశ్వసనీయ సమాచారం అందుకున్న ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం వలపన్ని పట్టుకున్నారు. రామాకంత్, ప్రసాద్‌లతో పాటు డ్రగ్స్ వినియోగిస్తున్న మాదపూర్‌కు చెందిన కరిచెర్ల వినియ్‌కుమార్(30), సైదాబాద్‌కు చెందిన డాక్టర్ అతిక్ అబ్దుల్(38), మేడ్చల్ హాస్టల్‌లో ఉంటున్న కొత్తపల్లి మోషా((29), ముషీరాబాద్‌కు చెందిన బల్లం వంశీకృష్ణ(38), చౌటుప్పల్‌కు చెందిన కెతావత్ రాజు నాయక్((29), కర్మన్‌ఘట్‌కు చెందిన షేక్ సమీర్(23), వారసిగూడకు చెందిన అడెపు సత్యసురేష్‌బాబు(51)లను అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి 100 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్, వారి సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వీరిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో టాస్క్‌ఫోర్స్‌అడిషనల్ డీసీపీ ఎ.శ్రీనివాస రావు, ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ జె.నర్సయ్య, చిలకల్‌గూడ ఏసీపీ శశాంక్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ బి.అనుదీప్, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఏ.నాగర్జున, ఎస్ఐలు, సిబ్బంది ఉన్నారు.

ప్రాణాల మీదికి తెచ్చిన కరక్కాయ

మన్సూరాబాద్: దగ్గు వస్తుందని రాత్రి నిద్రపోయేటప్పుడు కరక్కాయను బుగ్గన పెట్టుకున్న మహిళ ప్రాణాల మీదకు తెచ్చుకుంది. ఎల్‌బీనగర్ కామినేని వైద్యులు తెలిపిన మేరకు.. ఎల్‌బీనగర్‌కు చెందిన విజేతకు వాతావరణ మార్పులతో దగ్గు వస్తుందని, నిద్రకు అటంకం కల్గుతుందని బావించి కరక్కాయను దవడవద్ద ఉంచుకుంది. నిద్రలో పొరపాటున కరక్కాయను మింగేసింది. దీంతో ఆమెకు విపరీతమైన దగ్గు, అయాసం, ఊపిరి అందకపోవడంతో కుటుంబసభ్యులు ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్‌కు తీసుకువచ్చారు. కామినేని హాస్పిటల్ సీనియర్ పల్మొనాలజిస్ట్ డాక్టర్ రవీందర్‌రెడ్డి పరిక్షించి కరక్కాయను రెండు ముక్కలుగా చేసి బయటకు తీశారు. దీంతో రోగి ఊపిరితిత్తులు పూర్తిగా తెరుచుకుని ఆరోగ్యం మెరుపడటంతో డిశ్చార్జి చేసినట్లు వెల్లడించారు.

బాలికపై లైంగిక దాడి.. నిందితుడికి 20ఏళ్ల జైలు

అల్వాల్: బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఫాస్ట్ ట్రాక్ న్యాయస్థానం తీర్పునిచ్చింది. పోలీసులు తెలిపిన మేరకు.. అల్వాల్‌లో నివసించే బాలిక పై 2022లో అల్వాల్ చంద్రపురం కాలనీలో నివసించే అద్దాల నాని (23) లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపర్చి సాక్షాధారాలు సమర్పించడంతో నిందితుడికి గురువారం ఫాస్ట్ ట్రాక్ న్యాయస్థానం 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించింది. జరిమానా చెల్లించకపోతే మరో ఆరు నెలల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుంది. దీంతో పాటు బాధితురాలికి రూ.2 లక్షల నష్టపరిహారాన్ని ప్రకటించింది. ఈ కేసును ప్రభుత్వ న్యాయవాది ప్రభాకర్‌రెడ్డి వాదించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



సాయికిరణ్ (ఫైల్)

హస్తినాపురం: బైకుపై వెళుతున్న యువకుడు అదుపుతప్పి ప్రమాదవశాత్తు లారీనివెనుక నుండి ఢీకొని తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించి వనస్థలిపురం పోలీసులు తెలిపిన మేరకు.. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం కుదాబక్షిపల్లి గ్రామానికి చెందిన బొల్లారపు సాయికిరణ్(25) వనస్థలిపురంలోని నిషాబార్‌లో క్యాషియర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి విధులు ముగించుకుని కొత్తపేట వైపు వెళుతున్నాడు. విజయవాడ జాతీయరహదారిపై బైకు అదుపుతప్పి ప్రమాదవశాత్తు ముందు వెళుతున్న లారీని వెనుక నుండి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయికిరణ్‌కు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అదృశ్యమైన మహిళ శవమై తేలింది

- నిర్మానుష్య ప్రాంతంలో మృతదేహం
- సాకేత్ టవర్స్ సమీపంలో హత్య



మణెమ్మ (ఫైల్)

జవహర్‌నగర్: అదృశ్యమైన ఓ మహిళ శవమై కనిపించిన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. కాప్రా జమ్మిగడ్డలోని మారుతీనగర్‌లో బల్ల మణెమ్మ (37) కుటుంబసభ్యులతో కలిసి నివాసముంటోంది. ఈ నెల 2న మణెమ్మ అదృశ్యమైందని జవహర్‌నగర్ పోలీసులకు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. అయితే గురువారం సాయంత్రం జమ్మిగడ్డ సాకేత్ టవర్స్ సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో దుర్వాసన వస్తుందని స్థానికులు పోలీసులకు తెలిపారు. వెంటనే ఆ ప్రాంతానికి వచ్చిన పోలీసులు పరిశీలించగా ఓ మహిళ మృతదేహంగా గుర్తించారు. మృతురాలు మణెమ్మగా గుర్తించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. గుర్తు తెలియని దుండగులు మణెమ్మను చంపి ఉండవచ్చని పోలీసులు పేర్కొన్నారు.

గరిక అలంకరణలో విజయగణపతి



బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని బసవతారకం కేన్సర్ ఆస్పత్రి ఆవరణలో ఉన్న శ్రీ విజయగణపతి ఆలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. నవరాత్రి ఉత్సవాల్లో ఆఖరి రోజు స్వామివారిని ఆలయ అర్చకులు గరికతో అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి గరికార్చనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి వేకువ జామునే పంచామృతాలతో అభిషేకంతో పాటు గణపతి హోమం నిర్వహించారు.

స్వచ్ఛంద సంస్థలకు చేయూతనివ్వాలి



ఈటల రాజేందర్‌ను సత్కరిస్తున్న ఆదినారాయణ తదితరులు

లిబర్టీ: ప్రజాహితం కోసం పని చేసే వారికి చేయూతనివ్వాలని ఆధునిక ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఆదినారాయణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్‌కు వినతిపత్రం సమర్పించి స్వచ్ఛంద సంస్థలకు చేయూతనివ్వాలని కోరారు. సమాజంలో కింది వర్గాల కోసం నిరంతరం పని చేస్తున్న వ్యక్తులకు స్వచ్ఛంద సంస్థలకు అండగా నిలవాలని కోరారు. సమాజ హితం కోసం, పేదల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న వారికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఈటల రాజేందర్ హామీ ఇచ్చారు.

ఎస్సీ వర్గీకరణను తక్షణమే రద్దు చేయాలి



మాట్లాడుతున్న వద్లమూరి కృష్ణ స్వరూప్

హిమాయత్‌నగర్: ఎస్సీ వర్గీకరణను సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే రద్దు చేయకపోతే తిరుగుబాటు తప్పదని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జాతీయ కమిటీ చైర్మన్ వద్లమూరి కృష్ణ స్వరూప్ హెచ్చరించారు. వర్గీకరణను రద్దు చేయడానికి భవిష్యత్ కార్యాచరణలో భాగంగా గురువారం హిమాయత్ నగర్‌లోని సమితి కేంద్ర కార్యాలయంలో జరిగిన వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి భాగస్వామ్య సంస్థల ప్రతినిధుల సమావేశంలో వద్లమూరి మాట్లాడారు. ఈనెల 15 నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టాలని, అక్టోబర్ 6 నుంచి మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ, ప్రజా ప్రతినిధుల క్యాంప్ కార్యాలయం వద్ద ఆందోళన, డిసెంబర్ నెలాఖరున చలో హైదరాబాద్ సచివాలయం వద్ద ఆందోళన పోరాటం కార్యక్రమానికి రాష్ట్రంలోని 58 ఎస్సీ కులాల ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిస్తూ తీర్మానించారు. ఈ సమావేశంలో ప్రొ.డా.వి.ఎల్.రాజు, జె.ఎస్.రావు, ఎస్.అశోక్, సంపత్, మద్దెల రాయప్ప, పి.రాజలింగం, పి.సుచంద్ర, గంధం శంకర్, బత్తుల సత్యనారాయణ, చిప్పరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి గాయాలు

వెంగళరావునగర్: కారు ఢీకొని ద్విచక్ర వాహనదారునికి గాయాలైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..వరంగల్‌కు చెందిన ఎం.యశ్వంత్ నగరంలో ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడు. ఈనెల 1న ద్విచక్ర వాహనంపై హైటెక్‌సిటీ వెళుతుండగా మార్గమధ్యలో యూసుఫ్‌గూడ వద్ద వెనుక నుంచి వచ్చిన కారు అతని వాహనాన్ని ఢీకొట్టింది. చుట్టుపక్కల వారు అతడిని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై అతని తండ్రి ఎం.సదానందం గురువారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శుభకార్యానికి వెళ్లొచ్చేలోగా ఇంట్లో చోరీ

వెంగళరావునగర్: శుభకార్యానికి వెళ్లొచ్చేలోగా ఇంట్లో దొంగలు పడిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..రహమత్‌నగర్‌లో నివాసం ఉంటున్న పి.అడివమ్మ గత నెల 31న గాజుల రామారంలో ఉంటున్న తన పెద్ద కుమారుని ఇంటికి శుభకార్యానికి వెళ్లింది. ఈనెల 3న రహమత్‌నగర్‌లోని తన నివాస గృహానికి వచ్చింది. రాగానే ప్రధాన తలుపు తాళం విరిగి కనిపించింది. ఇంట్లోకి వెళ్లి చూడగా అల్మారా తాళం విరిగిపోయి ఉంది. అందులో దాచిన కొంత నగదు, గోల్డ్ రింగ్ మాయం అయ్యాయి. చుట్టుపక్కల విచారించిన అనంతరం గురువారం బాధితురాలు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆఖిరు రోజున 553 విగ్రహాలు

- నిమజ్జనానికి ఏర్పాట్లు చేస్తున్న నిర్వాహకులు
- బందోబస్తు ఏర్పాట్లలో పోలీసులు



వైభవంగా నిమజ్జన శోభాయాత్ర



బంజారాహిల్స్: గణేష్ నిమజ్జన శోభాయాత్రను వైభవంగా నిర్వహించేందుకు మండప నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తుండగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేసేందుకు పోలీసులు సమాయత్తమవుతున్నారు. ఆగస్టు 27న వినాయక చవితి పర్వదినం సందర్భంగా వెస్ట్‌జోన్ పరిధిలోని 8 పోలీస్‌స్టేషన్ల పరిధిలో 1906 వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఆగస్టు 29న మూడో రోజు నుంచి గణేష్ నిమజ్జనాలు వైభవంగా జరుగుతున్నాయి. ప్రతిరోజూ వివిధ ప్రాంతాల్లో నిమజ్జన శోభాయాత్రలను కనుల పండువగా నిర్వహిస్తున్నారు. ఈ నెల 6న వినాయక నిమజ్జనం ఉండగా, ఆఖరు రోజున వెస్ట్‌జోన్ పరిధిలో 553 విగ్రహాలు నిమజ్జనానికి గంగమ్మ ఒడికి చేరనున్నాయి.

- గత నెల 29 నుంచి ఈ నెల 4వ తేదీ వరకు బంజారాహిల్స్, మాసబ్‌ట్యాంక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో 83 విగ్రహాలు నిమజ్జనం కాగా, ఈ నెల 5న 51 విగ్రహాలు నిమజ్జనం కానున్నాయి.
- జూబ్లీహిల్స్, ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో గత నెల 29 నుంచి ఈ నెల 4వ తేదీ 78 విగ్రహాలు నిమజ్జనం కాగా శుక్రవారం మరో 50 విగ్రహాలు తరలనున్నాయి.
- పంజగుట్ట, మధురానగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో గత నెల 29 నుంచి ఈ నెల 4వ తేదీ వరకు 91 విగ్రహాలు నిమజ్జనం కాగా, శుక్రవారం మరో 76 విగ్రహాలు నిమజ్జనానికి తరలనున్నాయి.
- ఎస్సార్‌నగర్, బోరబండ పోలీస్‌స్టేషన్ల పరిధిలో గురువారం నాటికి 124 విగ్రహాలు నిమజ్జనం కాగా, శుక్రవారం 92 విగ్రహాలు నిమజ్జనం కానున్నాయి.

ఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎన్ని విగ్రహాలు..

ఠాణా పేరు	మొత్తం విగ్రహాలు	6న నిమజ్జనం కానున్న విగ్రహాలు
బంజారాహిల్స్	316	75
మాసబ్‌ట్యాంక్	51	13
జూబ్లీహిల్స్	151	32
ఫిలింనగర్	228	117
పంజగుట్ట	237	47
మధురానగర్	339	98
ఎస్సార్‌నగర్	269	61
బోరబండ	315	112

‘ప్రపంచ స్థాయి వైద్య విధానాలు హైదరాబాద్‌లోనే’



సాక్షి, సిటీబ్యూరో: ప్రపంచస్థాయి వైద్య విధానాలను హైదరాబాద్‌లో అందుబాటులోకి తెస్తున్నామని యశోద ఆసుపత్రి ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ సునీల్ దాచేపల్లి అన్నారు. గురువారం సోమాజీగూడ యశోద ఆసుపత్రిలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ..తెలుగు రాష్ట్రాలలో మొదటిసారి 3డీ ప్రింటెడ్ టైటానియం టోటల్ టాలస్ రీప్లేస్మెంట్ సర్జరీని విజయవంతంగా నిర్వహించామన్నారు. దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. కరీంనగర్‌కు చెందిన 38 ఏళ్ల పంకజ్ ప్రమాదవశాత్తు జారిపడటంతో కుడి కాలు చీలమండకు తీవ్రగాయమైంది. దీంతో చీలమండ ఎముకకు రక్త ప్రసరణ నిలిచిపోయింది. క్రమంగా ఆ ఎముక కుళ్లిపోయి, తీవ్రమైన నొప్పి, నడవలేని స్థితికి చేరింది. నడవలేని స్థితిలో ఆసుపత్రికి వచ్చిన పంకజ్‌ను పరిశీలించి అధునాతన పరిష్కారం చూపించాలని నిర్ణయించుకున్నాం. సిటీ స్కాన్ సాయంతో కస్టమ్ మేడ్ 3డీ ప్రింటెడ్ టైటానియం టాలస్ ఎముకను రూపొందించాం. కొత్త టాలస్ ఎముకను బాధిత వ్యక్తికి చీలమండ మార్పిడి చికిత్స చేసి అమర్చాం. ఇప్పుడు పంకజ్ నొప్పి లేకుండా నడవగలుగుతున్నాడు. వృత్తిపరమైన, వ్యక్తిగత కార్యక్రమాలు చేసుకోగలుగుతున్నాడని ఆయన వివరించారు. కార్యక్రమంలో యశోద ఆసుపత్రి డైరెక్టర్ పవన్ గోరుకంటి, చికిత్స పొందిన వ్యక్తి పంకజ్, తదితరులు ఉన్నారు.

ఏజెన్సీ ప్రాంత దళితుల సమస్యలు పరిష్కరించాలి



అభివాదం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

పంజగుట్ట: ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న 10 లక్షల మంది దళితులకు రాజ్యాంగ హక్కులు కల్పించేందుకు అన్ని దళిత సంఘాలు కలిపి ఒక జేఏసీగా ఏర్పాటు చేసుకుని ఎజెండా రూపొందించుకుని ముందుకు పోదామని షెడ్యూల్డ్ కులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు జె.బి.రాజు పిలుపునిచ్చారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మెర శ్రీనివాస్, కార్యదర్శి దావుల రమేష్, సెక్రటరీ జాడి లక్ష్మయ్య మాట్లాడుతూ..గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడే ఏజెన్సీ ప్రాంతంలోని దళితులకు అన్ని హక్కులు కల్పించిందని, కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాలకు తీరని అన్యాయం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే ఏజెన్సీ ప్రాంత దళితుల సమస్యలు అన్ని పరిష్కరిస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారన్నారు. కాని అధికారంలోకి వచ్చి 21 నెలలు అవుతున్నా సమస్యలు పట్టించుకోలేదని, వెంటనే ఏజెన్సీ ప్రాంత దళితుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ గోడ రమేష్, జేమ్స్, బాలరాజు, ఐలయ్య, సత్యనారాయణ, గంట మల్లేష్, చెన్నయ్య, యాదయ్య, కృపాకర్ పాల్గొన్నారు.

వీనులవిందుగా గాత్ర కచేరి



రాగాలాపన చేస్తున్న సంగీత విద్వాంసులు వైద్యనాథన్ బాలసుబ్రమణ్య బృందం

బంజారాహిల్స్: బంజారా హిల్స్ రోడ్ నెంబర్ 8 లోని సప్తపర్ణి సాంస్కృతిక కళా కేంద్రంలో సంగీత క్షీర సాగరం ఆధ్వర్యంలో గురువారం ప్రముఖ సంగీత విద్వాంసులు వైద్యనాథన్ బాలసుబ్రమణ్యంచే జరిగిన గాత్ర కచేరి వీనుల విందుగా సాగింది. హరి గోపీనాథ్, నృషీల్ అవధానుల గాత్ర సహకారం అందించగా శ్రీకాంత్ మృదంగం, శౌరి రాజన్ వయోలిన్ ఈ కార్యక్రమాన్ని మరింత రక్తి కట్టించాయి. రెండు గంటల పాటు వైద్యనాథన్ తన గాత్రంతో సంగీత అభిమానులను అలరించారు. శంకరాభరణం, ఆనంద భైరవి రాగాలలో ఆయన తన గాత్రంతో ఆహుతులను మంత్రముగ్ధులను చేశారు. సంగీత కళాభిమానులు ఈ కార్యక్రమానికి విచ్చేసి వీనుల విందుగా సాగిన గానామృతాన్ని ఆస్వాదించారు. సంగీత క్షీరసాగరం సప్తపర్ణి లో శాస్త్రీయ సంగీత కార్యక్రమాలను నిర్వహిస్తున్నది.

భక్తులతో అసభ్యకర ప్రవర్తన

పోలీసుల అదుపులో 930 మంది ఆకతాయిలు

ఖైరతాబాద్: ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్న 9 రోజుల్లో 930 మందిని ఆకతాయిలను షీ టీమ్స్ అదుపులోకి తీసున్నాయి. ఇందులో 55 మంది మైనర్లు ఉన్నారు. ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాల నేపథ్యంలో మహాగణపతి పరిసర ప్రాంతాల్లోనే 15 షీ టీమ్స్‌తో నిఘా ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పోషకాహారంపై అవగాహన పెంపొందించుకోవాలి



సదస్సులో విజయ్ ఖాదర్, అఫ్రోజ్ అస్పియా

హిమాయత్‌నగర్: నేటి ఉరుకుల పరుగుల జీవనశైలిలో పోషకాహారంపై ప్రతి ఒక్కరికీ అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం మాజీ డీన్ విజయ ఖాదర్ పేర్కొన్నారు. పోషకాహార శాస్త్రంలో తాజా పరిణామాలు, మెరుగైన ఆరోగ్యం, శ్రేయస్సు కోసం న్యూట్రిజెనియా(పోషకాహారం)పై 6వ జాతీయ సదస్సును గురువారం హిమాయత్‌నగర్‌లోని మదీనా డిగ్రీ, పీజీ కాలేజ్ ఫర్ ఉమెన్‌లో నిర్వహించారు. కాలేజీ పోషకాహార విభాగం డైరెక్టర్ కె.ఎం.మిన్హాజుద్దీన్, నిదా సుల్తాన్, ప్రిన్సిపాల్ అఫ్రోజ్ అస్పియా ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా విజయ ఖాదర్ హాజరై మాట్లాడారు. పోషకాహార లోపం దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందన్నారు. గౌరవ అతిథి డాక్టర్ యూనిస్ మున్షి మాట్లాడుతూ..ఆరోగ్యం కోసం సమతుల ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం అన్నారు. వివిధ సంస్థల నుంచి అధ్యాపకులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు హాజరై పేపర్ ప్రెజెంటేషన్లు, చర్చలలో చురుకుగా పాల్గొన్నారు.

ముమ్మరంగా మైత్రివనం నాలా పునరుద్ధరణ పనులు

లక్డీకాపూల్: జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోన్ పరిధిలోని అమీర్‌పేటలో మూసుకుపోయిన వరద కాల్వ మరమ్మతు పనులను సీఈ(ఎం) సహదేవ్ రత్నాకర్ పరిశీలించారు. స్వర్ణ జయంతి కాంప్లెక్స్ సమీపంలోని మైత్రివనం వద్ద మూసుకుపోయిన వరద కాల్వలోకి మధురానగర్, దాని పరిసర ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీరు కలుస్తుంది. దీంతో పూడుకుపోయిన ఈ వరద కాల్వ డ్రెయిన్‌ను జీహెచ్ఎంసీ శుభ్రపరిచే పనిలో పడింది. ఈ క్రమంలో సీఈ గురువారం మరమ్మతు పనులను పరిశీలించారు. ఇటీవలే సీఎం రేవంత్‌రెడ్డి మైత్రివనంను సందర్శించి దెబ్బతిన్న వరద కాల్వను పునరుద్ధరించి మురుగు నీటి ప్రవాహానికి అడ్డుకులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

అనుమానాస్పదస్థితిలో యువతి మృతి

వెంగళరావునగర్: అనుమానాస్పదస్థితిలో యువతి మృతిచెందిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..ఖమ్మం జిల్లాకు చెందిన జి.శిరీష (23) గత కొంతకాలంగా ఎల్లారెడ్డిగూడ హాస్టల్‌లో ఉంటుంది. ఈనెల 3న హాస్టల్‌లోని ఆమె రూంమెట్స్ ఖమ్మంలోని శిరీష చెల్లెలు తేజకు ఫోన్ చేసి శిరీష గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని చనిపోయిందని వివరించారు. దీంతో ఆమె నగరానికి చేరుకుని రెండురోజులు విచారించగా కిరణ్ అనే వ్యక్తి చనువుగా ఉండేవాడని, తన అక్క చావుకు అతని ప్రమేయం ఉండవచ్చని శిరీష సన్నిహితులు వివరించారు. దీంతో తేజ గురువారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రోన్ల ద్వారా సర్కారీ జాగా సర్వే



డ్రోన్ సర్వే నిర్వహిస్తున్న షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-12లోని ఎమ్మెల్యే కాలనీ రోడ్డులో ఏసీబీ కార్యాలయం ఎదురుగా ఇటీవల కబ్జాదారుల చెర నుంచి విముక్తి పొందిన ప్రభుత్వ స్థలం కొలతలపై షేక్‌పేట మండల రెవెన్యూ అధికారులు గురువారం డ్రోన్ సర్వే నిర్వహించారు. ఇటీవలనే ఈ స్థలాన్ని హెచ్ఎండీఏకు అప్పగించారు. అయితే స్థలం ఎంత ఉన్నది అన్నదానిపై స్పష్టత కోసం డ్రోన్ల ద్వారా ఈ సర్వే నిర్వహించారు. ముందుగా 12 ఎకరాలుగా భావించారు. అయితే సర్వే ద్వారా తొమ్మిదిన్నర ఎకరాలు మాత్రమే ఉన్నట్లుగా తాజాగా గుర్తించారు. ఈ స్థలానికి సంబంధించి ఇప్పటికే అధికారులు చుట్టూ బ్లూషీట్స్ ఏర్పాటు చేసి ప్రభుత్వ స్థలమని హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. సరైన కొలతలతో, హద్దులతో ఈ స్థలాన్ని హెచ్ఎండీఏకు పంచనామా చేసి అప్పగిస్తున్నారు.

నటుడు రామచంద్రకు ఆర్థిక సహాయం



రామచంద్రకు చెక్కును అందజేస్తున్న కాదంబరి కిరణ్

బంజారాహిల్స్: తెలుగు సినీనటుడు, మన సైతం నిర్వాహకులు కాదంబరి కిరణ్ మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. వెంకీ చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైన నటుడు రామచంద్ర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న విషయం తెలుసుకుని, కాదంబరి కిరణ్ ఆయనకు సహాయం అందించారు. ఇటీవల పక్షవాతం రావడంతో సినిమా రంగానికి దూరమైన రామచంద్రను నగరంలోని ఆయన నివాసంలో సందర్శించి, వైద్య ఖర్చుల కోసం రూ.25,000ల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా అతనికి ధైర్యం, భరోసా కల్పించారు. మన సైతం సంస్థ ద్వారా దశాబ్దకాలంగా అనేక మంది అవసరార్థులకు సాయం అందిస్తున్న కాదంబరి కిరణ్, సమాజ సేవకు తమ సంస్థ ఎల్లప్పుడూ అంకితమై ఉంటుందని పునరుద్ఘాటించారు.



బషీర్‌బాగ్‌లో..



నిమజ్జన శోభాయాత్రలో భారతి సిమెంట్స్ ఉద్యోగులు



సచివాలయంలోని నల్ల పోచమ్మ ఆలయంలో..



ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకున్న సీఎం రేవంత్‌రెడ్డి కుమార్తె, మనవడు



గురుబ్రహ్మ నగర్‌లో.. బస్తీ అధ్యక్షుడు గోపాల్‌నాయక్



పూజల్లో కాంగ్రెస్ సీనియర్ నేత మామిడి నర్సింగరావు

గణపయ్యా..దీవించయ్యా

గణపతి నవరాత్రి ఉత్సవాలు ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ జోన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. గురువారం ఆయా మండపాల్లోని బొజ్జ గణపయ్యలను భక్తులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. పలు మండపాల వద్ద అన్నదానాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో సందడిగా మారాయి. పలు ప్రాంతాల్లో గణనాథుల నిమజ్జనాలను జోరుగా నిర్వహించారు.

– బంజారాహిల్స్



ఇందిరానగర్ నల్లపోచమ్మ గుడిలో..



ఇందిరానగర్‌లో..ట్రాన్స్‌కో, జెన్‌కో మాజీ సీఎండీ ప్రభాకర్‌రావు దంపతులు



ఫిలింనగర్ దైవ సన్నిధానంలో సకలసిద్ధి గణపతిగా..



ఇందిరానగర్‌లో..జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్



పూజల్లో ఎమ్మెల్యే దానం



వెంకటేశ్వరగనగర్‌లో పరమేశ్వరి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్ భారతి నాయక్



ధోబీఘాట్ బస్తీలో..వెంకటేశ్వరకాలనీ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి



లడ్డూ అందుకుంటున్న మహేందర్‌రెడ్డి



విజయగణపతి స్వామి ఆలయంలో పూర్ణాహుతి పూజలు



ప్రెస్‌క్లబ్‌లో అన్నప్రసాద వితరణ చేస్తున్న క్లబ్ కార్యవర్గం



బోరబండలో..ఏఐసీసీ కార్యదర్శి పెరుమాళ్ విశ్వనాథం, బాబా ఫసియుద్దీన్



వెంకటగిరిలో.. రాజకీయ, సినీ జ్యోతిష పండితులు వేణుస్వామి

రేపు సాలార్జంగ్ మ్యూజియం బంద్

చార్మినార్: ఈ నెల 6 తేదీన సాలార్జంగ్ మ్యూజియం మూసి ఉంటుందని సంబంధిత అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6 తేదీన గణేష్ నిమజ్జనోత్సవాలను పురస్కరించుకొని మ్యూజియం సందర్శన నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. దూరప్రాంతాల నుంచి వచ్చే సందర్శకులు ఈ విషయాన్ని గమనించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

సేవాపక్షంలో భాగస్వాములు కావాలి

సాక్షి, సిటీబ్యూరో: ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు సేవాపక్షంలో భాగంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సేవా పక్వాడ కార్యచరణను పార్టీ శ్రేణులకు మార్గనిర్దేశం చేశారు. ఇందులో స్వచ్ఛ భారత్, పర్యావరణ పరిరక్షణ, రక్తదాన శిబిరం వరకు అనేక కార్యక్రమాలు ఉన్నాయి. పార్టీ కార్యక్రమాలతో పాటు సామాజిక, సేవా కార్యకలాపాల్లోనూ నేతలు పాల్గొనాలని ఆయన కోరారు.

విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించాలి

– బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: రాష్ట్రంలో 14 లక్షల మంది కాలేజీ విద్యార్థుల ఫీజుల బకాయిలు రూ.6వేల కోట్లను వారం రోజుల్లో చెల్లించకపోతే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విద్యార్థుల ఫీజు బకాయిలపై 14 బీసీ సంఘాల ప్రతినిధులతో గురువారం ఆయన చర్చించారు. అనంతరం ఫీజు బకాయిలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. ఫీజు బకాయిలను చెల్లించకపోతే రాష్ట్రంలో ఎక్కడికక్కడ మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులను విద్యార్థులు అడ్డుకుంటారని ఆయన హెచ్చరించారు. విద్యార్థుల స్కాలర్‌షిప్స్, ఫీజుబకాయిల విషయంలో నిర్లక్ష్యం తగదన్నారు. ఒక వైపు ఫీజు బకాయిలు చెల్లించకుండా మరోవైపు ఫీజుల స్కీమ్‌లను ఎత్తివేయడానికి ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆయన ఆరోపించారు. ట్రస్ట్ బ్యాంక్‌ను ఏర్పాటు చేసి దాని ద్వారా ఫీజులు చెల్లిస్తామని కొత్త నాటకానికి ప్రభుత్వం తెరలేపిందని, ఈ ప్రతిపాదనను అంగీకరించేది లేదన్నారు.

తాగునీటి వృథాపై కొరడా

సాక్షి, సిటీబ్యూరో: జలమండలి తాగునీటి వృథాపై కొరడా ఝులిపిస్తోంది. విజిలెన్స్ విభాగం ఆధ్వర్యంలో మంగళ్‌హాట్ పరిసర ప్రాంతాలలో నీటి సరఫరా సమయంలో గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించగా, బోర్డు సరఫరా చేస్తున్న తాగునీటిని మూడు నివాస సముదాయాలు తాగునీటి అవసరాలకు కాకుండా ఇతర అవసరాలకు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. సంబంధిత ఇళ్లపై బోర్డు నిబంధనల ప్రకారం జరిమానా విధించారు. భవిష్యత్తులో ఇలాంటి తప్పిదం మళ్లీ జరిగితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

త్రిపాఠికి రహమత్ ఏ-ఆలమ్ పీస్ అవార్డు



సాక్షి, సిటీబ్యూరో: మతసామరస్యం, మానవ హక్కుల వ్యాప్తి, పాలస్తీనాకు వ్యతిరేకంగా గొంతు వినిపించడం, గాజాలో జరిగిన మరణ హోమాన్ని ఎత్తి చూపడానికి వివిధ రకాలుగా నిరసనలు చేపట్టినందుకు ప్రొఫెసర్ వీపీ కుమార్ త్రిపాఠికి రహమ్ ఈ- ఆలమ్ పీస్ అవార్డు-25కు ఎంపిక చేశారు. ఈ మేరకు ఆల్ ఇండియా బాజ్మ్ ఇ రహమత్ ఈ అలమ్ నిర్ణయించింది. మిలాద్ ఉన్ నబీ రోజున నగరంలోని మాసబ్‌ట్యాంక్‌లోని ఖాజా మాన్షన్ హాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమంలో ఆయనకు అవార్డు అందజేయనున్నట్లు ఆల్ ఇండియా బాజ్మ్ ఇ రహమత్ ఈ అలమ్ అధ్యక్షుడు ముజీబ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పదేళ్లుగా తమ సంస్థ ఆధ్వర్యంలో అవార్డులను ప్రదానం చేస్తున్నట్లు ముజీబ్ వెల్లడించారు.

సరూర్‌నగర్ మినీట్యాంక్ బండ్‌పై ఏర్పాట్లపై ఆరా

చైతన్యపురి: గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్ వద్ద చేసిన నిమజ్జన ఏర్పాట్లు, బందోబస్తును రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు గురువారం సాయంత్రం పర్యవేక్షించారు. నిమజ్జనం కోసం ఏర్పాటు చేసిన క్రేన్లు, లైటింగ్, సీసీ కెమెరాల ఏర్పాట్లపై ఆరా తీశారు. క్రేన్‌ల వద్ద జరిగే నిమజ్జనాన్ని స్వయంగా తిలకించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాచకొండ పరిధిలో నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో 12వేల మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్‌పై 80 సీసీ కెమెరాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ రూంలో ముగ్గురు ఏసీపీ కేడర్ అధికారులు పర్యవేక్షిస్తారని తెలిపారు. ఎల్‌బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్, ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాస్, ఎల్‌బీనగర్ ఏసీపీ కృష్ణయ్య, ట్రాఫిక్ ఏసీపీ నవీన్‌కుమార్, చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి, ఆయా విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఛీఛీ.. కోచ్




ఏసీ, నాన్ ఏసీ కోచ్‌లలో సదుపాయాల కొరత

- సిబ్బంది కొరత వల్లే సేవల్లో లోపాలు
- దూరప్రాంత రైళ్లలో 40 శాతానికిపైగా ఫిర్యాదులు
- సకాలంలో నీటిని నింపకపోవడం వల్లే సమస్యలు

సాక్షి, సిటీబ్యూరో: ప్రతిరోజూ సికింద్రాబాద్ నుంచి పాట్నాకు వెళ్లే దానాపూర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12791) ట్రైన్‌లో సాధారణ ప్రయాణికులతో పాటు కాశీ, ప్రయాగ తదితర పుణ్యక్షేత్రాలను సందర్శించేందుకు వందలాది మంది భక్తులు సైతం బయలుదేరి వెళ్తారు. ప్రయాణికుల రద్దీ, డిమాండ్ ఎక్కువ.. పరిశుభ్రత తక్కువ.. బోగీలు, మరుగుదొడ్లు సకాలంలో శుభ్రం చేయకపోవడం వల్ల దుర్వాసన వ్యాపిస్తోందని ప్రయాణికుల నుంచి తరచూ ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. సాధారణ బోగీలు కిక్కిరిసి పోవడంతో కొంతమంది రిజర్వేషన్ బోగీల్లోకి అక్రమంగా ప్రవేశిస్తారు. దీంతో బోగీలపై ఒత్తిడి పెరుగుతోంది. మరోవైపు ఆన్‌బోర్డు సిబ్బంది ఎప్పటికప్పుడు బోగీలను శుభ్రం చేయకపోవడం వల్ల దుర్వాసన ప్రయాణికులను ఠారెత్తిస్తోంది. ఒక్క దానాపూర్ ఎక్స్‌ప్రెస్ మాత్రమే కాదు. దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని దూరప్రాంతాల రైళ్లలో అరకొర సదుపాయాల కారణంగా 40 శాతానికి పైగా ప్రయాణికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం. 'తిరుగు ప్రయాణంలో పాట్నా నుంచి రాత్రి 9.30గంటల సమయంలో సికింద్రాబాద్‌కు చేరుకొనే సమయానికి దానాపూర్ ఎక్స్‌ప్రెస్(12792) మరింత దారుణంగా మారుతుంది. మరుగుదొడ్లు, వాష్‌బేసిన్‌లు కంపు కొడతాయి. బోగీల్లోకి బొద్దింకలు వస్తాయి.' అని రామంతాపూర్‌కు చెందిన ఆనంద్ విస్మయం వ్యక్తం చేశారు.

నీటి కొరతే కారణమా..?

హైదరాబాద్ నుంచి ప్రతిరోజూ సుమారు 200 రైళ్లు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తాయి.



వాటిలో 85 ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లు దూర ప్రాంతాలకు బయలుదేరుతాయి. సికింద్రాబాద్ నుంచి బయలుదేరే సమయంలో రైళ్లను శుభ్రం చేస్తారు. ఆన్‌బోర్డ్ సదుపాయాలు కూడా అందజేస్తారు. కానీ రైళ్లు బయలుదేరిన కొన్ని గంటల తర్వాత ప్రయాణికుల రద్దీ పెరుగుతున్న కొద్దీ సదుపాయాలు లోపిస్తున్నాయి. నీటి లభ్యత లేకపోవడం వల్ల కొన్ని చోట్ల రైళ్లలో నీటిని నింపడం లేదు. బోగీలను శుభ్రం చేయడం లేదు. దీంతో మరుగుదొడ్లు, వాష్‌బేసిన్లు చెత్తకుప్పలుగా మారుతున్నట్లు ప్రయాణికులు ఫిర్యాదు చేస్తున్నారు. ప్రయాణికుల సదుపాయాలపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) సైతం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. దక్షిణ మధ్య రైల్వేలోని పలు ప్రధాన స్టేషన్ల నుంచి బయలుదేరే దూరప్రాంతాల రైళ్లలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉన్నట్లు పేర్కొంది. ముఖ్యంగా ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి మరే క్రమంలో ఈ నీటి కొరత సవాల్‌గా మారుతుంది. సికింద్రాబాద్-విజయవాడ, రేణిగుంట, గుంతకల్, సికింద్రాబాద్-గుంటూరు, సికింద్రాబాద్-బల్లార్ష, నాందేడ్-సికింద్రాబాద్ తదితర మార్గాల్లో రాకపోకలు సాగించే దూర ప్రాంత రైళ్లలో పరిశుభ్రత లోపిస్తున్నట్లు వెల్లడించింది. సికింద్రాబాద్ డివిజన్ నుంచి బీహార్, పశ్చిమ బెంగాల్, ఉత్తర్ ప్రదేశ్ తదితర ప్రాంతాలకు వెళ్లే రైళ్లలోనూ శుభ్రత ఒక సవాల్‌గా మారింది.

> **ఆన్‌బోర్డ్ సేవలను బలోపేతం చేయాలి**
>
> సరైన సర్వీసులు అందజేయని సంస్థలు, కాంట్రాక్టర్లపై జరిమానాలు విధించడం ఒక్కటే పరిష్కారం కాదు. అలాంటి వారిని తొలగించి సమర్థవంతమైన సేవలు చేసే వారికి బాధ్యతలను అప్పగించాలి. ఆన్‌బోర్డ్ సేవల వ్యవస్థను బలోపేతం చేయాలి.
>
> – శ్రీనివాస్, ప్రయాణికుడు.

అరకొరగా ఆన్‌బోర్డు సేవలు..

సాధారణంగా ఏసీ, స్లీపర్ బోగీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసేందుకు ఆన్‌బోర్డ్ సిబ్బంది అందుబాటులో ఉంటారు. కానీ చాలా రైళ్లలో ఈ సిబ్బంది అందుబాటులో ఉండటం లేదు. ఐదారు బోగీలకు కేవలం ఒకరిద్దరు మాత్రమే పనిచేస్తారు. ఆన్‌బోర్డు సర్వీసులను అందజేసే ప్రైవేట్ సంస్థలు తగినంత మంది సిబ్బందిని నియమించకపోవడం వల్లనే ఈ సమస్యలు తలెత్తుతున్నాయి. చర్లపల్లి–గోరఖ్‌పూర్ తదితర రైళ్లలో ఆన్‌బోర్డు సర్వీసులు అధ్వాన్నంగా ఉన్నాయని చేవెళ్లకు చెందిన ఫణిరాజ్ తెలిపారు. 'బల్లార్షాలో నీళ్లు నింపకుండానే కొన్ని రైళ్లు బయలుదేరుతాయి. ఆ తర్వాత మళ్లీ నాగపూర్‌లోనే నీళ్లు నింపేందుకు అవకాశం ఉంటుంది. దీంతో మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలు ఎంతో ఇబ్బంది పడాల్సి వస్తుంది' అని చెప్పారు. మరోవైపు ఆన్‌బోర్డు సేవలను అందజేయడంలో విఫలమైన సంస్థలపైన రైల్వే అధికారులు భారీ ఎత్తున పెనాల్టీలు కూడా విధిస్తున్నారు. ఇలాంటి కాంట్రాక్టర్లు, సంస్థలపై సుమారు రూ.22.5 లక్షల పెనాల్టీ విధించినట్లు అధికారులు తెలిపారు. ప్రయాణికుల నుంచి వచ్చిన 2,265 ఫిర్యాదుల ఆధారంగానే రూ.16.7 లక్షల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. నగరంలోని చర్లపల్లి, సికింద్రాబాద్, నాంపల్లి స్టేషన్‌లలో వాటరింగ్ సదుపాయం ఉంది. త్వరలో కాచిగూడలోనూ ఏర్పాటు చేయనున్నట్లు ఒక అధికారి చెప్పారు.

మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట

– మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

గోల్కొండ: మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మెహిదీపట్నంలోని సెయింటాన్స్ కళాశాలలో గురువారం ఆయన సెయింటాన్స్ ఇన్‌క్యుబేషన్ ఫౌండేషన్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో సెయింటాన్స్ విద్యా సంస్థలు ప్రత్యేకత చాటుకుంటున్నాయన్నారు. చిన్న పాఠశాలగా ప్రారంభమై నేడు అటానమస్ కళాశాలగా వేలాది మంది విద్యార్థులతో విరాజిల్లుతోందని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కళాశాలలో అత్యాధునిక విద్య, బోధనకు అవసరమైన అవసరాలను సమకూర్చుకుంటూ ప్రతి సంవత్సరం వేలాది మంది విద్యార్థులను తయారు చేస్తోందన్నారు. కేవలం విద్యాబోధనలోనే కాకుండా రాష్ట్రం గర్వించదగ్గ క్రీడాకారిణులను అందించిందని యాజమాన్యాన్ని అభినందించారు. కాంగ్రెస్ హయాంలో రాష్ట్రం ముందుకు సాగుతోందని, కంపెనీలను స్థాపించేందుకు విదేశీ సంస్థలు పోటీపడుతున్నాయని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో రాష్ట్రానికి విదేశీ పెట్టుబడులు తరలి వస్తున్నాయని తెలిపారు. టీహబ్, వీహబ్ స్టార్టప్‌లతో సమానంగా సెయింటాన్స్ ఇన్‌క్యుబేషన్ ఫౌండేషన్ వల్ల మహిళలు పారిశ్రామిక రంగంలో రాణించేందుకు పునాదిగా మారనుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కళాశాల పూర్వ విద్యార్థినులు, పారిశ్రామికవేత్తలు ఒకే వేదికపై వచ్చి ఈ ఫౌండేషన్‌ను పరిశోధన కేంద్రంగా రూపొందించాలని సూచించారు. ఎన్‌సీసీ పరేడ్‌ను వీక్షించారు. కార్యక్రమంలో సెయింటాన్స్ విద్యా సంస్థల చీఫ్ ప్యాట్రన్ రెవరెండ్ మదర్ ఆంథోనమ్మ, ప్రావెన్షియల్ సూపిరియల్ రెవరెండ్ సిస్టర్ బి.ఆన్‌రోజ్, భారత ప్రభుత్వ ఎన్ఐ–ఎంఎస్ఎంఈ డైరెక్టర్ డాక్టర్ విజయ ఈరంటి, ఉస్మానియా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గడ్డం నరేష్ రెడ్డి, ఎం.మరియాశేఖర్ తదితరులున్నారు.



సెయింటాన్స్ కళాశాలలో ఇన్‌క్యుబేషన్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

రేడియాలజీ కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడిగా శ్రీనివాసులు

లక్డీకాపూల్: నేషనల్ కమిషన్ ఆఫ్ అలైడ్ హెల్త్‌కేర్ ప్రొఫెషనల్స్ మెడికల్ రేడియాలజీ ఇమేజింగ్ అండ్ థెరప్యూటిక్ టెక్నాలజీ(ఎన్‌సీఏహెచ్‌పీ) ప్రొఫెషనల్ కౌన్సిల్ అధ్యక్షుడిగా సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్(ఎస్ఐఆర్) సీఈవో శ్రీనివాసులు సిరందాస్ నియమితులయ్యారు. నిమ్స్ కాలేజ్ ఆఫ్ అలైడ్ హెల్త్ సైన్సెస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఈ పదవిలో రెండేళ్లు కొనసాగుతారు. జాతీయ కౌన్సిల్‌ను స్థాపించడంలో కీలక పాత్ర పోషించిన ఆయన గతంలో ఎన్‌సీఏహెచ్‌పీ సభ్యుడిగా వ్యవహరించారు. తాజాగా కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖకు చెందిన అలైడ్ అండ్ హెల్త్‌కేర్ కమిషన్ ఆయనను దేశంలోని అన్ని మెడికల్ రేడియాలజీ ఇమేజింగ్, థెరప్యూటిక్ టెక్నాలజిస్టులను సూచించే కేటగిరీ 8కి అధ్యక్షుడిగా నియమించింది. ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప మాట్లాడుతూ ఈ నియామకం రేడియోగ్రాఫర్ సమాజానికి ఒక మైలురాయి అని, ఎందుకంటే మనలో ఒకరు ఇప్పుడు జాతీయ స్థాయిలో విశిష్ట నాయకత్వ పాత్రను పోషిస్తున్నారని పేర్కొన్నారు. ఆయన నాయకత్వం దేశవ్యాప్తంగా ఉన్న రేడియోగ్రాఫర్లకు స్ఫూర్తినిస్తుందన్నారు. అంతే కాకుండా రేడియోగ్రాఫర్ల వృత్తి పురోగతికి గణనీయంగా దోహదపడుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులుకు డైరెక్టర్ బీరప్పతో పాటు నిమ్స్ డీన్ డాక్టర్ లిజా రాజశేఖర్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ, అదనపు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లక్ష్మీభాస్కర్, రేడియోడినోసిస్ విభాగాధిపతి డాక్టర్ రామ్మూర్తి తదితరులు అభినందనలు తెలిపారు.

37 నుంచి 24వ ర్యాంక్‌కు వచ్చాం

– వీసీ అల్దాస్ జానయ్య

ఏజీవర్సిటీ: గతేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పనితీరు మెరుగుపడిందని నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్(ఎన్ఐఆర్ఎఫ్) ప్రకారం 2023లో 34లో ఉన్న పీజేటీఏయూ 2025లో 24కు చేరిందని, దీన్ని 3 లేదా 5వ ర్యాంకు తీసుకు వచ్చేందుకు కృషి చేస్తున్నామని వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ అల్దాస్ జానయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని అన్ని విశ్వవిద్యాలయాల పనితీరుపై భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ నిర్వహించిన సర్వే నివేదక గురువారం విడుదల చేసిందని అన్నారు. 2015లో ఆరవ ర్యాంక్‌లో ఉన్న విశ్వవిద్యాలయం పనితీరు 2023లో 37కు పడిపోయిందని చెప్పారు. ప్రస్తుతం 24కు చేరిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు తోడ్పాటుతో ర్యాంకు సాధించామని, 2027 నాటికి 5వ ర్యాంకు సాధిస్తామని ఆయన తెలిపారు.

పట్టుకొని చంపడం రాజ్యానికి మంచిది కాదు

– పౌర హక్కుల జాతీయ నేత ప్రొఫెసర్ హరగోపాల్

హిమాయత్‌నగర్: మనుషులను పట్టుకొని చంపడం రాజ్యాంగానికి విరుద్ధమని, అది రాజ్యానికి ఏమాత్రం మంచిది కాదని పౌర హక్కుల జాతీయ నేత ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. రాష్ట్రంలో కాల్పుల విరమణ ప్రకటించి, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కోరారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో పూర్వ విప్లవ విద్యార్థి వేదిక ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాల్పుల విరమణ, శాంతి చర్చల్లో పౌర సమాజం పాత్ర చాలా కీలకమైందని అన్నారు. తెలంగాణ సమాజంలో ఈ అంశంపై లోతుగా చర్చ జరగాలని, లేకపోతే భవిష్యత్‌లో రాజ్యాంగం విధ్వంసం అయ్యే ప్రమాదం ఉందన్నారు. మావోయిస్టులతో పాటు భద్రత బలగాలు రెండు వైపులా కాల్పుల విరమణ జరిగినప్పుడే ప్రస్తుత పరిస్థితి మెరుగుపడే అవకాశం ఉందన్నారు. కాల్పుల విరమణను ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిశీలించి ముందుకు తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. దేశంలో శాంతియుత వాతావరణం నెలకొల్పడంతో పాటు రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకొనేందుకు ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పూర్వ విప్లవ విద్యార్థుల వేదిక ప్రతినిధులు నాగయ్య, ఏకే.ప్రభాకార్, చరణ్, సజయ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

ఉపరాష్ట్రపతిగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని ఎన్నుకోండి



మాట్లాడుతున్న ఈ.టి.నరసింహ

– సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ

హిమాయత్‌నగర్: భారత రాజ్యాంగం, ప్రాథమిక హక్కులను సమర్థించే ప్రతిపక్షాల కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డిని ఎన్నుకోవాలని పార్లమెంట్ సభ్యులకు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ విజ్ఞప్తి చేశారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరంకుశ నియంతృత్వ పాలన నుంచి దేశాన్ని రక్షించడానికి, భారత రాజ్యాంగం, న్యాయ వ్యవస్థలో గొప్ప అనుభవం ఉన్న జస్టిస్ సుదర్శన్‌రెడ్డి ఉపరాష్ట్రపతి పదవికి తగిన వ్యక్తి అన్నారు. అనంతరం ఇటీవల జరిగిన సీపీఐ రాష్ట్ర మహాసభలలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఈ.టి.నరసింహను ఘనంగా సన్మానించించారు. నాయకులు ఛాయాదేవి, స్టాలిన్, కమతం యాదగిరి, చంద్రమోహన్ గౌడ్, పడాల నలిని, నేర్లకంటి శ్రీకాంత్, కాంపల్లి శ్రీనివాస్, షేక్ శంషుద్దీన్, మామిడిచెట్ల వెంకటస్వామి, మహమ్మద్ సలీం తదితరులు పాల్గొన్నారు.

చదువుకుంటూనే సంపాదించుకునేలా..

– అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ, స్వామి రామానంద తీర్థ ట్రస్ట్ ఒప్పందం

బంజారాహిల్స్: విద్యార్థులు వృత్తి విద్యా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, దానికి అవసరమైన సాంకేతిక సహాయాన్ని అందించడానికి వీలుగా డా.బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ, స్వామి రామానంద తీర్థ రూరల్ ఇనిస్టిట్యూట్‌తో గురువారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు వీసీ ఆచార్య ఘంటా చక్రపాణి, ఆ సంస్థ చైర్మన్ కిషోర్‌రెడ్డి సమక్షంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా.ఎల్.విజయ కృష్ణారెడ్డి, స్వామి రామానంద తీర్థ రూరల్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ హరికృష్ణ అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం ప్రకారం దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన ద్వారా అందించే వృత్తి విద్యా కోర్సులను అంబేడ్కర్ విశ్వవిద్యాలయం విద్యార్థులకు అందించేలా ఈ ఒప్పందం జరిగిందని వెల్లడించారు. విద్యార్థులకు ఉపాధి కల్పించేలా, చదువుతూనే సంపాదించుకునేలా పలు ప్రఖ్యాత సంస్థలతో అవగాహన ఒప్పందాలు చేసుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అకాడమిక్ డైరెక్టర్ ప్రొ.పుష్పా చక్రపాణి, స్కిల్ డెవలప్‌మెంట్, ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్ కో–ఆర్డినేటర్ ప్రొ.పల్లవీ కాబ్డే, ఈఎంఆర్ఆర్‌సీ డైరెక్టర్ ప్రొ.రవీంద్రనాథ్ సోలమన్, పలు విభాగాల డైరెక్టర్లు ఆయా విభాగాల అధిపతులు, డీన్లు తదితరులు పాల్గొన్నారు.

3డీ ప్రింట్ ఎముకలు వచ్చేస్తున్నాయ్

- సీటీ స్కాన్‌తో కచ్చితమైన కొలతలు
- టైటానియంతో కృత్రిమంగా తయారీ
- అందుబాటులోకి ఆధునిక వైద్య సేవలు
- మేక్ ఇన్ ఇండియాతో దిగివస్తున్న ధరలు

సాక్షి, సిటీబ్యూరో: కింద పడి కాలో, చెయ్యో విరిగిందని ఆసుపత్రికి వెళితే పిండి కట్టు వేయడం చూశాం. దెబ్బవాపు తగ్గిన తరువాత పిండి కట్టు సరిగా సెట్ కాకపోతే ఎముక అటు ఇటుగా వంకరయ్యే సందర్భాలు ఉంటాయి. కొన్ని సందర్భాల్లో విరిగిన ఎముకకు రాడ్లు పెట్టి స్క్రూలు బిగిస్తుంటారు. ఇవన్నీ పాత పద్ధతులు. ప్రస్తుతం 3డీ ఎముకలు అందుబాటులోకి వచ్చేస్తున్నాయి. ఎక్కడైనా ఎముక, కీళ్లు దెబ్బతింటే వాటిని తొలగించి కొత్త అవయవాన్ని రీప్లేస్ చేసేందుకు అత్యాధునిక టెక్నాలజీ వినియోగిస్తున్నారు. మోకీళ్లు, చీలమండ, తుంటి, వెన్నెముక, భుజం ఇలా ఏ స్థానంలోని ఎముక దెబ్బతిన్నా దాన్ని మార్చివేస్తున్నారు. ఫలితంగా చికిత్స అనంతరం రోగి అన్ని కార్యకలాపాల్లో పాల్గొనవచ్చు.

35 ఏళ్ల నుంచే మొదలు

సాధారణంగా 35 ఏళ్ల నుంచే మహిళల్లో కీళ్ల నొప్పులు మొదలైపోతున్నాయి. వాతావరణ పరిస్థితులు, జీవన విధానాలు దీనికి కారణంగా కనిపిస్తున్నాయి. ఎక్కువ మందిలో కీళ్ల వాతం కనిపిస్తోందని వైద్యులు చెబుతున్నారు. చేతి వేళ్లు వంగకపోవడం, మోచేయి, మణికట్టు తిప్పినప్పుడు నొప్పి అనిపించడం, తుంటి, మోకాలు, పాదం, భుజం ఇలాంటి భాగాల్లో భరించలేని నొప్పులు వేధిస్తున్నాయి. వీటిని అధిగమించేందుకు తాజాగా ఏ భాగమైనా డిస్క్ రీప్లేస్‌మెంట్ ఆప్షన్ వచ్చేసింది. గతంలో వైద్య పరికరాలు, కృత్రిమ అవయవాలు అమెరికా, ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వచ్చేది. దీంతో రవాణా, పన్నులు, ఇతరాలు కలిపి వైద్యం భారంగా మారేది. ప్రస్తుతం దేశీయంగా తయారు చేస్తుండటంతో తక్కువ ఖర్చులోనే మెరుగైన వైద్యం సాధ్యమైంది. చికిత్సల అనంతరం సాధారణ జీవితం కొనసాగించవచ్చని వైద్యులు చెబుతున్నారు. గతంలో రూ.2 లక్షలు అయ్యే చికిత్స ప్రస్తుతం సుమారుగా రూ.50 వేల నుంచి రూ.లక్షలో పూర్తవుతుంది.



సీటీస్కాన్ సాయంతో..

సహజసిద్ధమైన ఎముక స్థానంలో కృత్రిమంగా తయారు చేసిన అవయవాన్ని నిక్షిప్తం చేయాలంటే ఎంతో కచ్చితత్వం అవసరం. అత్యాధునిక టెక్నాలజీని వినియోగిస్తున్నారు. ముందుగా బాధితుడి ఎముక, కీళ్లు దెబ్బతిన్న ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తారు. సిటీ స్కాన్ సాయంతో ఎంత మేరకు ఎముకను తొలగించాల్సి ఉంటుందనేది లెక్కిస్తారు. దీని ఆధారంగా 3డీ ప్రింటెడ్ టైటానియంతో తయారు చేసిన కృత్రిమ అవయవాన్ని ఆ స్థానంలో అమరుస్తారు. ఈ పరికరం వల్ల ఎంఆర్ఐ వంటి స్కానింగ్‌ల సందర్భంలోనూ ఎలాంటి ఇబ్బంది ఉండదని, ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని వైద్యులు చెబుతున్నారు.

> **సాధారణ ప్రజలకు అందుబాటులో..**
>
> 
>
> చికిత్స విధానాల్లో టెక్నాలజీ మారుతోంది. బోన్ ఫ్రాక్చర్ అయితే కట్టు కట్టేవాళ్లు. ఎముక అతుక్కోవడానికి కొంత సమయం పడుతుంది. ఈలోగా శరీరం వాపు తగ్గిపోవడంతో కట్టిన కట్టు లూజ్ అవుతుంది. కొన్ని దఫాలు ఎముకలు వంకర్లు తిరిగే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం విరిగిపోయిన, దెబ్బతిన్న, కుళ్లిన ఎముకలు, కీళ్లను అవసరాల మేరకు ప్లేట్స్ స్క్రూ బిగించడం, 3డి ప్రింటెడ్ అవయవాలను మారుస్తున్నాం. డిస్క్ రీ ప్లేస్‌మెంట్ ఆప్షన్ వచ్చేసింది. టైటానియం వినియోగిస్తున్నాం. దీంతో సిటీస్కాన్, ఎమ్మారై చేసినా ఇబ్బంది ఉండదు. సాధారణ ప్రజలకు సైతం అందుబాటులో ఉండే ధరల్లోనే చికిత్సలు పూర్తవుతున్నాయి.
>
> – డా.సునీల్ దాచేపల్లి, ఆర్థోపెడిక్, రోబోటిక్ సర్జన్

దసరాలోపు అమృత్ ఎస్టీపీల పనులు

రూ.3,849.10 కోట్లతో 39 ఎస్టీపీల నిర్మాణం

- మురుగు శుద్ధి కేంద్రాల నిర్మాణ ప్రక్రియపై సమీక్ష

సాక్షి, సిటీబ్యూరో: దసరాలోపు అమృత్–2.0 పథకం కింద 39 కొత్త సీవరేజి ట్రీట్‌మెంట్ ప్లాంట్లు(ఎస్టీపీల) నిర్మాణ పనులు ప్రారంభించేందుకు జలమండలి సిద్ధమైంది. ఓఆర్ఆర్ పరిధిలోని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంతాల్లో అమృత్–2.0 పథకంలో భాగంగా రూ.3,849.10 కోట్ల అంచనాతో మురుగు శుద్ధి కేంద్రాల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఇప్పటికే పరిపాలన అనుమతి లభించింది. భూసేకరణ ప్రక్రియ వేగంగా సాగుతోంది. ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో అమృత్ ఎస్టీపీల నిర్మాణ ప్రక్రియపై ఎండీ అశోక్‌రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. భూవివాదాలు లేకుండా భూమి అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో ఎస్టీపీల నిర్మాణానికి ప్లాన్లను వెంటనే ఖరారు చేయాలని ఆదేశించారు. భూవివాదాలు ఉన్న ప్రాంత స్థానిక కలెక్టర్లతో సమావేశం ఏర్పాటు చేయమని ఎస్టేట్ ఆఫీసర్‌కు సూచించారు. భూవివాదాలు ఉన్న ప్రాంత ఎస్టీపీల నిర్మాణానికి ప్రత్యామ్నాయ ప్రాంతంలో భూమిని గుర్తించాలని సూచించారు. వీలైనంత త్వరగా సాయిల్ టెస్టులను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్, సీజీఎంలు పద్మజ, సుజాత, వాస సత్యనారాయణ, ఈవో విజయకుమారి, జీఎంలు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఎస్టీపీల నిర్మాణ ప్రక్రియపై సమీక్షలో జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

ఎస్టీపీల నిర్మాణ ప్రాంతం..

తెల్లాపూర్, ఇక్రిశాట్, ఉస్మాబావి, బాచుగూడ, తిమక్క చెరువు, గాంధీ గూడెం, పీర్జాదిగూడ, నాగారం, నార్సింగి(ఓఆర్ఆర్), సంఘం(బాపూఘాట్), హైదర్‌షాకోట, ఫతేనగర్, చిత్రపురి కాలనీ, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, మీర్‌పేట్, మాసబ్ చెరువు, కాప్రా, రవిర్యాల్, బొంగులూరు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్ । శుక్రవారం । 5 । సెప్టెంబర్ । 2025



మైక్రో బ్రూవరీ.. న్యూ స్టోరీ..

నగరంలో తొలి మైక్రో బ్రూవరీ ఏర్పాటై దాదాపు పదేళ్లవుతోంది. అప్పటి నుంచి కేవలం సరదాగా కాలక్షేపం చేసేవారికి తప్ప.. క్రాఫ్ట్ బీర్ అతి తక్కువ మందికి మాత్రమే చేరువైంది. ఈ నేపథ్యంలో మైక్రోబ్రూవరీలను విస్తృతంగా అనుమతిస్తూ ప్రభుత్వం నిర్ణయించడం నగరంలో క్రాఫ్ట్ బీర్ రంగానికి కొత్త ఉత్సాహం అందించింది.

– సాక్షి, సిటీబ్యూరో



మైక్రో బ్రూవరీ రంగం దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ రంగంలో బెంగళూరు అగ్రస్థానంలో ఉండగా, ఢిల్లీ, పుణె తదితర నగరాలు కూడా క్రాఫ్ట్ బీర్ మార్కెట్‌లో గణనీయమైన వృద్ధిని చూపిస్తున్నాయి. స్థానిక ప్రత్యేకమైన రుచుల పట్ల వినియోగదారుల ఆసక్తి, డిమాండ్ పెరుగుతున్న దృష్ట్యా 2030 నాటికి ప్రస్తుత మార్కెట్ మూడు రెట్లు పెరుగుతుందని అంచనా. ప్రస్తుతం దేశవ్యాప్తంగా మైక్రో బ్రూవరీల సంఖ్య 300కి పైగా ఉంటే, 2030 నాటికి ఈ సంఖ్య 1,000 దాటవచ్చని విశ్లేషకుల అంచనా.

పార్టీ కల్చర్‌కు కొత్త ఊపు..

క్లబ్‌లు, ఎలైట్ లిక్కర్ షాపులు, స్టార్ హోటళ్లు తమ సొంత ఇన్–హౌస్ మైక్రో బ్రూవరీలను నిర్వహించడానికి అనుమతినిచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోన్న నేపథ్యంలో నగర పార్టీ కల్చర్ కూడా కొత్త రూపు సంతరించుకోనుంది. ముఖ్యంగా తరచుగా ఈవెంట్స్ నిర్వహించే వారు కూడా ఈ బ్రూవరీల లైసెన్స్‌లు పొందే అవకాశం ఉంది. తద్వారా ఈవెంట్ల వ్యాప్తంగా బీర్ వినియోగం ఊపందుకునే పరిస్థితి కనిపిస్తోంది.

దేశీయ రుచులకు జై.. ఆరోగ్య స్పృహ

బ్రూవరీలు దేశీయ రుచులకు పెద్దపీట వేస్తున్నాయి. వినియోగదారులను ఆకర్షించడానికి మామిడి, మిరియాలు, చాయ్ వంటి స్థానిక పదార్థాలను తమ బ్రూలలో కలుపుతున్నారు. పెరుగుతున్న ఆరోగ్య స్పృహకు అనుగుణంగా తక్కువ ఆల్కహాల్‌తో పాటు ఆల్కహాల్ రహిత బీర్లకు సైతం వీటి ద్వారా ప్రాధాన్యత పెరుగుతోంది. ఈ మైక్రో బ్రూవరీలు కేవలం బీర్ డ్రింకింగ్‌కు మాత్రమే పరిమితం కావు. రుచికరమైన వంటకాలతో పాటు నగర సామాజిక కేంద్రాలుగా కూడా ఉంటున్నాయి.





ఏమిటీ క్రాఫ్ట్ బీర్?

తక్కువ ఆల్కహాల్ కలిగిన, స్థానిక తయారీదారులు తయారు చేసేవే క్రాఫ్ట్ బీర్లు. వినియోగదారులు హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహారం లాగానే అప్పటికప్పుడు తాజాగా తయారుచేసిన బీర్ ఆర్డర్ చేసుకోవచ్చన్న మాట. ఫ్రెష్ బీర్ రుచిని నచ్చిన ఆహారంతో కలిపి ఆస్వాదించవచ్చు.

బెంగళూరు.. క్యాపిటల్ ఆఫ్ బీర్..

భారతదేశ బీర్ క్యాపిటల్‌గా పేరున్న బెంగళూరు లో దాదాపు 80కిపైగా మైక్రో బ్రూవరీలు ఉన్నాయి. బీర్ ఇష్టపడే యువకుల సంఖ్య పెరుగుతండడంతో బెంగళూర్‌లో పేరున్న మైక్రో బ్రూవరీలు 10,000–15,000 చదరపు అడుగుల మధ్య ఏర్పాటవుతున్నాయి. ఓ బ్రూవరీ కంపెనీ డైరెక్టర్ మాట్లాడుతూ 'బ్రూవరీలు స్థానిక, అంతర్జాతీయ పదార్థాల మేళవింపుతో బీర్లను పరిచయం చేయడం ద్వారా వినియోగాన్ని ఆసక్తికరంగా మారుస్తున్నాయి. వైన్ షాప్స్‌లో అందుబాటులో ఉండే నిల్వ పానీయాలకు బదులు తాజాగా తయారుచేసినవి ఇష్టపడే 25 నుంచి 55 సంవత్సరాల వయసు గలవారే బ్రూవరీలకు రెగ్యులర్ కస్టమర్స్' అంటున్నారు.

నగరం ఇంకా వెనుకంజే..

నగరం బీర్‌ల వినియోగంలో ముందున్నప్పటికీ.. బెంగళూరు, పుణె, ఢిల్లీ వంటి నగరాల్లో మాదిరిగా ఇక్కడ మైక్రో బ్రూవరీ సంస్కృతి ఇంకా పెద్దగా ఊపందుకోలేదు. ప్రస్తుతం, హైదరాబాద్, రంగారెడ్డిలలో కలిపి 18 మైక్రో బ్రూవరీలు ఉండగా, ఇవి సమిష్టిగా ఏటా దాదాపు 1.8 మిలియన్ బల్క్ లీటర్ల బీరును ఉత్పత్తి చేస్తాయి. 2016లో 50 కంపెనీలు దరఖాస్తు చేసుకుంటే 18 కంపెనీలు లైసెన్స్ పొందాయి. ప్రస్తుతం రాష్ట్ర 2025–26లో ఎక్సైజ్ శాఖ రూ.27,623 కోట్ల ఆదాయ లక్ష్యంతో, రాష్ట్రం తన ప్రణాళికలను పునర్‌ప్రారంభిస్తోందని అంటున్నారు. దీని ఫలితంగా ఈ మైక్రోబ్రూవరీల సంఖ్య 50కి చేరినా ఆశ్చర్యపోనక్కర్లేదు. నగరంతో పాటు వరంగల్, హనుమకొండ, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, నల్గొండ వంటి నగరాల్లో బ్రూవరీలను ఏర్పాటు చేయడంపై గణనీయమైన ఆసక్తి ఉందని అధికారులు చెబుతున్నారు.



నగరానికి 'సాల్ట్'..

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని గచ్చిబౌలిలో ప్రముఖ అంతర్జాతీయ రెస్టారెంట్ గ్రూప్ 'సాల్ట్' తమ నూతన శాఖను నెలకొల్పనుంది. ఈ విషయాన్ని గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థ ప్రతినిధులు తెలిపారు. 'ఇండియన్ ఫుడ్ మేడ్ ఇంట్రెస్టింగ్' ట్యాగ్‌లైన్‌తో భారతీయ వంటకాల గొప్పదనాన్ని చాటి చెప్పేలా తమ మెనూ రూపుదిద్దుకుందన్నారు. చెన్నై, బెంగళూర్, పుణెలలో భోజన ప్రియుల ఆదరణ పొందామని, నగరవాసులను కూడా ఆకట్టుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తమదైన శైలిలో వండి వడ్డించే నాచో సలాడ్, తక్–ఎ–తక్ చిల్లీ పనీర్, బటర్ చికెన్ లాలీపాప్స్, అల్లెప్పీ ఫిష్ కర్రీ, గలోటీ కబాబ్ మసలేదార్ ప్రాన్ బిర్యానీ తదితర వంటకాల విశేషాలను చెఫ్ బాలచందర్ వివరించారు.



సహజ శిశు సంరక్షణ..

బేబీ స్పా..

- నగరానికి దేశంలోనే మొట్ట మొదటి బేబీ స్పా సేవలు
- 6 వారాల నుంచి 9 నెలల చిన్నారులకు హైడ్రోథెరపీ, బేబీ మసాజ్
- వినూత్నంగా పరిచయం చేసిన ఫెర్నాండెజ్ హాస్పిటల్
- తొలి బేబీ స్పాను ప్రారంభించిన కలెక్టర్ హరిచందన

సాక్షి, సిటీబ్యూరో: బాడీ స్పా, హీలింగ్ థెరపీ స్పా వంటి సేవలు అందించేందుకు నగరంలో మొదటి సారి చిన్నారుల కోసం 'బేబీ స్పా' సేవలు అందుబాటులోకొచ్చాయి. పీడియాట్రిక్, ఫిజియోథెరపిస్టుల ఆధ్వర్యంలో అందించే ఈ బేబీ స్పా సేవలు చిన్నారుల్లో ఆరోగ్యకరమైన ఎదుగుదల, కండరాల సమృద్ధి, మోటార్ డెవలప్‌మెంట్ వంటి ఫలితాలు ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. బంజారా హిల్స్‌లోని ఫెర్నాండెజ్ స్టార్క్ హోమ్ వేదికగా ఏర్పాటు చేసిన ఈ బేబీ స్పా దేశంలోనే మొదటిది కాగా దీనిని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరి చందన ప్రారంభించారు. ఈ 'బేబీ స్పా'లో భాగంగా 6 వారాల నుంచి 9 నెలల వయసు శిశువులకు హైడ్రోథెరపీ, బేబీ మసాజ్‌తో పాటు ఇంద్రియాల ఉద్దీపనం, చిన్నారులు తల్లిదండ్రుల బంధాన్ని పెంపొందించే సేవలుంటాయి.



సహజంగా.. సురక్షితంగా..!!

ఈ బేబీ స్పాలో అందించే హైడ్రోథెరపీ, మసాజ్‌లు 3 వేల ఏళ్ల క్రితమే మన సంస్కృతిలో ఉండేవని, ఈ పద్ధతులను అధునాతనంగా ఈ తరానికి అందించమే లక్ష్యంగా దీనిని ప్రారంభించామని ఫెర్నాండెజ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ డా.ఎవిటా ఫెర్నాండెజ్ తెలిపారు. బేబీ స్పా పద్ధతులు తల్లి గర్భంలో ఉన్న చిన్నారికి కొనసాగింపుగా ఉంటాయి. యూవీ స్టెరిలైజ్డ్ ఆర్‌ఓ ఫిల్టర్ చేసిన వాటర్ టబ్స్‌లో చిన్నారులకు స్పా, గ్రేప్ సీడ్ ఆయిల్‌తో మసాజ్ వంటి సురక్షితమైన సేవలుంటాయి. ఇవి పసిపిల్లల్లో సెన్సారింగ్, మోటార్ డెవలప్మెంట్‌కు తోడ్పడతాయి. సైన్స్ ఆధారిత ఫలితాలతో స్పా మేలు చేస్తుంది. చిన్నారుల నిద్ర, బరువులో సమతుల్యత, శరీర అవయవాల ఎదుగుదలలో సంరక్షణను అందిస్తుంది. ఒక సెషన్ 45 నిమిషాల పాటు ఉండగా.. ఇందులో 15 నిమిషాలు నీటిలోనే థెరపీ ఉంటుందని డాక్టర్ సుష్మ తెలిపారు. చిన్నారుల పీహెచ్‌కు అనుగుణంగా 36 నుంచి 37 డిగ్రీల సెల్సియస్‌లో అందించే ఈ స్పా విధానాలు భారత్ మూలాలతో పాటు ఈజిప్ట్, మొసపటేమియా, చైనా వంటి సంస్కృతుల్లో భాగమేనని తెలిపారు. దక్షిణ ఆఫ్రికాకు చెందిన లారా ఈ బేబీ స్పాపై పరిశోధనలు చేసి అభివృద్ధి చేశారు.



తల్లీబిడ్డల శ్రేయస్సు కోసం..

బేబీ స్పా వంటి అధునాతన సేవలు అందుబాటులోకి రావడం అభినందనీయం. దాదాపు తొమ్మిదేళ్లకు ముందే వాటర్ బర్త్ వంటి వినూత్న వైద్య సేవలను ఫెర్నాండేజ్ ఫౌండేషన్ నగరానికి పరిచయం చేశారు. సహజ ప్రసవాలకు ఇది కీలకంగా పనిచేస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లోని నర్సులకు మిడ్ వైఫ్స్ పద్ధతులపై అవగాహన, శిక్షణ కల్పించారు. మన మూలాల్లోని సంప్రదాయ పద్ధతులను అధునాతనంగా అందించే ఈ చికిత్సలను స్వతహాగా నా పిల్లలకు సైతం అందించాను. అధిక మొత్తంలో మెడిసిన్ కన్నా సహజంగా మిడ్ వైఫ్స్ సంరక్షణ పద్ధతులతో ఇలాంటి సేవలు మహిళా శిశు సంరక్షణలో కీలకంగా నిలుస్తాయి.

– హరిచందన, హైదరాబాద్ జిల్లా కలెక్టర్.



రాపిడ్ ఫైర్‌లో.. ఒలింపిక్సే టార్గెట్..

- అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న షూటర్ తనిష్క్ నాయుడు
- వయోపరిమితి లేకపోవడం అడ్వాంటేజ్
- జాతీయ స్థాయిలోనూ తీవ్రమైన పోటీ
- షూటింగ్‌లో భారతీయులకు అవకాశాలు పుష్కలం
- ఏకాగ్రత, సాధనతోనే విజయాలు సాధ్యం

ఒకే ఒక్క సెకన్‌లో ఐదు బుల్లెట్లు ప్రత్యర్థులను మించి టార్గెట్ రీచ్ అయితేనే రాపిడ్ ఫైర్ పిస్టల్‌లో మెడల్ సాధించేందుకు వీలవుతుంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తీవ్ర పోటీని దాటి రాణిస్తున్న హైదరాబాద్ యువ షూటర్ తనిష్క్ 2028లో లాస్‌ఏంజిల్స్‌లో జరిగే ఒలింపిక్స్‌లో పతకం సాధించడమే టార్గెట్‌గా ఏకాగ్రతతో సాధన చేస్తున్నాడు. 11 ఏళ్లు పైబడిన వారు ఒలింపిక్స్‌లో పాల్గొనే అవకాశం ఉండటమే షూటర్లలోని ఆత్మవిశ్వాసానికి కారణం. హాబీగా మొదలైన షూటింగ్.. అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లింది. అమ్మ నాన్నలు నా బర్త్‌డే గిఫ్ట్‌గా దీనిలో చేర్పించారని 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెబుతున్నారు తనిష్క్ నాయుడు. ఇప్పటికే 25 మీటర్ల రాపిడ్ ఫైర్ పిస్టల్ జూనియర్ మెన్, స్టాండర్డ్ పిస్టల్ మెన్ జూనియర్ విభాగాల్లో అంతర్జాతీయ స్థాయిలో పతకాలు అందుకున్నట్లు తెలిపారు. – గచ్చిబౌలి

సాక్షి: షూటింగ్ ఎందుకు ఎంచుకున్నారు?

తనిష్క్: నాకు ఆటలంటే మహా ఇష్టం. ఆరో తరగతిలో అమ్మ నాన్నలను ఏదైనా ఆటలో సాధన చేస్తానని చెప్పాను. 11వ బర్త్ డే గిఫ్ట్‌గా వారు నన్ను తిరుమలగిరిలోని జీఎఫ్‌జీ (గన్ ఫర్ గ్లోరీ) షూటింగ్ అకాడమీలో చేర్పించారు. 2016 నుంచి 2018 వరకూ అక్కడే సాధన చేశాను. కోవిడ్ రావడంతో గ్యాప్ వచ్చింది. 2021లో మళ్లీ సాధన కోసం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ షూటింగ్ రేంజ్‌లో చేరాను. ప్రాజెక్ట్ లీప్ (స్కాలర్ షిప్)కు ఎంపిక కావడంతో మళ్లీ తిరుమలగిరిలోని జీఎఫ్‌జీలో సాధన చేస్తున్నా.

సాక్షి: ఇప్పటి వరకూ సాధించిన మెడల్స్?

తనిష్క్: 2023లో సౌత్‌కొరియా చాంగ్వన్‌లో జరిగిన 15వ ఏషియన్ షూటింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో 25 మీటర్ల రాపిడ్ ఫైర్ పిస్టల్ జూనియర్ మెన్ టీంలో రజత పతకం సాధించా. 2025లో కజికిస్తాన్ 16వ ఏషియన్ చాంపియన్‌షిప్ పోటీల్లో 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్ జూనియర్ మెన్ విభాగంలో గోల్డ్ మెడల్ సాధించా. 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్ జూనియర్ మెన్ వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకం సాధించా. జాతీయ స్థాయిలోనూ పతకాలు సాధించాను.



సాక్షి: షూటింగ్‌లో మన క్రీడాకారులకు అవకాశాలు ఎలా ఉన్నాయి?

తనిష్క్: షూటింగ్‌లో మనదేశ క్రీడాకారులకు మంచి అవకాశాలు ఉన్నాయి. 16వ ఏషియన్ చాంపియన్ షిప్‌లో 99 మెడల్స్ సాధించి పట్టికలో టాప్‌లో నిలిచారు. ఒలింపిక్స్‌లోను నాలుగు పతాకాలు సాధించారు. భవిష్యత్తులో మన షూటర్లు అంతర్జాతీయ స్థాయిలో అనేక పతకాలు సాధించే అవకాశం ఉంది.

సాక్షి: మీ టార్గెట్ ఏమిటి? అంతర్జాతీయ స్థాయిలో పోటీ ఎలా ఉంటుంది?

తనిష్క్: ఒలింపిక్స్‌లో రాపిడ్ ఫైర్ పిస్టల్‌కు అవకాశం ఉంది. రెండున్నరేళ్లపాటు కఠోర సాధన చేసి 2028లో అమెరికాలో లాస్‌ఎంజిల్స్‌లో నిర్వహించే ఒలింపిక్స్‌లో పతకం సాధించాలి. ఆ టార్గెట్‌తోనే ప్రాక్టీస్ చేస్తున్నాను. వయోపరిమితి లేకపోవడం యువ క్రీడాకారులకు కలిసొచ్చే అంశం. ప్యారిస్ ఒలింపిక్స్‌లో 51 ఏళ్ల యూసఫ్ డికెక్ సిల్వర్ మెడల్ సాధించాడు.

సాక్షి: జాతీయ స్థాయిలో షూటింగ్‌కు ప్రాధాన్యత ఎలా ఉంది?

తనిష్క్: ఒకప్పుడు జాతీయ స్థాయిలో నాలుగైదు వేల మంది మాత్రమే పోటీ పడేవారు. ఆ పరిస్థితి ఇప్పుడు లేదు. జాతీయ స్థాయిలో పోటీల్లో దాదాపు 20 వేల మంది క్రీడాకారులు పోటీ పడుతున్నారు. ఎంచుకున్న విభాగంలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికే అంతర్జాతీయ స్థాయిలో అవకాశం ఉంటుంది.

సాక్షి: దేశంలో షూటింగ్ సాధన అవకాశాలు?

తనిష్క్: డెహ్రాడూన్, ఢిల్లీ, పుణె, భోపాల్, గోవా, హైదరాబాద్, బెంగళూర్ తదితర ప్రాంతాల్లో షూటింగ్ రేంజ్‌లు ఉన్నాయి. ఖేలో ఇండియా, ప్రాజెక్ట్ లీప్ ద్వార క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారు.

సాక్షి: ఏకాగ్రత కోసం మీరేం చేస్తారు?

తనిష్క్: సెకన్ల వ్యవధి పాటు సాగే షూటింగ్ పోటీల కోసం వందలు, వేల కిలోమీటర్లు ప్రయాణం చేస్తాం. ఏ మాత్రం ఏకాగ్రత కోల్పోయినా ఫలితం తలకిందులవుతుంది. నేను బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్ చేస్తాను.

ఆకట్టుకున్న

'రసబైవా'

రవీంద్రభారతిలో ఒడిస్సీ కళాకారుల నృత్య ప్రదర్శన





గన్‌ఫౌండ్రీ : భగవద్గీతలోని తత్వ శాస్త్రం జీవితాలకు సంబంధించిందని తెలిసేలా కళాకారులు తమ నృత్యంతో కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. రవీంద్రభారతిలో ఒడిస్సీ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో రసబైవా పేరుతో గురువారం నిర్వహించిన భరత నాట్యం, ఒడిస్సీ నృత్య కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వారసత్వం, చరిత్ర సజీవంగా ఉంది అనేటట్లు సాగిన ప్రదర్శనల్లో అల్లూరి సీతారామరాజు దేశభక్తి, మార్షల్ ఆర్ట్స్, థ్రిల్లింగ్ ఫైట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. మన చరిత్రను, వారసత్వ సంపదను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. అనంతరం కళాకారులను అభినందించారు. కార్యక్రమంలో పద్మశ్రీ పురస్కార గ్రహీతలు ఆనంద్ శంకర్‌జైన్, అరుణ మహంతి, డాక్టర్ సికా చక్రవర్తి, జి.అన్నారావు పాల్గొన్నారు.

ఇకపై ఏటా కాఫ్ డే నిర్వహణ



సాక్షి, సిటీబ్యూరో: అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియా నేషనల్ కాఫ్ డేని నిర్వహించనుంది. ఈ విషయాన్ని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ప్రముఖ ఫార్మాస్యూటికల్ కంపెనీ అయిన డాక్టర్ రెడ్డీస్ లాబొరేటరీస్ లిమిటెడ్ సహకారంతో తమ కన్సల్టెంట్ వైద్యుల ప్రొఫెషనల్ బాడీ ఆధ్వర్యంలో ఇకపై ప్రతి సంవత్సరం ఆగస్టు 29న జాతీయ కాఫ్ డేగా నిర్వహిస్తామని, శ్వాసకోశ వ్యాధులు ముఖ్యంగా అనేక మందిని వేధిస్తున్న దగ్గుపై దేశవ్యాప్తంగా అవగాహన పెంచడం, రోగ నిర్ధారణ చికిత్సా పద్ధతులను ప్రోత్సహించడమే దీని లక్ష్యమన్నారు. శ్వాసకోశ సంరక్షణలో మార్గదర్శకుడు పల్మోనాలజీకి ఆయన సేవల్ని పురస్కరించుకుని ఇండియన్ చెస్ట్ సొసైటీ వ్యవస్థాపకుడు డాక్టర్ అశోక్ మహాసూర్ వర్ధంతి రోజుని కాఫ్ డేగా నిర్ణయించామన్నారు.



మహబూబాబాద్‌లోని ఆగ్రోస్ రైతు సేవాకేంద్రం వద్ద సిగలు పట్టుకొని కొట్టుకుంటున్న మహిళలు



మహబూబాబాద్‌లోని ఆగ్రోస్ సేవాకేంద్రం వద్ద యూరియా బస్తాల కోసం క్యూలో నిలబడిన రైతులు

అటు సిగపట్లు.. ఇటు లూటీకి యత్నం

- యూరియా కోసం రైతుల ఆందోళనలతో ఉద్రిక్తంగా మారిన మహబూబాబాద్
- రైతులు బస్తాలు తీసుకెళుతుండగా అడ్డుకున్న పోలీసులు
- ఆగ్రోస్ రైతు సేవ కేంద్రం వద్ద తోపులాట... మన గ్రోమోర్ సెంటర్‌పై రైతుల రాళ్లదాడి

మహబూబాబాద్ రూరల్ : ఒకచోట యూరియా కోసం కొందరు మహిళలు సిగలు పట్టుకొని కొట్టుకోగా, మరోచోట కార్యాలయంపై రైతులు రాళ్ల దాడి చేశారు. ఆపై కట్టెలు కాల బెట్టి నిరసన తెలిపారు. దీంతో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వివరాల్లోకి వెళితే... మహబూబాబాద్‌లోని వివేకానంద సెంటర్ వద్ద ఉన్న ఆగ్రోస్ రైతు సేవాకేంద్రంలో గురువారం యూరియా బస్తాలు పంపిణీ చేస్తున్నారని తెలిసి వందల సంఖ్యలో రైతులు అక్కడకు చేరుకున్నారు. రైతుల క్యూలైన్ భారీగా ఉండటంతో టౌన్ సీఐ గట్ల మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గంటల తరబడి క్యూలైన్లలో నిలబడిన రైతులు.. యూరియా పంపిణీ ఆలస్యం కావడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. తోపులాట పెరిగి ఒకరికొకరు తోసుకుంటూ ముందుకు వెళ్లి బస్తాలు తీసుకునే క్రమంలో ఘర్షణ పడ్డారు. ఇందులో కొందరు మహిళలు సిగపట్లు పట్టుకున్నారు. దీంతో కొందరు మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. మరికొంతమంది మహిళలు నడిరోడ్డుపైనే ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో రైతు సేవాకేంద్రం నిర్వాహకులు కొంతమంది రైతులకు యూరియా బస్తాల పంపిణీ చేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

మన గ్రోమోర్ సెంటర్ వద్ద

యూరియా బస్తాలు పంపిణీ చేయాలంటూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని మన గ్రోమోర్ సెంటర్‌పై రైతులు రాళ్లతో దాడిచేశారు. గ్రోమోర్ బోర్డును చించివేసి పాత కర్రలు వేసి నిప్పిపెట్టి నిరసన తెలిపారు. అనంతరం గ్రోమోర్ సెంటర్ గోదాంపై దాడిచేసి అందులోకి చొచ్చుకెళ్లారు. గోదాము తలుపులు పగులగొట్టి యూరియా బస్తాలు తీసుకొని పోతుండగా పోలీసులు భారీగా చేరుకొని అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, రైతులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో అదనపు బలగాలు వజ్ర ట్యాంకర్‌తో సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. గోదాంలో ఉన్న యూరియా బస్తాల వరకు పంపిణీ చేస్తామని రైతులకు నచ్చచెప్పి శాంతింపజేశారు. కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ ఆర్ కేకన్ ఆదేశాల మేరకు డీఎస్పీ తిరుపతిరావు సంఘటన స్థలానికి చేరుకున్నాక పరిస్థితి అదుపులోకి వచ్చింది. తహసీల్దార్ చంద్రరాజేశ్వర్‌రావు రైతులను క్యూలైన్లలో నిలబెట్టి ఒక్కో రైతుకు ఒక బస్తా పంపిణీ చేశారు.

దొరుకుతుందో.. లేదో

అయినా యూరియా కోసం తెల్లవారుజాము నుంచే క్యూలైన్‌లో రైతులు



కామారెడ్డి జిల్లా బీబీపేట సొసైటీ కార్యాలయం వద్ద యూరియా కోసం వేచిఉన్న వందలాది మంది రైతులు

సాక్షి, నెట్‌వర్క్ : కనీసం ఒక బస్తా యూరియా అయినా దొరుకుతుందో లేదో తెలియకపోయినా తెల్లవారుజాము నుంచే రైతులు క్యూలైన్‌లో నిల్చుంటున్నారు. యూరియా దొరికిన రైతులు ఆనందంతో, దొరకని రైతులు నిరాశతో వెనుదిరుగుతున్నారు. కొన్నిచోట్ల అసలు యూరియా లారీలు రావడం లేదంటూ ఆందోళనలకు దిగి రైతులు రాస్తారోకోలు, ధర్నాలు చేస్తున్నారు.

- నారాయణపేట జిల్లా మరికల్ మండలం తీలేర్ సింగిల్‌విండో సొసైటీ వద్ద తెల్లవారుజాము నుంచే రైతులు టోకెన్ల కోసం క్యూలో నిల్చున్నారు. ఈ క్రమంలో ఇద్దరు వృద్ధులు మణెమ్మ, కుర్మన్న స్పృహ తప్పి పడిపోయారు. దీంతో వెంటనే పక్కన ఉన్న రైతులు నీళ్లు తాగించి 108లో ఆస్పత్రికి తరలించారు. టోకెన్లు తీసుకున్న రైతులే మళ్లీమళ్లీ వస్తుండడంతో మరికల్ సీఐ రాజేందర్‌రెడ్డి, ఎస్‌ఐ రాము ఎన్నికల పోలింగ్ తరహాలో తీలేర్ సొసైటీకి వచ్చిన ప్రతి రైతు చేతి బొటవేలుకు సిరా(ఇంకు) గుర్తు వేసి.. టోకెన్ ఇచ్చారు. వీరికి ఈ నెల 6వ తేదీన యూరియా ఇవ్వనున్నారు.
- సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని సింగిల్ విండో కార్యాలయానికి ఉదయాన్నే చేరుకున్నారు. ఇక్కడకు వచ్చిన యూరియా లారీని అధికారులు అక్కన్నపేటకు పంపడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆపై వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రధాన గేట్ రహదారిపై బైఠాయించారు. కొద్ది సేపటికి పక్కనే ఉన్న మంత్రి కార్యాలయానికి పరుగులు పెట్టారు. పోలీసులు వారించినా రైతులు వినకుండా మంత్రి కార్యాలయాన్ని ముట్టడించి ధర్నా నిర్వహించారు.
- తెల్లవారుజామునే కామారెడ్డి జిల్లా బీబీపేటలోని సింగిల్ విండో సొసైటీ కార్యాలయానికి రైతులు తరలివచ్చి క్యూలో ఉన్నారు. కొందరికే యూరియా పంపిణీ చేయడంతో రైతులు తోపులాటకు దిగారు. దీంతో పోలీసులు, వ్యవసాయ అధికారులు, సొసైటీ సిబ్బంది సర్దిచెప్పారు.
- యూరియా అందక తన పొలం ఎర్రబడిన నేపథ్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన రైతు మానుక లక్ష్మణ్ ఆగ్రహంతో రగలిపోయాడు. ఈ ప్రభుత్వానికి ఓట్లు వేసిన పాపానికి చెప్పుతో కొట్టుకోవాలంటూ లక్ష్మణ్ తన చెప్పుతో కొట్టుకున్నాడు. యూరియా కోసం అన్నదాతలు బాధ పడుతున్నారంటూ సీఎం రేవంత్‌రెడ్డిని దూషించాడు. దీనిపై కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేశారు.
- వరంగల్ గూడ్స్ షెడ్‌కు వివిధ కంపెనీలకు దాదాపు 2,912 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చింది. దీనిని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతులకు పంపిణీ చేస్తామని వ్యవసాయ అధికారి రవీందర్ చెప్పారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లోనూ
కేన్సర్ వైద్యం

- ప్రతీ జిల్లాలో కేన్సర్ డే కేర్, పల్లియేటివ్ కేర్ సెంటర్లు
- సోమవారం మంత్రి దామోదర చేతుల మీదుగా ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పెరుగుతున్న కేన్సర్ రోగులకు జిల్లా కేంద్రాల్లోనే చికిత్స అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కేన్సర్ సోకితే కార్పొరేట్ ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉంది. పేదలకు, అల్పాదాయ వర్గాలకు హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రి మాత్రమే ఉంది. ఇక్కడికి రాష్ట్రవ్యాప్తంగా అన్నిప్రాంతాల నుంచి వచ్చే రోగుల తాకిడి పెరగడంతో రేడియేషన్, కీమోథెరపీ, స్కానింగ్ కోసం రోజుల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఉంది. అదీగాక చికిత్స కోసం ప్రతిసారీ హైదరాబాద్‌కు రావడం కూడా పేదలకు ఆర్థికంగా భారమవుతోంది. ఈ నేపథ్యంలో తెలంగాణలో కేన్సర్ రోగులకు చేరువలో, తక్కువ ఖర్చుతో వైద్యం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్రంలోని ప్రతీ జిల్లాలో డే కేర్ కేన్సర్ సెంటర్లు, పల్లియేటివ్ కేర్ సెంటర్లను ఏర్పాటు చేస్తోంది. దీని ద్వారా రోగులకు కీమోథెరపీ చికిత్స, నొప్పి నియంత్రణ, ఇతర వైద్య సేవలు దొరుకుతాయి. ఈ మేరకు ఇప్పటికే పలు జిల్లాల్లో కేన్సర్ చికిత్స కోసం ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేశారు. పల్లియేటివ్ కేర్‌కు సంబంధించి కూడా బెడ్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ కేన్సర్ చికిత్స కేంద్రాలను ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ వచ్చే సోమవారం ప్రారంభించనున్నారు.

డే కేర్ కేన్సర్ సెంటర్లు

రాష్ట్రంలోని మొత్తం 33 టీచింగ్ ఆస్పత్రుల్లో పది చొప్పున డే కేర్, పల్లియేటివ్ కేర్ పడకలు ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ రోగులు ఒకే రోజు కీమోథెరపీ చికిత్స తీసుకుని తిరిగి ఇంటిక్లే సౌకర్యం ఉంటుంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కీమో థెరపీని ఆరోగ్యశ్రీతో అనుసంధానం చేయడంతో ఖర్చు లేకుండా వైద్యం అందనుంది. దూరప్రాంతాల రోగులు చికిత్స కోసం ఇకపై హైదరాబాద్ లేదా ఇతర నగరాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు.

ఎంఎన్‌జే పర్యవేక్షణలో కీమో థెరపీ

ఈ కొత్త వ్యవస్థను 'ఎంఎన్‌జే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ' పర్యవేక్షిస్తుంది. ఇప్పటికే 33 జిల్లాలకు చెందిన బోధనాసుపత్రులకు చెందిన ఎంపిక చేసిన వైద్యులు, నర్సింగ్, పారామెడికల్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కూడా ఇప్పించారు. ఒక రోగి కేన్సర్ బారిన పడినట్లు తేలితే ప్రాథమిక వైద్య పరీక్షలు, పూర్తి నిర్ధారణ ఎంఎన్‌జే ద్వారానే జరుగుతుంది. అలాగే మొదటి కీమోథెరపీ డోస్‌ను ఎంఎన్‌జేలో ఇస్తారు. తర్వాతి వైద్యాన్ని సంబంధిత జిల్లా డే కేర్ సెంటర్లలో అందిస్తారు. ఇందుకోసం జిల్లా బోధనాసుపత్రిలోని డాక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పర్యవేక్షిస్తూ, చికిత్స అందించేందుకు సహాయపడతారు. రోగులకు మందుల సరఫరా కూడా ఎంఎన్‌జే ద్వారానే జరుగుతుంది.

ప్రత్యేక ఏర్పాట్లు

అన్ని డే కేర్ సెంటర్లలో 20 పడకలు (10 కేన్సర్, 10 పల్లియేటివ్) ఏర్పాటు చేయనున్నారు. ఫ్రిజ్‌లు, ఔషధాలు, డిస్పోజబుల్స్ అందుబాటులోకి రానున్నాయి. శిక్షణ పొందిన వైద్యులు, నర్సింగ్‌తోపాటు పారామెడికల్ సిబ్బందిని ఇప్పటికే నియమించారు. జిల్లాలకు సంబంధించిన కేన్సర్ రోగుల డేటాను తెప్పించుకొని, ఆయా జిల్లాల నుంచే వారికి చికిత్స అందిస్తామని వైద్యారోగ్య శాఖ తెలిపింది. పల్లియేటివ్ కేర్‌కు సంబంధించి కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న రోగులకు నొప్పి తగ్గించేందుకు, శ్వాసకోశ సమస్యలను అధిగమించేందుకు వీటిని ఏర్పాటు చేస్తున్నారు. కేన్సర్‌తో పాటు హెచ్‌ఐవీ/ఎయిడ్స్, డిమెన్షియా, పార్కిన్సన్స్, మల్టిపుల్ స్క్లెరోసిస్, మోటార్ న్యూరాన్ డిసీజ్, స్ట్రోక్, ప్రోగ్రెసివ్ సిస్టమిక్ డిసీజెస్, సీఓపీడీ, ఐఎల్డీ, హృదయ, కాలేయ, కిడ్నీ వ్యాధులు, వృద్ధాప్య సంబంధిత అనారోగ్యాలకు సంబంధించిన రోగులకు ఈ కేంద్రాల్లో చికిత్స అందించనున్నారు.

గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన యువకుడు



పూతలపట్టు (యాదమరి): చిత్తూరు జిల్లా పూతలపట్టుకు చెందిన ప్రసాద్ గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించారు. ఈ ఏడాది జనవరిలో ఎల్‌ఐసీ ఆధ్వర్యంలో మ్యాడ్ డే సందర్భంగా 24 గంటల్లో 107 పాలసీలు చేయించడంతో ప్రసాద్ గిన్నిస్ వరల్డ్ రికార్డుకు ఎంపికయ్యాడు. ప్రసాద్‌కు ఎల్‌ఐసీ బ్రాంచ్ మేనేజర్ ప్రకాష్, డెవలప్‌మెంట్ అధికారి ధ్రువీకరణ పత్రాన్ని అందజేసి అభినందనలు తెలిపారు.

ఓయూ 53.. జేఎన్టీయూ 94..

▶ మొదటి పేజీ తరువాయి

పరిధిలో ప్రమాణాలను పరిగణనలోకి తీసుకుని ర్యాంకులు ఇచ్చింది.

ఉపాధి, పరిశోధనలతో ఓయూ ర్యాంకు మెరుగు

ఓవరాల్ ర్యాంకు (జాతీయ సంస్థలన్నీ కలిపి)ల్లో ఉస్మానియా యూనివర్సిటీ ఈ ఏడాది 53వ స్థానం సంపాదించింది. 2024లో 70వ ర్యాంకులో ఉంది. ఓయూలో 55 మంది గ్రాడ్యుయేషన్ పూర్తి చేస్తే వారిలో 35 మంది రూ.6.5 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు పొందారు. గత ఏడాదితో పోలిస్తే వేతనం పెరిగింది. 1,069 మంది పీజీ విద్యార్థులు రూ.8 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలు పొందారు. గత ఏడాది ఈ సంఖ్య 756 మాత్రమే. స్పాన్సర్డ్ రిసెర్చ్ కార్యక్రమాలు స్వల్పంగా పెరిగాయి. అయితే రెగ్యులర్ ఫ్యాకల్టీ తక్కువగా ఉండటం యూనివర్సిటీని ఇప్పటికీ వేధిస్తోంది. ఆశించిన మేర ర్యాంకు రాకపోవటానికి ఇదే కారణమని అధికారులు అంటున్నారు. ఓవరాల్ ర్యాంకుల్లో యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ గత ఏడాది 25వ స్థానంలో ఉండగా, ఈ ఏడాది 26వ స్థానానికి పడిపోయింది. యూనివర్సిటీల కేటగిరీ ర్యాంకుల్లో కూడా 17 నుంచి 18కి తగ్గింది.

తగ్గిన జేఎన్టీయూహెచ్

రాష్ట్రంలో సాంకేతిక విద్యకు గుండెకాయలా ఉన్న జేఎన్టీయూహెచ్ ర్యాంకు ఈసారి పడిపోయింది. అయితే వివిధ విభాగాల్లో పాయింట్లు మాత్రం తమ వర్సిటీకి తగ్గలేదని అధికారులు తెలిపారు. 2024లో జేఎన్టీయూహెచ్‌కు ఇంజనీరింగ్ విభాగంలో 88వ ర్యాంకు రాగా, ఈసారి 94కు పడిపోయింది. విద్యార్థుల సంఖ్య పెరిగినప్పటికీ ఉత్తీర్ణత, ఉపాధి అవకాశాలు, పరిశోధనల్లో వర్సిటీ వెనుకబడటంతో ర్యాంకు తగ్గింది. ఈ విభాగంలో ఎన్‌ఐటీ వరంగల్ కూడా 21వ స్థానం నుంచి 28వ స్థానానికి పడిపోయింది. మరోవైపు ఐఐటీ హైదరాబాద్ 8వ స్థానం నుంచి 7వ స్థానానికి చేరింది.

వివిధ విభాగాల్లో ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకులు..

ఓవరాల్ ర్యాంకులు విద్యా సంస్థ	ర్యాంకులు 2024	 2025
ఐఐటీ హైదరాబాద్	12	12
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్	25	26
ఉస్మానియా యూనివర్సిటీ	70	53
ఎన్‌ఐటీ వరంగల్	63	63
యూనివర్సిటీ విభాగంలో..		
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్	17	18
ఉస్మానియా యూనివర్సిటీ	43	30
ట్రిపుల్ ఐటీ హైదరాబాద్	74	55
ఇంజనీరింగ్ విద్యలో...		
ఐఐటీ హైదరాబాద్	8	7
ఎన్‌ఐటీ వరంగల్	21	28
ట్రిపుల్ ఐటీ హైదరాబాద్	47	38
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్	47	74
జేఎన్టీయూహెచ్	88	94
ఎస్‌ఆర్ యూనివర్సిటీ	98	91

ఫ్యాకల్టీ లేకపోవడమే కారణం

జేఎన్టీయూహెచ్ ర్యాంకు తగ్గినా పాయింట్లు మాత్రం పెరిగాయి. రెగ్యులర్ ఫ్యాకల్టీని పెంచాల్సిన అవసరం ఉందని ఈ ర్యాంకులు స్పష్టం చేస్తున్నాయి. పరిశోధనలు, వృత్తిపరమైన పురోగతికి అవసరమైన ఆర్థిక తోడ్పాటు కూడా అవసరం. ఈ అంశాన్ని ప్రభుత్వానికి నివేదిస్తాం. వచ్చేసారి మంచి ర్యాంకు పొందేందుకు కృషి చేస్తాం.

– ప్రొఫెసర్ టి. కిషన్‌కుమార్ రెడ్డి, వైస్ చాన్స్‌లర్, జేఎన్టీయూహెచ్.

సంతృప్తిగా ఉంది

ఓవరాల్ ర్యాంకుల్లో ఉస్మానియా యూనివర్సిటీకి మంచి ర్యాంకు రావడం సంతోషంగా ఉంది. పరిశోధన, బోధన సంస్కరణలపై పెడుతున్న శ్రద్ధ కారణంగానే ఈ ర్యాంకు సొంతం చేసుకుంది. యూనివర్సిటీలోని అందరి సమష్టి కృషి ఇది. భవిష్యత్‌లో మరింత ఉన్నతికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తాం.

– ప్రొఫెసర్ ఎం కుమార్, వైస్ చాన్స్‌లర్, ఉస్మానియా యూనివర్సిటీ.

ఎన్‌ఐఆర్‌ఎఫ్‌లో విజ్ఞాన్‌కు 70వ ర్యాంకు

చేబ్రోలు: ప్రస్తుత విద్యా సంవత్సరానికి గాను కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ (ఎంహెచ్‌ఆర్‌డీ) గురువారం విడుదల చేసిన ఉన్నత స్థాయి విద్యా సంస్థల ఎన్‌ఐఆర్‌ఎఫ్ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్) ర్యాంకుల్లో విజ్ఞాన్ యూనివర్సిటీకి జాతీయ స్థాయిలో 70వ ర్యాంకు లభించింది. ఈ సందర్భంగా గురువారం వీసీ పి.నాగభూషణ్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ విభాగంలోనూ 80వ ర్యాంకు సాధించినట్టు తెలిపారు. ఎన్‌ఐఆర్‌ఎఫ్‌లో ఉత్తమ ర్యాంకు సాధనకు కృషి చేసిన ఐక్యూఏసీ టీంను చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, సీఈవో మేఘన కూరపాటి, రిజిస్ట్రార్ పీఎంవీ రావులు అభినందించారు.





పేదల బియ్యం.. పురుగుల పాలు

రేషన్ దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ ప్రారంభానికి ముందు.. కార్డుదారులకు దొడ్డు బియ్యం పంపిణీ చేసేవారు. కాగా, పలు దుకాణాల్లో దొడ్డు బియ్యం నిల్వలు భారీగా పేరుకుపోయాయి. వాటి తరలింపుపై రాష్ట్ర పౌరసరఫరాలశాఖ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ఐదు నెలలుగా దుకాణాల్లోనే మగ్గుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు బియ్యానికి పురుగులు పట్టాయి. ఎలుకలు బుక్కేస్తున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే.. ఆ బియ్యం పూర్తిగా పాడై పోతాయని డీలర్లు చెబుతున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

కరెంటు వైర్లపై కార్మికులు..



పోల్ మీద వేలాడుతున్న కార్మికులు

నయీంనగర్: విద్యుత్ కార్మికుల ప్రాణాలు వైర్లపై వేలాడాయి. ప్రైవేట్ విద్యుత్ కాంట్రాక్టర్ రాజేంద్రప్రసాద్ వద్ద పనిచేస్తున్న పశ్చిమ బెంగాల్‌కు చెందిన కార్మికులు వలి, రఫీలు గురువారం వరంగల్ నగరంలోని 6వ డివిజన్ మర్కజీ స్కూల్ వద్ద కరెంట్ పోల్‌పై వైర్లు లాగుతుండగా కరెంట్ షాక్‌కు గురయ్యారు. దీంతో ఇద్దరు కార్మికులు స్తంభం మీద వైర్లలో ఇరుక్కుపోయారు. వెంటనే అక్కడ ఉన్నవారు స్పందించి జేసీబీ సాయంతో వారిని కిందకు దింపి ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. విద్యుత్ శాఖ నయీంనగర్ ఏఈ సీహెచ్ నవీన్‌ను ఈ ఘటనపై వివరణ కోరగా.. కార్మికులకు వైద్య చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. కాగా, విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు తోటి కార్మికులు చెబుతున్నారు.

నేర చరితుల్లో
నంబర్ వన్!

▶ మొదటి పేజీ తరువాయి

ఆస్తులు కలిగిన వారిలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రూ.15.38 లక్షలతో ఎనిమిదో స్థానంలో ఉండటం గమనార్హం.

కేంద్ర మంత్రుల్లో బండి సంజయ్ టాప్..

కేంద్ర మంత్రుల్లో తెలంగాణకు చెందిన బండి సంజయ్ కుమార్‌పై 42, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాపై 3, నితిన్ గడ్కరీపై 10, కింజారపు రామ్మోహన్ నాయుడుపై 4 క్రిమినల్ కేసులు ఉన్నాయి. హర్యానా, జమ్మూ-కాశ్మీర్, నాగాలాండ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలలో ఒక్క మంత్రిపైనా కేసు లేదు.

- తెలంగాణలో క్రిమినల్ కేసులకు సంబంధించి సీఎం అనుముల రేవంత్‌రెడ్డి (89), డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క (3), జూపల్లి కృష్ణారావు (3), కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి (6), దుద్దిళ్ల శ్రీధర్‌బాబు (5), గడ్డం వివేకానంద (5), కొండా సురేఖ (5), అడ్లూరి లక్ష్మణ్ కుమార్ (13), ఉత్తమ్ కుమార్ రెడ్డి (11), పొన్నం ప్రభాకర్ (7), సీతక్క (6) కేసులు ఉన్నాయి.

ఏపీలో 96 % మంత్రులు నేర చరితులే..

పేరు	ఎన్ని క్రిమినల్ కేసులు?
సీఎం నారా చంద్రబాబు నాయుడు	(19)
డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్	(8)
వాసంశెట్టి సుభాష్	(12)
కింజారపు అచ్చెన్నాయుడు	(13)
నారా లోకేష్	(17)
పి.నారాయణ	(8)
కొల్లు రవీంద్ర	(15)
మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి	(5)
ఎస్.సవిత	(10)
వంగలపూడి అనిత	(7)
కందుల దుర్గేష్	(7)
నిమ్మల రామానాయుడు	(20)
బీసీ జనార్ధన్ రెడ్డి	(9)
డి.బాలవీరాంజనేయస్వామి	(11)
గొట్టిపాటి రవికుమార్	(8)
కొలుసు పార్థసారథి	(5)
అనగాని సత్యప్రసాద్	(3)
జి.సంధ్యారాణి	(3)
ఎన్.మహ్మద్ ఫరూక్	(3)
ఆనం రాంనారాయణరెడ్డి	(1)
కొండపల్లి శ్రీనివాస్	(1)
పయ్యావుల కేశవ్	(1)

దేశంలో టాప్-10 సంపన్న అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు

1) చంద్రశేఖర్ పెమ్మసాని (టీడీపీ, గుంటూరు)	- రూ.5,705 కోట్లు
2) డీకే శివకుమార్ (కాంగ్రెస్, కర్ణాటక)	- రూ.1,413 కోట్లు
3) చంద్రబాబు నాయుడు (టీడీపీ, ఏపీ)	- రూ.931 కోట్లు
4) పొంగూరు నారాయణ (టీడీపీ, ఏపీ)	- రూ.824 కోట్లు
5) సురేశ్ బీఎస్ (కాంగ్రెస్, కర్ణాటక)	- రూ.648 కోట్లు
6) గడ్డం వివేకానంద్ (కాంగ్రెస్, తెలంగాణ)	- రూ.606 కోట్లు
7) నారా లోకేష్ (టీడీపీ, ఏపీ)	- రూ.542 కోట్లు
8) మంగళ ప్రభాత్ లోధా (బీజేపీ, మహారాష్ట్ర)	- రూ.447 కోట్లు
9) పొంగులేటి శ్రీనివాసరెడ్డి (కాంగ్రెస్, తెలంగాణ)	- రూ.433 కోట్లు
10) జ్యోతిరాదిత్య సింధియా (బీజేపీ, గుణా)	- రూ.424 కోట్లు

అడ్డదారిలో అదనపు బాధ్యతలు!

- గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ విభాగంలో ఇష్టారాజ్యం
- నిబంధనలకు విరుద్ధంగా పలువురు జూనియర్లకు పెద్ద పోస్టుల్లో ఎఫ్‌ఏసీ
- సీనియారిటీ, ఆర్వోఆర్‌ను పట్టించుకోకుండానే పూర్తిస్థాయి బాధ్యతలు
- సచివాలయంలోని కార్యదర్శి పేషీలో చక్రం తిప్పిన ఇద్దరు అధికారులు?
- చివరి నిమిషంలో ఉత్తర్వులిచ్చిన గత కార్యదర్శి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ప్రత్యేకంగా కొనసాగుతున్న ఇంజనీరింగ్ విభాగంలో ఉన్నతస్థాయి పోస్టుల్లో అదనపు బాధ్యతల అప్పగింత వివాదాస్పదమవుతోంది. ఈ విభాగానికి హెచ్‌ఓడీగా ఉన్న చీఫ్ ఇంజనీర్ జూన్ 30న పదవీ విరమణ పొందడంతో సీఈ పోస్టు ఖాళీ అయ్యింది. ఈ పోస్టుకోసం ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ (డీఈఈ) స్థాయిలోని పలువురు అధికారులు తీవ్ర స్థాయిలో పోటీ పడ్డారు. దాదాపు రెండు నెలల పాటు ముమ్మరంగా ప్రయత్నించగా.. ఏటూరునాగారం సబ్ డివిజన్‌లో డీఈగా పనిచేస్తున్న ఎం.బాలును చీఫ్ ఇంజనీర్‌గా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు ఇస్తూ ఆగస్టు 30న అప్పటి గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి వీఎస్ అలుగు వర్షిణి ఉత్తర్వులు జారీ చేశారు. కేంద్ర సర్వీసులకు వెళ్లిన ఆమె.. ఇక్కడినుంచి రిలీవ్ అవుతున్న రోజున ఈ ఉత్తర్వులు జారీ చేయడంపై ఆ శాఖలో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఉత్తర్వులు వెలువడడంలో కార్యదర్శి పేషీలోని ఇద్దరు అధికారులు చక్రం తిప్పారంటూ ఇప్పుడు ఆ శాఖలో తీవ్రస్థాయిలో చర్చ జరుగుతోంది.

సీనియారిటీ, ఆర్వోఆర్ మెరిట్‌కు మంగళం...

సాధారణంగా ఒక ప్రభుత్వ శాఖలో హెచ్‌ఓడీ లేదా ఆ తర్వాతి స్థాయి పోస్టులో పదోన్నతి లేదా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు ఇచ్చే క్రమంలో సీనియారిటీకి తొలి ప్రాధాన్యం దక్కుతుంది. సీనియారిటీ జాబితా ఆధారంగా తొలివరుసలో ఉన్న వారికి బాధ్యతలు అప్పగిస్తారు. ఈ జాబితా రూపకల్పనలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ కమ్ మెరిట్‌ను పరిగణనలోకి తీసుకుంటారు. కానీ ఈ శాఖలో చీఫ్ ఇంజనీర్, సూపరింటెండెంట్ ఇంజనీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోస్టులకు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు (ఎఫ్‌ఏసీ) ఇవ్వడంలో ఈ నిబంధనలు పాటించలేదని విమర్శలు ఉన్నాయి. ఏకపక్షంగా ఎఫ్‌ఏసీ ఇచ్చారని కొందరు ఇంజనీర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వకుండా, సీనియారిటీ జాబితాను పరిగణించకుండా ఏకపక్షంగా రూపొందించిన ఫైలుకు గత కార్యదర్శి ఆమోదం తెలపడం ఇప్పుడు ఆ విభాగంలో దుమారం రేపుతోంది. ఈ నిర్ణయంతో రిజర్వేషన్ల ఫలాలు అందకుండా.. కేవలం ఎక్కువ మార్కులు వచ్చిన వారికి ఎఫ్‌ఏసీ బాధ్యతలు ఇవ్వడం వెనుక మతలబుందని అధికారులు, ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

పేషీలోని ఇద్దరు అధికారుల వల్లే?

గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ విభాగంలో ఏడుగురు ఇంజనీర్లకు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు కట్టబెడుతూ ఆగస్టు 30న జీవో 242 జారీ అయ్యింది. ఇంజనీరింగ్ విభాగాధిపతిగా, చీఫ్ ఇంజనీర్‌గా ఏటూరునాగారంలో డీఈఈగా పనిచేస్తున్న ఎం.బాలుకు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు. అదేవిధంగా డీఈఈ కేడర్‌లో ఉన్న ఆర్‌డీ ఫణికుమారికి సీఈ కార్యాలయంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ (ప్లానింగ్ అండ్ మానిటరింగ్)గా, ఎ.హేమలతను సీఈ కార్యాలయంలో ఈఈ(పీఎం)గా, జె.తానాజీని ఉట్నూరు ప్రాజెక్టులో ఈఈగా, సీహెచ్ సత్యనారాయణను భద్రాచలం ప్రాజెక్టులో ఈఈగా, కె.రామకృష్ణను ఏటూరునాగారం ప్రాజెక్టులో ఈఈగా నియమించారు. ప్రస్తుతం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) కేడర్‌లో ఉన్న కె.జగజ్యోతికి గిరిజన గురుకుల సొసైటీలో పోస్టింగ్ ఇచ్చారు. వాస్తవానికి సీనియారిటీ జాబితాలో ముందువరుసలో ఉన్న ఆమెకు అప్రాధాన్య పోస్టు ఇవ్వడంపై ఆమె ఇప్పటికే సంక్షేమ మంత్రి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. తనకు జరిగిన అన్యాయంపై న్యాయపోరాటానికి సిద్ధమవుతున్నారు. ఎఫ్‌ఏసీ బాధ్యతల ఉత్తర్వుల జారీలో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి కార్యాలయంలోని ఇద్దరు అధికారులు కీలక పాత్ర పోషించారని, కార్యదర్శి బాధ్యతల నుంచి రిలీవ్ అవుతున్న చివరి నిమిషంలో ఫైలును సర్క్యులేట్ చేశారని ప్రచారం జరుగుతోంది. కాగా, ఈ వ్యవహారంలో ఇంజనీర్లు, అధికారుల మధ్య లావాదేవీలు జరిగాయని విమర్శలు వస్తున్నాయి.

మార్కెటింగ్ శాఖలో
అడ్డగోలు నియామకాలు!

ఓ ఉన్నతాధికారి ప్రమేయంపై ఉద్యోగుల్లో చర్చ

సాక్షి, హైదరాబాద్: మార్కెటింగ్ శాఖలో చట్టాలకు విరుద్ధంగా.. సస్పెండ్ అయిన అధికారుల క్రమబద్ధీకరణ జరుగుతోందన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ప్రభుత్వ నియమ, నిబంధనలు ఏవీ పట్టనట్లుగా అడ్డగోలు వ్యవహారాలు కొనసాగుతున్నట్లు సమాచారం. ఇటీవల సస్పెండ్ అయిన అధికారులను, సిబ్బందిని తిరిగి విధుల్లోకి తీసుకునే వ్యవహారంలో అక్రమాలు చోటుచేసుకున్నట్లు ఆ శాఖలో చర్చ జరుగుతోంది. మార్కెటింగ్ శాఖలో కొత్తగా డైరెక్టర్‌గా నియమితులైన అధికారి ఈ అక్రమ నియామకాలపై దృష్టి కేంద్రీకరించినట్లు తెలిసింది. హైదరాబాద్‌లో కీలకమైన గడ్డిఅన్నారం మార్కెట్ స్పెషల్ గ్రేడ్ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సూపర్ వైజర్‌ను మార్కెట్ నియమ నిబంధనలను అతిక్రమించి, అక్రమంగా లైసెన్స్‌లు జారీ చేశారన్న అభియోగంపై విధుల నుంచి తొలగించారు. అయితే మార్కెటింగ్ శాఖ కార్యదర్శి ఆదేశాలతో వారిద్దరినీ ఉన్నతాధికారులు తిరిగి విధుల్లోకి చేర్చుకోవడంపై తీవ్రస్థాయిలో ఆరోపణలు వస్తున్నాయి. వారిని విధులనుంచి తప్పించడం, తిరిగి తీసుకోవడంపై ఎలాంటి విచారణ జరగలేదని, కేవలం ఉన్నతస్థాయిలో తీసుకున్న నిర్ణయం తప్ప.. ప్రభుత్వ నిబంధనలను పాటించలేదని ఉద్యోగులు వాపోతున్నారు. ఇలాంటి సంఘటనలు మార్కెటింగ్ శాఖలో తరచూ జరుగుతున్నాయన్న ప్రచారం కూడా జరుగుతోంది.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం ॥ 5-9-2025

మాస్టారు లెక్కలు చెబితే మనసుకి బాగా ఎక్కింది... అభిమానం అనే లెక్క పెరిగింది. ఆ లెక్క చదువుకే పరిమితం కాలేదు. కెరీర్ లెక్కలు చూసేవరకూ తెచ్చింది. ఓ లెక్కల మాస్టారు ఓ కుర్రాడి జీవితాన్ని అంతగా ప్రభావితం చేశారు. సినిమా ఇండస్ట్రీలో రికార్డు స్థాయి వసూళ్ల లెక్కలు చూస్తున్న డైరెక్టర్ సుకుమార్ తన శిష్యుడు బుచ్చిబాబు సానాకి కాలేజీలో లెక్కల పాఠాలు చెప్పి, డైరెక్టర్‌ని చేసి, కెరీర్ వసూళ్ల లెక్కలు చూసుకునేవరకూ అండగా ఉన్నారు. 'ఎప్పటికీ ఉంటారు' అని శిష్యుడు అంటున్నారు. టీచర్స్ డే సందర్భంగా 'ఉప్పెన' ఫేమ్ డైరెక్టర్ బుచ్చిబాబు సానా తన గురువు సుకుమార్ గురించి 'సాక్షి'కి ఇచ్చిన ఎక్స్‌క్లూజివ్ ఇంటర్వ్యూ...


సుకుమార్ బుచ్చిబాబు

కెరీర్ లెక్కల్లోనైనా మా సారు... తగ్గేదే లే!

● ముందుగా ఇంటర్మీడియట్ చదువుకున్నప్పుడు మీ గురువుకి సంబంధించిన జ్ఞాపకాలను షేర్ చేసుకుంటారా?

బుచ్చిబాబు: ఆ రోజుల్లో సుకుమార్ సార్ నాలా బక్క పలచగా ఉండేవారు. తెల్లగా షార్ప్ మీసాలతో హ్యాండ్స్ వరకూ బటన్స్ పెట్టి, ఫుల్ హ్యాండ్స్ చొక్కాలో నీట్‌గా వచ్చేవారు. ఆయన చిరంజీవిగారి ఫ్యాన్ అని తెలిశాక మా సీనియర్స్ అందరూ ఓ 40, 50 మంది సుకుమార్ సార్ వస్తుంటే 'మాస్టర్' సినిమాలో 'హే జు హే జు' అని బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కొట్టేవారు. ఆయన మురిసిపోయేవారు. సుకుమార్ సార్ చిరంజీవిగారి ఫ్యాన్ అయితే మేము సుకుమార్ సార్ ఫ్యాన్స్.

● మీరు లెక్కల మాస్టారుకే కనెక్ట్ అవ్వడానికి కారణం?

స్టూడెంట్స్ లెక్కలకు కనెక్ట్ అవ్వడం రేర్. అలాంటిది లెక్కల మాస్టార్‌కి ఎందుకు కనెక్ట్ అవుతాం? అయినా ఆయనకి కనెక్ట్ అయ్యాం. ఎందుకంటే లెక్కలు కూడా సార్ అందంగా చెప్పేవారు. తెలుగు పాఠంలా విడదీసి అర్థమయ్యేలా చెప్పేవారు. సూత్రాల్ని కూడా సులువుగా చెప్పడం మా మాస్టార్ ప్రత్యేకత. అప్పుడు లెక్కలు చెప్పడంలో తగ్గలే. ఇప్పుడు కెరీర్ లెక్కల్లోనూ మా సారు తగ్గేదే లే!

● చదువుకునే రోజుల్లో మీ గురువుకి ఏదైనా బహుమతి ఇచ్చారా?

నేను ఇవ్వలేదు గానీ, ఆయనే మాకు సినిమాలకి వెళ్ళమని డబ్బులిచ్చేవారు. కానీ 'నా క్లాస్ వినేసి వెళ్ళండి' అని కండీషన్ పెట్టేవారు.

● ఓ శిష్యుడిగా మీ గురువుకి బహుమతి ఇవాల్సి వస్తే ఏం ఇస్తారు?

మా బంధం లైఫ్ లాంగ్ ఉండాలనుకుంటున్నాను. అందుకే లైఫ్ లాంగ్ నేను చేసే ప్రతీ సినిమాకి 'సుకుమార్ రైటింగ్స్ బేనర్' ఉంటుంది. ఓ శిష్యుడిగా నేను ఆయనకిచ్చే గిఫ్ట్ ఇదే అనుకుంటున్నాను.

● మీ కెరీర్ మొదలయ్యాక మీ గురువు మీకు ఇచ్చిన బహుమతులేమైనా?

'ఉప్పెన' సినిమా అయ్యాక ఆయన ఒక లెటర్ రాశారు. నేను పొద్దున నిద్ర లేచి చూస్తే సుకుమార్ సార్ లెటర్ రాశారు అని సోషల్ మీడియాలో సర్క్యులేట్ అవుతోంది. ఫేక్ అనుకుని నమ్మలేదు. అయితే సుకుమార్ సార్ పక్కన ఉన్నవాళ్ళు చెప్తే నమ్మాను. ఆ లెటర్ నా గురువుగారు నా లైఫ్‌లో నాకు ఇచ్చిన మర్చిపోలేని బహుమతి.

● క్లాస్ రూమ్‌లో మీ మాస్టారు ఎలా ఉండేవారు?

బ్లాక్ బోర్డ్ మీద ఒక లెక్క రాసి, అది మాకు ఎక్స్‌ప్లెయిన్ చేశాక 'ఎనీ డౌట్స్' అని చిటికేసి గట్టిగా అరిచి, అడిగేవారు. అలా ఆ మాటతో పక్కకి పోయిన మా బ్రెయిన్స్‌ని కూడా లోపలికి తీసుకొచ్చేసేవారు (నవ్వుతూ).

● గురువుని మించిన శిష్యుడు అనిపించుకోవాలనుకుంటున్నారా?

గురువుని మించిన కాదు గానీ గురువు మెచ్చిన శిష్యుడు అవ్వాలనే కోరిక మాత్రం ఎప్పుడూ ఉంటుంది.

● లైఫ్‌లో కీలక మెట్లు అయిన చదువు, ఆ తర్వాత కెరీర్... ఈ రెండింటిలోనూ సుకుమార్‌గారితో మీకు కనెక్షన్ ఉంది. మీ ఇద్దరికీ అంత సింక్ కుదరడానికి కారణం?

నేను ఇంటర్మీడియట్ అంటే... నా నూనూగు మీసాల వయసు నుండీ ఆయన తెలుసు నాకు. యవ్వనంలో ప్రతి ఒక్కరికీ ఒక రోల్ మోడల్ ఉంటారు కదా. నా రోల్ మోడల్ సుకుమార్ సారే. నాకు టెన్త్ వరకూ రోల్ మోడల్ ఎవరూ లేరు. ఇంటర్మీడియట్‌కి వెళ్ళిన దగ్గర నుండీ 'సుకుమార్ సార్ నా రోల్ మోడల్' అని చెప్పడం మొదలెట్టాను. నేను ఆయన్ని అంత ఇన్‌స్పిరేషన్‌గా తీసుకున్నాను. మా ఫ్రెండ్స్ 'ఒరేయ్ సుకుమార్‌లా మాట్లాడుతున్నావ్.. ఆలోచిస్తున్నావ్' అంటారు. నా లోపలకి ఆయన్ని అంత గట్టిగా తీసేసుకున్నాను.

● ఓ గురువుగా కెరీర్ గురించి మీకు ఆయన ఎలాంటి సలహాలు ఇస్తుంటారు?

ఈ కెరీరే ఆయన సలహా. ఆయన పరిచయం కాకపోతే, నా క్లాస్‌కి ఆయన లెక్కలు మాస్టారు కాకపోయి ఉంటే నేను సినిమా వైపు వచ్చి ఉండేవాణ్ణే కాదు.

● సుకుమార్‌గారు కాకుండా మీరు అభిమానించే గురువులు ఎవరైనా ఉన్నారా?

గరికిపాటి నరసింహారావుగారు కూడా నా గురువుగారే. కాకినాడ చైతన్య కాలేజ్‌లో బీఎస్సీ కంప్యూటర్స్ చదువుకునేటప్పుడు సంస్కృతం చెప్పేవారు. ఆయన పాఠాలు చెప్పే విధానం చమత్కారంగా ఉండేది. ఒకసారి రాజు అని నా స్నేహితుడు క్లాస్‌కి లేట్‌గా వచ్చి, 'మే ఐ కమ్ ఇన్ సార్' అన్నాడు. గరికిపాటిగారు 'తమరి నామధేయం ఏంటో' అని అడిగారు. వాడు రాజా అనగానే 'ఏ రాజ్యానికో' అని వెంటనే సెటైర్ వేశారు. వాడు క్లాస్ వింటూ నెత్తి మీద టోపీ తీయలేదు. 'రాజువారు తమరి కిరీటం తియ్యాలి' అన్నారు. ఆయన అంత చమత్కారంగా ఉండేవారు. పాఠాలను కూడా ప్రవచనాల్లా చెప్పేవారు. ఆయన చెప్పిన సంస్కృతంలోనే నాకు ఎక్కువ మార్కులు వచ్చాయి. ఇలాంటి గురువులు దొరకడం నా అదృష్టం. సినిమాలో ఒకరు, సాహిత్యంలో ఒకరు... నన్ను అమితంగా ప్రభావితం చేసిన ఇద్దరూ గొప్ప వ్యక్తులు.

● సుకుమార్‌గారు మిమ్మల్ని ఎలా పిలుస్తారు?

నన్ను ఒరేయ్ అనే పిలుస్తారు... అంత క్లోజ్ అయితే తప్ప ఒరేయ్ అని పిలవరు ఎవర్నీ. నాకు ఒరేయ్ అని పిలిపించుకోవడం అమితమైన ఆనందాన్నిస్తుంది.

● సుకుమార్ గారు, మీ మధ్య ఏమైనా చిన్ని చిన్ని మనస్పర్థలు వచ్చినప్పుడు ఎవరు ముందుగా మాట్లాడేవాళ్లు?

'మనం తప్పు చేశాం... ఆయన తిట్టారు. ఫోన్ చేసి మాట్లాడదాం' అని ఫోన్ తీసేలోపే ఆయన మెసేజ్ ఉండేది. 'సారీ రా ఏమనుకోకు, ఏదో మాటనేశా' అని అంటారు. మా గురువుగారు ఎదుటోడు ఎంత పెద్ద తప్పు చేసినా 'క్షమించడం'లో ముందుంటారు.

● మీ జీవితంలో మీ గురువుగారి పాత్ర అంటే... ఏం చెబుతారు?

వ్యక్తిగా బుచ్చిబాబు సానాకి అయితే ఏం సంబంధం లేదు గానీ డైరెక్టర్ బుచ్చిబాబు సానా అయితే మాత్రం మొత్తం మా గురువుగారి పాత్రే.

- డి.జి. భవాని

శాస్త్రీయ సాంకేతిక అవగాహనకు...


మారం పవిత్ర

తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ జిల్లా పరిషత్తు స్కూల్లో బయాలజీ టీచర్‌గా పని చేస్తున్న మారం పవిత్ర 2025 సంవత్సరానికి గాను జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. దేశవ్యాప్తంగా 44 మందిని ఎంపిక చేయగా, తెలంగాణ రాష్ట్రం నుంచి ఎంపికైన ఏకైక ఉపాధ్యాయురాలు పవిత్ర. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా ఆమె అవార్డును అందుకోబోతున్నారు. ఆట పాటలను మిళితం చేస్తూ బోధించే విధానానికి శ్రీకారం చుట్టారు పవిత్ర. పాఠ్యాంశాలకు అనుగుణంగా గేమ్స్ రూపొందించి విద్యార్థులకు బాగా అర్థం అయ్యేలా చేస్తున్నారు.

ఆడుతూ హాయిగా నేర్చుకునేలా...

బయాలజీ కాన్సెప్ట్స్‌ను తీసుకొని ఫైండ్ ద వర్డ్ సర్చ్, క్రాస్ వర్డ్ పజిల్స్ తదితర గేమ్స్ రూపొందించారు. పాఠం చెప్పిన తరువాత ఈ గేమ్స్ ఆడిస్తే విద్యార్థులకు కాన్సెప్ట్‌ను మరోసారి రిపీట్ చేసినట్లు అవుతుంది. ప్రతి దశను తెలుసుకుంటారు. ఆడుతూ నేర్చుకుంటారు కాబట్టి మరచిపోకుండా ఉంటారు.


విద్యా వారధి

అమెరికా వంటి దేశాల్లో విద్యా విధానం ఎలా ఉందో విద్యార్థులకు అర్థమయ్యేలా చేసేందుకు 'విద్యా వారధి' కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారు. 'విద్యా వారధి'లో స్కూల్ పిల్లలు అమెరికాలోని విద్యార్థులతో ప్రతి ఆదివారం సాయంత్రం 7 గంటలకు జూమ్ ద్వారా ఇంటరాక్ట్ అవుతారు. అమెరికాలో విద్య, బోధన విధానం, పదో తరగతి, ఇంటర్మీడియట్ తరువాత ఎలాంటి ప్రవేశ పరీక్షలు ఉంటాయి...మొదలైన విషయాలను అక్కడి విద్యార్థులతో మాట్లాడి తెలుసుకుంటారు.

వ్యక్తిత్వ వికాస డైరీ

విద్యార్థులు తమ డైరీలో సబ్జెక్ట్‌కు సంబంధించిన అసైన్‌మెంట్స్ రాసుకుంటారు. కానీ ఈ స్కూల్ పిల్లల డైరీ ప్రత్యేకం. ఉదయం నుంచి రాత్రి పడుకునే వరకు తమ దినచర్య రాయాలి. తప్పు చేసినా, మంచి పని చేసినా రాయాలి. వారం రోజుల తరువాత డైరీలో రాసుకున్న విషయాలను విద్యార్థులే చదువుకునేలా చేస్తారు. వారం రోజుల్లో చేసిన మంచి పనులు, తప్పులు ఏమిటి? ఎలా ఉండాలనేది విద్యార్థులు స్వయంగా తెలుసుకుంటారు. తద్వారా వారిలో క్రమంగా సత్ప్రవర్తన పెంపొందుతుంది.

- చింతకింది గణేశ్,
సాక్షి ప్రతినిధి, నల్లగొండ



కొత్తగా ఆలోచిస్తే అద్భుతాలు జరుగుతాయి. విద్యాబోధన కూడా అంతే. విద్యా విధానం, బోధనలో కొత్తదనం తీసుకువస్తే అద్భుత ఫలితాలు వస్తాయి అని ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది విద్యావేత్తలు నిరూపించారు. మన ఉపాధ్యాయులు కూడా వారి బాటలో నడుస్తూ సరికొత్త ఆలోచనలు, ఆవిష్కరణలతో విద్యాబోధనలో కొత్త వెలుగు తీసుకుస్తున్నారు. సొంత డబ్బులతో పాఠశాలను తీర్చిదిద్దుతున్నారు. ప్రతికూల పరిస్థితులు ఎదురైనా పట్టుదలతో ముందుకు సాగి విద్యార్థుల్లో స్ఫూర్తి నింపుతున్నారు...

'స్టార్' టీచర్

కలల బడి


శిరీష

'చదువు అనేది అజ్ఞానాన్ని పారదోలే అస్త్రం' అన్న సావిత్రి బాయి పూలే మాట శిరీషకు ఎంతో స్ఫూర్తి నిచ్చింది. ఆమె చూపిన బాటలో పయనిస్తున్న శిరీష విద్యా బోధనకే పరిమితం కాలేదు. సర్కారు బడిలో చేరడానికి పిల్లలు ఆసక్తి చూపేలా బడి రూపు రేఖలు మార్చడంలో కృషి చేస్తోంది అంబారీపేట గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న శిరీష...

గత ఏడాది జూలైలో తెలంగాణ రాష్ట్రంలోని కామారెడ్డి జిల్లా దోమకొండ మండలం అంబారీపేట ప్రాథమిక పాఠశాలకు బదిలీపై వచ్చింది శిరీష. ఆ బడిలో ఒకటే గది ఉంది. అది కూడా అధ్వాన స్థితిలో ఉంది. ముందు బడి రూపు రేఖలు మార్చాలని నిర్ణయించుకున్న శిరీష సొంత డబ్బులు రూ.10 వేలు ఖర్చు చేసి గదిలో రంగులు వేయించి రకరకాల బొమ్మలు గీయించింది. ఒకటే గదిలో ఇద్దరు టీచర్లు బోధించడం ఇబ్బందికరంగా ఉండడంతో, పైన అసంపూర్తిగా ఉన్న భవనాన్ని పూర్తి చేయించాలని చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఒకరోజు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంజన్ ప్రసాద్‌తో చర్చించింది.

బడి ఎంతగా మారిపోయింది!

విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడితే వారంతా తాము పేదోళ్లమని, ఎంతో కొంత సాయం చేస్తామని మాట ఇచ్చారు. వెంటనే నిర్మాణం మొదలుపెట్టాలని నిర్ణయించుకుని మేస్త్రీలను పిలిపించి మాట్లాడింది. పనులు మొదలయ్యాయి. ప్రధానోపాధ్యాయుడు అంజన్ ప్రసాద్ రూ.పది వేలు ఇవ్వగా, పేరెంట్స్ తలా కొంత జమ చేసిన వాటితో కలిపి రూ 81 వేలు సమకూరాయి. భవనం పూర్తి కావాలంటే పెద్ద మొత్తం అవసరం అవుతుంది. అయినా సరే, శిరీష వెనక్కు తగ్గలేదు. సొంత డబ్బులు ఇస్తూ పోయింది. మొత్తంగా రూ.2.55 లక్షలు ఖర్చయ్యాయి. ఇదే పనిని కాంట్రాక్టర్‌కు ఇస్తే నాలుగింతలు అయ్యేది. అందరూ ఇచ్చిన డబ్బు పోగా తాను రూ.లక్షా74 వేలు సొంతంగా ఖర్చు చేసింది. పై అంతస్తులో అసంపూర్తిగా ఉన్న గదికి గోడలు నిర్మించడంతో పాటు కిటికీలు బిగించి, మెట్లకు సైడ్ వాల్స్, ఎలివేషన్ పనులు చేయించింది. రంగులు వేయించింది. ఇప్పుడు బడి రూపమే మారిపోయింది. గదుల కొరత సమస్య తీరింది. విద్యాబోధనను ఆసక్తికరంగా మలిచే క్రమంలో పిల్లలతో అనేక కార్యక్రమాలు చేయిస్తూ 130 వీడియోలు రికార్డు చేసి వాటిని యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసింది శిరీష.

- ఎస్.వేణుగోపాలాచారి,
సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

ముందు చూపుతో...


గంగాధర నవ్య

తనకున్న దృష్టి లోపాన్ని అధిగమించి టీచర్ ఉద్యోగం సాధించింది గంగాధర నవ్య. నల్లగొండ జిల్లా నకిరేకల్‌కు చెందిన నవ్య మునుగోడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయినిగా పనిచేస్తోంది. చిన్నప్పటి నుంచే ఆమెకు దృష్టి లోపం ఉండేది. ఇంటర్మీడియట్‌కు వచ్చేసరికి దాదాపు 70 శాతం చూపును కోల్పోయినా పట్టుదలతో చదువుకుంది. డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎడ్) పూర్తి చేసి, టెట్‌లో అర్హత సాధించి, టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్టు(టీఆర్‌టీ)లో ప్రతిభ కనబరిచి ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం సాధించింది. ఒకవైపు స్కూల్లో విద్యార్థులకు చదువు చెబుతూనే మరోవైపు నిత్య విద్యార్థిగా మారింది. డిగ్రీ పూర్తి చేయడంతో పాటు ఇన్ సర్వీసులో బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఎడ్) చదువుతోంది. టీచర్‌గా విధుల్లో చేరిన నవ్య పాఠాలు బోధించే క్రమంలో మొదట్లో ఇబ్బంది పడాల్సి వచ్చింది. తన లోపం పిల్లలకు సమస్య కాకూడదని ఒక వాలంటీర్‌ను సహాయకురాలిగా నియమించుకుంది.

మ్యాథ్స్ అంటే భయాన్ని పోగొట్టారు



నా అభిమాన టీచర్ మా అమ్మే. ఆమె ప్రొఫెసర్‌గా పనిచేశారు. అమ్మ నాకు బడి పాఠాలే కాదు బతుకు పాఠాలు కూడా చెప్పారు. 'మ్యాథ్స్' అనే మాట వినబడగానే పరుగెత్తాలనిపించేది. అలాంటి నన్ను మ్యాథ్స్ అంటే చాలా ఇష్టం అయ్యేలా చేశారు అమ్మ.

- కృతి సనన్

భావ వ్యక్తీకరణకు బాట వేశారు



నాకు ఇష్టమైన టీచర్ నమిత శ్రీవాత్సవ. కేవలం పాఠాలు చెప్పడానికే ఆమె పరిమితం కాలేదు. బాధ్యతల గురించి ఎన్నో విలువైన విషయాలు చెప్పేవారు. స్కూలు రోజుల్లో 'నేను నా ప్రపంచం' అన్నట్లుగా ఉండేదాన్ని. అలాంటి నన్ను షెల్ నుంచి బయటికి తీసుకువచ్చి నలుగురిలో కలిసేలా చేశారు. నాలో భావవ్యక్తీకరణ నైపుణ్యాలకు బాట వేశారు. రచనలు చేయడానికి ప్రోత్సహించారు.

- దియా మీర్జా

టీచర్, గైడ్, ఫ్రెండ్



మా హిస్టరీ టీచర్ అపిత నాయక్ అంటే నాకు ఇష్టం. ఆమె నాకు టీచర్ మాత్రమే కాదు ఫ్రెండ్, గైడ్ కూడా. నాకు ఎప్పుడు ఏ సమస్య వచ్చినా ఎలాంటి భయం, సంకోచం లేకుండా ఆమె దగ్గరకు వెళ్లేదాన్ని. వ్యక్తిత్వ వికాస కోణంలో ఆమె ఎన్నో విషయాలు చెప్పేవారు.

- ఆలియా భట్

యువాహారం

ఈ రోజుల్లో గ్రామీణ, పట్టణ ప్రాంతం అనే తేడా లేకుండా యువత ముఖ్యంగా అమ్మాయిలు వివిధ రకాల ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. వాటిలో ప్రధానంగా చెప్పుకోదగినది ఐరన్ లోపం. రుతుక్రమం కారణంగా రక్త నష్టం, సరైన ఆహారం తీసుకోకపోవడం వల్ల హిమోగ్లోబిన్ స్థాయి తగ్గిపోతుంది. ఫలితంగా బలహీనత, తలనొప్పి, చదువుపై దృష్టి కేంద్రీకరించ లేకపోవడం జరుగుతున్నాయి. కాల్షియం లోపం వల్ల ఎముకలు, దంతాల బలం తగ్గిపోతుంది. దీని కారణంగా భవిష్యత్తులో ఆస్టియోపోరోసిస్ వచ్చే ప్రమాదం ఉంటుంది. ప్రోటీన్ లోపం వల్ల కండరాల అభివృద్ధి సరిగా జరగదు. శరీరంలో శక్తి తగ్గి, బలహీనమైపోతుంది. విటమిన్ -ఎ, ఇ లోపం వల్ల కంటి సమస్యలు, రోగనిరోధక శక్తి తగ్గడం వంటివి జరుగుతాయి. తరచుగా జలుబు, ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఎక్కువ. హార్మోన్ల అసమతుల్యత, సరైన పోషకాలు అందక పీసీఓడీ, థైరాయిడ్ సమస్యలు రావచ్చు. పోషకాల లోపం వల్ల మెదడు పనితీరుపై ప్రభావం పడుతుంది. టెన్షన్, ఆందోళన, డిప్రెషన్ వచ్చే ప్రమాదం ఎక్కువ. చదువులు, ఉద్యోగం, దినసరి చర్యలలో ఇబ్బందులు కలుగుతాయి. అందుకని, యువత రోజువారీ ఆహారంలో ఐరన్, కాల్షియం, ప్రోటీన్లు, విటమిన్లు, పాలు - పండ్లు తప్పనిసరిగా చేర్చుకోవాలి.

జాతీయ పోషకాహార వారోత్సవాలు సెప్టెంబరు 1 - 7

యువత కోసం రోజువారీ ఆహార ప్రణాళిక (18–25 ఏళ్లు)



పోషక అవసరాలు

కేలరీలు
యువకులు: 2400–3000 కిలోకేలరీలు/రోజు
యువతులు:1800–2400 కిలోకేలరీలు/రోజు

ప్రోటీన్
యువకులు: 56 గ్రాములు/రోజు
యువతులు: 46 గ్రాములు/రోజు

కూరగాయలు: రోజూ 4–5 సర్వింగ్స్

ఫ్యాట్స్
యువకులు – యువతులు:
రోజువారీ బరువు ప్రకారం 20–25%
అన్ని రకాల గిజ ధాన్యాలలో ఏవైనా..
రోజుకు 6–7 సర్వింగ్స్
(1/2–1 కప్పు ఉడికించిన బియ్యం లేదా గోధుమ)

కార్బోహైడ్రేట్లు
యువకులు – యువతులు:
రోజువారీ బరువు ప్రకారం 45–65%

పాలు - పాల ఉత్పత్తులు
రోజుకు 1–2 సర్వింగ్స్
(పెరుగు లేదా టోన్డ్ మిల్క్ రూపంలో)

విటమిన్ - ఎ
యువకులు: 1900 మి.గ్రా/రోజు
యువతులు: 700 మి.గ్రా/రోజు

విటమిన్ - ఇ
యువకులు: 90 మి.గ్రా/రోజు
యువతులు: 75 మి.గ్రా/రోజు

కాల్షియం: 1000 మి.గ్రా/రోజు

ఐరన్
యువకులు: 10 మి.గ్రా/రోజు
యువతులు: 18 మి.గ్రా/రోజు

ఆరోగ్యకరమైన కొవ్వులు (Healthy fats):
నట్స్, గింజలు – 1 టీ స్పూన్

ప్రోటీన్ ఫుడ్స్
చికెన్/మాంసం/చేప/గుడ్డు – 1 సర్వింగ్
పప్పులు, బఠానీలు – 1/4 కప్పు


– డా. సుజాతా స్టీఫెన్,
న్యూట్రిషనిస్ట్

బులియన్

(బంగారం 10 గ్రా.: వెండి కిలో)
సెప్టెంబర్ 4న ముగింపు రూ.లలో

నగరం	బంగారం (24 క్యారెట్లు)	బంగారం (22 క్యారెట్లు)	వెండి
హైదరాబాద్	1,09,400	1,02,560	1,27,000
విజయవాడ	1,08,920	97,950	1,26,400
విశాఖపట్నం	1,06,860	97,950	1,37,000
రాజమండ్రి	1,08,920	1,00,890	1,26,400
ప్రొద్దుటూరు	1,08,100	99.450	1,26,500
చెన్నై	1,06,850	97,950	1,37,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

● టెక్... టాక్

కోపైలట్ 3డీ



మైక్రోసాఫ్ట్ సరికొత్త కోపైలట్ 3డీ టూల్ ఫ్లాట్ ఇమేజ్‌ని క్షణాల వ్యవధిలో త్రీడి మోడల్‌లోకి మారుస్తుంది. **ఇలా చేయాలి...**
● కోపైలట్.కామ్‌లో వెళ్లి సైన్ ఇన్ కావాలి ● సైడ్‌బార్ మెనూను ఓపెన్ చేసి 'ల్యాబ్స్'ను క్లిక్ చేయాలి ● పీఎన్‌జీ లేదా జేజీ ఫైల్స్‌ను 10 ఎంబీ వరకు అప్‌లోడ్ చేయవచ్చు ● కాంప్లెక్స్ ఇమేజీలు ఎంపిక చేసుకోవద్దు ● అప్‌లోడింగ్ తరువాత కోపైలట్ 3డీ ఆటోమేటిక్‌గా ఫైల్‌ను ప్రాసెస్ చేసి త్రీడీ మోడల్‌లోకి మారుస్తుంది.

రియల్ మీ 15 ప్రో



డిస్‌ప్లే	: 6.80 అంగుళాలు
బరువు	: 187 గ్రా.
రిజల్యూషన్	: 1280×2800 పిక్సెల్స్
ఫ్రంట్ కెమెరా	: 50 ఎంపీ
మెమొరీ	: 128జీబి 8జీబి ర్యామ్/ 256 జీబి 8జీబి ర్యామ్/ 256జీబి 12జీబి ర్యామ్
వోఎస్	: ఆండ్రాయిడ్ 15

యూట్యూబ్ వీడియోస్ టు ఆడియో



యూట్యూబ్ వీడియోలను ఆడియోలోకి కన్వర్ట్ చేయడం వల్ల... వ్యాయామాలు చేస్తూ మ్యూజిక్ వినడం, పాడ్‌కాస్ట్ క్రియేట్ చేయడం, ఆఫ్‌లైన్ లిజనింగ్‌లాంటి ప్రయోజనాలు ఉన్నాయి. యూట్యూబ్ వీడియోలను ఆడియోలోకి కన్వర్ట్ చేయడానికి రకరకాల ఆన్‌లైన్ టూల్స్, సాఫ్ట్‌వేర్‌లు అందుబాటులో ఉన్నాయి. వైటీఎంపీ3, కనవెర్టియో, క్లిప్ కన్వర్ట్‌లాంటి వెబ్‌సైట్‌ల ద్వారా యూట్యూబ్ లింక్‌ను పేస్ట్ చేసి ఆడియో ఫైల్‌ను డైరెక్ట్‌గా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

శాంసంగ్ గెలాక్సీ ట్యాబ్ ఎస్ 10 లైట్



స్క్రీన్: 10.9 అంగుళాలు
బరువు: 524 గ్రా.
బ్యాటరీ: 8,000 ఎంఏహెచ్
వోఎస్: ఆండ్రాయిడ్ 15.0
● ఎస్ పెన్ అండ్ క్రియేటివ్ టూల్స్
● థర్డ్–పార్టీ యాప్ సపోర్ట్ (స్కెచ్, రైట్, క్రియేట్ కోసం)
కలర్: గ్రే, సిల్వర్, కోరల్‌రెడ్

● సేవాపథం

యువర్స్

ఫుడ్... ఫ్రెండ్స్



'ఎప్పుడు చూసినా సెల్‌ఫోన్‌లో మునిగి పోయి కనిపిస్తారు' అనేది యూత్ గురించి వినిపించే మాట. అయితే ఆ సెల్‌ఫోన్ ద్వారానే సమాజం మెచ్చే సేవాకార్యక్రమాలూ కూడా చేపట్టవచ్చు అని నిరూపించారు వేములవాడ యువకులు...

అన్నదానం మహాదానం అంటారు. ఈ మాటను నిజం చేస్తూ వేములవాడ యువకులు గత 1582 రోజులుగా 'మై వేములవాడ ట్రస్ట్' ద్వారా స్ఫూర్తిదాయకమైన సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. శుభకార్యాల్లో మిగిలిపోయిన ఆహారాన్ని వృథా కాకుండా పేద భక్తులకు పంచిపెడుతున్నారు.

మొదట ఫ్రెండ్స్ అందరూ కలసి వాట్సాప్ గ్రూప్‌గా ఏర్పడ్డారు. సమాజానికి తమవంతుగా ఏదైనా చేయాలనుకున్నారు. 'మై వేములవాడ ట్రస్ట్' ఏర్పాటు చేసి పేద భక్తులకు నిత్యాన్నదానాన్ని అందిస్తున్నారు. స్థానిక పేదలు ప్రతిరోజూ ఈ అన్నదాన కార్యక్రమం ద్వారా కడుపు నింపుకుంటున్నారు.

ట్రస్ట్‌గా ఏర్పడిన తరువాత భక్తులకు నిత్యాన్నదానాన్ని అందించడంతో పాటు పలు సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నారు. రాజన్న దర్శనానికి వచ్చే వందలాది మంది భక్తులు ఎలాంటి ఇబ్బంది పడకుండా చూస్తున్నారు.

'మేము పుట్టి పెరిగిన పట్టణానికి ఏదైనా చేయాలనే సంకల్పంతో ట్రస్టుగా ఏర్పడ్డాం. అప్పటి నుంచి దాతల సహకారంతో నిత్యం అన్నదానం చేస్తున్నాం. అనాథలకు, పేదింటి ఆడపడచుల వివాహాలకు, అనారోగ్యంతో బాధపడే వారికి తోచినంత సహాయం చేస్తున్నాం' అంటున్నాడు 'మై వేములవాడ ట్రస్టు' కార్యదర్శి మధు మహేశ్.

'ఫ్రెండ్స్ అంతా కలసి ట్రస్టుగా ఏర్పడి మాకు తోచిన స్థాయిలో సామాజిక కార్యక్రమాలు చేపడుతున్నాం. ఈ కార్యక్రమాలకు వచ్చిన స్పందన మాకు మరింత ఉత్సాహాన్ని ఇస్తోంది. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపడతాం' అంటున్నాడు ట్రస్టు ప్రతినిధి బెజ్జింకి రవీందర్.

- సయ్యద్ తాహెర్‌పాషా,
సాక్షి, వేములవాడ

కుల మతాలకు అతీతంగా...



కులమతాలకు అతీతంగా 'మై వేములవాడ ట్రస్టు' ద్వారా నిత్య సేవా కార్యక్రమాలతో ముందుకు వెళుతున్నాం. మా పాప జన్మదినం సందర్భంగా ఇక్కడే పేదలకు అన్నదానం నిర్వహించాం. మా ప్రయత్నం చూసి మరికొందరు ముందుకు రావాలని, తమ వంతు సేవ అందించాలని కోరుకుంటున్నాం.
- మహమ్మద్ రఫీక్, ట్రస్టు ప్రతినిధి, వేములవాడ

మహాభాగ్యం



మై వేములవాడ ట్రస్ట్ సేవా యాత్రలో సేవ చేసే భాగ్యం లభించడం అదృష్టంగా భావిస్తున్నాను. నిత్యం పేదలకు అన్నదానం చేస్తుంటే మనసెంతో ఆనందంగా ఉంటుంది. ప్రతిరోజూ ఇక్కడకు వచ్చే వందలాది మంది భక్తులలో ఎవరూ ఆకలితో ఉండకుండా చేయడం కోసం ప్రయత్నం చేస్తున్నాం. అన్నం వృథా కాకుండా అవసరమైన వారికి అందించడమే నిజమైన పుణ్యంగా భావిస్తున్నాం.
- పాత సంతోష్, ట్రస్టు ప్రతినిధి, వేములవాడ

● మ్యూజిక్ వరల్డ్

బంగారంలా మెరిసింది



మన దేశానికి చెందిన పన్నెండేళ్ల వాన్షీ మొదలియార్ జపాన్‌లోని టోక్యో ఒపెరా సిటీ కన్సర్ట్ హాల్‌లో జరిగిన ఇంటర్‌నేషనల్ ఆర్ట్ ఫెస్టివల్‌లో బంగారు పతకం గెలుచుకుంది. పాశ్చాత్య సంగీత పోటీలలో కనిపించే యూరప్, యూఎస్, రష్యా, జపాన్ కళాకారుల ఆధిపత్యాన్ని బ్రేక్ చేసింది వాన్షీ. 'నా పేరు గోల్డ్ ఫస్ట్ ప్రైజ్‌కు ప్రకటించినప్పుడు సంతోషంగా అనిపించింది. టోక్యో వేదిక మీద నిలబడి భారత్‌కు ప్రాతినిధ్యం వహించడం గర్వంగా అనిపించింది. ఇది నా ప్రయాణానికి ఆరంభం మాత్రమే' అంటున్న వాన్షీ గత సంవత్సరం ఆస్ట్రియా రాజధాని వియన్నాలో జరిగిన 'ఇంటర్నేషనల్ ఆర్ట్స్ ఫెస్టివల్'లో సిల్వర్ మెడల్ గెలుచుకుంది. అయిదు సంవత్సరాల క్రితం మహారాష్ట్రలోని పుణెలో 'రహెల్ అకాడమీ ఆఫ్ మ్యూజిక్'లో సంగీత ప్రయాణం ప్రారంభించింది వాన్షీ. 'లండన్, న్యూయార్క్‌లలో ప్రదర్శనలు ఇవ్వాలనేది నా కోరిక. సంగీతానికి సరిహద్దులు లేవు. కొత్త భాషలు, కొత్త సంగీత రీతులు నేర్చుకోవాలనుకుంటున్నాను' అంటుంది వాన్షీ.

ఇన్‌స్టా లింక్‌డ్ రీల్



కంటెంట్ క్రియేటర్‌లు మల్టిపుల్ రీల్స్‌ను ఒక సిరీస్‌లోకి తీసుకురావడానికి ఇన్‌స్టాగ్రామ్ కొత్త ఫీచర్‌ని తీసుకువచ్చింది.థీమ్, టాపిక్, సందర్భాన్ని దృష్టిలో పెట్టుకొని ఒక రీల్‌ను మరొక రీల్‌కు లింక్ చేయవచ్చు.

రీల్‌ను లింక్ చేయడానికి... ● రీల్ కాప్షన్ బాక్స్ కింద, రీల్‌ను లింక్ చేయడానికి ఆప్షన్ ఉంటుంది. దానిపై ట్యాప్ చేయాలి ● ఒక సమయంలో ఒక రీల్ మాత్రమే ఎంచుకోవాలి ● లింక్‌డ్ రీల్‌కు ఒక టైటిల్ ఇవ్వాలి ● ఎంచుకున్న టైటిల్‌ను ఎప్పుడైనా మార్చవచ్చు. తొలిగించవచ్చు ● టైటిల్ ఇవ్వకపోతే లింక్డ్ రీల్ పేరు 'లింక్ చేసిన రీల్'గానే ఉంటుంది ● టైటిల్ 15 క్యారెక్టర్‌లకు మించి ఉండాలి ● 'ఓకే' ప్రెస్ చేసి షేర్ చేయాలి.



● టీన్ టాలెంట్

కైరాన్ అంటే మాటలు కాదు!

శాంటా క్లారా యూనివర్శిటీలో యంగెస్ట్ గ్రాడ్యుయేట్‌గా అందరి దృష్టిని ఆకర్షించిన కైరాన్ క్వాజీ పద్నాలుగు సంవత్సరాల వయసులోనే 'స్పేస్ ఎక్స్'లో స్టార్‌లింక్ విభాగంలో చేరి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఇక అప్పటి నుంచి కైరాన్‌కు ప్రసిద్ధ ఏఐ ల్యాబొరేటరీలు, టెక్నాలజీ కంపెనీల నుంచి ఆఫర్లు వస్తూనే ఉన్నాయి. చివరికి ప్రపంచ ప్రసిద్ధ ప్రీమియర్ మార్కెట్ మేకింగ్ ఫర్మ్ సిటడెల్ సెక్యూరిటీస్‌ను ఎంపిక చేసుకున్నాడు.

'స్పేస్ ఎక్స్'లో సాఫ్ట్‌వేర్ డిజైనింగ్, ప్రొడక్షన్–క్రిటికల్ సిస్టమ్స్‌పై పనిచేసేవాడు కైరాన్.

సమర్థతకు వయసు అడ్డు కాదని తన నియామకం ద్వారా తెలియజేసిన 'సిటడెల్ సెక్యూరిటీస్'కు కైరాన్ కృతజ్ఞతలు చెప్పాడు.

కైరాన్ క్వాజీ బంగ్లాదేశీ–అమెరికన్. తొమ్మిది సంవత్సరాల వయసులోనే థర్డ్ గ్రేడ్ నుండి కాలేజీలో చేరాడు. పది సంవత్సరాల వయసులో 'ఇంటెల్ ల్యాబ్స్'లో ఇంటర్న్‌షిప్ చేశాడు. మన్‌హట్టన్‌లో ఉంటున్న కైరాన్ రోజూ పది నిమిషాలు నడిచి 'స్పేస్ ఎక్స్' ఆఫీసుకు నడిచి వెళ్లేవాడు.

'నడకలో గొప్ప ఆలోచనలు వస్తాయి' అంటాడు. అందుకే ఏమో!

● అవును ఇది నిజమే

వారానికి 13 రోజులు!

ఇప్పుడంటే వారానికి ఏడు రోజులు అని చెబుతున్నాంగానీ పురాతన సమాజాలలో ఎవరి లెక్కలు వారికి ఉండేవి. మాయా ప్రజల క్యాలెండర్ ప్రకారం వారానికి పదమూడు రోజులు. వీరి క్యాలెండర్‌ను అజటిక్స్, టోలటెక్స్‌లాంటి నాగరిక జాతులు అనుసరించాయి. ఈజిప్ట్‌లో వారానికి ఎనిమిది రోజులు ఉండేవి. బాబిలోనియన్ పూజారులు వారానికి ఏడు రోజుల విధానానికి శ్రీకారం చుట్టారు. ఇతరులు వారిని అనుసరించారు. 'వీక్' అనే పదం పాత ఇంగ్లీష్ పదం 'విక్' నుంచి వచ్చింది. కదలిక, మార్పు అని ఈ పదానికి అర్థాలు ఉన్నాయి.

సాక్షి సినిమా

రజనీకాంత్‌గారు క్లాస్ తీసుకున్నారు

- మంచు మనోజ్



తేజ సజ్జా, రితికా నాయక్ హీరో హీరోయిన్లుగా, మంచు మనోజ్ మరో ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'మిరాయ్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో టీజీ విశ్వ ప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మంచు మనోజ్ చెప్పిన విశేషాలు.

● తేజ చిన్నప్పట్నుంచి నాకు తెలుసు. క్యూట్‌గా ఉండేవాడు... బుగ్గలు గిల్లేసేవాడిని. ఓ సందర్భంలో మంచి స్క్రిప్ట్ ఉంటే చెప్పు తమ్ముడూ సినిమా చేద్దామని అన్నాను. 'నిజమా? అన్నా' అని 'మిరాయ్' గురించి చెప్పాడు. దర్శకుడు కార్తీక్‌గారు కథ చెప్పారు. నచ్చి, ఈ సినిమా చేశాను.

● 'మిరాయ్'లో పవర్‌ఫుల్ క్యారెక్టర్ చేశాను. వారసత్వం, లేజీనెస్‌ని ఏ మాత్రం సహించని క్యారెక్టర్ నాది. కథ రీత్యా తొమ్మిది గ్రంథాలు నా దగ్గరకు వస్తే, నా తలతో కలిసి పది తలల రావణుడిని అవుతాను. వాటి కోసం ఏం చేశాను? అన్నదే కథ. ఒక రకంగా మోడ్రన్ రావణాసురుడు అని చెప్పుకోవచ్చు. కానీ ఆడవాళ్ల జోలికి వెళ్లడు. దర్శకుడు నా క్యారెక్టర్‌ను స్పెషల్‌గా డిజైన్ చేశారు. 'మిరాయ్' నాకు మంచి కమ్‌బ్యాక్ ఫిల్మ్ అవుతుంది.

● 'మిరాయ్' సినిమా కోసం మూడేళ్లు కష్టపడ్డాం. శ్రీరాములవారి ప్రస్తావన, 9 పుస్తకాల బ్యాక్‌డ్రాప్, ఇతిహాస కోణాలు... ఇవన్నీ బాగుంటాయి. ఈ సినిమా కోసం తేజ చేసిన హార్డ్‌వర్క్ మీకు స్క్రీన్‌పై కనిపిస్తుంది. మేమిద్దరం డూప్ లేకుండా యాక్షన్ సీక్వెన్స్ చేశాం. హైదరాబాదులో జాక్సన్ మాస్టర్ దగ్గర ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నాను. ఉన్న బడ్జెట్‌లోనే కార్తీక్‌గారు హాలీవుడ్ స్థాయి సినిమా తీశారు. విశ్వప్రసాద్ రాజీ పడకుండా నిర్మించారు. ఇక 'కూలీ' సినిమాకు ముందు మా ఇంట్లో రజనీకాంత్‌గారిని కలిశాను. 'మిరాయ్' ట్రైలర్ చూశారు. ఆయనకు నచ్చింది. అప్పుడు ఆయన చెప్పిన మాటలు నాకు ఎనర్జీనిచ్చాయి. ఇక గ్యాప్ లేకుండా సినిమాలు చేయమని రజనీకాంత్ గారు క్లాస్ తీసుకున్నారు.

● 'డేవిడ్ రెడ్డి, రక్షక్' సినిమాలు చేస్తున్నాను. ఇంటెన్స్ యాక్షన్ చిత్రాలు ఇవి. ఇక 'అహం బ్రహ్మాస్మి' చిత్రం రావాల్సినప్పుడు వస్తుంది. అలాగే డార్క్ కామెడీ ఫిల్మ్ 'వాట్ ద ఫిష్' ఎప్పుడొచ్చినా చాలా బాగుంటుంది. కామెడీ చిత్రాలు చేయాలని ఉంది. కథల కోసం చూస్తున్నాను. 'నేను మీకు తెలుసా' టీమ్‌తో ఓ సినిమా చేయాలనే ఆలోచన ఉంది. నటుడిగా అన్ని భాషల్లోనూ సినిమాలు చేయాలనుకుంటున్నాను... కథలు వింటున్నాను.

మేమిద్దరం ఒకేలా ఆలోచిస్తాం

- దుల్కర్ సల్మాన్



● నస్లెన్, కల్యాణి, డొమినిక్ అరుణ్, దుల్కర్ సల్మాన్, నాగ్ అశ్విన్, నాగవంశీ, వెంకీ

"కల్యాణీ ప్రియదర్శన్ నాకు చెల్లిలాంటిది. మేమిద్దరం ఒకేలా ఉంటాం, ఒకేలా ఆలోచిస్తాం. చంద్ర పాత్ర కోసం తను తప్ప మా మైండ్‌లోకి వేరే ఎవరి పేరు రాలేదు. నన్ను ఎలాగైతే మీవాడిగా భావించారో అలాగే నేను నిర్మించిన 'కొత్త లోక' చిత్రాన్ని కూడా మీ సినిమాగా భావించి ఆదరిస్తున్నందుకు తెలుగు ప్రేక్షకులకు కృతజ్ఞతలు" అని దుల్కర్ సల్మాన్ అన్నారు. కల్యాణీ ప్రియదర్శన్ లీడ్ రోల్‌లో, నస్లెన్ కీలక పాత్రలో నటించిన మలయాళ చిత్రం 'లోక చాప్టర్ 1: చంద్ర'. డొమినిక్ అరుణ్ దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్ నిర్మించిన ఈ చిత్రాన్ని తెలుగులో 'కొత్త లోక' పేరుతో ఆగస్టు 29న నిర్మాత సూర్యదేవర నాగవంశీ విడుదల చేశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ చిత్ర విజయోత్సవానికి దర్శకులు నాగ్ అశ్విన్, వెంకీ అట్లూరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దుల్కర్ సల్మాన్ మాట్లాడుతూ– "ఈ సినిమా బడ్జెట్ తక్కువని మీరు అనుకోవచ్చు. కానీ, మలయాళ పరిశ్రమలో ఈ బడ్జెట్ చాలా ఎక్కువ. అయితే నేను బడ్జెట్ గురించి ఆలోచించలేదు. డైరెక్టర్, డీటీపీ మధ్య బాండింగ్ బాగుంటే మంచి సినిమాలు చేయొచ్చు" అని చెప్పారు. నాగ్ అశ్విన్ మాట్లాడుతూ– "అందరిలాగే నేను కూడా ఈ సినిమా రెండో భాగం కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను" అని పేర్కొన్నారు. "ఈ సినిమా ప్రారంభించినప్పుడు మలయాళంలో రూ. 30 కోట్లు అనేది చాలా ఎక్కువ. నిర్మాతగా ధైర్యం చేసిన దుల్కర్ సల్మాన్‌ని అభినందించాలి" అన్నారు వెంకీ అట్లూరి. "ఇలాంటి సూపర్ హీరో సినిమాని డిస్ట్రిబ్యూట్ చేయడం హ్యాపీగా ఉంది" అన్నారు నాగవంశీ. కల్యాణీ ప్రియదర్శన్ మాట్లాడుతూ– "మా సినిమాకి, మాకు ఇంత పెద్ద హిట్ ఇచ్చిన తెలుగు ప్రేక్షకులకు ధన్యవాదాలు" అని తెలిపారు. "తెలుగు ప్రేక్షకులు మా సినిమాపై కురిపిస్తున్న ప్రేమకు హ్యాపీగా ఉంది" అన్నారు డొమినిక్ అరుణ్.

ఇంకెందుకు రా నీ బతుకు!



● 'అల్లరి' నరేశ్

'లక్షలు లక్షలు సంపాదిస్తావ్... కానీ మందు తాగవ్... ఇంకెందుకు రా నీ బతుకు' (నటుడు సత్య), 'తాగుడికి సంపాదనకి లింకేముంది సార్' (నరేశ్) అనే డైలాగ్స్‌తో 'ఆల్కహాల్' మూవీ టీజర్ ఆరంభమైంది. 'అల్లరి' నరేశ్ హీరోగా, రుహానీ శర్మ, నిహారిక ఎస్.ఎం. హీరోయిన్లుగా రూపొందుతోన్న చిత్రం 'ఆల్కహాల్'. 'ఫ్యామిలీ డ్రామా' ఫేమ్ మెహర్ తేజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సత్య, గిరీష్ కులకర్ణి, హర్షవర్ధన్, చైతన్య కృష్ణ, వెంకటేశ్ కాకుమాను, కిరీటి ఇతర పాత్రలు పోషిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రం 2026 జనవరి 1న విడుదల కానుంది. ఈ సినిమా టీజర్‌ని గురువారం విడుదల చేశారు. "ఒక ఉత్కంఠభరితమైన థ్రిల్లర్ డ్రామాగా రూపొందుతోన్న చిత్రం 'ఆల్కహాల్'. హీరో జీవితాన్ని మద్యం ఎలా ప్రభావితం చేస్తుందనే అంశం, తాగడానికి ముందు, తాగిన తర్వాత అతని ప్రవర్తన చుట్టూ జరిగే సంఘటనల సమాహారంతో ఈ సినిమా రూపొందుతోంది. మరో వైవిధ్యమైన చిత్రాన్ని ప్రేక్షకులకు అందించనున్నారు నరేశ్. ఇందులో ఆయన సరికొత్త అవతారంలో కనిపించనున్నారు" అని చిత్రయూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: గిబ్రాన్, కెమెరా: జిజు సన్నీ.

మంచి సినిమానా? కాదా అనేదే ముఖ్యం

- శివ కార్తికేయన్



"'మదరాసి' కథ కొత్తగా ఉంటుంది. మంచి భావోద్వేగాలతో పాటు హై ఓల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్ ఉన్నాయి. యాక్షన్ బ్లాక్స్ ఆడియన్స్‌ని మెస్మరైజ్ చేస్తాయి" అని శివ కార్తికేయన్ తెలిపారు. ఏఆర్ మురుగదాస్ దర్శకత్వంలో శివ కార్తికేయన్, రుక్మిణీ వసంత్ జోడీగా నటించిన చిత్రం 'మదరాసి'. తెలుగులో శ్రీ లక్ష్మీ మూవీస్ సంస్థ నేడు ఈ సినిమాని విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా శివ కార్తికేయన్ మాట్లాడుతూ– "చిరంజీవిగారు, మహేశ్‌బాబుగారు వంటి పెద్ద స్టార్స్‌ని డైరెక్ట్ చేసిన మురుగదాస్ గారితో పని చేసినందుకు సంతోషంగా ఉంది. ఆయన్నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. ఈ సినిమా షూటింగ్ చాలా పాజిటివ్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చింది. నిర్మాత తిరుపతి ప్రసాద్‌గారు ఈ చిత్రాన్ని ఎక్కడా రాజీ పడకుండా గ్రాండ్ స్కేల్‌లో తీశారు. అనిరుధ్, నేను బెస్ట్ ఫ్రెండ్స్. మా కాంబినేషన్లో వచ్చిన అన్ని సినిమాలు మ్యూజికల్‌గా హిట్ అయ్యాయి. ఈ సినిమా పాటలు కూడా అద్భుతంగా వచ్చాయి. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీలో ఒక లెగ్ మూమెంట్ ఉన్న సాంగ్ చేశాను... అది మంచి ఎక్స్‌పీరియన్స్. సుదీప్ ఎలామన్ విజువల్స్ ప్రత్యేకంగా ఉంటాయి. తెలుగు, తమిళ ప్రేక్షకుల అభిరుచులు ఒకేలా ఉంటాయి. చిన్న సినిమా, పెద్ద సినిమా అని కాకుండా బావుంటే ప్రతి సినిమాని ఆదరిస్తారు. వాళ్లకి మంచి సినిమానా? కాదా అనేదే ముఖ్యం. ఇప్పటివరకు నా సినిమాలు 'రెమో, వరుణ్ డాక్టర్, కాలేజ్ డాన్, మహావీరుడు, అమరన్'లకు తెలుగు ప్రేక్షకులు మంచి సపోర్ట్ ఇచ్చారు. అద్భుతమైన కంటెంట్‌తో వస్తున్న 'మదరాసి'ని కూడా అలానే ఆదరించాలని కోరుకుంటున్నాను" అని చెప్పారు.

సస్పెన్స్... థ్రిల్



● అథర్వా మురళి, లావణ్యా త్రిపాఠి

అథర్వా మురళి, లావణ్యా త్రిపాఠి జంటగా నటించిన చిత్రం 'టన్నెల్'. రవీంద్ర మాధవ దర్శకత్వం వహించారు. అశ్విన్ కాకుమాను విలన్ పాత్ర చేశారు. ఈ చిత్రాన్ని తెలుగులో లచ్చురామ్ ప్రొడక్షన్స్‌పై ఎ. రాజు నాయక్ ఈ నెల 12న విడుదల చేస్తున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. 'ఈ యూనిఫామ్ వేసుకున్న ప్రతి ఒక్కడికీ అందరూ ఫ్యామిలీనేరా' అంటూ ట్రైలర్ చివర్లో అథర్వా మురళి చెప్పిన డైలాగ్ ఆసక్తిగా ఉంది. "సస్పెన్స్ థ్రిల్లర్ యాక్షన్ మూవీగా 'టన్నెల్' రూపొందింది. ఈ చిత్రంలో లవ్ ట్రాక్‌కి కూడా ప్రాధాన్యం ఉంది. జస్టిన్ ప్రభాకరన్ మంచి మ్యూజిక్ అందించారు. శక్తి శరవణన్ విజువల్స్ ఆకట్టుకుంటాయి" అని చిత్రయూనిట్ పేర్కొంది.

అప్పుడే ఎదుగుతాం

- మౌళి తనుజ్



"90స్ మిడిల్ క్లాస్ బయోపిక్' ఫేమ్ మౌళి తనుజ్, శివానీ నాగారం జంటగా నటించిన చిత్రం 'లిటిల్ హార్ట్స్'. సాయి మార్తాండ్ దర్శకత్వంలో ఆదిత్య హాసన్ నిర్మించిన ఈ చిత్రం నేడు (శుక్రవారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం విలేకరుల సమావేశంలో మౌళి తనుజ్ మాట్లాడుతూ– "బీటెక్ పూర్తి చేశాను. ఎనిమిదో తరగతి చదువుతున్నప్పట్నుంచే బేసిక్ ఎడిటింగ్ నేర్చుకున్నాను. మొదట్లో రియాక్షన్ వీడియోస్ చేశాను. ఆ తర్వాత షార్ట్ ఫిల్మ్స్, మీమ్స్ చేశాను. నేను చదువుకుంటున్నప్పుడే నా ఖర్చులు నేనే చూసుకున్నాను. రైటర్, డైరెక్టర్ అవుదామనే ఇండస్ట్రీకి వచ్చాను. అయితే '90స్ మిడిల్ క్లాస్ బయోపిక్' సిరీస్‌తో నటుడిగా గుర్తింపు తెచ్చుకున్నాను. 'లిటిల్ హార్ట్స్' సినిమా కథ విన్నప్పుడు థియేట్రికల్‌గా బాగుంటుందనిపించింది. సోషల్ మీడియాలో విభిన్నమైన అభిప్రాయాలు ఉంటాయి. అయితే సరైన విమర్శలను తప్పక తీసుకుంటాను. లోపాలు సరి చేసుకుంటేనే ఎదుగుతామని నా ఫీలింగ్. 'లిటిల్ హార్ట్స్' కేవలం యూత్ కోసమే కాదు... ఫ్యామిలీస్ అందరూ చూడదగ్గ చిత్రం. ఇక దర్శకుణ్ణి కావాలన్న నా కల నెరవేరుతుందా? లేదా అనేది తెలియదు. కానీ కథ ఉంది. ఈ కథలో నేనే హీరోగా నటించి, దర్శకత్వం వహిస్తాను" అని అన్నారు.

కల్లు కొట్టు కాడ...



● రమణ్, మురళీ మోహన్, వర్ష

రమణ్, వర్ష విశ్వనాథ్ జోడీగా రామచంద్ర వట్టికూటి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మటన్ సూప్'. 'విట్‌నెస్ ది రియల్ క్రైమ్' అన్నది ట్యాగ్ లైన్. రామకృష్ణ వట్టికూటి సమర్పణలో మల్లికార్జున ఎలికా (గోపాల్), అరుణ్ చంద్ర వట్టికూటి, రామకృష్ణ సనపల నిర్మించారు. వెంకీ వీణ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'కల్లు కొట్టు కాడ...' అంటూ సాగే మాస్ ఎనర్జిటిక్ పాటని నటుడు మురళీ మోహన్ విడుదల చేశారు. సూరన్న సాహిత్యం అందించిన ఈ పాటని సూరన్న, రేలారే రేలా గోపాల్, సుజాత వాసు ఆలపించగా, సత్య మాస్టర్ కొరియోగ్రఫీ అందించారు. ఈ సందర్భంగా మురళీ మోహన్ మాట్లాడుతూ– "'మటన్ సూప్' టైటిల్ చాలా బాగుంది. యంగ్ టీమ్ చేసిన ఈ ప్రయత్నానికి పెద్ద సక్సెస్ దక్కాలి" అని తెలిపారు. "మా సినిమాని త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకు రాబోతున్నాం" అని రామచంద్ర వట్టికూటి చెప్పారు. "'కల్లు కొట్టు కాడ...' పాట చాలా బాగా వచ్చింది" అన్నారు మల్లికార్జున ఎలికా. "మురళీ మోహన్‌గారిలాంటి పెద్దల సహకారం వల్లే మా లాంటి చిన్న నిర్మాతలు తీసే చిత్రాలు నిలబడుతున్నాయి" అని రామకృష్ణ సనపల తెలిపారు. "మా సినిమా మంచి విజయం సాధిస్తుందని నమ్మకంగా ఉన్నాం" అన్నారు రమణ్.

సాక్షి బిజినెస్
శుక్రవారం
5-9-2025

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
150	19
80,718	24,734

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	26,622	▲	126
డోజోన్స్	45,592	▲	321
ఎఫ్‌టీఎస్ఈ 100	9,216	▲	38
డాక్స్	23,787	▲	192
షాంఘై	3,766	▼	48
నికాయ్	42,580	▲	641

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	87.70	88.72
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	116.40	119.37
€	యూరో	ఎస్‌బీఐ	101.20	103.95
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	59.00	60.51
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	56.37	58.63
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	66.08	69.80
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.60	24.10
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.10	24.34
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.45	13.28

'ఆరోగ్య' ఉపశమనం



హెల్త్, లైఫ్ ఇన్సూరెన్స్‌పై సున్నా జీఎస్‌టీ అన్నది మాస్టర్ స్ట్రోక్. రక్షణ (బీమా)ను విశేషాధికారం కాకుండా, ఒక హక్కుగా మారుస్తుంది. ఔషధాలపై జీఎస్‌టీ తగ్గింపుతో ప్రతి ఇంటికీ అందుబాటు ధరలకే ఆరోగ్య సంరక్షణను చేరువ చేస్తుంది. ప్రభుత్వం లక్షలాది మంది గౌరవప్రదంగా ఆరోగ్య సంరక్షణను పొందేలా చేసింది.
- శోభన కామినేని, అపోలో హెల్త్ ఈడీ



న్యూఢిల్లీ: కొన్ని రకాల ఔషధాలు, వైద్య పరికరాలపై జీఎస్‌టీని తగ్గించడం, ప్రాణాధార ఔషధాలపై లెవీని మినహాయించడం.. రోగులకు, వారి కుటుంబాలకు ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తాయని, వారిపై ఆర్థిక భారాన్ని తగ్గిస్తాయని ఫార్మాస్యూటికల్స్, ఆరోగ్య సంరక్షణ కంపెనీలు పేర్కొన్నాయి. ఔషధాల ధరలు దిగొస్తాయని, నాణ్యమైన వైద్యం అందరికీ అందుబాటులోకి వస్తుందని అభిప్రాయపడ్డాయి. ప్రాణాలను కాపాడే, కేన్సర్ ఔషధాలను జీఎస్‌టీ నుంచి మినహాయించడం బాధిత కుటుంబాలకు ఉపశమనం కలిగ్రస్తుందని భారత ఫార్మాస్యూటికల్స్ కూటమి సెక్రటరీ జనరల్ సుదర్శన్ జైన్ తెలిపారు. చాలా ఔషధాలపై 12 శాతం జీఎస్‌టీని 5 శాతానికి తగ్గించడం వల్ల చికిత్సల ధరలు తగ్గుతాయన్నారు. 33 నిత్యావసర ఔషధాలను జీఎస్‌టీ నుంచి మినహాయించడం, కేన్సర్, అరుదైన వ్యాధులు, దీర్ఘకాల వ్యాధుల ఔషధాలపై రేటును 5 శాతానికి తగ్గించడం చరిత్రాత్మక నిర్ణయాలే కాకుండా, దయతో తీసుకున్నవిగా భారత ఫార్మాస్యూటికల్ తయారీదారుల సమాఖ్య (ఓపీపీఐ) డైరెక్టర్ జనరల్ అనిల్ మతాయ్ పేర్కొన్నారు. రోగులు, వారి కుటుంబాలకు ఊరట లభిస్తుందన్నారు. తాజా చర్యలు నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొస్తాయని నాట్‌హెల్త్ ప్రెసిడెంట్, మెట్రోపొలిస్ హెల్త్‌కేర్ చైర్‌పర్సన్ అయిన అమీరా షా తెలిపారు.



- రూ. లక్ష వరకు తగ్గనున్న ధర
- మిడ్‌సైజ్ కార్ల ధరలూ దిగొస్తాయ్
- పుంజుకోనున్న డిమాండ్
- పండుగల సీజన్‌లో ఆటో రంగానికి జోష్

చిన్న కారు.. హుషారు!

ఆధునిక ఫీచర్లు, టెక్నాలజీతో కూడిన ఎస్‌యూవీల ధాటికి చిన్న కార్లు చిన్నబోతున్న తరుణంలో.. జీఎస్‌టీ రేటు కోత తిరిగి ప్రారంభ స్థాయి కార్లకు డిమాండ్‌ను పెంచుతుందని ఆటోమొబైల్ పరిశ్రమలో ఆశాభావం వ్యక్తమవుతోంది. రోడ్లపై మళ్లీ చిన్న కార్లు తెగ సందడి చేయనున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జీఎస్‌టీలో 28 శాతం పన్ను రేటును 18 శాతానికి తీసుకొచ్చిన నేపథ్యంలో ఒక్క చిన్న కార్ల ధర రూ.లక్ష వరకు తగ్గనుంది. దీంతో మరింత మంది వినియోగదారులకు ఇవి చేరువ కానున్నాయి.


2024–25 ఆర్థిక సంవత్సరం ప్యాసింజర్ కార్ల మొత్తం విక్రయాల్లో చిన్న కార్ల వాటా 31 శాతంగా ఉంటే.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి జూలై మధ్యలో 27 శాతానికి పడిపోయింది. "12 శాతం రేటు తగ్గిన ఫలితంగా కొనుగోలు వ్యయం రూ.లక్ష మేర తగ్గనుంది. దీంతో డిమాండ్ పుంజుకుంటుంది. పండుగల తరుణంలో ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో అమ్మకాలు పెరుగుతాయి. మధ్యశ్రేణి, విలాస కార్లపై జీఎస్‌టీ రేటు 40 శాతానికి పెరగనుంది. కాంపెన్సేషన్ సెస్ లేక పోవడంతో వీటి ధరలు కూడా తగ్గనున్నాయి" అని గ్రాంట్ థార్న్‌టన్ భారత్ పార్ట్‌నర్ సాకేత్ మెహ్రా అంచనా వేశారు.

అందరికీ మేలు..: వాహనాలపై జీఎస్‌టీ రేటు తగ్గింపును భారత ఆటోమొబైల్ తయారీదారుల సంఘం (సియామ్) ప్రెసిడెంట్ శైలేష్ చంద్ర ఆహ్వానించారు. సకాలంలో తీసుకున్న ఈ చర్య ఆటోమోటివ్ రంగంలో తాజా ఉత్తేజాన్ని కలిగిస్తుందన్నారు. "వాహనాల ధరలు చౌకగా మారతాయి. ముఖ్యంగా ఆరంభ స్థాయి కార్ల ధరలు తగ్గుతాయి. మొదటిసారి కొనుగోలుదారులకు, మధ్యాదాయ కుటుంబాలకు మేలు కలుగుతుంది" అని చెప్పారు. ఎలక్ట్రిక్ వాహనాలపై 5 శాతం రేటును కొనసాగించడాన్ని సైతం స్వాగతించారు. జీఎస్‌టీ కౌన్సిల్ నిర్ణయాలు సాహసోపేతమైనవి, మార్పును తీసుకొచ్చేవిగా ఆటోమొబైల్ డీలర్ల సమాఖ్య (ఫాడా) ప్రెసిడెంట్ సీఎస్ విఘ్నేశ్వర్ ప్రకటించారు. ఈ నిర్ణయంతో వాహన ధరలు అందుబాటులోకి వస్తాయని, డిమాండ్ పుంజుకుంటుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కీలకమైన పండుగల సీజన్‌లోకి అడుగుపెట్టిన తరుణంలో ఎలాంటి ఆటంకాల్లేకుండా రేట్ల తగ్గింపు అమలు చేయడం ద్వారా ప్రయోజనాలను కస్టమర్లకు అందేలా చూడొచ్చన్నారు.

ప్రీమియం కార్లకూ ప్రయోజనమే..

పెద్ద కార్లపై లెవీలను క్రమబద్ధీకరిస్తూ.. చిన్న కార్లపై రేటు తగ్గించడం సామాన్యులకు వాహనాలను చేరువ చేస్తాయని టయోటా కిర్లోస్కర్ మోటార్ డీఎండీ స్వప్నేష్ అభిప్రాయపడ్డారు. ఎలాంటి సెస్సు లేకుండా ప్రీమియం కార్లపై 40 శాతం జీఎస్‌టీ అమలు చేయడం వల్ల విక్రయాలు పెరుగుతాయని బీఎండబ్ల్యూ గ్రూప్ ఇండియా సీఈవో హర్‌దీప్ సింగ్ బ్రార్ తెలిపారు.

మరిన్ని వేగవంతమైన సంస్కరణల బాటలోకి చేరాం. ఇవి వినియోగాన్ని, పెట్టుబడులను పెంచుతాయి. ఎకానమీ విస్తృతమై, ప్రపంచవేదికపై భారత్ స్వరాన్ని బలపరుస్తుంది. 'లేవండి, మేల్కొనండి, లక్ష్యాన్ని చేరుకునే వరకు విశ్రమించకండి' అన్న వివేకానంద సందేశాన్ని గుర్తు చేసుకోవాలి.
- ఆనంద్ మహీంద్రా, మహీంద్రా గ్రూప్ చైర్మన్



బీమా అందరికీ చేరువ



రేట్ల క్రమబద్ధీకరణ దూరదృష్టితో తీసుకున్న చర్య. వ్యక్తిగత జీవిత బీమా పాలసీలపై జీఎస్‌టీ ట తొలగించడం పౌరులు అందరికీ జీవిత బీమాను చేరువ చేసేందుకు, 2047 నాటికి అందరికీ బీమా లక్ష్యాన్ని సాధించే దిశగా వేసిన అడుగు.
-ఆర్.దొరైస్వామి, ఎల్ఐసీ సీఈవో, ఎండీ



అన్ని వ్యక్తిగత జీవిత, ఆరోగ్యబీమా పాలసీలపై 18 శాతం జీఎస్‌టీ రేటును మినహాయిస్తూ జీఎస్‌టీ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమైనదిగా బీమా పరిశ్రమ పేర్కొంది. వైద్య ద్రవ్యోల్బణం గణనీయంగా పెరిగిపోతున్న తరుణంలో తాజా నిర్ణయం పౌరులకు ప్రయోజనం కలిగిస్తుందని, కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గిస్తుందని బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈవో తపన్ సింఘాల్ అభిప్రాయపడ్డారు. వినియోగదారుల కోణం నుంచి చూస్తే కొనుగోలు ధర దిగొస్తుందని హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్ ఈడీ, సీఎఫ్‌వో సమీర్ షా తెలిపారు. "పన్ను రేట్లు తగ్గించడం వల్ల ప్రీమియం రేట్లు దిగొస్తాయన్న అంచనాలున్నాయి. కానీ, తాజా రేట్ల తగ్గింపు ప్రయోజనం ఏ మేరకు లభిస్తుందన్నది ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) లభ్యతపైనే ఆధారపడి ఉంటుంది. రానున్న రోజుల్లో దీనిపై స్పష్టత వస్తుంది" అని షా వివరించారు. ఇఫ్కో టోకియో జనరల్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈవో సుబ్రత మోండల్ స్పందిస్తూ.. జీఎస్‌టీని తొలగించడం వల్ల హెల్త్ ఇన్సూరెన్స్ కొనుగోలు స్తోమత పెరుగుతుందని, మరిన్ని వర్గాల ప్రజలకు బీమా రక్షణ విస్తరిస్తుందని అభిప్రాయపడ్డారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ఇక పీవీసీ పైపుల లాభాల ఫ్లో! | మార్కెట్లో 'జీఎస్‌టీ' లాభాలకు గండి!

వినియోగదారునికి చేర్చాలి..

- పరిశ్రమలకు వాణిజ్య మంత్రి గోయల్ సూచన
- డిమాండ్‌కు ఊతం లభిస్తుందన్న ఆశాభావం



జీఎస్‌టీ రేట్ల తగ్గింపు ప్రయోజనాన్ని పరిశ్రమ తప్పకుండా వినియోగదారులకు అందించాలని కేంద్ర వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్ సూచించారు. స్వాతంత్ర్యం తర్వాత చేపట్టిన అతిపెద్ద, విప్లవాత్మక సంస్కరణగా దీన్ని అభివర్ణిస్తూ, ప్రధాని మోదీకి ఈ ఘనతను ఆపాదించారు. అన్ని రంగాల్లోనూ డిమాండ్‌కు ఊతమిస్తుందన్నారు. భారత్‌లో తయారు చేసిన ఉత్పత్తుల విక్రయాలను ప్రోత్సహించాలని పరిశ్రమను కోరారు. ఫార్మా, హెల్త్‌కేర్‌కు సంబంధించి 11 అంతర్జాతీయ ప్రదర్శన (ఇండియా మెడ్‌టెక్ ఎక్స్‌పో 2025, ఐఫెక్స్ 2025)ను ఉద్దేశించి మంత్రి మాట్లాడారు. జీఎస్‌టీలో తీసుకొచ్చిన సంస్కరణలు రైతుల నుంచి ఎంఎస్‌ఎంఈల వరకు.. ఫార్మా రంగంతోపాటు మరెన్నో రంగాలపై గణనీయమైన ప్రభావం చూపిస్తుందన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాధనకు సహకరిస్తుందన్నారు. వచ్చే రెండేళ్లలో భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందంటూ.. 4 ట్రిలియన్ డాలర్ల పరిమాణం నుంచి 2047 నాటికి 30 ట్రిలియన్ డాలర్ల స్థాయికి బలపడుతుందని చెప్పారు.

పెట్టుబడులు, ఉపాధి కల్పనకు ఊతం..

'జీఎస్‌టీ తగ్గింపు మొత్తాన్ని వినియోగదారులకు బదలాయించినప్పుడే పరిశ్రమకు పూర్తిస్థాయిలో ప్రయోజనం దక్కుతుంది. రేట్లు తగ్గడం సహజంగానే వినియోగాన్ని పెంచుతుంది. డిమాండ్‌కు ఊతంతో పెద్ద ఎత్తున పెట్టుబడులకు, ఉపాధి కల్పనకు, వృద్ధికి దారితీస్తుంది' అని మంత్రి చెప్పారు.

సాఫీగా మారేలా చూస్తాం: సీబీఐసీ చైర్మన్

జీఎస్‌టీలో ప్రతిపాదిత కొత్త శ్లాబులకు సాఫీగా మారేందుకు వీలుగా, సెప్టెంబర్ 22 నాటికి టెక్నాలజీని సిద్ధం చేస్తామని పరోక్ష పన్నుల కేంద్ర మండలి (సీబీఐసీ) చైర్మన్ సంజయ్ కుమార్ అగర్వాల్ విశ్వాసం వ్యక్తం చేశారు. రిటర్నుల దాఖలుకు వీలుగా సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడ్ విషయమై పరిశ్రమతో సంప్రదింపులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

ఎఫ్‌ఎంసీజీ వినియోగానికి ఊతం

ప్రజలు రోజువారీ వినియోగించే సబ్బులు, షాంపూలు, టూత్ పేస్ట్‌లు, టూత్ బ్రష్‌లు, హెయిర్ ఆయిల్, నమ్కీన్ తదితర ఎన్నో వస్తువులపై రేట్ల తగ్గింపు దేశీయంగా వినియోగం కోలుకునేందుకు, ఆర్థిక వృద్ధికి ప్రేరణనిస్తుందని, ఎఫ్‌ఎంసీజీ రంగం దీర్ఘకాల వృద్ధికి బాటలు వేస్తుందని పరిశ్రమ అభిప్రాయపడింది. సకాలంలో తీసుకున్న పరివర్తనతో కూడిన నిర్ణయంగా డాబర్ సీఈవో మోహిత్ మల్హోత్రా పేర్కొన్నారు. 'ఈ సంస్కరణ నిత్యావసరాలైన షాంపూలు, సబ్బులు, టూత్‌పేస్ట్‌లను లక్షలాది కుటుంబాలకు అందుబాటు ధరలకే చేరువ చేయడమే కాదు.. సమ్మిళిత వృద్ధి పట్ల, దేశీ వినియోగం పునరుద్ధరణకు కట్టుబడి ఉన్నామన్న సంకేతాన్ని పంపింది' అని మల్హోత్రా తెలిపారు. పన్ను రేట్లను సులభతరం చేయడం, వినియోగారులకు ఉత్పత్తులను చేరువ చేయడం పట్ల ప్రభుత్వానికి హెచ్‌యూఎల్ సీఈవో ఎండీ ప్రియా నాయర్ ధన్యవాదాలు తెలిపారు.



రేట్ల తగ్గింపు ఒక గేమ్ చేంజర్. నిత్యావసర వస్తువులను మరింత చౌకగా మారుస్తుంది. ముఖ్యంగా పండుగల సీజన్‌లో చేపట్టిన ఈ సంస్కరణలు ఆర్థిక వృద్ధికి, ఎఫ్‌ఎంసీజీ రంగంలో దీర్ఘకాల వృద్ధికి బాటలు వేస్తాయి. గృహాల సాధికారతను మరింత పెంచుతుందని భావిస్తున్నాం.
- సౌగత గుప్తా, మారికో ఎండీ, సీఈవో





సెమీఫైనల్లో యూకీ-వీనస్ జోడీ

యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో భారత డబుల్స్ స్టార్ యూకీ బాంబ్రీ అద్భుత ప్రదర్శన కొనసాగుతోంది. మైకేల్ వీనస్ (న్యూజిలాండ్)తో జత కట్టి పురుషుల డబుల్స్ విభాగంలో బరిలోకి దిగిన యూకీ బాంబ్రీ సెమీఫైనల్లోకి దూసుకెళ్లాడు. గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో 14వ సీడ్ యూకీ-వీనస్ ద్వయం 6-3, 6-7 (8/10), 6-3తో 11వ సీడ్ రాజీవ్ రామ్ (అమెరికా)-నికోలా మెక్‌టిక్ (క్రొయేషియా) జంటను బోల్తా కొట్టించింది. 2 గంటల 37 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో యూకీ-వీనస్ ఐదు ఏస్‌లు సంధించి, 12 డబుల్ ఫాల్ట్‌లు చేశారు. ఏకంగా 60 విన్నర్స్ కొట్టిన ఇండో-కివీస్ ద్వయం తమ సర్వీస్‌ను ఒకసారి కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను మూడుసార్లు బ్రేక్ చేసింది. 33 ఏళ్ల యూకీ బాంబ్రీకిదే తొలి గ్రాండ్‌స్లామ్ సెమీఫైనల్ కాగా... 37 ఏళ్ల వీనస్ 2017 ఫ్రెంచ్ ఓపెన్ డబుల్స్ టైటిల్‌ను గెలిచి, 2018 వింబుల్డన్ టోర్నీలో రన్నరప్‌గా నిలిచాడు. ఫైనల్లో చోటు కోసం ఆరో సీడ్ జో సాలిస్‌బరీ-నీల్ స్కుప్‌స్కీ (బ్రిటన్)లతో యూకీ-వీనస్ తలపడతారు.



గెలిచి నిలిచిన భారత్

- మలేసియాపై 'సూపర్-4' మ్యాచ్‌లో టీమిండియా ఘనవిజయం
- చైనాతో చివరి మ్యాచ్‌ను 'డ్రా' చేసుకున్నా ఫైనల్‌కు అర్హత

రాజ్‌గిర్ (బిహార్): సొంతగడ్డపై జరుగుతున్న ఆసియా కప్ పురుషుల హాకీ టోర్నమెంట్‌లో ఆతిథ్య భారత జట్టు ఫైనల్ చేరే అవకాశాలను సజీవంగా నిలబెట్టుకుంది. మలేసియా జట్టుతో గురువారం జరిగిన 'సూపర్-4' దశ రెండో మ్యాచ్‌లో భారత్ 4-1 గోల్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. భారత్ తరఫున మన్‌ప్రీత్ సింగ్ (17వ నిమిషంలో), సుఖ్‌జీత్ సింగ్ (19వ నిమిషంలో), శిలానంద్ లాక్రా (24వ నిమిషంలో), వివేక్ సాగర్ ప్రసాద్ (38వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. మలేసియా జట్టుకు షఫీక్ హసన్ (2వ నిమిషంలో) ఏకైక గోల్ అందించాడు. **ఈ మ్యాచ్‌లో నెగ్గడం ద్వారా 'సూపర్-4' పట్టికలో భారత్ నాలుగు పాయింట్లతో అగ్రస్థానానికి చేరుకుంది. బుధవారం డిఫెండింగ్ చాంపియన్ దక్షిణ కొరియాతో జరిగిన** 'సూపర్-4' తొలి మ్యాచ్‌ను భారత్ 2-2తో 'డ్రా' చేసుకుంది. శుక్రవారం విశ్రాంతి దినం తర్వాత... శనివారం చైనాతో జరిగే చివరి 'సూపర్-4' మ్యాచ్‌ను భారత్ 'డ్రా' చేసుకున్నా పట్టికలో తొలి రెండు స్థానాల్లో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది. గురువారం జరిగిన 'సూపర్-4' మరో మ్యాచ్‌లో చైనా 3-0 గోల్స్ తేడాతో డిఫెండింగ్ చాంపియన్ **దక్షిణ కొరియాను ఓడించింది. ప్రస్తుతం చైనా, మలేసియా మూడు పాయింట్లతో సంయుక్తంగా రెండో స్థానంలో... కొరియా ఒక పాయింట్‌తో నాలుగో స్థానంలో ఉంది.**

మలేసియాతో జరిగిన మ్యాచ్‌లో భారత్‌కు ఆరంభంలోనే షాక్ తగిలింది. మ్యాచ్ మొదలైన రెండు నిమిషాలకే మలేసియా హసన్ గోల్‌తో ఖాతా తెరిచింది. అయితే భారత్ వెంటనే తేరుకుంది. సమన్వయంతో ఆడుతూ మలేసియా గోల్‌పోస్ట్‌పై ఎడతెరిపి లేకుండా దాడులు నిర్వహించింది. రెండో క్వార్టర్‌లో భారత్ దాడులకు ఫలితం లభించింది. ఏడు నిమిషాల వ్యవధిలో భారత్ మూడు గోల్స్ చేసి ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత అదే జోరు కొనసాగించిన టీమిండియా ప్రత్యర్థి జట్టుకు మరో గోల్ చేసే అవకాశం ఇవ్వకుండా విజయాన్ని ఖాయం చేసుకుంది. మ్యాచ్ మొత్తంలో భారత్‌కు ఆరు పెనాల్టీ కార్నర్‌లు లభించగా... ఒక పెనాల్టీ కార్నర్‌ను భారత్ గోల్‌గా మలిచింది. లేదంటే మరింత తేడాతో మలేసియాపై భారత్‌కు విజయం దక్కేది.

కనీస ధర రూ. 100 మాత్రమే!

మొదలైన మహిళల వన్డే వరల్డ్ కప్ టికెట్ల అమ్మకాలు

న్యూఢిల్లీ: భారత్‌లో జరిగే మహిళల వన్డే వరల్డ్ కప్ మ్యాచ్ టికెట్ల అమ్మకాల వివరాలను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రకటించింది. ఈ నెల 30న టోర్నీ తొలి మ్యాచ్‌లో భారత్, శ్రీలంక తలపడనుండగా, 26 రోజుల ముందు గురువారం సాయంత్రం 7 గంటల నుంచి అభిమానుల కోసం టికెట్లు అందుబాటులోకి వచ్చాయి. టికెట్ కనీస ధర రూ. 100 మాత్రమే కావడం విశేషం. వరల్డ్ కప్ మ్యాచ్‌ల టికెట్లను ఐసీసీ రెండు దశల్లో అమ్మకానికి ఉంచింది. వరుసగా నాలుగు రోజుల పాటు ఈ నెల 8 వరకు 'గూగుల్ పే' వినియోగదారులు టికెట్లు కొనుక్కోవచ్చు. ఆ తర్వాత 9వ తేదీ నుంచి రెండో దశలో అభిమానులకు ఆన్‌లైన్‌లో టికెట్లు లభిస్తాయి. tickets.cricketworldcup.com వెబ్‌సైట్‌లో ఈ టికెట్లు లభిస్తాయి. మరోవైపు గువాహటిలో జరిగే టోర్నీ తొలి మ్యాచ్ సందర్భంగా ప్రత్యేక ప్రారంభోత్సవ వేడుకలు కూడా నిర్వహించనున్నారు. ఈ వరల్డ్ కప్ అఫీషియల్ సాంగ్ 'బ్రింగ్ ఇట్ హోమ్' పాడిన ప్రముఖ గాయని శ్రేయ ఘోషాల్ వేదికపై సంగీత ప్రదర్శన ఇవ్వనుంది.

యస్తిక స్థానంలో ఉమా ఛెత్రి

ముంబై: మహిళల వన్డే వరల్డ్ కప్ కోసం ప్రకటించిన భారత జట్టులో ఒక మార్పు జరిగింది. వికెట్ కీపర్ యస్తిక భాటియా గాయం కారణంగా టోర్నీ నుంచి తప్పుకుంది. స్టాండ్‌బైలలో ఒకరిగా ఉన్న ఉమా ఛెత్రిని యస్తిక స్థానంలో భారత జట్టులోకి ఎంపిక చేశారు. భారత్ తరఫున ఇప్పటి వరకు 7 టి20లు ఆడిన ఛెత్రి ఇంకా వన్డేల్లో అరంగేట్రం చేయలేదు.


అనిసిమోవా

అనిసిమోవా అదరహో

రెండో ర్యాంకర్ స్వియాటెక్‌పై వరుస సెట్‌లలో విజయం

- వింబుల్డన్ టోర్నీ ఫైనల్లో ఎదురైన ఓటమికి ప్రతీకారం
- ఫైనల్లో చోటు కోసం ఒసాకాతో పోరు

న్యూయార్క్: యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో అమెరికా స్టార్, ఎనిమిదో సీడ్ అమండ అనిసిమోవా సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో అనిసిమోవా 6-4, 6-3తో ప్రపంచ రెండో ర్యాంకర్ ఇగా స్వియాటెక్ (పోలాండ్)ను ఓడించింది. ఈ గెలుపుతో... గత జూలై 12న ప్రతిష్టాత్మక వింబుల్డన్ టోర్నీ ఫైనల్లో ఒక్క గేమ్ కూడా నెగ్గకుండా 0-6, 0-6తో స్వియాటెక్ చేతిలో ఎదురైన దారుణ ఓటమికి అనిసిమోవా బదులు తీర్చుకుంది. 'వింబుల్డన్ ఫైనల్లో ఘోర పరాజయం తర్వాత పుంజుకొని స్వియాటెక్‌పై నెగ్గడం నాకెంతో ప్రత్యేకం. ఆ ఓటమి నుంచి తేరుకోవడానికి నేను చాలా శ్రమించాను. నా కష్టానికి తగ్గ ఫలితం ఇప్పుడు లభించినందుకు ఆనందంగా ఉంది' అని తొలిసారి యూఎస్ ఓపెన్‌లో సెమీఫైనల్ చేరిన అనిసిమోవా వ్యాఖ్యానించింది. స్వియాటెక్‌తో 96 నిమిషాలపాటు జరిగిన క్వార్టర్ ఫైనల్లో అనిసిమోవా మూడు ఏస్‌లు సంధించి, రెండు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తన సర్వీస్‌ను రెండుసార్లు కోల్పోయి, స్వియాటెక్ సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేసింది. 23 విన్నర్స్ కొట్టిన అనిసిమోవా 12 అనవసర తప్పిదాలు చేసింది. మరోవైపు స్వియాటెక్ మూడు డబుల్ ఫాల్ట్‌లతోపాటు 15 అనవసర తప్పిదాలు చేసి మూల్యం చెల్లించుకుంది. ఫైనల్లో చోటు కోసం నాలుగు గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ విజేత నయోమి ఒసాకా (జపాన్)తో అనిసిమోవా తలపడుతుంది. మరో క్వార్టర్ ఫైనల్లో 23వ సీడ్ ఒసాకా 6-4, 7-6 (7/3)తో 11వ ర్యాంకర్ కరోలినా ముకోవా (చెక్ రిపబ్లిక్)పై విజయం సాధించింది.


స్వియాటెక్

సినెర్ దూకుడు

పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ యానిక్ సినెర్ (ఇటలీ) సెమీఫైనల్లోకి అడుగుపెట్టాడు. ఇటలీకే చెందిన 10వ సీడ్ ముసెట్టితో జరిగిన క్వార్టర్ ఫైనల్లో సినెర్ 6-1, 6-4, 6-2తో నెగ్గాడు. సినెర్ పది ఏస్‌లు సంధించడంతోపాటు ముసెట్టి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేశాడు. మరో క్వార్టర్ ఫైనల్లో 25వ సీడ్ ఫెలిక్స్ (కెనడా) 4-6, 7-6 (9/7), 7-5, 7-6 (7/4)తో ఎనిమిదో సీడ్ డిమినార్ (ఆస్ట్రేలియా)పై గెలిచాడు.



తెలుగు టైటాన్స్ గెలుపు బోణీ

మాజీ చాంపియన్ జైపూర్ పింక్ పాంథర్స్‌పై విజయం

విశాఖ స్పోర్ట్స్: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్) 12వ సీజన్‌లో మొదటి రెండు మ్యాచ్‌లలో ఓడిన తెలుగు టైటాన్స్ జట్టు మూడో మ్యాచ్‌తో గెలుపు బోణీ చేసింది. గురువారం జరిగిన పోరులో టైటాన్స్ 37-32తో మాజీ చాంపియన్ జైపూర్ పింక్ పాంథర్స్‌ను ఓడించింది. టైటాన్స్ కెప్టెన్ విజయ్ మలిక్, ఆల్‌రౌండర్ భరత్ హుడా చెరో 8 పాయింట్లతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. రెయిడర్ చేతన్ సాహు, డిఫెండర్ అజిత్ పవార్ కూడా చెరో 5 పాయింట్లు సాధించి సహకరించారు. జైపూర్ తరఫున నితిన్ కుమార్ (13 పాయింట్లు) ఒంటరి పోరాటం వృథా అయింది. మ్యాచ్ 13వ నిమిషంలో ప్రత్యర్థిని ఆలౌట్ చేసి ఆధిక్యం సాధించిన టైటాన్స్, పదునైన డిఫెన్స్‌తో తొలి అర్ధ భాగాన్ని 16-9తో ముగించింది. మరో పది నిమిషాల తర్వాత ఇది 23-16కు మారింది. అయితే ఆ తర్వాత రెయిడర్ నితిన్ ఒక్కసారిగా చెలరేగి టైటాన్స్‌ను ఆలౌట్ చేయడంతో పాటు సూపర్ రెయిడ్ సాధించాడు. దాంతో చివరి మూడు నిమిషాల్లో అంతరం కేవలం మూడు పాయింట్లకు తగ్గి ఉత్కంఠ పెరిగింది. అయితే విజయ్ మలిక్ ఒత్తిడిని అధిగమించి రెండు పాయింట్లు రాబట్టడంతో టైటాన్స్ ఊపిరి పీల్చుకుంది.

తొలిసారి గోల్డెన్ రెయిడ్‌లో గెలుపు

పుణేరి పల్టన్, దబంగ్ ఢిల్లీ మధ్య హోరాహోరీగా సాగిన మరో మ్యాచ్‌లో చివరకు 'గోల్డెన్ రెయిడ్' ద్వారా ఫలితం వచ్చింది. ఇందులో ఢిల్లీ విజేతగా నిలిచింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు 28-28 పాయింట్లతో సమంగా నిలిచాయి. ఆ తర్వాత 'టైబ్రేక్'లో కూడా స్కోరు 5-5తో సమంగానే ముగిసింది. అనంతరం 'గోల్డెన్ రెయిడ్' కోసం టాస్ నెగ్గిన ఢిల్లీ తరఫున అశు మలిక్ రెయిడింగ్‌కు వెళ్లి అద్భుతంగా 2 పాయింట్లు సాధించడంతో జట్టుకు గెలుపు దక్కింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

క్లుప్తంగా...

అనుమతి లేకుండా జడ్జి చాంబర్‌కి కక్షిదారు..

కేసు విచారణ నుంచి తప్పుకున్న జస్టిస్ నగేశ్ భీమపాక

సాక్షి, హైదరాబాద్: అనుమతి లేకుండా న్యాయమూర్తి చాంబర్‌కు ఓ కక్షిదారు నేరుగా వెళ్లడం హైకోర్టులో కలకలం సృష్టించింది. 'రివ్యూ పిటిషన్‌ను ఎలా కొట్టివేస్తారు.. స్టే ఎందుకు ఇవ్వరు.. తీర్పు ఎందుకు వెలువరించరు?'అంటూ కోర్టు హాల్‌లోనూ దురుసుగా ప్రవర్తించారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. సీనియర్ సిటిజన్ కావడంతో పిటిషనర్‌పై ఎలాంటి ధిక్కరణ చర్యలు తీసుకోవడం లేదని, అయితే, కేసు విచారణ నుంచి తప్పుకుంటున్నట్లు చెప్పారు. ఓ సివిల్ సూట్ కేసులో అంబర్‌పేట్‌కు చెందిన చెన్నకృష్ణారెడ్డి హైకోర్టులో 2008లో అప్పీల్ వేశారు. ఈ పిటిషన్‌పై గతంలో విచారణ చేపట్టిన జస్టిస్ నగేశ్ భీమపాక.. అప్పీల్‌ను కొట్టివేశారు. పార్టీ ఇన్ పర్సన్ (న్యాయవాది లేకుండా నేరుగా తనే వాదనలు వినిపించడం)గా చెన్నకృష్ణారెడ్డి.. రివ్యూ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టాల్సి ఉండగా.. ఇటీవల నేరుగా జడ్జి చాంబర్‌కు వెళ్లారు. దీన్ని ఆక్షేపించిన న్యాయమూర్తి.. ఇలా వచ్చి, కేసు గురించి మాట్లాడకూడదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాటవినని పిటిషనర్.. తన ఒత్తిడి భరించలేకే కేసులో ప్రత్యర్థి న్యాయవాది గుండెపోటుతో చనిపోయారన్నారు. మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయమూర్తి.. మీ వాదనలు ఓపెన్ కోర్టులో వింటామని చెప్పి బయటకు పంపించారు. ఈ పిటిషన్‌పై గురువారం న్యాయమూర్తి విచారణ చేపట్టారు. రివ్యూ పిటిషన్‌లో తీర్పు ఎందుకు ఇవ్వరని న్యాయమూర్తిని పిటిషనర్ ప్రశ్నించారు. వెంటనే తీర్పు ఇవ్వాలని బెదిరింపు ధోరణితో మాట్లాడారు. స్పందించిన న్యాయమూర్తి.. పిటిషనర్ తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. విచారణ నుంచి తప్పుకుంటున్నానని పేర్కొన్నారు.

యాదగిరీశుడికి ఇల్లు విరాళం

విలువ రూ.4 కోట్లు



ఈవో వెంకట్రావ్‌కు తన ఇంటి పత్రాలను అందజేస్తున్న ముత్తినేని వెంకటేశ్వర్లు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయానికి ఒక భక్తుడు రూ.4 కోట్ల విలువైన తన ఇంటిని విరాళంగా ఇచ్చారు. హైదరాబాద్‌లోని తిలక్‌నగర్‌కు చెందిన రిటైర్డ్ ఉద్యోగి ముత్తినేని వెంకటేశ్వర్లు.. 152 గజాల స్థలంలో నిర్మితమైన జీ ప్లస్3, పెంట్‌హౌస్‌తో కూడిన తన ఇంటిని యాదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం పేరిట రిజిస్ట్రేషన్ చేశారు. ఈ మేరకు పత్రాలను గురువారం ఆలయ ఈవో వెంకట్రావ్, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తికి అందజేశారు. ప్రస్తుతం ఆ ఆస్తి విలువ సుమారు రూ.4 కోట్లు ఉంటుందని దాత ముత్తినేని వెంకటేశ్వర్లు తెలిపారు. అనంతరం ఈవో వెంకట్రావ్, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి.. దాత వెంకటేశ్వర్లును సన్మానించి, ప్రసాదాన్ని అందజేశారు. కాగా, వెంకటేశ్వర్లును.. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్‌లు అభినందించారు.

ఎయిరిండియా విమానానికి తప్పిన ప్రమాదం

- గన్నవరం నుంచి బెంగళూరు వెళ్లేందుకు సిద్ధమైన విమానం
- రన్‌వేపై టేకాఫ్ సమయంలో ఢీ కొట్టిన పక్షి
- అప్రమత్తమై విమానాన్ని నిలిపివేసిన పైలెట్లు



పక్షి ఢీకొట్టిన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానం

విమానాశ్రయం(గన్నవరం): ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానానికి గురువారం విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం(గన్నవరం)లో ప్రమాదం తప్పింది. విమానం రన్‌వేపై టేకాఫ్‌కు సిద్ధమవుతున్న సమయంలో ఇంజిన్ రెక్కల వద్ద పక్షి ఢీకొట్టింది. అప్రమత్తమైన పైలెట్లు విమానాన్ని వెంటనే నిలిపివేయడంతో పెనుప్రమాదం నుంచి ప్రయాణికులు బయటపడ్డారు. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌కు చెందిన ఎయిర్‌బస్ ఏ–320 విమానం సుమారు వంద మంది ప్రయాణికులతో గురువారం ఉదయం 8.15 గంటలకు గన్నవరం నుంచి బెంగళూరు వెళ్లేందుకు సిద్ధమైంది. గాలిలో ఎగిరేందుకు రన్‌వేపై వేగంగా వెళ్తున్న సమయంలో విమానం ఇంజిన్ భాగాన్ని పక్షి బలంగా ఢీకొట్టింది. పైలెట్లు వెంటనే అప్రమత్తమై సడన్ బ్రేకులు వేసి విమానాన్ని రన్‌వేపై నిలిపివేశారు. దీంతో విమానం ఒక్కసారిగా భారీ కుదుపులకు గురికావడంతో ప్రయాణికులు భయంతో కేకలు వేశారు. ఇంజిన్ వద్ద రెక్కలను పక్షి ఢీకొట్టిన విషయాన్ని పైలెట్లు తెలియజేయడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. పక్షి వేగంగా ఢీకొట్టడంతో ఇంజిన్ భాగంలోని ఫ్యాను రెక్కలు దెబ్బతిన్నట్లు గుర్తించిన ఎయిరిండియా ప్రతినిధులు... ఈ విమాన సర్వీస్‌ను రద్దు చేశారు.

ఆపరేషన్.. అటవీ భూములు

జిల్లా స్థాయిలో సిట్, రెవెన్యూ డివిజన్లలో స్పెషల్ టీమ్

సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు

రిజర్వ్ ఫారెస్టులో అటవీయేతర అవసరాలకు వ్యక్తులు, సంస్థలకిచ్చిన భూములను స్వాధీనం చేసుకునేందుకే టీమ్‌ల ఏర్పాటు

ఈనెల 15లోగా ఫారెస్ట్, సీఏ బ్లాక్‌లు, నోటిఫై చేయని బ్లాక్‌లలో ఇచ్చిన పట్టాలు, అటవీ ఆక్రమణలపై పూర్తి నివేదికకు ఆదేశాలు



సాక్షి,హైదరాబాద్: అటవీ భూములపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. మళ్లీ అటవీ భూముల ఆక్రమణలు ఊపందుకోవడం, కొంతకాలంగా అటవీ, రెవెన్యూ శాఖల పరిధిలోని భూముల లెక్కలు, సరిహద్దు, సమన్వయ సమస్యలు తీవ్రం అయ్యాయి. ఈ నేపథ్యంలో అటవీభూముల అన్యాక్రాంతం, అటవీభూముల యాజమాన్య హక్కులు, అటవీ–రెవెన్యూ శాఖల మధ్య ఉన్న వివాదాల పరిష్కారానికి ఒక అడుగు ముందుకు పడింది. రాష్ట్ర వ్యాప్తంగా రిజర్వ్ ఫారెస్టుల్లో అటవీయేతర అవసరాలకు వ్యక్తులు, సంస్థలకు కేటాయించిన భూముల స్వాధీనానికి జిల్లా స్థాయిలో కలెక్టర్ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్), రెవెన్యూ డివిజన్ స్థాయిలో ఆర్డీఓల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు (స్పెషల్ టీమ్స్) ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రెవెన్యూ శాఖ ఆధీనంలోని రిజర్వ్ ఫారెస్ట్ భూములను అటవీయేతర అవసరాల నిమిత్తం వ్యక్తులు, సంస్థలకు కేటాయింపులపై సిట్ పరిశీలన జరుపుతుంది. ఇలాంటి భూముల కేటాయింపు, అధీనంలో ఉన్న వ్యక్తులు, సంస్థల నుంచి స్వాధీనం చేసుకొని మళ్లీ అటవీశాఖకు అప్పగిస్తారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో పాటు, కొన్ని రాష్ట్రాల్లో అటవీ ఆక్రమణలు, ఇతర అంశాలపై జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) ఆదేశాలకు అనుగుణంగా అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని తప్పక ఏర్పాటు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. కోర్టుల్లో, ఎన్‌జీటీ వద్ద కొన్ని కేసుల విషయంలో పిటిషన్ల (సివిల్) నేపథ్యంలో సిట్‌లు, స్పెషల్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఈ నెల 15వ తేదీలోగా మొత్తంగా ఫారెస్ట్ బ్లాకులు, కాంపెన్సేటరీ ఎఫారెస్టేషన్ బ్లాక్స్ (సీఏ బ్లాకులు), నోటిఫై చేయని బ్లాక్‌లలో ఇచ్చిన పట్టాలు, అటవీ ఆక్రమణలు, అటవీ వివాదాల్లో ఉన్న భూములకు సంబంధించిన పూర్తి నివేదిక సమర్పించాలని జిల్లా అటవీ అధికారులకు పీసీసీఎఫ్ డా.సి. సువర్ణ తాజాగా ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకు రెవెన్యూ–అటవీశాఖల మధ్య ఎంతమేర వివాదాల్లో అటవీ భూమి ఉందనే దానిపై అధికారికంగా స్పష్టమైన అంచనాలు లేవని తెలుస్తోంది.

ఆక్రమణల్లో 7 లక్షల ఎకరాల అటవీ భూములు!

పూర్తి వివరాలు - సాక్షి ప్లస్‌లో

ఇవీ పీసీసీఎఫ్ ఆదేశాలు..

ఇప్పటి వరకు కేటాయించిన పట్టాల గుర్తింపు, రిజర్వ్ ఫారెస్ట్, కాంపెన్సరేటరీ ఎఫారెస్టేషన్, అన్ నోటిఫైడ్ బ్లాక్‌లలో ఆక్రమణల గుర్తింపునకు అనెగ్జర్లను, నమూనా పత్రాలను అటవీ అధికారులకు పీసీసీఎఫ్ పంపించారు.

అనెగ్జర్–1లో : రాష్ట్రంలోని అన్ని సర్కిల్, జిల్లా, డివిజన్, అటవీ రేంజ్, బీట్, బ్లాక్‌లు, కంపార్ట్‌మెంట్‌ల వారీగా ఇప్పటి వరకు కేటాయించిన అటవీ పట్టాలు (ఎకరాల్లో), వీటి పరిధిలో ఆక్రమణలకు గురైన ప్రాంతాలు (ఎకరాల్లో), ఇంకా రెవెన్యూ శాఖతోపాటు ఇతర వివాదాలు, తదితరాలను పొందుపరచాలని ఆదేశించారు.

అనెగ్జర్–2లో : నోటిఫై చేసిన కాంపెన్సరేటరీ ఎఫారెస్టేషన్ (ప్రత్యామ్నాయ అటవీకరణ) బ్లాక్‌లతోపాటు ప్రతిపాదిత సీఏ బ్లాక్‌ల్లో సర్కిల్, జిల్లా, డివిజన్, అటవీ రేంజ్, బీట్, సీఏ బ్లాక్‌లు, కంపార్ట్‌మెంట్‌ల వారీగా ఇప్పటివరకు కేటాయించిన అటవీ పట్టాలు (ఎకరాల్లో), వీటి పరిధిలో ఆక్రమణలకు గురైన ప్రాంతాలు (ఎకరాల్లో), ఇంకా రెవెన్యూ శాఖతోపాటు ఇతర వివాదాలు తదితరాలను పొందుపరచాలని సూచించారు.

అనెగ్జర్–3లో: నోటిఫై చేయని బ్లాక్‌ల కోసం (అన్ నోటిఫైడ్ బ్లాక్‌లు) సర్కిల్, జిల్లా, డివిజన్, అటవీ రేంజ్, బీట్, సీఏ బ్లాక్‌లు, కంపార్ట్‌మెంట్‌ల వారీగా...ఇప్పటివరకు కేటాయించిన అటవీ పట్టాలు (ఎకరాల్లో), వీటి పరిధిలో ఆక్రమణలకు గురైన ప్రాంతాలు (ఎకరాల్లో), ఇంకా రెవెన్యూ శాఖతోపాటు ఇతర వివాదాలు వంటి వివరాలు తెలియజేయాలని ఆదేశించారు. దీనికి సంబంధించిన ఇప్పటికే గతనెలలో 8న, మళ్లీ 19వ తేదీన అరణ్యభవన్ నుంచి జిల్లాల వారీగా ఆక్రమణలకు సంబంధించి డేటాను పంపించాలని ఆదేశాలు జారీ అయ్యాయి

వయసు పెరుగుతుంటే.. ఎత్తు తగ్గుతుంది!



వయసు మీరిన కొద్దీ మన శరీరంలో అనేక మార్పులు వస్తాయి. జుట్టు నెరుస్తుంది. చర్మంపై ముడతలు వస్తాయి. అంతేకాదు ఎత్తు కూడా తగ్గుతారట. 40 ఏళ్ల వయసు వచ్చేనాటికి చాలా మందిలో ఎత్తు తగ్గడం ప్రారంభం అవుతుంది. పురుషుల కంటే మహిళలు ఎక్కువ ఎత్తు తగ్గే అవకాశం ఉంది. ఎందుకంటే వారి ఎముకలు పలుచగా మారడం.. మెనోపాజ్ తర్వాత మరింత త్వరగా జరుగుతుంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రచురితమైన అనేక అధ్యయనాలు చెబుతున్న వివరాల ప్రకారం..

- సాక్షి, స్పెషల్ డెస్క్

ఎంత ఎత్తు కోల్పోతారు?

70 ఏళ్ల వయసు వచ్చేసరికి..
మహిళలు దాదాపు **2 అంగుళాలు** కోల్పోవచ్చు
పురుషులు సగటున **ఒక అంగుళం** తగ్గవచ్చు


80 ఏళ్ల వయసు వచ్చేసరికి
పురుషులు, స్త్రీలు మరో అంగుళం తగ్గవచ్చు



ఎందుకు తగ్గుతారు?

ఆస్టియోపొరోసిస్: చాలామందిలో.. ప్రధానంగా స్త్రీలలో వెన్నెముక సంకోచించడానికి ఈ వ్యాధి ప్రధాన కారణం. ఆస్టియోపొరోసిస్ బారినపడితే ఎముకలు బరువు తగ్గి పలుచగా, గుల్లబారి పెళుసుగా తయారవుతాయి. తేలికపాటి ఒత్తిడికి కూడా ఎముకలు విరిగిపోయే పరిస్థితి ఏర్పడుతుంది.

వెన్నెముక మార్పులు..
వెన్నెముకలో వెన్నుపూస డిస్కులు ఉంటాయి. 80% నీరు కలిగిన ఈ డిస్కులు యవ్వనంలో బలంగా, మృదువుగా ఉంటాయి. వయసు పెరిగే కొద్దీ ఈ డిస్కులు క్రమంగా కుంచించుకుపోతాయి.



కండరాల బలహీనత..
పొట్ట, నడుము కండరాలు బలహీనపడతాయి. ప్రత్యేకించి సార్కోపీనియా అనే పరి స్థితి వల్ల వయసు పెరిగే కొద్దీ కండరాల బరువు, పనిచేసే విధానం, బలం కూడా తగ్గుతాయి. వీటన్నింటి వల్ల వెన్నెముకను నిటారుగా ఉంచడం కష్టమవుతుంది.



పాదాల్లో మార్పులు..
యవ్వనం వరకు కాస్త ఎగుడు దిగుడుగా ఉన్న పాదాలు.. వయసు పైబడుతున్నకొద్దీ చదునుగా మారవచ్చు. దీనివల్ల మొత్తం ఎత్తు తగ్గొచ్చు.



ఈ ప్రక్రియను నెమ్మదించగలరా?

- క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ ఉండాలి.
- ముఖ్యంగా శరీరంలోని కేంద్ర భాగం.. అంటే కటి, తుంటి, వీపు, ఉదర కండరాలను బలోపేతం చేయడానికి, ఎముక పెరుగుదలను ప్రేరేపించడానికి బరువులతో కూడిన వ్యాయామాలు చేయాలి..
- ఎముకల ఆరోగ్యానికి తోడ్పడటానికి ఆహారంలో తగినంత కాల్షియం, విటమిన్–డి ఉండేలా చూసుకోవాలి. 50 ఏళ్లు పైబడిన మహిళలు, 70 ఏళ్లకు పైబడ్డ పురుషులు ప్రతిరోజూ సుమారు సగటున 1,200 మిల్లీగ్రాముల కాల్షియం, విటమిన్–డి తీసుకోవాలి. స్పష్టమైన మోతాదు, ఆయా వ్యక్తుల శరీరానికి తగ్గ అవసరాల కోసం వైద్య నిపుణులను సంప్రదించడం మేలు.



వైద్యులను ఎప్పుడు సంప్రదించాలి



- ఏడాది లేదా రెండేళ్లలో ఒక అంగుళం కంటే ఎక్కువగా ఎత్తు తగ్గితే ఆస్టియోపొరోసిస్ లేదా ఇతర అనారోగ్య సమస్యకు సంకేతం కావచ్చు.
- ఎముకలకు సంబంధించిన ఎలాంటి అనారోగ్య సమస్య వచ్చినా నిర్లక్ష్యం చేయవద్దు.

డ్యూటీమీట్‌కు తెలంగాణ జైళ్లశాఖ సిద్ధం

9 నుంచి 11 వరకు నిర్వహణ..

సాక్షి, హైదరాబాద్: జాతీయ స్థాయిలో జైళ్ల శాఖ నిర్వహించే డ్యూటీ మీట్‌కు ఈసారి తెలంగాణ జైళ్ల శాఖ ఆతిథ్యం ఇవ్వనుంది. బీపీఆర్అండ్‌డీ (బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్), తెలంగాణ జైళ్లశాఖ సంయుక్తంగా ఈనెల 9 నుంచి 11 వరకు మూడు రోజులపాటు నిర్వహించనున్న 7వ ఆల్ ఇండియా డ్యూటీ మీట్‌కు తెలంగాణ జైళ్లశాఖ ఆతిథ్యం ఇస్తోంది. దేశవ్యాప్తంగా 21 రాష్ట్రాలు, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లోని జైళ్లశాఖ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలంగాణ జైళ్లశాఖ డీజీ సౌమ్యా మిశ్రా 'సాక్షి'కి తెలిపారు. తెలంగాణ పోలీస్ అకాడమీలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆయా రాష్ట్రాల జైళ్లశాఖల నుంచి.. జైల్ వార్డర్ నుంచి ఎస్పీ స్థాయి వరకు మొత్తం 1300 మంది జైళ్లశాఖ సిబ్బంది, అధికారులు పాల్గొంటారు. వీరిలో 300 మంది వరకు మహిళలు ఉన్నారు. మొత్తం 31 అంశాల్లో పోటీలను నిర్వహించనున్నారు.

రూ.250 కోట్లతో స్టేట్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్

నేషనల్ హైడ్రాలాజికల్ ప్రాజెక్టు కింద 100% కేంద్ర నిధులతో ఏర్పాటు

అన్ని శాఖల నీటికి సంబంధించిన సమాచారం సేకరణ, విశ్లేషణ

ఎస్‌డబ్ల్యూఐసీ ఏర్పాటుకు ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం

సాక్షి, హైదరాబాద్: నీటిపారుదల, వ్యవసాయం, భూగర్భ జలాలు, ప్రణాళిక, విపత్తుల నిర్వహణ శాఖలకు చెందిన జల సంబంధిత సమాచారాన్ని సేకరించి విశ్లేషించడం కోసం స్టేట్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ (ఎస్‌డబ్ల్యూఐసీ) అనే కొత్త విభాగాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో పనిచేయనున్న ఈ విభాగానికి నేషనల్ హైడ్రాలాజికల్ ప్రాజెక్టు (ఎన్‌హెచ్‌పీ) కింద కేంద్రం 100 శాతం ఆర్థిక సహాయం అందించనుంది. ఇప్పటికే కేంద్రం మంజూరు చేసిన రూ.168 కోట్లతో ఎన్‌హెచ్‌పీ తొలి ప్రాజె క్టును 2025లో రాష్ట్రం పూర్తి చేసింది. దీనిలో భాగంగా రాష్ట్రంలో ఆటోమెటిక్ వాటర్ లెవల్ రికార్డర్స్ (ఏడబ్ల్యూఎల్ఆర్ఎస్) ఏర్పాటు, జలాశయాల్లో పూడిక సర్వేల నిర్వహణ, ప్రాజెక్టుల వద్ద స్కాడా సిస్టమ్స్ ఏర్పాటు, జలాశయాల నుంచి విడుదలయ్యే నీటి పరిమాణాన్ని లెక్కించే యంత్రాల సమీకరణ, దిగువ మానేరు డ్యామ్ వద్ద డేటా కేంద్రం ఏర్పాటు వంటి చర్యలు తీసుకుంది. భూగర్భ జల శాఖ ఆధ్వర్యంలో డిజిటల్ వాటర్ లెవల్ రికార్డర్స్, నీటి నాణ్యత ప్రయోగశాలలు, మొబైల్ నీటి నాణ్యత ప్రయోగశాలలు, భూగర్భ జలాల అట్లాస్ ఏర్పాటు వంటి చర్యలూ తీసుకున్నారు. హైడ్రాలాజికల్ సదుపాయాల అభివృద్ధి, అత్యాధునిక అధ్యయనాల నిర్వహణ, నిర్ణయాలు తీసుకోవడంలో విధానకర్తలకు సహకరించే లక్ష్యంతో 'డబ్ల్యూ–అమ్రితం'పేరుతో చేపట్టిన ప్రాజెక్టును మరింత ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో రాష్ట్రం చేరాలంటే రాష్ట్ర మంత్రివర్గ ఆమోదంతోపాటు తప్పనిసరిగా స్టేట్ వాటర్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీంతో సీఎం అధ్యక్షతన గత నెల 30న జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఎస్‌డబ్ల్యూఐసీ ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదించింది.

రూ.250 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులు..

ఎస్‌డబ్ల్యూఐసీ ఏర్పాటుకు రాష్ట్రం అంగీకరించిన నేపథ్యంలో కేంద్రం నుంచి ఎన్‌హెచ్‌పీ అడ్వాన్స్‌డ్ ఫేజ్ కింద రూ.250 కోట్ల ఆర్థిక సహాయం రాష్ట్రానికి అందనుందని అంచనా వేస్తున్నారు. ఈ నిధులతో హైడ్రాలాజికల్ నెట్‌వర్క్ ఏర్పాటు చేస్తారు. ఎస్‌డబ్ల్యూఐసీ ఏర్పాటుకు అవసరమైన మొత్తం హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌ను అందించడంతో పాటు డెవలప్‌మెంట్ వంటి చర్యలను ఎస్‌డబ్ల్యూఐసీ తీసుకోనుంది.

యూఏఈ పెట్టుబడులకు తెలంగాణే బెస్ట్

'గ్లోబల్ డిజిటల్' లక్ష్యంలో పాలుపంచుకోండి

'ఏఐ' ఆర్ అండ్ డీ సెంటర్‌ను ఏర్పాటు చేయండి

డీప్–టెక్, ఏఐ స్టార్టప్‌లలో పెట్టుబడులు పెట్టండి

యూఏఈని ఆహ్వానించిన ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు



అల్ ఒలామాతో శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణను 'గ్లోబల్ డిజిటల్, ఇన్నోవేషన్ హబ్'గా మార్చాలని కాంగ్రెస్ ప్రభుత్వం సంకల్పించిందని, ఈ లక్ష్య సాధనలో భాగస్వామి కావాలని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆహ్వానించారు. యూఏఈ పర్యటనలో భాగంగా ఆ దేశ మినిస్టర్ ఆఫ్ స్టేట్ ఫర్ ఏఐ, డిజిటల్ ఎకానమీ అండ్ రిమోట్ వర్క్ అప్లికేషన్స్ ఒమర్ బిన్ సుల్తాన్ అల్ ఒలామాతో గురువారం శ్రీధర్‌బాబు భేటీ అయ్యారు. తెలంగాణను 'ఏఐ కేపిటల్ ఆఫ్ ది గ్లోబ్'గా తీర్చి దిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టబోతున్న ఏఐ సిటీ, ఏఐ యూనివర్సిటీ, ఏఐ ఇన్నోవేషన్ హబ్ తదితర ప్రాజెక్టుల గురించి శ్రీధర్ బాబు వివరించారు. భారత్‌లోనే తొలిసారిగా అందుబాటులోకి తెచ్చిన ఏఐ ఆధారిత 'తెలంగాణ డేటా ఎక్స్ఛేంజ్'వల్ల ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, ప్రభుత్వ పాలన తదితర రంగాల్లో కలుగుతున్న ప్రయోజనాల గురించి తెలిపారు. హైదరాబాద్‌లో ఏఐ ఆర్ అండ్ డీ సెంటర్‌ను ప్రారంభించాలని కోరారు. యూఏఈ డిజిటల్ ఆర్థిక సంస్థలకు భారత్‌లో ప్రవేశ కేంద్రంగా హైదరాబాద్ అన్ని రకాలుగా అనుకూలంగా ఉంటుందని తెలిపారు.జీసీసీల ఏర్పాటుకు తెలంగాణఅన్ని రకాలుగా అనుకూలమని, ఇక్కడ యూఏఈ కంపెనీలు నానో– జీసీసీలు, డిజిటల్ హబ్స్ ప్రారంభించేలా చొరవ చూపాలని విన్నవించారు. డీప్–టెక్, ఏఐ స్టార్టప్‌లలో పెట్టుబడులు పెట్టడానికి యూఏఈ సావరిన్ ఫండ్స్, వెంచర్ క్యాపిటల్ సంస్థలకు మంచి అవకాశాలు ఉన్నాయని శ్రీధర్‌బాబు తెలిపారు. 'ఏఐ, స్టార్టప్ సమ్మిట్'ను యూఏఈతో కలిసి నిర్వహించేందుకు తెలంగాణ ఆసక్తిగా ఉందని, ఇందుకు సహకరించాలని కోరారు. గేమింగ్‌లో 'తెలంగాణ–యూఏఈ ఫ్యూచర్ స్కిల్స్ అకాడమీ'ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని ఆహ్వానించారు.

తెలంగాణతో కలిసి పనిచేసేందుకు సిద్ధం: అల్ ఒలామా

తెలంగాణను 'గ్లోబల్ డిజిటల్, ఇన్నోవేషన్'హబ్‌గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను యూఏఈ మంత్రి ఒమర్ బిన్ సుల్తాన్ అల్ ఒలామా ప్రశంసించారు. ఏఐ, డిజిటల్ ఎకానమీ, క్లౌడ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, గేమింగ్ తదితర రంగాల్లో తెలంగాణతో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. 100 బిలియన్ డాలర్ల అంచనా వ్యయంతో యూఏఈ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఏఐ ఆధారిత 'స్టార్ గేట్'ప్రాజెక్టు గురించి మంత్రి శ్రీధర్‌బాబుకు వివరించారు. ఈ ప్రాజెక్టులో తెలంగాణ కీలక భాగస్వామిగా మారాలని ఆకాంక్షించారు. త్వరలో యూఏఇలో నిర్వహించనున్న 'ఫిన్ టెక్ స్టార్టప్స్'సమ్మిట్‌లో తెలంగాణ కంపెనీలను కూడా భాగస్వామ్యం చేస్తామని చెప్పారు.

ప్రసూతి సెలవులు 'ఇద్దరి'కే పరిమితమా?

వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మహిళలకు ప్రసూతి సెలవులు ఇద్దరు బిడ్డలకే పరిమితమా.. వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ప్రభుత్వం నుంచి వివరాలు తెలుసుకుని తమ ముందు ఉంచాలని ప్రభుత్వ న్యాయవాదిని ఆదేశిస్తూ తదుపరి విచారణ ఈనెల 16కు వాయిదా వేసింది. ఇద్దరికంటే ఎక్కువ మంది పిల్లలున్న మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవుపై ఉన్న పరిమితిని సవాలుచేస్తూ రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ రాజీవ్‌గాంధీ నగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న జి.శ్వేత హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 2010, మే 4 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 152ను సవాల్ చేశారు. ఈ జీవో ప్రకారం 180 రోజుల చొప్పున ప్రసూతి సెలవులకు అనుమతి ఉంటుందని.. అయితే ఇద్దరు పిల్లలకే పరిమితమని పేర్కొన్నారు. పరిమితిని తొలగిస్తూ ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున జీపీ ఎస్.సుమన్ విచారణకు హాజరై.. ప్రభుత్వం నుంచి సూచనలు పొందేందుకు సమయం కావాలని కోరారు. దీంతో ధర్మాసనం తదుపరి విచారణ వాయిదా వేసింది.

గిరిజన భాషల కోసం ఏఐ సేవలు...

అందుబాటులోకి వచ్చిన 'ఆదివాణి' యాప్

సాక్షి, హైదరాబాద్: భారతదేశంలో తొలిసారిగా గిరిజన భాషల కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత అనువాద యాప్‌ను ప్రభుత్వం ఆవిష్కరించింది. 'ఆది వాణి'పేరుతో అందుబాటులోకి వచ్చిన ఈ యాప్ ద్వారా హిందీ, ఇంగ్లిష్ భాషలతో పాటు సంతాలి, భీలీ, ముండారి, గోండి వంటి గిరిజన భాషలను పరస్పరం అనువదించుకునే సౌకర్యం లభించనుంది. గిరిజన, గిరిజనేతర సమాజాల మధ్య భాషా అంతరాలను తగ్గించడమే ఈ యాప్ ప్రధాన లక్ష్యం.

ఐఐఐటీ హైదరాబాద్ కీలక పాత్ర...

ఐఐఐటీ హైదరాబాద్, ఐఐటీ ఢిల్లీ, బిట్స్ పిలానీ, ఐఐఐటీ నవ రాయపూర్ వంటి విద్యాసంస్థలు ఈ యాప్‌ను అభివృద్ధి చేశాయి. ఇందులో భాగంగా ఐఐఐటీ హైదరాబాద్ పరిశోధక బృందం అనువాద వ్యవస్థలు, టెక్స్ట్–టు–స్పీచ్ టూల్స్ రూపొందించింది. గిరిజన భాషల నిపుణులు, స్థానికులతో కలిసి పనిచేయడం వల్ల సరిగ్గా అనువాదం సాధ్యమైందని ఆ సంస్థ ప్రొఫెసర్ రాధిక మామిడి తెలిపారు. ఇది కేవలం టెక్నాలజీ ప్రాజెక్టు మాత్రమే కాదు, ఒక సామాజిక మిషన్'అని ఆమె వ్యాఖ్యానించారు. ప్రస్తుతం 'ఆది వాణి' యాప్ గూగుల్ ప్లేస్టోర్‌లో, ప్రత్యేక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఈ యాప్ ద్వారా మరిన్ని గిరిజన భాషలను జోడించాలన్నది బృందం ప్రణాళిక. ముఖ్యంగా కోయ, కొలామీ, చెంచు, లంబాడీ వంటి భాషలకు కూడా ఏఐ ఆధారిత టూల్స్‌ను అభివృద్ధి చేయాలని ఐఐఐటీ హైదరాబాద్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆమె వివరించారు.

విస్తృత సేవలతో ఇందిరమ్మ ఇళ్ల యాప్

ఫొటోలు అప్‌లోడ్ చేసే అవకాశం లబ్ధిదారులకే..

బిల్లుల విడుదల మరింత వేగవంతం.. పారదర్శకతకు పెద్దపీట

హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతమ్

సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులే బిల్లుల కోసం స్వయంగా ఫొటోలు అప్‌లోడ్ చేసే అవకాశం కల్పించినట్టు హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతమ్ తెలిపారు. లబ్ధిదారులకు నిర్దేశిత సమయంలో బిల్లులను విడుదల చేయడానికి ఇది తోడ్పడుతుందన్నారు. గురువారం రాష్ట్రవ్యాప్తంగా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్ కార్పొరేషన్ పీడీలు, ఇతర సిబ్బందితో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమ్ మాట్లాడుతూ లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల యాప్ వినియోగంపై సమగ్రమైన అవగాహన కల్పించాలని సూచించారు. లబ్ధిదారుల వివరాలు, ఇంతవరకు చేసిన చెల్లింపులు తదితర సమాచారమంతా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచి ఎక్కడి నుంచైనా తెలుసుకునే విధంగా యూనివర్సల్ సెర్చ్‌తో మంచి ఫలితాలు కనిపిస్తున్నాయన్నారు. తమ బిల్లు ఎక్కడ ఉంది..ఏ తేదీన, ఎంత మొత్తం ఏ బ్యాంక్ అకౌంట్‌లో జమ అయ్యింది తదితర వివరాలు పారదర్శకంగా అందరికీ అందుబాటులోకి తేవడంతో లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం తగ్గిపోతుందని చెప్పారు. గురువారం నుంచి ఈ విధానాన్ని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చినట్టు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు/బిల్ కలెక్టర్లు తదితర స్థాయిల్లో ఉద్దేశపూర్వక జాప్య నివారణకు, అక్కడక్కడా జరుగుతున్న అవినీతిని అరికట్టడానికి ఈ విధానాన్ని ప్రవేశపెట్టామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో హౌసింగ్ కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్ ఎం.చైతన్యకుమార్, సూపరింటెండెంటింగ్ ఇంజనీర్ భాస్కర్‌రెడ్డి, జనరల్ మేనేజర్ మమత, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అప్‌లోడ్ చేసేది ఇలా...

- మొదటగా మొబైల్ ఫోన్‌లో ఇందిరమ్మ ఇళ్ల యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఆ తర్వాత బెనిఫిషియరీ లాగిన్‌లో మొబైల్ నంబరు ఎంటర్ చేస్తే ఓటీపీ వస్తుంది.
- ఓటీపీ ఎంటర్ చేసిన తర్వాత డ్యాష్ బోర్డులో లబ్ధిదారుడి పేరు, మొబైల్ నంబరు తదితర వివరాలతోపాటు ఫొటోలు తీయడం (క్యాప్చర్ ఫొటోగ్రాఫ్) అనే వాటి కింద ఇళ్ల నిర్మాణపు దశలు (గ్రౌండింగ్, బేస్‌మెంట్, వాలింగ్, స్లాబ్, నిర్మాణం పూర్తి) అని కనిపిస్తాయి.
- లబ్ధిదారులు గ్రౌండింగ్ స్థాయి ఫొటోలు అప్‌లోడ్ చేయాలనుకుంటే గ్రౌండింగ్‌పై క్లిక్ చేస్తే దరఖాస్తుదారుడికి సంబంధించిన వివరాలు కనిపిస్తాయి. లబ్ధిదారులు ప్రతిపాదిత ఇంటి నిర్మాణ స్థలం నుంచే మొబైల్ ఫోన్‌లోని కెమెరాతో ఫొటోలు తీయాలి, ఇక్కడే కెమెరాలో జియో ట్యాగింగ్ నిమిత్తం మ్యాప్ సింబల్‌ను క్లిక్ చేసి వివరాలు నమోదు చేసి, ఒకసారి సరిచూసుకున్న తర్వాత సబ్మిట్ చేయాలి. ఆ తర్వాత వెనక్కి వెళ్లి గ్రౌండింగ్ బటన్‌పై క్లిక్ చేస్తే వివరాలన్నీ కనిపిస్తాయి.
- బేస్‌మెంట్ స్థాయిలో నిర్మాణ పనులు జరుగుతున్న ఇంటి వద్ద లబ్ధిదారుతోపాటు ముందువైపు నుంచి, పక్క నుంచి, పైనుంచి (టాప్ యాంగిల్) ఫొటోలు తీయాలి, ఈ ఫొటోలు గ్రౌండింగ్ సమయంలో తీసిన ప్రాంతం సమీపం నుంచే తీయాలి. ఆపై యాప్‌లో అడిగిన సమాచారాన్ని నమోదు చేసి సబ్మిట్ చేయాలి.
- ఇదే తరహాలో వాలింగ్ దశలోనూ, స్లాబ్ దశలోనూ, ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత ఫొటోలు తీసి లబ్ధిదారులే నేరుగా బిల్లుల కోసం అప్‌లోడ్ చేయొచ్చు.
- గ్రామ కార్యదర్శులు, ఎంపీడీఓలు, డీఈఈలు పీడీ, తదితర అధికారులు, ఈ విధంగా నమోదైన వివరాలను క్షేత్రస్థాయిలో సరిచూసుకున్న తర్వాతనే లబ్ధిదారులకు బిల్లులు విడుదల చేస్తారు.

'ఇథనాల్ బ్లెండింగ్' కుటుంబ పథకమైంది

కేంద్ర మంత్రి గడ్కరీపై కాంగ్రెస్ ఆరోపణలు

న్యూఢిల్లీ: కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ దేశంలో పెట్రోల్ ఉత్పత్తుల్లో ఇథనాల్‌ను తప్పనిసరిగా కలిపే విధానాన్ని తన కుటుంబానికి మేలు చేసే లాభసాటి పథకంగా మార్చారని కాంగ్రెస్ ఆరోపించింది. పెరుగుతున్న ఇంధన ధరలతో ప్రజలు ఇబ్బంది పడుతుంటే గడ్కరీ కుమారుల కంపెనీలు మాత్రం లాభాలు గడించాయని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పవన్ ఖెడా ఆరోపించారు. గురువారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. మోదీజీ ఓటు చోరీతో వచ్చిన బీజేపీ ప్రభుత్వం, ఇప్పుడు పెట్రోల్ చోరీ, కల్తీలతో అధికారాన్ని కొనసాగిస్తోందని ఆరోపించారు. గడ్కరీ కొడుకు నిఖిల్ యాజమాన్యంలో ఉన్న సియాన్ ఆగ్రో ఇండస్ట్రీస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌ను ఆయన ఉదహరించారు. కంపెనీ ఆదాయం జూన్ 2024లో రూ.18 కోట్లు ఉండగా.. జూన్ 2025 నాటికి రూ.523 కోట్లకు పెరిగిందన్నారు. మరో కొడుకు సారంగ్ మానస్ ఆగ్రో ఇండస్ట్రీస్ డైరెక్టర్‌గా ఉన్నారని, ఆయనా ఇథనాల్ ఉత్పత్తిలోనూ పాలుపంచుకున్నారని ఆరోపించారు. ఇథనాల్–మిశ్రమ ఇంధనం గురించి 2018లో ఇచ్చిన హామీలేవీ కార్యరూపం దాల్చలేదని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తుందని బీజేపీ చెప్పినా.. తగ్గకపోగా ధరలు పెరిగాయన్నారు. ఏడేళ్లుగా ఇదే జరుగుతున్నా ఒక్క పైసా కూడా సామాన్యుడికి ఎందుకు చేరలేదని ప్రశ్నించారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

చీర నేసేదెప్పుడు.. కట్టేదెప్పుడు?

లక్ష్యానికి ఆమడదూరంలో ఇందిరా మహిళాశక్తి చీరల ఉత్పత్తి

- ఆర్డర్ల లక్ష్యం 4.63 కోట్ల మీటర్లు
- సేకరించిన చీరల బట్ట 1.85 కోట్ల మీటర్లు
- ఇంకా సాంచాలపై 69 లక్షల మీటర్లు
- సూరత్ పంపిన చీరల బట్టలో నాణ్యత లోపాలు
- 65 లక్షల మందికి చీరల పంపిణీ లక్ష్యం
- చీరల పంపిణీకి సీఎం హామీ ఇచ్చి ఏడాది



సిరిసిల్లలో ఇందిరా మహిళాశక్తి చీరల బట్టను ఉత్పత్తి చేస్తున్న నేత కార్మికుడు కందుకూరి రమేశ్

ఇతను కందుకూరి రమేశ్. సిరిసిల్ల పట్టణంలోని బీవై నగర్‌లో పవర్‌లూమ్స్ (మరమగ్గాల)పై ఇందిరా మహిళాశక్తి చీరల బట్టను ఉత్పత్తి చేస్తున్నాడు. పది సాంచాలపై పది గంటలపాటు పని చేస్తే.. ఒక్కో మగ్గంపై నిత్యం 50 మీటర్ల చీరల బట్ట ఉత్పత్తి అవుతుంది. నెలంతా పనిచేస్తే రమేశ్‌కు రూ.20 వేల వరకు కూలీ వస్తుంది. అదే పాలిస్టర్ బట్టను ఉత్పత్తి చేస్తే నెలకు రూ.10 వేలు వస్తాయి. ఇందిరా మహిళాశక్తి చీరల బట్టను ప్రభుత్వం ఆర్డర్ చేయడంతో కూలీ డబ్బులు ఎక్కువగా వస్తాయి. ఇలా సిరిసిల్లలో 9,600 పవర్‌లూమ్స్‌పై చీరల బట్ట ఉత్పత్తి అవుతుంది. అంటే రోజుకు 4.80 లక్షల మీటర్ల బట్ట ఉత్పత్తి అవుతుంది. ఆరు నెలల కిందట చీరల ఉత్పత్తి ఆర్డర్లు ఇస్తే ఇప్పుడిప్పుడే గాడిలో పడింది. కానీ సెప్టెంబరు నెలాఖరులోగా చీరల ఉత్పత్తి లక్ష్యం నెరవేరే అవకాశం లేదు.

సిరిసిల్ల: ఇందిరా మహిళాశక్తి చీరల ఉత్పత్తి లక్ష్యం చేరడం లేదు. ఉత్పత్తి నెమ్మదిగా సాగుతుండటంతో ఇప్పటికే అధికారులు రెండు సార్లు గడువు పొడిగించారు. ప్రస్తుతం పవర్‌లూమ్స్ సంఖ్య పెరగడంతో చీరలబట్ట ఉత్పత్తి వేగం పుంజుకుంది. సిరిసిల్లలోని 131 మ్యాక్స్ సంఘాలకు వస్త్రోత్పత్తి ఆర్డర్లు ఇచ్చారు. సిరిసిల్లతోపాటు కరీంనగర్, హనుమకొండ జిల్లాల్లోనూ చీరల ఉత్పత్తి ఆర్డర్లను అందించారు. కానీ సిరిసిల్లలో మెజార్టీ పవర్‌లూమ్స్ ఉండటంతో ఇక్కడే ఎక్కువగా ఆర్డర్లు ఇచ్చారు. ఫిబ్రవరిలో మొదటిసారి 2.12 కోట్ల మీటర్ల ఆర్డర్లు ఇవ్వగా.. రెండో విడతగా ఏప్రిల్‌లోనూ మరో 2.12 కోట్ల మీటర్ల ఆర్డర్లు ఇచ్చారు. ఈ బట్ట ఉత్పత్తికి వేములవాడలో ప్రభుత్వమే యారన్(నూలు) డిపో ఏర్పాటు చేసింది. నూలును నేరుగా కొనుగోలు చేసి బఫర్ స్టాక్‌గా ఉంచడానికి రూ.50 కోట్ల కార్పస్ నిధిని మంజూరు చేసింది. సిరిసిల్ల వస్త్రోత్పత్తిదారులకు నూలును 90 శాతం అరువుపై సరఫరా చేసింది. ఇప్పటి వరకు మ్యాక్స్ సంఘాలకు 2,253 మెట్రిక్ టన్నుల నూలును సరఫరా చేశారు. ఆ నూలుతో చీరల బట్ట ఉత్పత్తి అవుతుంది. అన్ని ప్రాంతాల్లోనూ బట్ట ఉత్పత్తి అవుతున్నా.. సిరిసిల్లలో స్లోగా సాగడంతో అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదు.

నాణ్యత.. నవ్యత సమస్యలు

సిరిసిల్లలో ఉత్పత్తి అయిన బట్ట నాణ్యతను పరిశీలించి గోదాములో సేకరిస్తున్నారు. కానీ చీరల బట్టకు బార్డర్ డిజైన్ ఉండటంతో జోట వేసిన తరువాత కినారె దగ్గర మిగిలిన పోగులను, తెగిన పోగులు చీరల ప్రింటింగ్ దగ్గర ఇబ్బందిగా మారింది. ఇటీవల సూరత్ ప్రాసెసింగ్ మిల్లులకు చీరల బట్టను పంపించగా నాణ్యత లోపాలు వెలుగు చూశాయి. తెగిన పోగులు వెంటనే మగ్గంపైనే ఎదురు పోగు కట్టి ఎక్కించాలి. ఈ సమయంలో నేతన్నలు తమ చేతులను శుభ్రంగా ఉంచుకోకపోవడంతో పోగు ఎక్కించినప్పుడు ఆ చుట్టు పక్కన పోగులు నల్లగా అవుతున్నాయి. పోగులు ఎక్కించిన తరువాతనే సాంచాలను స్టార్ట్ చేయాలి. పోగులు తెగిపోయినా సాంచాను ఆపకుండా ఉత్పత్తి చేయడంతో చీరల బట్ట నాణ్యత దెబ్బతింటుంది. బట్టపై చాక్‌పీస్, బాల్‌పెన్ను గుర్తులు లేకుండా చూడాలని, ప్రతి బట్ట ముక్క 30 మీటర్లకుపైగా ఉండాలని లేకుంటే రిజెక్టు చేస్తామని స్పష్టం చేశారు. చీరల బట్ట నాణ్యతపై అనేక అంశాలను సూచించారు. ఇలాంటి సమస్యలు ఉండడంతో ఇందిరా మహిళాశక్తి చీరల బట్ట ఉత్పత్తి నిదానంగా సాగుతోంది.

సిరిసిల్లలో ఇందిరా మహిళా శక్తి చీర ప్రదర్శన రాష్ట్రంలోని 65 లక్షల మంది మహిళా సంఘాల సభ్యులకు ఏకరూప చీరలను అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. గత ఏడాది ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఏటా మహిళా సంఘాల సభ్యులకు రెండు చీరలను ఇస్తామని ప్రకటించారు. గతంలో బతుకమ్మ చీర ఖరీదు రూ.350 ఉండగా.. ఈ ఏడాది ఇందిరా మహిళా శక్తి చీర ఖరీదు రూ.480గా నిర్ధారించారు. ఈమేరకు నాణ్యమైన నూలును ప్రభుత్వమే సరఫరా చేస్తూ చీరల బట్టను ఉత్పత్తి చేయిస్తోంది. ఈమేరకు ఆగస్టు 26న రాష్ట్ర చేనేత జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, మరో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చేనేత, జౌళిశాఖ కమిషనర్ శైలజారామయ్యర్ ఇందిరా మహిళాశక్తి తొలి చీరను ప్రదర్శించారు. పాలపిట్ట కలర్‌లో చీరను డిజైన్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకేసారి చీరల పంపిణీకి శ్రీకారం చుట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే రెండు గడువులు విధించినా చీరల ఉత్పత్తి లక్ష్యాన్ని వస్త్రోత్పత్తిదారులు సాధించలేకపోతున్నారు. ఇప్పటికే సరఫరా చేసిన చీరల బట్టకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉండడం స్లో కావడానికి మరో కారణంగా భావిస్తున్నారు.

సిరిసిల్లలో పవర్‌లూమ్ పరిశ్రమ స్వరూపం

- పవర్‌లూమ్స్: 26,302
- మ్యాక్స్ సంఘాలు: 131
- నూలు డిపో ద్వారా సరఫరా అయిన నూలు: 2,253 మెట్రిక్ టన్నులు
- ప్రస్తుతం మహిళా శక్తి చీరల బట్టను నడుపుతున్న సాంచాలు: 9,600
- ఇప్పటి వరకు సేకరించిన చీరల బట్ట: 1,85,28,754 మీటర్లు
- పవర్‌లూమ్స్‌పై ఉత్పత్తి అవుతున్న బట్ట: 69,66,656 మీటర్లు
- చీరల బట్ట ఇవ్వాల్సిన గడువు: సెప్టెంబరు 30
- ప్రభుత్వ ఆర్డర్లతో నేతన్నలకు పని లభించే కాలం: 6 నుంచి 8 నెలలు

ఇప్పటి వరకు పొందిన చీరల బట్ట ఆర్డర్లు: 4.24 కోట్ల మీటర్లు



ఇటీవల సాంచాల సంఖ్య పెరిగింది

ఇటీవల చీరల బట్టను ఉత్పత్తి చేసే సాంచాల సంఖ్య పెరిగింది. మొన్నటి వరకు తక్కువ సాంచాలపై చీరల బట్ట ఉత్పత్తి అయ్యేది. బట్ట ఉత్పత్తిలో నాణ్యత సమస్యలు ఎదురయ్యాయి. కానీ ఇప్పుడు క్వాలిటీతో బట్ట ఉత్పత్తి అవుతుంది. మరిన్ని సాంచాలపై చీరల బట్టను ఉత్పత్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే బట్ట ఉత్పత్తి లక్ష్యం సాధించిన మ్యాక్స్ సంఘాలకు మరిన్ని ఆర్డర్లు ఇచ్చి గడువులోగా లక్ష్యం సాధిస్తాం.

– రాఘవరావు, చేనేత, జౌళిశాఖ ఏడీ, సిరిసిల్ల



ఇందిరా మహిళా శక్తి చీరను సిరిసిల్లలో ప్రదర్శించిన మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



సిరిసిల్ల గోదాముకు చేరిన చీరల బట్ట గట్టాలు





సిరిసిల్ల గోదాములో చీరల వస్త్ర నాణ్యతను పరిశీలిస్తున్న మహిళలు, టీఏలు

నాలుగు గనులకు ఫైవ్ స్టార్ రేటింగ్

సింగరేణి సీఎండీ బలరామ్‌కు అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న బలరామ్

కొత్తగూడెం అర్బన్: పర్యావరణ హిత చర్యలు, సంక్షేమం, సౌకర్యాల కల్పనలో సింగరేణి పరిధిలోని నాలుగు బొగ్గు గనులు గత ఆర్థిక సంవత్సరం ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించాయి. ఈ సందర్భంగా గురువారం ముంబైలో జరిగిన కార్యక్రమంలో.. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి నుంచి సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ అవార్డులు స్వీకరించారు. ఫైవ్ స్టార్ రేటింగ్ అవార్డులు అందుకున్న గనుల్లో రామగుండం-3 ఏరియాకు చెందిన ఆర్జీ ఓసీ-1 ఎక్స్‌టెన్షన్, ఇల్లెందు ఏరియాకు చెందిన జేకే-5 ఓసీ, భూగర్భ గనుల్లో శ్రీరాంపూర్ ఏరియాకు చెందిన ఆర్కే-6 గని, ఆర్కే న్యూటెక్ గనులు ఉన్నాయి. దేశంలో అత్యుత్తమ గనుల్లో తీసుకుంటున్న రక్షణ చర్యలు, పర్యావరణ హిత చర్యల ఆధారంగా.. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఏటా స్టార్ రేటింగ్ ఇస్తుంది. నిర్వహణ, సౌకర్యాలు, కార్మిక సంక్షేమం తదితర 84 అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. రెండు దశల్లో వడపోత అనంతరం.. మొత్తం 100 మార్కులకు 91 కన్నా ఎక్కువ మార్కులు సాధించిన గనులకు ఫైవ్ స్టార్ రేటింగ్ ఇస్తారు. ఈసారి సింగరేణి సంస్థలోని నాలుగు గనులు అవార్డు దక్కించుకోవడం విశేషం.

ఆక్రమణల్లో 7 లక్షల ఎకరాల అటవీ భూములు!

సాక్షి, హైదరాబాద్: అనధికార లెక్కల ప్రకారం చూస్తే...ఇప్పటికే 7 లక్షల ఎకరాల అటవీభూమి ఆక్రమణలకు గురైనట్టుగా తెలుస్తోంది. రాష్ట్రంలోనూ రోజురోజుకు అటవీ ఆక్రమణలు పెరుగుతుండగా...దేశవ్యాప్తంగా చోటుచేసుకుంటున్న ఆక్రమణలను కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. రాష్ట్రాల వారీగా ఈ ఆక్రమణలకు సంబంధించిన పూర్తి వివరాలు, సమాచారం పంపించాలని ఆదేశించింది.

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కొత్తగా ఆక్రమణలు వెలుగులోకి వస్తున్న సందర్భంలోనే...గతనెలలో 8న, మళ్లీ 19న అరణ్యభవన్ నుంచి జిల్లాల వారీగా ఆక్రమణలకు సంబంధించి డేటాను పంపించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. దీనికి సంబంధించిన నివేదికను కేంద్ర అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల శాఖకు పంపించాల్సి ఉండటంతో జిల్లా అటవీ అధికారులకు అర్జెంట్ ఈ-మెయిల్‌ను పంపించినట్టు సమాచారం. జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) కేసుకు సంబంధించి అటవీ ఆక్రమణల వివరాలు సమర్పించాల్సి ఉన్న విషయం తెలిసిందే. ఈ ఏడాది జూలై 31 నాటికి ప్రతీ జిల్లాలో చోటుచేసుకున్న ఆక్రమణలకు సంబంధించిన సమాచారం, గత ఐదేళ్లలో ఆక్రమణలపై తీసుకున్న చర్యలు, జూలై 31 నాటికి జిల్లాల వారీగా నష్టపోయిన అటవీ శాతం తదితర వివరాలను పంపించాలని అటవీశాఖ ఉన్నతాధికారులు ఆదేశించారు.



ఆయా కమిటీల్లో ఎవరెవరు ఉంటారంటే....

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు కొద్దిరోజుల క్రితం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం... జిల్లా స్థాయిలో కలెక్టర్ల చైర్మన్‌గా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సభ్యుడిగా, జిల్లా అటవీ అధికారి సభ్యకార్యదర్శిగా, అసిస్టెంట్ డైరెక్టర్/ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే (సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్) సభ్యుడిగా ప్రత్యేక దర్యాప్తు బృందాలు (సిట్) ఏర్పాటయ్యాయి. ఈ సిట్‌లు రెవెన్యూశాఖ అధీనంలోని ఏదైనా రిజర్వ్ ఫారెస్ట్‌లో వ్యక్తులు లేదా సంస్థలకు అటవీయేతర అవసరాలకు భూమిని కేటాయించిన అంశాన్ని పరిశీలిస్తాయి. రిజర్వ్ ఫారెస్ట్‌లలో వ్యక్తులు, సంస్థలకు కేటాయించిన అటవీయేతర అవసరాలకు కేటాయించిన అటవీ భూమిని స్వాధీనం చేసుకొని, దానిని అటవీశాఖకు అప్పగించేందుకు

– ప్రతీ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఆర్డీఓ చైర్మన్‌గా, డీఎస్పీ సభ్యుడిగా. ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ సభ్యకార్యదర్శిగా, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్‌సర్వే (సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్) సభ్యుడిగా ప్రత్యేక బృందాలు ఏర్పాటయ్యాయి.

రాష్ట్రంలో 26.9 లక్షల హెక్టార్లలో అడవులు



రాష్ట్రంలో మొత్తం కలిపి 26.9 లక్షల హెకార్ల విస్తీర్ణంలో (24 శాతం) అడవి ఉంది. అందులో 2.94 లక్షల హెక్టార్లు (దాదాపు 11 శాతం) అన్యాక్రాంతమైనట్టు అటవీశాఖ రికార్డుల్లో ఉన్నట్టు తెలిసింది. వాస్తవానికి ఈ ఆక్రమణలు మరో మూడు శాతం వరకు ఉంటాయని అటవీ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతమున్న అడవి కూడా ఎక్కువగా కొండలు, గుట్టలపైనే మిగిలిందని, అధిక శాతం దట్టమైన అడవి ఇప్పటికే కనుమరుగవుతోందని, ఇంకా ఉపేక్షిస్తే అసలు అడవి అనేదే నామరూపాలు లేకుండా పోతుందని హెచ్చరిస్తున్నారు.

ఆర్‌ఓఎఫ్‌ఆర్ కింద...

2006 అటవీ హక్కుల గుర్తింపు చట్టం (రికగ్నిషన్ ఆఫ్ ఫారెస్ట్ రైట్స్ యాక్ట్-ఆర్‌ఓఎఫ్‌ఆర్) కింద 2017 చివరి నాటికి మొత్తం 11 లక్షల ఎకరాల్లో తమకు హక్కులు కల్పించాలంటూ 1,86,534 క్లెయిమ్స్ అందాయి. ఆయా విభాగాల వారీగా చూస్తే...

- 1,83,107 మంది వ్యక్తిగతంగా (6,30,714 ఎకరాలకు), సామూహికంగా (కమ్యూనిటీ) 3,427 క్లెయిమ్స్ (4,70,605 ఎకరాలకు) రూపంలో దరఖాస్తులు అందాయి. వాటిలో వ్యక్తిగత క్లెయిమ్స్‌లో భాగంగా 93,494 మందికి 3 లక్షల ఎకరాలకు హక్కుపత్రాలు పంపిణీ చేశారు. సామూహికంగా 721 క్లెయిమ్స్‌కు 4,54,055 ఎకరాలకు హక్కుపత్రాలు అందజేశారు.
- 80.890 వ్యక్తిగత క్లెయిమ్స్ (2,90,589 ఎకరాలు) 1,682 కమ్యూనిటీ క్లెయిమ్స్ (11,988 ఎకరాల)ను తిరస్కరించారు.
- 8,723 వ్యక్తిగత క్లెయిమ్స్(40,033 ఎకరాలు)1,024 కమ్యూనిటీ క్లెయిమ్స్ (4,562 ఎకరాలు) పెండింగ్‌లో ఉన్నట్టుగా అటవీ, ఎస్టీ సంక్షేమ శాఖల రికార్డులను బట్టి స్పష్టమవుతోంది.

రెండేళ్ల క్రితం నాటి వివరాల ప్రకారం చూస్తే...

జిల్లాల వారీగా అటవీ విస్తీర్ణం, ఆక్రమణలు ఇలా...(హెక్టార్లలో)


జిల్లా	అటవీ విస్తీర్ణం	ఆక్రమణ	ఆక్రమణల శాతం
ఆదిలాబాద్	1,70,689	35,890	21.009
భద్రాద్రి	4,28,698	78,199	18.241
హైదరాబాద్	143	1	0.699
జగిత్యాల	55,491	2,324	4.188
జనగామ	3,075	0	0
జోగులాంబ	679	0	0
కామారెడ్డి	86,899	7,931	9.127
కరీంనగర్	347	24	6.862
ఖమ్మం	62,189	17,285	27.794
ఆసిఫాబాద్	2,42,017	34,997	14.461
మహబూబాబాద్	1,49,070	40,291	27.028
మంచిర్యాల	1,76,117	5,430	3.083
మెదక్	56,341	3,632	6.447
మేడ్చల్	8,912	120	1.343
నాగర్‌కర్నూల్	2,49,849	0	0
నల్లగొండ	64,485	3,108	4.819
నిర్మల్	1,21,308	9,224	7.640
నిజామాబాద్	85,321	2,819	3.305
పెద్దపల్లి	30,491	1,195	3.918
రాజన్నసిరిసిల్ల	37,914	1,014	2.675
రంగారెడ్డి	29,273	905	3.093
సంగారెడ్డి	20,368	2,658	13.049
సిద్దిపేట	25,218	1,880	7.454
సూర్యాపేట	11,778	0	0
వికారాబాద్	43,297	5,561	12.844
వనపర్తి	11,874	494	4.156
వరంగల్-రూరల్	16,359	13,930	85.151
వరంగల్-అర్బన్	2,876	0	0
యాదాద్రి	11,697	980	8.375
మహబూబ్‌నగర్ (నారాయణపేట కలిపి)	37,084	2,362	6.370
జయశంకర్ భూపాలపల్లి (ములుగు కలిపి)	4,50,504	22.470	4.988

పదేళ్ల తర్వాత యుద్ధ నౌకల పండగ



వచ్చే ఏడాది ఫిబ్రవరి 14 నుంచి ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ

- 2016 తర్వాత ఆతిథ్యమిస్తున్న భారత్
- విశాఖ కేంద్రంగా మరోసారి నిర్వహణకు సిద్ధం
- 145 దేశాలకు ఆహ్వానం పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్న ఇండియన్ నేవీ
- ఈసారి చైనాకు ఆహ్వానించే అంశంపై రక్షణ మంత్రిత్వ శాఖ చర్చలు



యుద్ధ నౌకలు, యుద్ధ విమానాల విన్యాసాలు

సాక్షి, విశాఖపట్నం : అంతర్జాతీయంగా స్నేహపూర్వక వాతావరణం, సమన్వయం, సహకారంతో మహా సముద్రాల మధ్య బంధాల్ని బలోపేతం చేసే మహోజ్వల ఘట్టానికి విశాఖ నగరం మరోసారి వేదికగా మారుతోంది. నీలి కెరటాల్లో నౌకదళ పరాక్రమాన్ని చాటిచెప్పే విన్యాసాలకు తూర్పు నౌకాదళం ఆతిథ్యమివ్వబోతోంది. దాదాపు పదేళ్ల తర్వాత.. విశాఖ నగరంలో యుద్ధ నౌకల పండుగగా పిలిచే.. ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ-2026 నిర్వహించేందుకు భారత నౌకాదళం ప్రణాళికలు రూపొందించింది. ఫిబ్రవరిలో ఐఎఫ్ఆర్‌తో పాటు మిలాన్-2026 కూడా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 14 నుంచి 24 వరకూ ఐఎఫ్ఆర్‌తో పాటు మిలాన్-2026ని విశాఖలో నిర్వహించనున్నారు. చరిత్రలో నిలిచిపోయేలా దాదాపు 145 దేశాలకు ఆహ్వానాలు పంపించేందుకు సమాయత్తమవుతుండగా.. చైనాని పిలవాలా వద్దా అనే అంశంపై రక్షణ మంత్రిత్వ శాఖలో చర్చలు జరుగుతున్నాయి. నౌకాదళ పరాక్రమాన్ని చాటిచెప్పేలా 2026 ఫిబ్రవరిలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ(ఐఎఫ్ఆర్)కు విశాఖ మహా నగరం ఆహ్వానం పలకనుంది. తూర్పు నావికాదళ కేంద్రంగా అభివృద్ధి చెందిన విశాఖ తీరం.. అనేక ఆధునిక యుద్ధ వ్యవస్థలతో మన సైనిక సంపత్తిలో కీలక స్థానం సంపాదించింది. ఇప్పుడు అంతర్జాతీయ యుద్ధనౌకల ప్రదర్శన పేరు చెప్తే వెంటనే విశాఖ గుర్తొచ్చే స్థాయికి ఎదిగింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సహకారంతో 2022లో ప్రతిష్టాత్మకమైన ప్రెసిడెంట్ ఫ్లీట్ రివ్యూతో పాటు మిలాన్‌ని విజయవంతంగా నిర్వహించింది. అదేవిధంగా.. 2024 ఫిబ్రవరిలో రికార్డు స్థాయిలో మిలాన్ విన్యాసాల్ని మరోసారి నిర్వహించింది. ఇప్పుడు అత్యంత ప్రతిష్టాత్మకమైన ఐఎఫ్ఆర్‌కు ఆతిథ్యమిస్తోంది.

ఏమిటీ ఫ్లీట్ రివ్యూ

దేశ సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు సాగరంలో ఎదురుదాడికి దిగగల తన సత్తాను ప్రపంచదేశాలకు చాటిచూపించేవే ఫ్లీట్ రివ్యూలు. త్రివిధ దళాల అధిపతి అయిన రాష్ట్రపతి ఆధ్వర్యంలో వీటిని నిర్వహిస్తారు. మనదేశంలో 2001లో ముంబైలోనూ 2016లో విశాఖలో ఐఎఫ్ఆర్‌ని నిర్వహించారు. ప్రస్తుతం మరోసారి అంతర్జాతీయ యుద్ధనౌకల విన్యాసాలకు విశాఖ వేదికగా నిలవబోతోంది. చంద్రగుప్తుని కాలంనుంచే భారతీయులు సముద్రయానంపై మంచి పట్టు సాధించినట్లు చరిత్ర చెబుతోంది. ఆనాటి నుంచి నేడు స్వయం శక్తితో అణుజలాంతర్గాములు నిర్మించే స్థాయికి చేరుకున్న భారత్ ప్రపంచదేశాలను ఆకర్షిస్తూ ఉంది. అంతర్జాతీయ యుద్ధనౌకల ప్రదర్శనతో ప్రపంచదేశాలు మరోసారి విశాఖతీరంవైపు దృష్టిసారించనున్నాయి.

చైనాని పిలవాలా.. వద్దా.?

ఇటీవల చైనాతో చర్చలు జరిగిన నేపథ్యంలో.. ఐఎఫ్ఆర్‌కు చైనాని ఆహ్వానించాలా వద్దా అనే అంశంపై రక్షణ మంత్రిత్వ శాఖ ప్రత్యేక చర్చలు జరుపుతోంది. 2016లో నిర్వహించిన ఐఎఫ్ఆర్‌కు చైనాని ఆహ్వానించగా రెండు యుద్ధ నౌకలు, ఓ జలాంతర్గామి విన్యాసాల్లో పాలుపంచుకున్నాయి. ఈసారి ఆహ్వానం అందించాలా వద్దా అనే దానిపై త్వరలోనే స్పష్టత వస్తోందని నౌకాదళ వర్గాలు చెబుతున్నాయి. అయితే.. ఇప్పటి వరకూ భారత్‌లో జరిగే ఏ విన్యాసాలకు పాక్‌ని ఆహ్వానించలేదు. రాబోతున్న ఐఎఫ్ఆర్, మిలాన్-2026కి కూడా ఆహ్వానం లేదని రక్షణ వర్గాలు తెగేసి చెబుతున్నాయి. ఆసియా, ఐరోపా, ఆస్ట్రేలియా, ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా, ఆఫ్రికా ఖండాలకు చెందిన దేశాలు ఐఎఫ్ఆర్‌లో భాగస్వామ్యం కాబోతున్నాయి.

తొలిసారి 25.. మూడోసారి 145

2001లో భారత్‌లో తొలిసారి ముంబైలో ఐఎఫ్ఆర్ నిర్వహించిన సమయంలో 25 దేశాలు హాజరయ్యాయి. 2016లో విశాఖలో నిర్వహించినప్పుడు 51 దేశాలు హాజరయ్యాయి. 2025లో ఇండోనేషియాలోని బాలి సముద్ర తీరంలో ఐఎఫ్ఆర్‌లో 30 దేశాలు పాల్గొన్నాయి. ఈసారి మాత్రం రికార్డు స్థాయిలో 145 దేశాలకు ఆహ్వానం పంపించాలని భారత్ నిర్ణయించింది. ఈ మేరకు ఇండియన్ నేవీ సన్నాహక సమావేశాలు నిర్వహిస్తూ.. ఏర్పాట్లు ముమ్మరం చేసింది. ఈ విన్యాసాల్లో భారత నావికా దళానికి చెందిన సర్ఫేస్ యుద్ధనౌకలు, జలాంతర్గాములతోపాటు నావల్ ఏవియేషన్ విమానాలు పాల్గొంటున్నాయి. ఢిల్లీ క్లాస్, రాజ్‌పుత్ క్లాస్, కమోర్తా క్లాస్, విశాఖ క్లాస్, శివాలిక్ క్లాస్, బ్రహ్మపుత్ర క్లాస్, నీలగిరి మొదలైన తరగతులకు చెందిన యుద్ధ నౌకలతో పాటు జలాంతర్గాములు, యుద్ధనౌకలకు అన్నివిధాల సహకారాన్ని అందించే ఫ్లీట్ టాంకర్లు, టార్పెడో రికవరీ వెసల్స్, గ్రీన్ టగ్స్ సత్తా చాటనున్నాయి. అలాగే కోస్ట్ గార్డ్, షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ (ఎన్ఐఓటీ) వంటి ఇతర సముద్ర సంస్థలకు చెందిన నౌకలు ఈ ఫ్లీట్ రివ్యూలో భాగస్వామ్యం కానున్నాయి.



2016 ఐఎఫ్ఆర్‌లో అప్పటి రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ, ప్రధాని మోదీ

క్లుప్తంగా...

ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్-2 రాజీనామా

సాక్షి, అమరావతి: ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్-2 పి.ఉమా మహేశ్వరి దేవి రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామాను ఆమోదిస్తూ ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

గిరిజనుల సమస్యలను పరిష్కరించండి

గవర్నర్‌కు సీపీఎం ప్రతినిధి బృందం వినతి

సాక్షి, అమరావతి: పోలవరం నిర్వాసితులు, ఐదవ షెడ్యూల్ ప్రాంత గిరిజనుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేలా తగిన చర్యలు చేపట్టాలని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు సీపీఎం రాష్ట్ర ప్రతినిధి బృందం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నేతృత్వంలోని బృందం రాజ్‌భవన్‌లో గురువారం గవర్నర్‌ను కలిసి వినతిపత్రం అందించింది. పోలవరం నిర్వాసితులు పదేళ్లుగా అనేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. 5వ షెడ్యూల్డ్ ప్రాంతంలో పెసా, అటవీ హక్కుల కమిటీ ఆమోదం లేకుండానే ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం సరికాదని, 1/70 యాక్ట్, పెసా, అటవీ హక్కుల చట్టాలను పరిరక్షించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి తన వంతు చర్యలు తీసుకుంటానని గవర్నర్ హామీ ఇచ్చారు.

స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కు డైరెక్టర్ల నియామకం

సాక్షి, అమరావతి: స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కు డైరెక్టర్లను నియమిస్తూ గురువారం మున్సిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ ఉత్తర్వులిచ్చారు. గతంలో సంస్థకు చైర్మన్‌ను నియమించగా, ఇప్పుడు 14 మందిని డైరెక్టర్లుగా నియమించారు. రెండేళ్ల పాటు వీరు ఈ పదవిలో కొనసాగుతారు.

జాతీయ శిక్షణకు అధికారులను పంపండి

సీఎస్‌ను కోరిన మహిళా కమిషన్ చైర్‌పర్సన్

సాక్షి, అమరావతి: జాతీయ మహిళా కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమానికి రాష్ట్రం తరపున అధికారులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) విజయానంద్‌ను ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ కోరారు. సీఎస్‌ను గురువారం కలిసిన ఆమె ఈ కార్యక్రమం గురించి వివరించారు. జాతీయ మహిళా కమిషన్, లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ సంయుక్తంగా సెప్టెంబర్ 12 నుంచి 14 వరకు డామన్ డయూలో జాతీయ శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణకు ఏపీ నుంచి అధికారులు, పోలీసులను నామినేట్ చేయాలని కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం నేడు

సాక్షి, అమరావతి: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఏటా సెప్టెంబర్ 5న నిర్వహించే ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువారం రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రభుత్వం ప్రదానం చేయనుంది. పాఠశాల విద్యలో 78 మంది, ఇంటర్మీడియట్ విద్యలో 26 మంది(జిల్లాకు ఒకరు చొప్పున)ని, రాష్ట్ర సాంకేతిక విద్య(పాలిటెక్నికల్)లో 16 మందిని అవార్డులకు ఎంపిక చేశారు. వీరిని శుక్రవారం విజయవాడలోని ఎ-కన్వెన్షన్ సెంటర్‌లో సత్కరించనున్నారు.

ఇదేంటి గురూ..

ఉత్తమ టీచర్ అవార్డులు అభాసుపాలు

- పనితనం కన్నా.. ప్రసన్నతే మిన్న
- ‘ఉన్నతవిద్య’ అవార్డుల్లో విచిత్రాలు
- నిబంధనలకు విరుద్ధంగా వీసీకి అవార్డు
- విధులకు సరిగా రానివారికి సైతం..
- ఎంపికలో రాజకీయ కోణమే ప్రధానం



సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ఉపాధ్యాయ అవార్డు అభాసుపాలయింది. ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికలో బోధన ప్రతిభ కంటే రాజకీయమే పాసయింది. కూటమి ప్రభుత్వం దశాబ్దాలుగా వృత్తిలో సాధించిన ప్రగతిని పక్కనపెట్టి ఇంటర్వ్యూల పేరిట కాలక్షేపం చేసి అర్హులకు అన్యాయం చేసింది. విశ్వవిద్యాలయం మొదలుకొని పాఠశాల విద్య వరకు ప్రతిస్థాయిలోను ఉత్తమ టీచర్ల ఎంపిక ప్రహసనంగా మారింది. ఎంపికలో పలువురు అనర్హుల్ని అవార్డులకు సిఫార్సు చేశారు. ఈ అవార్డుల తీరుచూసి నిజంగా అర్హులైనవారు.. తమను ఎంపిక చేయకపోవడమే మంచిదైంది అనుకునే పరిస్థితి నెలకొంది. ఈ ఎంపికల్లో తమవారా.. కాదా.. అనేది మాత్రమే కూటమి ప్రభుత్వం పరిశీలించిందన్న విమర్శలున్నాయి. ఎక్కడా ప్రతిభను పట్టించుకోలేదని, రాజకీయంగా ఏ పార్టీకి సానుభూతిపరులో చూసి మరీ పురస్కారాలు ప్రకటించారని ఉపాధ్యాయులు విమర్శిస్తున్నారు. శుక్రవారం ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా వర్సిటీస్థాయిలో 32 మందికి, డిగ్రీ కళాశాల స్థాయిలో 18 మందికి, ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో ఆరుగురికి అవార్డులు ప్రకటిస్తూ ఉన్నతవిద్య కార్యదర్శి కోన శశిధర్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

ద్రావిడ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీకి..

నిబంధనల ప్రకారం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు పరిపాలన పదవుల్లో ఉన్నవారు దూరంగా ఉండాలి. అలాంటిది.. ఏకంగా ద్రావిడ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వీసీ ఎం.దొరస్వామికి ఉత్తమ టీచర్ అవార్డు ప్రకటించారు. వర్సిటీ స్థాయిలో దరఖాస్తులు/నామినేటెడ్ పేర్లను స్క్రీనింగ్ చేసేందుకు వీసీ చైర్మన్‌గా కమిటీ ఉంటుంది. ఇక్కడ ఆ కమిటీ చైర్మన్ అయిన ఇన్‌చార్జి వీసీ దొరస్వామి తన పేరే సిఫార్సు చేసుకున్నారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ నేతృత్వంలోని రాష్ట్రస్థాయి కమిటీ సైతం ఆయన్ని ఎంపిక చేసేసింది. అసలు ఆయన నాన్ టీచింగ్ విభాగానికి చెందిన ఉద్యోగి. లైబ్రరీ శాఖకు చెందిన వ్యక్తి. ఈ వర్సిటీలో ఆయన బోధించడానికి అస్సలు లైబ్రరీసైన్స్ కోర్సులే లేవు. అలాంటప్పుడు ఏ ప్రాతిపదికన ఆయన బోధనాపటిమను గుర్తించారో తెలియదు. వర్సిటీలో 2010లో తాత్కాలిక ప్రాతిపదికన డిప్యూటీ లైబ్రేరియన్‌గా అడుగుపెట్టిన ఆయన ఎక్కడిక్కడ నిబంధనలు మీరి రెగ్యులర్ అయిపోయి, నాన్‌టీచింగ్ డిప్యూటీ లైబ్రేరియన్ పోస్టు (అసోసియేట్ ప్రొఫెసర్) నుంచి ఏకంగా టీచింగ్ విభాగంలోని ప్రొఫెసర్ పోస్టులోకి వచ్చేశారని వర్సిటీవారే బహిరంగంగా విమర్శిస్తున్నారు. ఇలా నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగం పొందారంటూ కోర్టుల్లో కేసులున్న వ్యక్తిని అవార్డుకు ఎలా ఎంపిక చేశాంటూ ప్రశ్నిస్తున్నారు.


ఇంటర్వ్యూల పేరిట కాలక్షేపం..

ఈ అవార్డులకు ఎంపిక కోసం కూటమి ప్రభుత్వం తొలిసారిగా ఇంటర్వ్యూలు నిర్వహిచింది. ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఆచార్యులకు నిర్వహించిన ఇంటర్వ్యూలు ఒక్కోచోట ఒక్కో విచిత్రాన్ని తలపించాయి. ఉత్తమ ఆచార్యుల ఎంపికకు రాష్ట్రస్థాయి కమిటీ ఘనంగా ఇంటర్వ్యూలు నిర్వహించింది. ఆ తర్వాత మీరు ఎంపికయ్యారంటూ ఆహ్వానాలు పంపింది. తీరా.. ఎంపిక జాబితా వెలువడటానికి కొద్ది గంటల ముందు ‘సారీ మీరు డ్రాప్ అవ్వండి.. మేం ఏం చేయలేం..’ అంటూ సందేశాలు పంపించి ప్రతిభ, సామర్థ్యం ఉన్న ఎందరో ఆచార్యులను అవార్డులకు దూరం చేసింది. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకులకు కళాశాల డైరెక్టరేట్ రెండు, మూడు నిమిషాల్లోనే ఇంటర్వ్యూలు ముగించింది. ‘కళాశాల అభివృద్ధిలో మీ పాత్ర ఏంటి? మీరు దరఖాస్తులో సమర్పించిన రికార్డులు మీవేనా? ఇక వెళ్లి రండి..’ ఇదీ వారికి నిర్వహించిన ఇంటర్వ్యూ.

సాంకేతికవిద్యలో మరో కోణం

రాష్ట్ర సాంకేతిక విద్యావిభాగంలో మరో అడుగు ముందుకేసి అవార్డులు పంచుకున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విభాగంలో 16 అవార్డులు ఇచ్చేందుకు నిర్ణయించారు. ఒక్కో అవార్డుకు ఇద్దరు చొప్పున దరఖాస్తు చేసుకోవాలని పిలుపునిచ్చినా పెద్దగా స్పందన రాలేదు. దీంతో దరఖాస్తు గడువును పెంచి సిబ్బందికి ప్రత్యేకంగా సమాచారం అందించి అవార్డుకు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు కోరారు. దీంతో 31 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 30 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఆంధ్ర యూనివర్సిటీ రీజియన్ నుంచి ప్రిన్సిపల్ కేటగిరిలో ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. ఎస్వీయూ రీజియన్‌లో ఒక్కరే దరఖాస్తు చేయగా ఆయన్నే ఎంపిక చేశారు. ఈ విభాగంలో 15 మందిని ఉత్తమ అధ్యాపకులుగా ప్రకటించారు. వీరిలో పలువురు విధులకు హాజరయ్యే విషయంలో సమయపాలన పాటించలేదని తేలింది. ఇటీవల ఉన్నతాధికారులు ఫేషియల్ రికగ్నేషన్ సిస్టం నుంచి వివరాలు విడుదల చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో సమయానికి కాలేజీకి రానివారు ఉత్తమ అధ్యాపకులు ఎలా అవుతారని సాంకేతికవిద్యలో పనిచేసే అధ్యాపకులే విమర్శిస్తున్నారు. వీటిని పరిశీలిస్తే.. ఈ ఏడాది అవార్డుల ఎంపికను పాలకులు ఎంతగా దిగజార్చారోఅర్థమవుతోంది.

అ‘ధర’కొడుతున్న కొబ్బరి



ఎగుమతికి సిద్ధమవుతున్న పచ్చి కొబ్బరికాయలు

- అంబాజీపేట మార్కెట్‌లో వెయ్యి కాయల ధర రూ.23 వేల నుంచి రూ.24 వేలు
- కురిడీ కొబ్బరి రూ.31,500కు చేరిక
- ఆరు నెలలుగా రికార్డు స్థాయిలో ధరలు
- వరుస పండగల ప్రభావం

సాక్షి, అమలాపురం/అంబాజీపేట: కొబ్బరి ధరలు రికార్డుల మీద రికార్డులు సృష్టిస్తున్నాయి. గత ఆరు నెలలుగా రైతుల అంచనాలకు మించి ధరలు నమోదవుతున్నాయి. కురిడీ కొబ్బరి కొత్త రికార్డులు నమోదు చేస్తుండగా.. పచ్చి కాయలు సైతం ఆల్‌టైమ్ హైకి చేరాయి. తొలుత పచ్చి కొబ్బరికాయ ధర రూ.15 ఉండగా.. ఆ తర్వాత అది రూ.17కు చేరడంతో రైతులు సంబరపడ్డారు. అది కాస్తా రూ.19కి.. ఆపై రూ.20కి, రూ.22కి.. ఇప్పుడు ఏకంగా రూ.24కు చేరింది. ప్రస్తుతం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మార్కెట్‌లో వెయ్యి కొబ్బరికాయల ధర రూ.23 వేల నుంచి రూ.24 వేల వరకు పలుకుతోంది. ఈ స్థాయిలో ధర రావడం ఇదే తొలిసారి. దీంతో అంబాజీపేట మార్కెట్‌లో జోష్ నెలకొంది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి రోజుకు 130 లారీల కొబ్బరికాయలు ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయని రైతులు చెబుతున్నారు.

కురిడీకి భలే డిమాండ్..

కురిడీ కొబ్బరి ధరలు కూడా భారీగా పెరిగాయి. పాతకాయలలో గండేరా రకానికి(పెద్ద కాయ) చెందిన వెయ్యి కాయల ధర రూ.31,500 ఉంది. అదే గటగటా రకం(చిన్నకాయ) రూ.30 వేలు పలుకుతోంది. ఇక కొత్తకాయలో గండేరా రకం రూ.30 వేలు.. గటగటా రకం రూ.28,500 వరకు ధర ఉంది. కోనసీమ జిల్లా నుంచి రోజుకు 40 లారీల కురిడీ కొబ్బరి ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి అవుతోందని వ్యాపారులు చెబుతున్నారు.

ఇతర రాష్ట్రాల్లో తగ్గిన దిగుబడులు

- దక్షిణాదిలో ఏపీ తప్ప మిగిలిన రాష్ట్రాల్లో కొబ్బరి దిగుబడులు తగ్గాయి. కేరళలో 40 శాతం, తమిళనాడు, కర్ణాటకలో 30 శాతానికి పైగా దిగుబడి తగ్గింది. దీంతో గుజరాత్, రాజస్తాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, బిహార్ తదితర రాష్ట్రాలకు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి కొబ్బరి కాయలను ఎగుమతి చేస్తున్నారు.
- అలాగే వరుస పండగలు కూడా ధరల పెరుగుదలకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు. ఇప్పటికే వినాయకచవితి వేడుకలు జరుగుతుండగా.. నెలాఖరు నాటికి దసరా, ఆ తర్వాత దీపావళి, ఆ వెంటనే కార్తీక మాసం మొదలుకానుంది. దీంతో ఉత్తరాది రాష్ట్రాల నుంచి కొబ్బరికి ఎక్కువగా ఆర్డర్లు వస్తుండడం కూడా ధరల పెరుగుదలకు కారణమని వెల్లడించారు.

మైనింగ్ లీజుల్లో వడ్డెరలకు 15 శాతం రిజర్వేషన్

సాక్షి, అమరావతి : ఎన్నికల హామీ మేరకు వడ్డెరలకు మైనింగ్ లీజుల్లో 15 శాతం రిజర్వేషన్ కల్పించనున్నట్టు రాష్ట్ర గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. వెలగపూడి సచివాలయంలో గురువారం వడ్డెర సొసైటీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. వడ్డెరలు క్వారీ లీజులు పొందడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. సీనరేజు ఫీజులో 50 శాతం సబ్సిడీ అందించనున్నామన్నారు. క్వారీల్లో వినియోగించే యంత్రాలను కొనుగోలు చేసేందుకూ సబ్సిడీ పథకాలు తీసుకురావాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు వివరించారు.

18 ఏఎంసీలకు చైర్మన్ల నియమాకం

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో 18 మార్కెట్ కమిటీలకు కూటమి ప్రభుత్వం చైర్మన్లను నియమించింది. టెక్కలి ఏఎంసీకి బడగిడి శేషగిరిరావు, ఎచ్చెర్ల ఏఎంసీకి ఎన్.పద్మ, రాజోలు(ఎస్సీ) ఏఎంసీకి తేతా వెంకటలక్ష్మి, చింతలపూడి(ఎస్సీ) ఏఎంసీకి సీహెచ్ దుర్గాపార్వతి తదితరులు నియమితులయ్యారు. బీసీలకు 8, ఓసీలకు 8, ఎస్సీలకు 2 చైర్మన్ పదవులను కేటాయించారు. మహిళలకు 10 స్థానాలు కేటాయించగా, పురుషులకు 8 చైర్మన్ పదవులు దక్కాయి.

ఏసీబీ వలలో వీఆర్వో

రైతు నుంచి రూ.20 వేల లంచం తీసుకుంటుండగా పట్టివేత



సూర్యకృష్ణ పృథ్వీ

కశింకోట: భూమి బదిలీ (మ్యుటేషన్) కోసం రైతు నుంచి రూ.20 వేల లంచం తీసుకుంటూ వీఆర్వో గన్నమరాజు సూర్యకృష్ణ పృథ్వీ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. విశాఖ రేంజి ఏసీబీ డీఎస్పీ బీవీఎస్ నాగేశ్వరరావు గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. అనకాపల్లి జిల్లా కశింకోట మండలం జెట్టపురెడ్డితుని శివారు నరసింగబిల్లికి చెందిన ఇద్దరు అన్నదమ్ములు తమ తల్లి పేరిట ఉన్న 2.10 ఎకరాల భూమిని తమ పేరిట బదిలీ చేసి పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని గత నెలలో దరఖాస్తు చేశారు. రైతు ఊడి నాగేశ్వరరావు చేసిన ఈ దరఖాస్తును పరిశీలించిన వీఆర్వో గన్నమరాజు సూర్య కృష్ణ పృథ్వీ రూ.40 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంత ఇచ్చుకోలేమని నాగేశ్వరరావు చెప్పగా.. చివరకు రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు విశాఖ రేంజి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. రైతు నుంచి వీఆర్వో రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్టు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. వీర్వోను అరెస్టు చేశామని, శుక్రవారం అతడిని విశాఖ ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని చెప్పారు.

‘ఓపెన్ ఎయిర్’ స్పెషల్



జైల్ లోపల వ్యవసాయం చేస్తున్న ఖైదీలు

30 మంది ఖైదీలకు స్వేచ్ఛ

ఆరిలోవ: సాధారణంగా జైలు అనగానే నాలుగు గోడల మధ్య ఉండే ఖైదీలు గుర్తుకు వస్తారు. కానీ విశాఖ కేంద్ర కారాగారంలో నిర్వహిస్తున్న ‘ఓపెన్ ఎయిర్ జైలు’మాత్రం ఖైదీలకు కొంత స్వేచ్ఛను కల్పిస్తోంది. ఈ ప్రత్యేకమైన జైలులో ప్రస్తుతం 30 మంది ఖైదీలు ఉన్నారు. సాధారణ జైలు ఖైదీలతో పోలిస్తే.. ఓపెన్ ఎయిర్ జైలులో ఉన్నవారికి ప్రత్యేక సౌకర్యాలు లభిస్తాయి. ముఖ్యంగా మంచి ప్రవర్తన ఉన్న ఖైదీలను జైలు అధికారులు ఈ విభాగం కింద ఎంపిక చేస్తారు. వారిని జైలులో వ్యవసాయం, పాడి పరిశ్రమ, సుధార్ కేంద్రాల్లో పనిచేయడానికి అవకాశం కల్పిస్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వీరు ఈ పనుల్లో నిమగ్నమై, తిరిగి సాయంత్రానికి జైలు లోపలికి చేరుకుంటారు. ఒక ఖైదీని ఓపెన్ ఎయిర్ జైలుకు ఎంపిక చేయడానికి కొన్ని నిబంధనలు ఉన్నాయి. వారి ప్రవర్తన బాగుండడంతో పాటు, వారు



సుధార్ కేంద్రం

పెరోల్‌కు, ఫర్లోకు ఇంటికి వెళ్లొచ్చి ఉండాలి. అలాగే కుటుంబ సభ్యులతో వారికి ఉన్న సంబంధాలు తెగిపోకుండా ఉండాలి. ఈ అర్హతలు ఉన్న వారిని, జైలు అధికారుల పూర్తి నమ్మకం చూరగొన్న వారిని మాత్రమే ఈ ప్రత్యేక జైలుకు ఎంపిక చేస్తారు. ఇలాంటి ఖైదీలు చాలా మంది శిక్ష కాలం పూర్తవక ముందే క్షమాభిక్ష పొందే అవకాశాలు కూడా ఉంటాయి. ఓపెన్ ఎయిర్ జైలులో పనిచేస్తున్న ఖైదీలకు సెమీ-స్కిల్డ్ విభాగం కింద రోజుకు రూ.180 వేతనం ఇస్తారు. మన దేశంలో 17 రాష్ట్రాల్లో 91 కేంద్ర కారాగారాల్లో ఇలాంటి ఓపెన్ ఎయిర్ జైళ్లు ప్రస్తుతం పనిచేస్తున్నాయి.

కరేడు వెళ్లేందుకు బోడేకు అనుమతి

షరతులు విధించిన హైకోర్టు

సాక్షి, అమరావతి: శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, ఉలవపాడు మండలం, కరేడు గ్రామ పరిధిలో ఏర్పాటు చేస్తున్న ఇండోసోల్ పరిశ్రమ కోసం చేపట్టిన భూ సేకరణ ప్రక్రియను వ్యతిరేకిస్తున్న రైతులకు సంఘీభావం తెలిపే నిమిత్తం కరేడుకు వెళ్లేందుకు భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్‌కు హైకోర్టు అనుమతినిచ్చింది. ఈ నెల 14న ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల మధ్య గ్రామస్తులతో సమావేశం కావొచ్చని తెలిపింది. అతనితో పాటు 6 నాలుగు చక్ర వాహనాలను, 15 మంది మీడియా సిబ్బందిని అనుమతించాలని పోలీసులను ఆదేశించింది. వంద మందికి పైగా ఒకే చోట గుమికూడకుండా చర్యలు తీసుకోవాలంది. ఈ మొత్తం సమావేశాన్ని రికార్డ్ చేయాలని పోలీసులను ఆదేశించింది. ప్రజలను రెచ్చగొట్టవద్దని, కులపరమైన విషయాలను ప్రస్తావించరాదని బోడేకు హైకోర్టు స్పష్టం చేసింది. అవాంఛనీయ ఘటనలు జరిగితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పోలీసులకు సూచించింది.

సాక్షి సినిమా

ప్లాన్ వరల్డ్

- ఫారిన్‌లో తెలుగు సినిమాల రిలీజ్‌లు
- విదేశీ మార్కెట్‌పై ఫోకస్

ఫిల్మ్ ఇండస్ట్రీలో ఒక్కోసారి ఒక్కో ట్రెండ్ కనిపిస్తుంటుంది. నిన్న మొన్నటి వరకు తెలుగు హీరోలు, దర్శక-నిర్మాతలు పాన్ ఇండియా మంత్రం జపించారు. ఇప్పుడు 'పాన్ వరల్డ్' అంటున్నారు. ప్రపంచవ్యాప్తంగా విదేశీ భాషల్లోనూ తెలుగు సినిమాలను రిలీజ్ చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఇలా పాన్ వరల్డ్ రిలీజ్ ప్లాన్‌లో ఉన్న చిత్రాలపై ఓ లుక్ వేద్దాం.



● ఎన్టీఆర్ ● రామ్‌చరణ్ ● అల్లు అర్జున్ ● మహేశ్‌బాబు ● రణ్‌బీర్ సింగ్ ● నాని

అవతార్‌ను మించి..!

హాలీవుడ్‌లో ప్రపంచవ్యాప్తంగా అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాలుగా చెప్పుకునే 'అవతార్', 'అవెంజర్స్' వంటివి దాదాపు వంద దేశాల్లో విడుదలయ్యాయి. అలాంటిది హీరో మహేశ్‌బాబు, దర్శకుడు రాజమౌళి కాంబినేషన్‌లోని ఫారెస్ట్ అడ్వెంచరస్ యాక్షన్ డ్రామా 'ఎస్‌ఎస్‌ఎమ్‌బీ 29' (వర్కింగ్ టైటిల్) మాత్రం అంతకు మించి, 120కి పైగా దేశాల్లో రిలీజ్ అయ్యేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు 'ఎస్‌ఎస్‌ఎమ్‌బీ 29' హాలీవుడ్ సినిమాలకు ఏ మాత్రం తీసిపోదని. ఇంకా చెప్పాలంటే... హాలీవుడ్ చిత్రాలకే పోటీగా నిలుస్తున్న సినిమా ఇది. పైగా ఈ సినిమా అప్‌డేట్స్‌కి కూడా గ్లోబల్ రీచ్ ఉండేలా ప్లాన్ చేస్తున్నారు దర్శకుడు రాజమౌళి. ఈ 'ఎస్‌ఎస్‌ఎమ్‌బీ29' సినిమా ఫస్ట్ లుక్‌ను 'టైటానిక్, అవతార్' వంటి మూవీస్‌ని డైరెక్ట్ చేసిన జేమ్స్ కామెరూన్ చేతుల మీదుగా రిలీజ్ చేసేందుకు రాజమౌళి అండ్ టీమ్ సన్నాహాలు చేస్తోందని తెలిసింది. నవంబరులో తన సినిమా 'అవతార్: ఫైర్ అండ్ యాష్' ప్రమోషన్స్‌లో భాగం దర్శకుడు జేమ్స్ కామెరూన్ ఇండియాకు రానున్నారని, ఈ సందర్భంగా ఆయన చేతుల మీదుగా 'ఎస్‌ఎస్‌ఎమ్‌బీ 29' ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేయించేలా రాజమౌళి ఏర్పాట్లు చేస్తున్నారనే టాక్ తెరపైకి వచ్చింది. ఇలా చేస్తే 'ఎస్‌ఎస్‌ఎమ్‌బీ 29' రీచ్ గ్లోబల్ స్థాయిలో ఉంటుందన్నది టీమ్ ఆలోచనగా తెలుస్తోంది.

ఇక ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ కెన్యాలో జరుగుతోంది. ఈ చిత్ర హీరో మహేశ్‌బాబుతో పాటుగా ఇతర ప్రధాన తారాగణం ప్రియాంకా చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ పాల్గొంటుండగా ఆఫ్రికా అడవుల్లో కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. ఈ సినిమా బడ్జెట్ దాదాపు రూ.1200 కోట్లు అని, ఈ సినిమాకు 'జెన్ -63' అనే టైటిల్‌ను అనుకుంటున్నారని, దాదాపు 20కిపైగా భాషల్లో ఈ సినిమాను అనువదించి, 2027 మార్చి 25న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేయాలని రాజమౌళి ప్లాన్ చేస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. ఇంకా ఈ సినిమాలో క్రిస్ హెమ్స్‌వర్త్ వంటి హాలీవుడ్ నటులు కూడా కనిపిస్తారని, ఇందుకు సంబంధించి ఓ ప్రముఖ హాలీవుడ్ యాక్టింగ్ ఏజెన్సీతో రాజమౌళి ఒప్పందం కుదుర్చుకున్నారనే వార్తలు ఉన్నాయి. అయితే ఈ విషయాలపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది.

ఫారిన్ స్పిరిట్

ప్రభాస్‌ది ఇంటర్‌నేషనల్ హీరో కటౌట్. ప్రభాస్ హీరోగా నటించిన 'బాహుబలి, కల్కి2898 ఏడీ' వంటి చిత్రాలు జపాన్ దేశంలో విడుదలై, అక్కడి ప్రేక్షకులను అలరించాయి. ఇక ప్రభాస్ హీరోగా నటించనున్న చిత్రాల్లో 'స్పిరిట్' కూడా ఒకటి. 'అర్జున్ రెడ్డి, యానిమల్' చిత్రాల ఫేమ్ సందీప్‌రెడ్డి వంగా ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నారు. యూవీ క్రియేషన్స్, టీ-సిరీస్, భద్రకాళి పిక్చర్స్ ఈ సినిమాను నిర్మించనున్నాయి. అయితే ఈ సినిమా అనౌన్స్‌మెంట్ సమయంలోనే 'స్పిరిట్'ను భారతీయ భాషలతో పాటు ఇంగ్లిష్, చైనా, జపాన్, కొరియా భాషల్లో కూడా రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ పేర్కొన్నారు. దీంతో 'స్పిరిట్' చిత్రం ఇంటర్‌నేషనల్ లెవల్లో రిలీజ్ కానుంది. ఇంకా 'స్పిరిట్' సినిమా చిత్రీకరణ మొదలు కాలేదు. రిలీజ్ సమయానికి 'స్పిరిట్' మరిన్ని విదేశీ భాషల్లో రిలీజ్ అయ్యే అవకాశాలు లేకపోలేదు. ఇక ఈ చిత్రంలో తొలిసారిగా ప్రభాస్ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. 'యానిమల్' ఫేమ్ త్రిప్తి దిమ్రి హీరోయిన్‌గా నటించనున్నారు. నిజానికి ఈ సినిమా చిత్రీకరణ ఈ పాటికే మొదలు కావాల్సింది. కానీ కొన్ని కారణాల వల్ల వాయిదా పడుతోంది. కాగా ఈ సినిమాలోని ఓ మేజర్ షూటింగ్ షెడ్యూల్‌ను మెక్సికోలో ప్లాన్ చేసినట్లుగా ఈ చిత్రదర్శకుడు సందీప్ రెడ్డి వంగా ఇటీవల ఓ సందర్భంలో వెల్లడించిన విషయం గుర్తుండే ఉంటుంది. ఇంకా ఈ చిత్రంలో సౌత్ కొరియన్ నటుడు డాన్ లీ విలన్‌గా నటించనున్నారనే టాక్ వినిపిస్తోంది. డాన్ లీతో తెలుగు నటుడు శ్రీకాంత్ ఉన్న ఫొటోలు ఇంటర్ నెట్‌లో వైరల్ అయ్యాయి. దీంతో..'స్పిరిట్' చిత్రంలో డాన్ లీ, శ్రీకాంత్ ఏమైనా భాగం అయ్యారా? అనే టాక్ తెరపైకి వచ్చింది. అయితే ఈ విషయాలపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది.

గ్లోబల్ డ్రాగన్

హీరో ఎన్టీఆర్-దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా 'డ్రాగన్'. ఈ పీరియాడికల్ యాక్షన్ డ్రామాలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. మలయాళ నటుడు టొవినో థామస్ విలన్‌గా కనిపిస్తారనే ప్రచారం జరుగుతోంది. అయితే ఈ సినిమా అనౌన్స్‌మెంట్ సమయంలో కొన్ని ఆసక్తికరమైన విషయాలు తెరపైకి వచ్చాయి. ఈ సినిమాను దాదాపు 15 దేశాల్లో చిత్రీకరించాలని ప్రశాంత్ నీల్ ప్లాన్ చేశారన్నది ఆ వార్తల సారాంశం. ఇందుకు తగ్గట్లుగానే ఈ 'డ్రాగన్' కోసం ఇంటర్‌నేషనల్ కనెక్టివిటీ ఉండే ఓ ప్రపంచాన్ని ప్రశాంత్ నీల్ క్రియేట్ చేస్తున్నారనే టాక్ తాజాగా తెర పైకి వచ్చింది. అంతేకాదు... ఈ సినిమా విదేశీ షూటింగ్ షెడ్యూల్స్ నవంబరులో ప్రారంభం అవుతాయట. మరి... ఇంటర్‌నేషనల్ కనెక్టివిటీ ఉన్న స్టోరీని రెడీ చేసుకుని, ఇంటర్‌నేషనల్ లొకేషన్స్‌లో చిత్రీకరణకు ప్లాన్ చేసినప్పుడు, ఇంటర్‌నేషనల్ రేంజ్ రిలీజ్‌ను కూడా ప్లాన్ చేయకుండా ఉంటారా? 'డ్రాగన్' టీమ్ ఈ దిశగా ఆలోచిస్తోందట. గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్, టీ సిరీస్ ఫిల్మ్స్ పతాకాలపై కల్యాణ్ రామ్ నందమూరి, నవీన్ యెర్నేని, రవి శంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్న ఈ సినిమా 2026 జూన్ 25న విడుదల కానుంది. ఇదిలా ఉంటే... 'ఆర్‌ఆర్‌ఆర్' (ఇందులో రామ్‌చరణ్ మరో హీరో) చిత్రంలో మంచి పెర్ఫార్మెన్స్ ఇచ్చారు ఎన్టీఆర్. ఈ సినిమా ఆస్కార్ క్యాంపైన్ ప్రమోషన్స్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు ఎన్టీఆర్. ఈ విధంగా ప్రపంచవ్యాప్త సినిమా ఆడియన్స్‌కు ఎన్టీఆర్ గురించి ఓ అవగాహన ఉంది.

ఇంటర్‌నేషనల్ పెద్ది

స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ సినిమాలకు ఓ సౌలభ్యం ఉంటుంది. భాష అర్థం కాకపోయినా గేమ్, ఇందులోని స్ట్రాటజీస్ ఏ భాషవారికైనా కనెక్ట్ అవుతాయి. హిందీలో 'మేరికోమ్, భాగ్ మిల్కా సింగ్, చక్ దే ఇండియా' వంటి సినిమాలు వచ్చినప్పుడు ఇక్కడి తెలుగు ఆడియన్స్ కూడా ఈ సినిమాలను హిందీ భాషలోనే చూసి, ఈ చిత్రాలను సూపర్ హిట్ చేశారు. ఇప్పుడు 'పెద్ది' టీమ్ కూడా ఇదే చేయనుందట. కాకపోతే ఇంటర్‌నేషనల్ లెవల్లో. రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ పీరియాడికల్ మల్టీ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది'. బుచ్చిబాబు సానా ఈ సినిమాకు దర్శకుడు. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా జగపతిబాబు, దివ్యేందు శర్మ, శివరాజ్‌కుమార్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ మైసూర్‌లో జరుగుతోంది. రామ్ చరణ్ పాల్గొంటుండగా ఓ పాటతో పాటు కొన్ని కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ పతాకాలపై వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా రామ్‌చరణ్ బర్త్ డే సందర్భంగా మార్చి 27న విడుదల కానుంది. కాగా ఈ సినిమాను గ్లోబల్ స్థాయిలో రిలీజ్ చేయాలనే ఆలోచనలో ఉన్నారట మేకర్స్. మంచి ఎమోషన్స్ ఉన్న స్పోర్ట్స్ డ్రామా కాబట్టి యూనివర్సల్ అప్పీల్ ఉంటుందని టీమ్ భావిస్తోందట. ఈ దిశగా ప్రయత్నాలను మొదలు పెట్టిందట టీమ్. ఇక 'ఆర్‌ఆర్‌ఆర్' (ఈ చిత్రంలో ఎన్టీఆర్ మరో హీరో) చిత్రంతో ప్రపంచవ్యాప్తంగా రామ్ చరణ్‌కు క్రేజ్ వచ్చింది. ఈ సినిమా ఆస్కార్ ప్రమోషన్స్‌లోనూ రామ్ చరణ్ ఉత్సాహంగా పాల్గొన్నారు. 'ఆర్‌ఆర్‌ఆర్‌'లో రామ్‌చరణ్ పెర్ఫార్మెన్స్‌ను కొందరు హాలీవుడ్ దర్శకులు మెచ్చుకున్నారు. ఇదంతా 'పెద్ది' సినిమాను ఇంటర్‌నేషనల్ ఆడియన్స్‌కు దగ్గర చేయడంలో ఉపయోగపడుతుందని టీమ్ భావిస్తోందని ఫిల్మ్‌నగర్ భోగట్టా.

హాలీవుడ్ అసోసియేషన్

'పుష్ప' ఫ్రాంచైజీ నుంచి వచ్చిన 'పుష్ప: ది రైజ్, పుష్ప: ది రూల్' చిత్రాల తర్వాత అల్లు అర్జున్ క్రేజ్ బాగా పెరిగింది. 'పుష్ప:ది రూల్' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత హీరో అల్లు అర్జున్ అంతర్జాతీయ స్థాయిలో ఓ సినిమా చేస్తున్నారు. ఈ చిత్రానికి తమిళ దర్శకుడు అట్లీ డైరెక్టర్. భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తోంది. కాగా ఈ సినిమాను అంతర్జాతీయ స్థాయిలో రిలీజ్ చేయాలని టీమ్ ప్లాన్ చేస్తోంది. ఇందుకోసం సన్నాహాలు కూడా మొదలుపెట్టింది. హాలీవుడ్‌లో 'అవతార్, ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్, డ్యూన్, జురాసిక్ వరల్డ్' వంటి సినిమాల ప్రమోషన్స్‌లో క్రియాశీలకంగా వ్యవహరించిన హాలీవుడ్ ప్రముఖ మార్కెటింగ్ ఏజెన్సీ 'కనెక్ట్ మాబ్ సీన్'తో అల్లు అర్జున్-అట్లీ టీమ్ అసోసియేట్ అయ్యేందుకు చర్చలు జరిగాయి. ఈ చర్చల్లో భాగంగానే 'కనెక్ట్ మాబ్ సీన్' ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఆఫ్ క్రియేటివ్ కంటెంట్ అలెగ్జాండ్రా ఈ. విస్కోంటి ఇటీవల ముంబై వచ్చి, అల్లు అర్జున్-అట్లీ అండ్ టీమ్‌ని కలిసి మాట్లాడారు. 'కనెక్ట్ మాబ్ సీన్'తో అసోసియేషన్ దాదాపు ఓకే అయ్యిందని, త్వరలోనే అధికారిక ప్రకటన ఉండొచ్చనే టాక్ వినిపిస్తోంది.

కాగా ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ ముంబైలో జరుగుతోంది. అల్లు అర్జున్‌తో పాటు ఈ చిత్రంలోని కీలక తారాగణం పాల్గొంటుండగా కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. ఇక ఈ సినిమాలో దీపికా పదుకోన్ ఓ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కథ రీత్యా ఈ చిత్రంలో ఐదుగురు హీరోయిన్స్‌కు స్కోప్ ఉందని, దీపికా పదుకోన్ ,మృణాల్ ఠాకూర్ కన్ఫార్మ్ అయ్యారని, మిగతా హీరోయిన్స్‌గా జాన్వీ కపూర్, ఆలియా.ఎఫ్, భాగ్యశ్రీ బోర్సే వంటివారు కనిపించే అవకాశం ఉందనే టాక్ తెరపైకి వచ్చింది. ఇంకా ఈ చిత్రంలో రమ్యకృష్ణ, యోగిబాబు, విజయ్ సేతుపతి వంటి వారు ఇతర కీలక పాత్రల్లో కనిపిస్తారనే ప్రచారం జరుగుతోంది. అంతేకాదు... ఈ చిత్రంలో అల్లు అర్జున్ నాలుగు పాత్రల్లో కనిపిస్తారనే టాక్ వినిపిస్తోంది. తాత - తండ్రి- ఇద్దరు కొడుకుల పాత్రల్లో అల్లు అర్జున్ కనిపిస్తారట. ఇక అల్లు అర్జున్ కెరీర్‌లోని ఈ 22వ సినిమా 2027 ఆగస్టులో రిలీజ్ కానుందనే ప్రచారం జరుగుతోంది.

తెలుగు సినిమా హీరోలు, దర్శక-నిర్మాతలే కాదు.. బాలీవుడ్, కన్నడ వంటి సినీ పరిశ్రమలు కూడా హాలీవుడ్ మార్కెట్‌పై దృష్టి సారించాయి. భారతీయ ఇతిహాసం 'రామాయణం' ఆధారంగా హిందీలో 'రామాయణ' అనే సినిమా రూపొందుతున్న విషయం తెలిసిందే. ఈ చిత్రంలో రాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, హనుమంతుడిగా సన్నీ డియోల్, రావణుడిగా యశ్ నటిస్తున్నారు. కాగా 'రామాయణ' సినిమా రెండు భాగాలను దాదాపు 4 వేల కోట్ల రూపాయల బడ్జెట్‌తో రూపొందిస్తున్నామని, హాలీవుడ్ సినిమాలకు ఏమాత్రం ఈ సినిమా తీసిపోదని ఈ చిత్రనిర్మాత నమిత్ మల్హోత్రా ఓ సందర్భంలో తెలిపారు. అలాగే విదేశీ ప్రేక్షకులు సైతం మెచ్చుకునేలా 'రామాయణ' సినిమాను తీస్తున్నామని ఆయన చెప్పుకొచ్చారు. ఇలా 'రామాయణ' సినిమాను విదేశీ భాషల్లో కూడా రిలీజ్ చేస్తున్నట్లుగా ఆయన పరోక్షంగా వెల్లడించారు. 'రామాయణ పార్ట్ 1' చిత్రం వచ్చే ఏడాది దీపావళికి, 'రామాయణ పార్ట్ 2' చిత్రం ఆపై వచ్చే ఏడాది దీపావళికి రిలీజ్ కానున్నాయి. ఇంకా రిషబ్ శెట్టి 'కాంతార: చాప్టర్ 1', యశ్ 'టాక్సిక్' చిత్రాలు కొన్ని భారతీయ భాషలతో పాటు ఇంగ్లిష్ వెర్షన్స్‌ను కూడా రిలీజ్ చేయనున్నాయి. ఈ విధంగా విదేశీ మార్కెట్‌పై భారతీయ ఫిల్మ్‌మేకర్స్ దృష్టి పెట్టారు. ఇక 'కాంతార: చాప్టర్ 1' చిత్రం ఈ అక్టోబరు 2న విడుదల కానుండగా, 'టాక్సిక్' చిత్రం వచ్చే ఏడాది మార్చి 19న విడుదల కానుంది.

ది ప్యారడైజ్

'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత నాని-దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'ది ప్యారడైజ్'. సుధాకర్ చెరుకూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 26న విడుదల కానుంది. కాగా 'ది ప్యారడైజ్' సినిమాను కొన్ని భారతీయ భాషలతో పాటు స్పానిష్, ఇంగ్లిష్ భాషల్లో కూడా రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ ప్రకటించారు. ఇందుకు తగ్గట్లుగానే హాలీవుడ్ ప్రముఖ మార్కెటింగ్ ఏజెన్సీ 'కనెక్ట్ మాబ్ సీన్' సంస్థతో ఇటీవల చర్చలు జరిపారు మేకర్స్. అంతేకాదు... 'ది ప్యారడైజ్' సినిమా ఇంటర్‌నేషనల్ వెర్షన్ రిలీజ్ కోసం ఓ పాపులర్ హాలీవుడ్ యాక్టర్‌తో అసోసియేట్ కావాలనుకుంటున్నారు మేకర్స్. ఈ దిశగా ప్రయత్నాలు మొదలు పెట్టారు. త్వరలోనే ఈ విషయంపై మరిన్ని వివరాలు వెల్లడి కానున్నాయి.

వీరే కాదు.. మరికొంతమంది తెలుగు హీరోలు కూడా తమ మార్కెట్ పరిధిని గ్లోబల్ స్థాయిలో పెంచుకునేందుకు ఇప్పట్నుంచే వ్యూహ రచనలు చేస్తున్నారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది.

- ముసిమి శివాంజనేయులు

ఓటీటీలో ది గేమ్



హీరోయిన్ శ్రద్ధా శ్రీనాథ్ లీడ్ రోల్‌లో నటించిన సస్పెన్స్ థ్రిల్లర్ వెబ్ సిరీస్ 'ది గేమ్: యు నెవర్ ప్లే అలోన్'. సంతోష్ ప్రతాప్, చాందినీ, శ్యామ హరిని, బాల హసన్, సుభాష్ సెల్వం, వివియా సంతోష్, ధీరజ్ ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. నెట్‌ఫ్లిక్స్, అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో కలిసి దర్శకుడు రాజేశ్ ఎం. సెల్వ రూపొందిన సిరీస్ ఇది. కాగా నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో అక్టోబరు 2 నుంచి 'ది గేమ్: యు నెవర్ ప్లే అలోన్' సిరీస్ స్ట్రీమింగ్ కానుంది. ''ది గేమ్' కేవలం థ్రిల్లర్ మాత్రమే కాదు. మనం ఉన్న రియల్ వరల్డ్‌కి అద్దం పడుతుంది. ఇది ప్రజల ఆసక్తి, బలహీనతలు, నిజం- అబద్ధాల మధ్య ఉన్న సన్నని గీత గురించి చెప్పే కథ'' అని చెప్పారు డైరెక్టర్ రాజేశ్ ఎం. సెల్వ. ''ది గేమ్' అనేది డిజిటల్ యుగం రియాలిటీలను చూపించే టైమ్‌లీ స్టోరీ. రాజేశ్ సెల్వ మార్క్‌తో, స్ట్రాంగ్ స్టోరీ టెల్లింగ్‌తో ఈ సిరీస్ ఆడియన్స్‌కు కనెక్ట్ అవుతుంది'' అని తెలిపారు అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎండీ సమీర్ నాయర్. ''ది గేమ్' ఈ ఏడాది ఫస్ట్ తమిళ సిరీస్. సరికొత్త స్టోరీని తీసుకొస్తున్నాం. ఒక ఫీమేల్ గేమ్ డెవలపర్‌పై జరిగే కో ఆర్డినేటెడ్ అటాక్ వెనక ఎవరు ఉన్నారు? వాళ్లను ట్రాక్ చేసే ఆమె జర్నీని థ్రిల్లర్‌గా ప్రజెంట్ చేస్తున్నాం'' అని తెలిపారు నెట్‌ఫ్లిక్స్ ఇండియా కంటెంట్ వైస్ ప్రెసిడెంట్ మోనికా షెర్గిల్.


● శ్రద్ధా శ్రీనాథ్

కలలే కలలే...



● యుక్తి తరేజా, కిరణ్ అబ్బవరం

కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'కె-ర్యాంప్'. జైన్స్ నాని దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో యుక్తి తరేజా హీరోయిన్‌గా నటిస్తున్నారు. హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ పతాకాలపై రాజేశ్ దండా, శివ బొమ్మకు నిర్మిస్తున్నారు. చిత్రీకరణ తుది దశకు చేరుకున్న ఈ సినిమా దీపావళి పండగ సందర్భంగా అక్టోబర్ 18న విడుదల కానుంది. చేతన్ భరద్వాజ్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'కలలే కలలే..' అంటూ సాగే మెలోడీ పాటని ఈ నెల 9న రిలీజ్ చేయనున్నట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. ''లవ్‌లో ఉన్నవాళ్లు ఫీల్ అవ్వండి, లవ్‌లో లేని వాళ్లు ఊహించుకోండి.. మ్యాజికల్ మెలోడి వస్తోంది..' అంటూ కిరణ్ ట్వీట్ చేశారు. ఈ సినిమాకి కెమెరా: సతీష్ రెడ్డి మానం, సహ నిర్మాత: బాలాజీ గుట్ట.



● రామ్

వినోదాల పప్పీ షేమ్!

రామ్ పోతినేని, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా'. 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' మూవీ ఫేమ్ పి. మహేశ్‌బాబు దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ఉపేంద్ర, రావు రమేశ్, మురళీ శర్మ, సత్య, రాహుల్ రామకృష్ణ, వీటీవీ గణేశ్ ఇతర పాత్రలు పోషించారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం నవంబరు 28న విడుదల కానుంది. వివేక్-మెర్విన్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'పప్పీ షేమ్...' అంటూ సాగే వినోదాత్మక పాటని ఈ నెల 8న విడుదల చేయనున్నట్లు ప్రకటించి, కొత్త పోస్టర్ రిలీజ్ చేశారు మేకర్స్. భారీగా జనం ఉన్న థియేటర్‌లో ఫస్ట్ డే ఫస్ట్ షో సెలబ్రేషన్స్ జరుపుకుంటున్నట్లు ఫుల్ ఎనర్జిటిక్‌గా కనిపించారు రామ్. ఈ చిత్రానికి సీఈఓ: చెర్రీ, కెమెరా: సిద్ధార్థ నుని, సమర్పణ: గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్, టీ సిరీస్ ఫిలిమ్స్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: హరి తుమ్మల.

బిజినెస్ రీల్

పాలీ మెడిక్యూర్ చేతికి పెండ్రాకేర్

90 శాతం వాటా కొనుగోలు



న్యూఢిల్లీ: మెడికల్ పరికరాల తయారీ కంపెనీ పాలీ మెడిక్యూర్.. తాజాగా నెదర్లాండ్స్ సంస్థ పెండ్రాకేర్ గ్రూప్‌లో మెజారిటీ వాటా కొనుగోలు చేయనుంది. ఇందుకు పెండ్రాకేర్ మాతృ సంస్థ వెల్లింక్ హోల్డింగ్స్ బీవీతో తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు పాలీ మెడిక్యూర్ పేర్కొంది. 90% వాటా కొనుగోలుకి 1.83 కోట్ల యూరోల(దాదాపు రూ. 189 కోట్లు) ఎంటర్‌ప్రైజ్ విలువలో ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు వెల్లడించింది. మిగిలిన 10% వాటాను 2030లో సొంతం చేసుకోనున్నట్లు తెలియజేసింది. 2029 కేలండర్ ఏడాదిలో నిర్వహణ లాభం(ఇబిటా) ఆధారంగా ఈ వాటాను చేజిక్కించుకోనున్నట్లు వెల్లడించింది. పెండ్రాకేర్ ప్రస్తుత యాజమాన్య నిర్వహణలోనే కొనసాగనున్నట్లు వివరించింది. సంస్థ ప్రధానంగా కార్డియాలజీ కేథటర్ సొల్యూషన్ల తయారీ, విక్రయాలు చేపడుతోంది. ఇతర గ్లోబల్ దిగ్గజాలకూ డిజైన్, అభివృద్ధి, తయారీ సర్వీసులను సమకూర్చుతోంది.

రైతులకు ఎన్‌పీఎస్ దన్ను

పీఎఫ్ఆర్‌డీఏ ఈడీ మమతా రోహిత్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వ్యవసాయంలో చురుగ్గా పాలుపంచుకోలేని వృద్ధాప్య దశలో మరొకరిపై ఆధారపడకుండా, ఆర్థికంగా పటిష్టంగా ఉండేందుకు రైతులకి నేషనల్ పెన్షన్ సిస్టం (ఎన్‌పీఎస్) దన్నుగా నిలుస్తుందని పెన్షన్ ఫండ్ నియంత్రణ, అభివృద్ధి సంస్థ పీఎఫ్ఆర్‌డీఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మమతా రోహిత్ తెలిపారు. కొద్ది, కొద్దిగా చేసే పొదుపు, కాలక్రమేణా గణనీయ స్థాయిలో రిటైర్మెంట్ నిధిని ఏర్పాటు చేసుకునేందుకు ఉపయోగపడుతుందని వివరించారు. రైతులు, అసంఘటిత రంగానికి కూడా ఎన్‌పీఎస్‌ను మరింత అందుబాటులోకి తెచ్చే దిశగా సంస్కరణలపై పీఎఫ్ఆర్‌డీఏ కసరత్తు చేస్తోందని రైతు ఉత్పత్తిదారుల సంఘాల సదస్సులో పాల్గొన్న సందర్భంగా ఆమె తెలిపారు. ప్రస్తుతం ఎన్‌పీఎస్ నిర్వహణలోని ఆస్తుల పరిమాణం (ఏయూఎం) రూ. 15 లక్షల కోట్లకు చేరినట్లు ఎన్‌పీఎస్ ట్రస్ట్ సీఈవో సుపర్ణ టాండన్ పేర్కొన్నారు.

ఇక పీవీసీ పైపుల లాభాల ఫ్లో!

- 5 త్రైమాసికాల తదుపరి జోష్
- యాంటీడంపింగ్ డ్యూటీల దన్ను
- ద్వితీయార్థంలో రికవరీపై ఆశలు
- ప్రొడక్టులకు బలపడుతున్న డిమాండ్

సుమారు ఐదు త్రైమాసికాలుగా అంతంతమాత్ర పనితీరు చూపుతూ వచ్చిన ప్లాస్టిక్ పైపుల తయారీ కంపెనీలు ఇకపై బలాన్ని పుంజుకోనున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025-26) ద్వితీయార్థం నుంచి రికవరీ బాటలో సాగనున్నట్లు పరిశ్రమవర్గాలు పేర్కొంటున్నాయి. వెరసి ప్లాస్టిక్ పైపులు, తదితర ప్రొడక్టుల తయారీ దిగ్గజాలకు ప్రోత్సాహం లభించనున్నట్లు భావిస్తున్నాయి. వివరాలు చూద్దాం..

- సాక్షి, బిజినెస్ డెస్క్



కొద్ది నెలలుగా నిరుత్సాహకర ఫలితాలు ప్రకటిస్తున్న ప్లాస్టిక్ పైపుల తయారీ కంపెనీలు ఈ ఏడాది తొలి త్రైమాసికం(ఏప్రిల్–జూన్)లోనూ ఓమాదిరి పనితీరునే ప్రదర్శించాయి. అయితే పలు సానుకూల అంశాల ప్రభావంతో ద్వితీయార్థం (2025 అక్టోబర్–మార్చి 2026)లో మెరుగైన ఫలితాలను సాధించనున్నట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రొడక్టులకు డిమాండ్ పుంజుకోవడం, పాలీవినైల్ క్లోరైడ్(పీవీసీ) ధరలు నిలకడను చూపడం ఇందుకు సహకరించనున్నట్లు తెలియజేశారు. పరిశ్రమ వర్గాల అంచనాల ప్రకారం పటిష్ట డిమాండ్‌కు తోడు ముడివ్యయాలు తగ్గడం కంపెనీలకు కలసిరానుంది. ప్రధానంగా ప్రతిపాదిత యాంటీడంపింగ్ డ్యూటీలు దేశీ పరిశ్రమలకు జోష్‌నివ్వనున్నాయి. ఈ సానుకూలతల కారణంగా ఇటీవల పీవీసీ కంపెనీల షేర్లు పరుగెడుతున్నాయి.

ప్రభుత్వ మద్దతు

ఇటీవలే వాణిజ్య పరిష్కార సంబంధ చర్యలు తీసుకునే ట్రేడ్ రెమిడీస్ డైరెక్టరేట్ జనరల్(డీజీటీఆర్).. పీవీసీ రెజిన్ దిగుమతులపై తుది పరిశీలనను పూర్తి చేసింది. తద్వారా యాంటీడంపింగ్ డ్యూటీల విధింపునకు దారి చూపనుంది. ప్రధానంగా చైనా, ఇండోనేసియా, జపాన్, దక్షిణ కొరియా, తైవాన్, యూఎస్‌ల నుంచి పీవీసీ రెజిన్ దిగుమతి అవుతోంది. దీంతో దిగుమతులు, దేశీ ఉత్పత్తి మధ్య ధరల్లో వ్యత్యాసం తగ్గనుంది. కాగా.. భారత్ పీవీసీ దిగుమతులపై అధికంగా ఆధారపడుతోంది. దేశీ డిమాండ్ వార్షికంగా 4.7 మిలియన్ టన్నులు(ఎంటీపీఏ)కాగా.. స్థానిక తయారీ సామర్థ్యం 1.8 ఎంటీపీఏ మాత్రమే. దీంతో పీవీసీ రెజిన్ కోసం విదేశాలవైపు చూపు సారిస్తోంది. ఫలితంగా పరిశ్రమపై అంతర్జాతీయ ధరల ప్రభావం పడుతోంది. అయితే 2027 కేలండర్ ఏడాదిలో దేశీయంగా 2.5 ఎంటీపీఏ సామర్థ్యం అందుబాటులోకి వచ్చే వీలుంది. వెరసి పీవీసీ దిగ్గజాలు దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకునే అవకాశముంది.

సానుకూలతలు

దేశీయంగా పీవీసీ రెజిన్ సరఫరాలు పుంజుకుంటే పైపుల తయారీ కంపెనీలకు లబ్ధి చేకూరనుంది. ముడిసరుకుల స్థానిక లభ్యతపై విశ్వాసం, ధరల హెచ్చుతగ్గులకు చెక్ పెట్టడం, వర్కింగ్ క్యాపిటల్ అవసరాలు తగ్గడం, నిర్వహణ లాభ మార్జిన్లకు రక్షణ తదితర ప్రయోజనాలకు వీలుచిక్కుతుందని మోతీలాల్ ఓస్వాల్ సెక్యూరిటీస్ నిపుణులు అభిప్రాయపడ్డారు. యాంటీడంపింగ్ చర్యలతో స్థానిక తయారీకి మద్దతు, పీవీసీ రెజిన్ ధరల నిలకడ ద్వారా ఈ రంగంలోని పరిశ్రమల లాభదాయకత మెరుగుపడనున్నట్లు ప్రభుదాస్ లీలాధర్ నిపుణులు తెలియజేశారు. ప్రధానంగా లిస్టెడ్ కంపెనీలు ఆస్ట్రల్, సుప్రీం, ఫినొలెక్స్ లబ్ధి పొందనున్నట్లు పేర్కొన్నారు. ఉదాహరణకు పీవీసీ రెజిన్ ధరలు ఐదు నెలల తదుపరి మే నెలలో తొలిసారి బలపడ్డాయి. కేజీ ధర రూ. 1.5 పుంజుకోగా.. ఆగస్టుకల్లా మరో రూ. 4.6 పెరిగాయి.

షేర్ల జోరు ఇలా...

కంపెనీ పేరు	ప్రస్తుతం	ఏడాది గరిష్టం	ఏడాది కనిష్టం
ఫినొలెక్స్ ఇండస్ట్రీస్	218	334	144
ప్రిన్స్ పైప్స్	331	596	210
ఆస్ట్రల్ లిమిటెడ్	1,422	2,040	1,232
సుప్రీం ఇండస్ట్రీస్	4,587	5,611	3,020

(షేరు ధర రూ.లలో)

పనితీరు డీలా

ఈ ఏడాది ఏప్రిల్–జూన్(క్యూ1)లో పీవీసీ రంగ కంపెనీల ఫలితాలు డీలా పడ్డాయి. ఉమ్మడి ఆదాయం వార్షికంగా 3 శాతం నీరసించగా.. ప్రొడక్టులకు ధరలు(రియలైజేషన్లు) 8% క్షీణించాయి. అయితే అమ్మకాలు 3 శాతం వృద్ధి చూపాయి. అయినప్పటికీ నిర్వహణ లాభం(ఇబిటా) వార్షికంగా 27 శాతం వెనకడుగు వేసింది. ఈ కాలంలో కేజీకి ఇబిటా 41 శాతం పడిపోయింది. నిల్వలపై భారీ నష్టాలు ఇందుకు కారణమయ్యాయి.

క్యూ1లో ఎఫ్‌డీఐల జోరు

15 శాతం వృద్ధితో 18.6 బిలియన్ డాలర్లకు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు(ఎఫ్‌డీఐలు) 15 శాతం ఎగశాయి. వెరసి ఏప్రిల్–జూన్(క్యూ1)లో 18.62 బిలియన్ డాలర్లను తాకాయి. వీటిలో యూఎస్ నుంచి మూడు రెట్లు అధికంగా 5.61 బిలియన్ డాలర్లు తరలి వచ్చాయి. ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2024–25 క్యూ1లో 16.17 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు నమోదయ్యాయి. ఈక్విటీ పెట్టుబడులుసహా మొత్తం ఎఫ్‌డీఐలు 25.2 బిలియన్ డాలర్లకు చేరాయి. గతేడాది క్యూ1లో 22.5 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు లభించాయి. టారిఫ్ సవాళ్లున్నప్పటికీ యూఎస్ నుంచి అత్యంత భారీగా 5.61 బిలియన్ డాలర్లు తరలి వచ్చాయి. గత క్యూ1లో ఇవి కేవలం 1.5 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఈ ఏడాది క్యూ1లో ప్రధానంగా సింగపూర్ నుంచి 4.59 బిలియన్ డాలర్లు, మారిషస్ నుంచి 2.08 బిలియన్ డాలర్లు, సైప్రస్ నుంచి 1.1 బిలియన్ డాలర్లు, యూఏఈ నుంచి బిలియన్ డాలర్లు చొప్పున లభించాయి. కాగా.. 2000 ఏప్రిల్ నుంచి 2025 జూన్‌వరకూ చూస్తే 76.26 బిలియన్ డాలర్ల పెట్టుబడులతో యూఎస్ మూడో ర్యాంకులో నిలవగా.. 182.2 బిలియన్ డాలర్లతో మారిషస్ అగ్రస్థానాన్ని ఆక్రమించింది. ఈ బాటలో సింగపూర్ 179.48 బిలియన్ డాలర్లతో రెండో పెద్ద ఇన్వెస్టర్‌గా నిలిచింది.

రంగాలవారీగా చూస్తే

ఈ ఏడాది తొలి త్రైమాసికంలో పలు రంగాలలోకి విదేశీ పెట్టుబడులు ప్రవహించాయి. ప్రధానంగా కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ అండ్ హార్డ్‌వేర్ 5.4 బిలియన డాలర్లను ఆకట్టుకోగా.. సర్వీసులు 3.28 బిలియన్ డాలర్లు, ఆటోమొబైల్ 1.29 బిలియన్ డాలర్లు, సంప్రదాయ ఇంధనం 1.14 బిలియన్ డాలర్లు, ట్రేడింగ్ 50.6 కోట్ల డాలర్లు, కెమికల్స్ 14 కోట్ల డాలర్లు, టెలికమ్యూనికేషన్లు 2.4 కోట్ల డాలర్లు చొప్పున అందుకున్నాయి. ఇక రాష్ట్రాలవారీగా చూస్తే కర్ణాటక అత్యధికంగా 5.69 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులను సమకూర్చుకుంది. జాబితాలో తదుపరి మహారాష్ట్రకు 5.36 బిలియన్ డాలర్లు, తమిళనాడుకు 2.67 బిలియన్ డాలర్లు, గుజరాత్‌కు 1.2 బిలియన్ డాలర్లు, హర్యానాకు 1.03 బిలియన్ డాలర్లు, ఢిల్లీకి బిలియన్ డాలర్లు చొప్పున లభించాయి.

వెండికి హాల్‌మార్కింగ్

- స్వచ్ఛంద ప్రాతిపదికన అమలు
- ఈ నెల 1 నుంచి అమల్లోకి



న్యూఢిల్లీ: స్వచ్ఛంద ప్రాతిపదికన ప్రభుత్వం వెండి ఆభరణాలకు హాల్‌మార్కింగ్‌ను ప్రవేశపెట్టింది. సెప్టెంబర్ 1నుంచి అమల్లోకి వచ్చేటట్లు హాల్‌మార్కింగ్ నిబంధనలను బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) తాజాగా సవరించింది. వినియోగదారులకు డిజిటల్ గుర్తింపు వ్యవస్థ ద్వారా వెండి స్వచ్ఛతను తెలియజేసే బాటలో ప్రభుత్వం తాజా చర్యలకు ఉపక్రమించింది. ప్రస్తుతం బంగారు ఆభరణాలకు అనుసరిస్తున్న విధానంలోనే వెండి ఆభరణాలకు సైతం హాల్‌మార్కింగ్ యూనిక్ ఐడెంటిఫికేషన్(హెచ్‌యూఐడీ)ను ప్రవేశపెట్టింది. దీంతో స్వచ్ఛతను సులభంగా గుర్తించేందుకు వీలు చిక్కనుంది. కొత్త విధానంలో భాగంగా కొనుగోలుదారులు ఆయా వస్తువు(ఆర్టికల్) ఎలాంటిది, స్వచ్ఛత, హాల్‌మార్కింగ్ తేదీ, టెస్టింగ్ సెంటర్ తదితర వివరాలు తెలుసుకునేందుకు వీలుంటుంది. 2025 సెప్టెంబర్ 1 తదుపరి హాల్‌మార్క్ చేసిన వెండి ఆభరణాలను బీఐఎస్ కేర్ మొబైల్ అప్లికేషన్ ద్వారా వినియోగదారులు వివరాలను పరిశీలించుకోవచ్చని ఒక ప్రకటనలో బీఐఎస్ పేర్కొంది. తాజా సవరణల ప్రకారం వెండి 7 ప్రమాణాలు(800, 835, 925, 958, 970, 990, 999)గా స్వచ్ఛతను నిర్ధారించనున్నారు. వీటిలో 958, 999ను కొత్తగా ప్రవేశపెట్టారు. సిల్వర్, ప్యూరిటీ గ్రేడ్, హెచ్‌యూఐడీతో బీఐఎస్ స్టాండర్డ్ మార్క్ పరిగణిస్తారు.

ఐపీవోకు ఎల్‌డొరాడో అగ్రిటెక్

- సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు
- రూ. 1,000 కోట్లపై కన్ను



న్యూఢిల్లీ: విత్తనాలు, సస్య రక్షణ రంగ కంపెనీ ఎల్‌డొరాడో అగ్రిటెక్ పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు అనుమతించమంటూ క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. ప్రాస్పెక్టస్ ప్రకారం కంపెనీ ఐపీవోలో భాగంగా రూ. 340 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి అదనంగా రూ. 660 కోట్ల విలువైన షేర్లను కంపెనీ ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. వీటిలో రూ. 500 కోట్ల విలువైన ఈక్విటీని శ్రీనివాసరావు లింగ, రూ. 160 కోట్ల విలువైన షేర్లను ఉషా రాణి పాపినేని ఆఫర్ చేయనున్నారు. తద్వారా మొత్తం రూ. 1,000 కోట్లు సమీకరించాలని కంపెనీ భావిస్తోంది. శ్రీకర్ సీడ్స్ బ్రాండుతో కార్యకలాపాలు విస్తరించిన తెలంగాణ కంపెనీ ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 245 కోట్లు రుణ చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. విత్తనాలుసహా సమీకృత సస్య రక్షణ సొల్యూషన్లు అందించే కంపెనీ పరిశోధన, అభివృద్ధి(ఆర్అండ్‌డీ) ఉత్పత్తి, ప్రాసెసింగ్, మార్కెటింగ్, పంపిణీ తదితరాలను నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా విభిన్నతరహా హైబ్రిడ్, స్వీయ పరాగ సంపర్క(ఓపీవీ) విత్తనాలను పంపిణీ చేస్తోంది. జొన్న, ధాన్యం, పత్తి, గోధుమలు, సజ్జలు తదితర పంటల సంబంధ విత్తనాలను ఆఫర్ చేస్తోంది. 2025 జూన్‌కల్లా సీఐబీఆర్‌సీ నుంచి 269 రిజిస్ట్రేషన్లు పొందింది. గతేడాది(2024–25)లో రూ. 441 కోట్ల ఆదాయం, రూ. 71 కోట్ల నికర లాభం ఆర్జించింది.

టీవీఎస్ హైపర్ స్పోర్ట్ స్కూటర్.. ఎన్‌టార్క్ 150



ముంబై: టీవీఎస్ మోటార్ హైపర్ స్పోర్ట్ స్కూటర్ 'ఎన్‌టార్క్ 150'ను మార్కెట్లో విడుదల చేసింది. స్పోర్టీ, ప్రీమియం లుక్‌తో వస్తున్న ఈ మోడల్ రెండు వేరియంట్లలో లభిస్తుంది. ఎక్స్‌షోరూం వద్ద బేస్ వేరియంట్ ధర రూ.1,19,000, అధునాతన టీఎఫ్‌టీ వేరియంట్ ధర రూ.1,29,000 గా ఉంది. ఇందులో 149.7సీసీ సామర్థ్యం కలిగిన ఎయిర్–కూల్డ్ 3సీ టెక్ ఇంజిన్ అమర్చారు. ఇది గరిష్టంగా 7,000 ఆర్‌పీఎం వద్ద 13.2 పీఎస్ పవర్‌ను, 5,500 ఆర్‌పీఎం వద్ద 14.2 ఎన్‌ఎమ్ టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. కేవలం 6.3 సెకన్లలో 0 నుండి 60 కి.మీ వేగాన్ని అందుకోగలదు. గంటకు 104 కి.మీ వేగం ప్రయాణించలదు. హై–రిజల్యూషన్ టీఎఫ్‌టీ క్లస్టర్‌తో పాటు టీవీఎస్ స్మార్ట్‌ఎక్స్‌కనెక్షన్ టెక్నాలజీ ఉంది. అలెక్సా, స్మార్ట్ వాచ్ ఇంటిగ్రేషన్, టర్న్–బై–టర్న్ నావిగేషన్, వెహికల్ ట్రాకింగ్, చివరిగా పార్క్ చేసిన స్థానం, కాల్/మెసేజ్ అలర్ట్స్, రైడ్, స్ట్రీట్ మోడ్‌లు, ఓటీఏ అప్‌డేట్స్, కస్టమ్ విడ్జెట్‌లు వంటి మరెన్నో స్మార్ట్ ఫీచర్లు ఇందులో లభిస్తాయి.

మనీ మార్కెట్లకు 8న సెలవు: రిజర్వ్ బ్యాంక్

ముంబై: మనీ మార్కెట్లకు ఈ నెల 8న సెలవు వర్తించనున్నట్లు రిజర్వ్ బ్యాంక్ తాజాగా పేర్కొంది. మహారాష్ట్ర ప్రభుత్వం ఇంతక్రితం ప్రకటించిన సెలవు తేదీ 5ను తాజాగా 8కు మార్చడంతో ప్రభుత్వ సెక్యూరిటీ(జీసెక్)లు, విదేశీ మారకం, రుపీ ఇంటరెస్ట్ రేటు డెరివేటివ్స్‌లో లావాదేవీలు, సెటిల్‌మెంట్స్ ఉండబోవని స్పష్టం చేసింది. వెరసి ఈ నెల 5న జీసెక్‌లు, విదేశీ మారకం, మనీ మార్కెట్, రుపీ ఇంటరెస్ట్ రేటు డెరివేటివ్స్ మార్కెట్లు యథావిధిగా పనిచేస్తాయని తెలియజేసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

5-9-2025	
విశాఖ	555-00
చిత్తూరు	578-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	545-00
విజయవాడ	545-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	535-00
వరంగల్	537-00
రిటైల్ ధర	5.95

నిఫ్టీ 50 — టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
M&M	3,480.00	5.9
BAJFINANCE	933.05	4.1
APOLLOHOSP	7,891.00	2
BAJAJFINSV	2,003.00	1.88
NESTLEIND	1,211.40	1.39

నిఫ్టీ 50 — టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HDFCLIFE	754.55	-2.82
TATACONSUM	1,074.00	-2.75
INDUSINDBK	755	-1.71
WIPRO	245.45	-1.65
MARUTI	14,680.00	-1.65

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	8,507
ఎన్ఎస్ఈ	1,05,477
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,46,923
ఎఫ్ఐఐ	- 106
డీఐఐ	+ 2,233

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	62.18	$ 63.97
బ్రెంట్	66.94	$ 67.06

'జీఎస్‌టీ' లాభాలకు గండి!

- లాభాల స్వీకరణ ఇందుకు నేపథ్యం
- 887 పాయింట్ల నుంచి 150 పాయింట్లకు సెన్సెక్స్
- 19 పాయింట్ల స్వల్ప లాభంతో గట్టెక్కిన నిఫ్టీ



ముంబై: కీలక రంగాల షేర్లలో లాభాల స్వీకరణతో 'జీఎస్‌టీ సంస్కరణ' లాభాలు పరిమితమయ్యాయి. సెన్సెక్స్ 150 పాయింట్ల స్వల్ప లాభంతో 80,718 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 19 పాయింట్లు పెరిగి 24,734 వద్ద నిలిచింది. జీఎస్టీ కీలక మార్పులు ప్రకటన నేపథ్యంలో ఉదయం సెన్సెక్స్ 887 పాయింట్లు పెరిగి 81,456 వద్ద, నిఫ్టీ 266 పాయింట్లు బలపడి 24,981 వద్ద ట్రేడింగ్ ప్రారంభించాయి. అమెరికా సుంకాల విధింపు ఒత్తిళ్లు, అంతర్జాతీయ ఆర్థిక అస్థిరతలు, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ అంశాలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఫలితంగా వినియోగ ఆధారిత షేర్లు మినహా అన్ని రంగాల షేర్లలో పెద్ద ఎత్తున లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. ముఖ్యంగా అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్(–1%), ఇన్ఫోసిస్(–1%), మారుతీ సుజుకీ(–2%) నష్టపోయి సూచీల లాభాలను సగానికి పైగా హరించివేశాయి. అంతర్జాతీయ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి.

- వినియోగ ఆధారిత రంగాలైన ఆటో, ఎఫ్ఎంసీజీ, కన్జూమర్ డిస్క్రెషనరీ, ఫైనాన్స్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్ఈలో రంగాల వారీ ఇండెక్సుల్లో యుటిలిటీస్ 1.25%, ఆయిల్అండ్‌గ్యాస్ 1.05%, ఐటీ, రియల్టీ, టెక్ సూచీలు 1% నష్టపోయాయి. స్మాల్, మిడ్‌క్యాప్ సూచీలు 0.60% పతనమయ్యాయి.
- ఇంట్రాడేలో లాభాల స్వీకరణతో ఆటో షేర్లలో ర్యాలీ సైతం నెమ్మదించింది. మహీంద్రాఅండ్‌మహీంద్రా 6% పెరిగింది. ఐషర్ మోటార్స్ 1.11%, టీవీఎస్ మోటార్ 1%, అపోలో టైర్స్ 0.13%, హీరో మోటోకార్ప్ 0.06 శాతం రాణించాయి. ఇంట్రాడేలో ఎంఅండ్‌ఎం 8%, ఐషర్ మోటార్స్ 5.39%, టీవీఎస్ మోటార్ 4%, హీరో మోటోకార్ప్ 3.50%, బజాజ్ ఆటో, అపోలో టైర్స్ 2.50% గరిష్టాన్ని తాకాయి.
- జీఎస్‌టీ పన్ను రేట్లలో మార్పులు కొన్ని రంగాలపై ప్రతికూల ప్రభావాన్ని చూపింది. బొగ్గు, లిగ్నైట్, పీట్‌పై జీఎస్‌టీని 5 నుంచి 18 శాతానికి పెంచడంతో కోల్ ఇండియా, ఎన్ఎల్‌సీ ఇండియా, టాటా పవర్, జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ షేర్లు 1% నష్టపోయాయి. సోడా, ఎనర్జీ డ్రింక్స్‌పై జీఎస్‌టీ 40 శాతానికి పెంచడంతో వరుణ్ బేవరేజెస్ షేరు 3% నష్టపోయింది. క్యాసినో, బెట్టింగ్, ఆన్‌లైన్ మనీ గేమింగ్స్‌పై 40% పన్ను పడుతుండటంతో డెల్టా కార్ప్ షేరు 8%, నజరా టెక్నాలజీస్ 2.50% పతనమయ్యాయి.
- ఆరోగ్య, జీవిత బీమా పాలసీలపై 18% జీఎస్‌టీ ఎత్తివేయడంతో ఇన్సూరెన్స్ కంపెనీల షేర్లకు డిమాండ్ లభించింది. అయితే లాభాల స్వీకరణ కారణంగా ఆరంభ లాభాలు ఆవిరై నష్టాలతో ముగిశాయి. మాక్స్ ఫైనాన్సియల్ సర్వీసెస్ 3.11%, నువా బుపా హెల్త్ ఇన్సూరెన్స్ 3%, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ 3%, స్టార్ హెల్త్ అండ్ అల్లయిడ్ ఇన్సూరెన్స్ 2%, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ 1.50%, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ ఒకశాతం నష్టపోయాయి. ఇంట్రాడేలో స్టార్ హెల్త్ 9.35%, నువా బుపా 9%, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ 6%, ఎల్ఐసీ, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ 5% గరిష్టాన్ని తాకాయి. ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ 2.50%, ఎల్ఐసీ 1% పెరిగాయి.

సెబీపై శాట్‌కి జేన్‌స్ట్రీట్

ముంబై: మార్కెట్లో అవకతవకలకు పాల్పడిన ఆరోపణలకు సంబంధించి సెబీ తమపై ఆంక్షలు విధించడాన్ని సవాలు చేస్తూ అమెరికన్ హెడ్జ్ ఫండ్ జేన్‌స్ట్రీట్ తాజాగా సెక్యూరిటీస్ అప్పీలేట్ ట్రిబ్యునల్‌ని (శాట్) ఆశ్రయించింది. సెబీ ఉత్తర్వులను రద్దు చేయాలని, తమ నిర్దోషిత్వాన్ని రుజువు చేసుకునేందుకు ఉపయోగపడే డాక్యుమెంట్లకు యాక్సెస్ కల్పించాలని కోరింది. అలాగే, తదుపరి చర్యలు తీసుకోకుండా సెబీని ఆదేశించడం ద్వారా తాత్కాలిక ఊరట కల్పించాలని విజ్ఞప్తి చేసింది. ఎక్స్‌పార్టీ మధ్యంతర ఉత్తర్వులను పాటిస్తూ సెబీ నిర్దేశించిన మొత్తాన్ని ఇప్పటికే జమ చేసినట్లు వివరించింది. దీనిపై సెప్టెంబర్ 8న శాట్ విచారణ చేపట్టే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ట్రేడింగ్ అవకతవకలకు గాను రూ. 4,843 కోట్లు కట్టాలంటూ జేన్‌స్ట్రీట్‌కు సెబీ జరిమానా విధించిన సంగతి తెలిసిందే.



భారత్, అఫ్గానిస్తాన్ మ్యాచ్ 'డ్రా'

హిసర్ (తజికిస్తాన్): అందివచ్చిన అవకాశాల్ని చేజార్చుకున్న భారత ఫుట్‌బాల్ జట్టు అఫ్గానిస్తాన్‌తో మ్యాచ్‌ను 'డ్రా'గా ముగించుకుంది. సీఏఎఫ్‌ఏ నేషన్స్ కప్ ఫుట్‌బాల్ టోర్నీలో గురువారం భారత్, అఫ్గానిస్తాన్‌ల మధ్య జరిగిన మ్యాచ్ ఒక్క గోల్ నమోదు కాకుండానే 0-0తో 'డ్రా' అయ్యింది. ఫిఫా' ర్యాంకుల్లో 127వ స్థానంలో ఉన్న భారత్ తమకన్నా దిగువ ర్యాంకు 160లో ఉన్న అఫ్గానిస్తాన్‌పై ప్రభావం చూపలేకపోయింది. మ్యాచ్ మొత్తం మీద బంతిని తమ ఆధీనంలో ఉంచుకోవడంలోనూ విఫలమైంది. ప్రత్యర్థి గోల్ పోస్ట్‌పై చేసిన దాడుల్లోనూ నిరాశపరిచింది. అఫ్గానిస్తాన్ మూడుసార్లు భారత్ గోల్‌పోస్ట్‌పై గురిపెడితే... భారత్ కేవలం రెండుసార్లే గోల్ ప్రయత్నాలు చేయగలిగింది. భారత్ కన్నా అఫ్గానిస్తాన్ రక్షణ శ్రేణి మెరుగ్గా ఆడింది. తాజా ఫలితంలో భారత్ గ్రూప్ 'బి'లో 4 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. తద్వారా ఫైనల్ చేరే అవకాశాల్ని కోల్పోయిన భారత్ ఇప్పుడు మూడు, నాలుగో స్థానాల కోసం ఉజ్బెకిస్తాన్‌తో తలపడుతుంది. ఈ నెల 8న ఈ కాంస్య పతకపోరు జరుగుతుంది.

రుతురాజ్ భారీ శతకం



సెంట్రల్ జోన్‌తో దులీప్ ట్రోఫీ సెమీఫైనల్

- వెస్ట్‌జోన్ 363/6
- రాణించిన తనుశ్

బెంగళూరు: రుతురాజ్ గైక్వాడ్ (206 బంతుల్లో 184; 25 ఫోర్లు, 1 సిక్స్) వీరోచిత శతకం సాధించడంతో వెస్ట్‌జోన్ భారీస్కోరు సాధించింది. దులీప్ ట్రోఫీలో భాగంగా సెంట్రల్ జోన్‌తో గురువారం మొదలైన సెమీఫైనల్లో టాస్ నెగ్గి మొదట బ్యాటింగ్‌కు దిగిన వెస్ట్‌జోన్ మొదటి రోజు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 87 ఓవర్లలో 6 వికెట్లకు 363 పరుగులు చేసింది. తనుశ్ కొటియాన్ (121 బంతుల్లో 65 బ్యాటింగ్; 5 ఫోర్లు) రాణించాడు. సెంట్రల్ బౌలర్లలో ఖలీల్ అహ్మద్, సారాంశ్ జైన్ చెరో 2 వికెట్లు తీశారు. గత నెలలో జరిగిన బుచ్చిబాబు టోర్నీలో హిమాచల్ ప్రదేశ్‌తో జరిగిన పోరులో మహారాష్ట్ర తరఫున చెలరేగి సెంచరీ బాదిన రుతురాజ్ ఇక్కడి బీసీసీఐ ఎక్సలెన్సీ గ్రౌండ్‌లోనూ అదే జోరు కొనసాగించాడు.

4/1... 10/2!

బ్యాటింగ్‌కు దిగగానే వెస్ట్‌జోన్ కష్టాల్లో పడింది. ఇన్నింగ్స్ మొదలైన ఓవర్లోనే 4 పరుగుల స్కోరు వద్దే కీలకమైన ఓపెనర్ యశస్వి జైస్వాల్ (4) వికెట్‌ను కోల్పోయింది. దీన్నుంచి తేరుకోకముందే మరో ఓపెనర్ హార్విక్ దేశాయ్ (1) కూడా వికెట్‌ను అప్పగించడంతో 10 పరుగులకే 2 వికెట్లు కోల్పోయిన వెస్ట్ కష్టాల్లో కూరుకుంది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన రుతురాజ్ ఆడిన ఆట, చేసిన పరుగులు, పాతుకుపోయిన భాగస్వామ్యాలతో వెస్ట్‌ను కష్టాల నుంచి గట్టెక్కించాడు. ముందుగా వన్‌డౌన్ బ్యాటర్ ఆర్య దేశాయ్ (39; 6 ఫోర్లు)తో కలిసి వికెట్ల పతనాన్ని అడ్డుకున్నాడు. చూడచక్కని బౌండరీలతో గైక్వాడ్ పరుగులు రాబట్టాడు. జట్టు స్కోరు 100కు ముందు 92 పరుగుల వద్ద ఆర్య అవుటయ్యాడు. దీంతో మూడో వికెట్‌కు 82 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాత వచ్చిన శ్రేయస్ అయ్యర్ (28 బంతుల్లో 25; 4 ఫోర్లు) బాధ్యత కనబరచలేకపోయాడు. క్రీజులోకి రాగానే అవుటయ్యే ప్రమాదం నుంచి బయట పడినప్పటికీ మరెంతో సేపు క్రీజులో నిలువలేదు. కుదురుగా ఆడుతున్న రుతురాజ్‌కు సహకారం అందించాల్సిన చోట నిర్లక్ష్యంగా 137 స్కోరు వద్ద అతనూ పెవిలియన్‌కు వెళ్లిపోయాడు.

తనుశ్ అండతో...

రెండో సెషన్‌లో షమ్స్ ములానీ (18; 3 ఫోర్లు) కూడా చెప్పుకోదగ్గ స్కోరు చేయలేదు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన తనుశ్ కొటియాన్ అండతో గైక్వాడ్ బ్యాటింగ్ జోరుగా సాగింది. ఇద్దరు క్రీజులో పాతుకుపోవడమే కాదు... పరుగుల్ని కూడా చకచకా రాబట్టారు. ఈ క్రమంలోనే రుతురాజ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. శతకం తర్వాత అతను వన్డేను తలపించే ఆటతీరుతో అలరించడంతో పరుగుల వేగం అనూహ్యంగా పుంజుకుంది. జట్టు స్కోరు 300 పైచిలుకు దాటింది. ఇక డబుల్ సెంచరీ ఖాయమనుకున్న దశలో రుతురాజ్‌ను సారాంశ్ అవుట్ చేశాడు. దీంతో ఆరో వికెట్‌కు 148 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కెప్టెన్ శార్దుల్ ఠాకూర్ (50 బంతుల్లో 24 బ్యాటింగ్; 3 ఫోర్లు) క్రీజులోకి రాగా నింపాదిగా ఆడుతున్న తనుశ్ అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఇద్దరు నాటౌట్‌గా నిలిచారు.

నారాయణ్ జగదీశన్ అజేయ సెంచరీ



నార్త్‌జోన్‌తో దులీప్ ట్రోఫీ సెమీఫైనల్

- రాణించిన పడిక్కల్, తన్మయ్
- సౌత్‌జోన్ 297/3

బెంగళూరు: టాపార్డర్ బ్యాటర్లు బాధ్యతగా ఆడటంతో సౌత్‌జోన్ జట్టు దులీప్ ట్రోఫీ సెమీస్ పోరును సాధికారికంగా ప్రారంభించింది. ఓపెనర్ నారాయణ్ జగదీశన్ (260 బంతుల్లో 148 బ్యాటింగ్; 13 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ సెంచరీతో కదం తొక్కాడు. దులీప్ ట్రోఫీలో నార్త్‌జోన్‌తో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్‌కు దిగిన సౌత్‌జోన్ తొలిరోజు ఆట నిలిచే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 81 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 297 పరుగులు చేసింది. దేవదత్ పడిక్కల్ (71 బంతుల్లో 57; 7 ఫోర్లు), తన్మయ్ అగర్వాల్ (99 బంతుల్లో 43; 5 ఫోర్లు) రాణించారు. నార్త్‌జోన్ బౌలర్లలో నిశాంత్ సింధు 2, అన్షుల్ కంబోజ్ ఒక వికెట్ తీశారు.

ఓపెనర్ల శుభారంభం

టాస్ నెగ్గిన నార్త్‌జోన్ ఫీల్డింగ్ ఎంచుకోవడంతో సౌత్ ఇన్నింగ్స్‌ను ఆరంభించిన ఓపెనర్లు తన్మయ్ అగర్వాల్, జగదీశన్ చక్కని ఆరంభమిచ్చారు. ఇద్దరు చక్కని సమన్వయంతో పరుగులు సాధించారు. టీమిండియాతో కలిసి ఇటీవల ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లిన నారాయణ్ జగదీశన్‌కు తుదిజట్టుకు ఆడే అవకాశం లభించలేదు. అయితే దేశవాళీ క్రికెట్‌లో తన బ్యాటింగ్ జోరును కనబరచడం ద్వారా సెలక్టర్ల దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేశాడు. తన్మయ్‌తో కలిసి నార్త్‌జోన్ బౌలర్లను అవలీలగా ఎదుర్కొన్నాడు. ఓపెనర్లిద్దరూ పాతుకుపోవడంతో నార్త్‌జోన్‌కు తొలిసెషన్‌లో కష్టాలు తప్పలేదు. చూస్తుండగానే జట్టు స్కోరు వంద పరుగులు దాటింది. ఎట్టకేలకు జట్టు స్కోరు 103 పరుగుల వద్ద తన్మయ్ నిష్క్రమించడంతో తొలివికెట్ భాగస్వామ్యానికి తెరపడింది.

పడిక్కల్ ఫిఫ్టీ

తొలి వికెట్ తీసిన ఆనందం ఆవిరయ్యేందుకు ఎంతోసేపు పట్టలేదు. వన్‌డౌన్ బ్యాటర్ దేవదత్ పడిక్కల్, జగదీశన్ పరుగులు చక్కబెట్టే పనిలో నిమగ్నమయ్యారు. అనవసర షాట్ల జోలికి వెళ్లకుండా సింగిల్స్, డబుల్స్‌తో జట్టు స్కోరును నడిపించారు. క్రీజులో కుదురుకున్నాక పడిక్కల్ అడపాదడపా బౌండరీలతో అలరించాడు. దీంతో నార్త్ కష్టాలు కాస్త మళ్లీ మొదటికొచ్చాయి. ఇటు పరుగుల్ని ఆపలేక... అటు వికెట్లను పడగొట్టలేక నార్త్‌జోన్ బౌలర్లు రోజంతా ఆపసోపాలు పడ్డారు. దేవదత్ అర్ధసెంచరీ సాధించగా, నారాయణ్ జగదీశన్ సెంచరీ పూర్తిచేసుకున్నాడు. జట్టు స్కోరు 200 పైచిలుకు దాటాకా పడిక్కల్‌ను అన్షుల్ కాంబోజ్ అవుట్ చేశాడు. తర్వాత వచ్చిన మోహిత్ (15) తక్కువ స్కోరుకే పరిమితం కాగా... కెప్టెన్ అజారుద్దీన్ (11 బ్యాటింగ్), ఓపెనర్ జగదీశన్‌లు మళ్లీ మరో వికెట్ అవకాశాన్ని ఇవ్వకుండా రోజును ముగించారు. చేతిలో ఇంకా ఏడు వికెట్లున్న సౌత్‌జోన్ భారీ స్కోరు దిశగా పయనిస్తోంది.

క్రికెట్‌కు అమిత్ మిశ్రా గుడ్‌బై

రిటైర్మెంట్ ప్రకటించిన లెగ్‌స్పిన్నర్



న్యూఢిల్లీ: భారత మాజీ స్పిన్నర్ అమిత్ మిశ్రా క్రికెట్ నుంచి పూర్తిగా తప్పుకున్నాడు. అన్ని స్థాయిల్లోనూ ఆట నుంచి రిటైర్ అవుతున్నట్లు అతను ప్రకటించాడు. 43 ఏళ్ల మిశ్రా తొలిసారి 2003లో భారత జట్టుకు వన్డేల్లో ప్రాతినిధ్యం వహించాడు. మరో ఐదేళ్ల తర్వాత అతనికి టెస్టు ఆడే అవకాశం దక్కింది. భారత జట్టు తరఫున 2017లో మిశ్రా చివరి అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. 2000-01 సీజన్‌లో తొలి రంజీ ట్రోఫీ మ్యాచ్ ఆడిన అమిత్ మిశ్రా 25 ఏళ్ల పాటు వేర్వేరు జట్లకు ప్రాతినిధ్యం వహించడం విశేషం. 'నా జీవితంలో అన్ని రకాలుగా భాగమైన క్రికెట్‌కు 25 ఏళ్ల తర్వాత గుడ్‌బై చెబుతున్నా. నా కెరీర్‌లో ఎన్నో విజయాలు, మలుపులు, భావోద్వేగాలు ఉన్నాయి. నా కెరీర్‌లో అండగా నిలిచిన అందరికీ కృతజ్ఞతలు. మరో రూపంలో ఆటతో నా అనుబంధం కొనసాగుతుంది' అని అమిత్ మిశ్రా సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. కెరీర్‌లో మిశ్రా 22 టెస్టుల్లో 35.72 సగటుతో మొత్తం 76 వికెట్లు పడగొట్టాడు. 36 వన్డేలు, 10 టి20ల్లో కలిపి అమిత్ 80 వికెట్లు తీశాడు. 2013లో చాంపియన్స్ ట్రోఫీ గెలిచిన భారత జట్టులో అతను సభ్యుడిగా ఉన్నాడు. హరియాణా తరఫున రంజీ ట్రోఫీలో ఎన్నో చెప్పుకోదగ్గ ప్రదర్శనలు నమోదు చేసిన మిశ్రా...బ్యాటింగ్‌లో కూడా కర్ణాటకపై డబుల్ సెంచరీ (202 నాటౌట్) సాధించడం విశేషం. ఐపీఎల్‌లో సుదీర్ఘ కాలం తనదైన ముద్ర వేసిన బౌలర్లలో అతను కూడా ఒకడు. 2008 నుంచి 2024 వరకు మధ్యలో ఒక సీజన్ మినహా ప్రతీసారి మిశ్రా ఐపీఎల్ బరిలోకి దిగాడు. హైదరాబాద్, ఢిల్లీ, లక్నో తరఫున ఆడిన అతను 162 మ్యాచ్‌లలో 7.37 ఎకానమీతో 174 వికెట్లు పడగొట్టి అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో ఎనిమిదో స్థానంతో ముగించాడు. ఐపీఎల్ టోర్నీ చరిత్రలో 3 హ్యాట్రిక్‌లు (2008, 2011, 2013) సాధించిన ఏకైన బౌలర్‌గా మిశ్రా నిలిచాడు.

గుకేశ్ గెలుపు



సమర్‌కండ్ (ఉజ్బెకిస్తాన్): అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) గ్రాండ్ స్విస్ టోర్నమెంట్ ఓపెన్ విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్, ప్రపంచ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్ విజయంతో ఖాతా తెరిచాడు. ఎటెని బాక్రోట్ (ఫ్రాన్స్)తో జరిగిన తొలి గేమ్‌లో నల్ల పావులతో ఆడిన గుకేశ్ 45 ఎత్తుల్లో గెలిచాడు. భారత్‌కే చెందిన గ్రాండ్‌మాస్టర్లు విదిత్, అభిమన్యు పురాణిక్ కూడా తొలి గేముల్లో నెగ్గగా... ఇరిగేశి అర్జున్, ప్రజ్ఞానంద, నిహాల్ సరీన్, రౌనక్ సాధ్వాని, లియోన్, ప్రణవ్, నారాయణన్ తమ గేమ్‌లను 'డ్రా' చేసుకున్నారు. పెంటేల హరికృష్ణ, మురళీ కార్తికేయన్, ఆర్యన్ చోప్రా, ఓపెన్ విభాగంలో పోటీపడుతున్న మహిళా గ్రాండ్‌మాస్టర్ దివ్య దేశ్‌ముఖ్‌లకు తొలి గేమ్‌లో ఓటమి ఎదురైంది. మహిళల విభాగం తొలి రౌండ్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ వైశాలి 56 ఎత్తుల్లో గుల్‌రుఖ్ బేగం (ఉజ్బెకిస్తాన్)పై, వంతిక అగర్వాల్ 65 ఎత్తుల్లో యూలియా (ఉక్రెయిన్)పై నెగ్గగా... మార్సెల్ ఎఫ్రోమ్‌స్కీ (ఇజ్రాయెల్)తో జరిగిన గేమ్‌ను ద్రోణవల్లి హారిక 55 ఎత్తుల్లో 'డ్రా' చేసుకుంది.

భారత బాక్సర్ పవన్ శుభారంభం



లివర్‌పూల్: ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు శుభారంభం లభించింది. పురుషుల 55 కేజీల విభాగంలో భారత బాక్సర్ పవన్ బర్త్‌వాల్ తొలి రౌండ్‌లో గెలిచి రెండో రౌండ్‌లోకి ప్రవేశించాడు. మైకేల్ డగ్లస్ సిల్వా (బ్రెజిల్)తో జరిగిన బౌట్‌లో పవన్ 3:2తో విజయం సాధించాడు. భారత ఇతర బాక్సర్లు హితేశ్ గులియా (70 కేజీలు), అభినాశ్ (65 కేజీలు), లవ్లీనా (75 కేజీలు), మీనాక్షి హుడా (48 కేజీలు), పూజా రాణి (80 కేజీలు), నుపుర్ (ప్లస్ 80 కేజీలు), జాదూమణి (60 కేజీలు), సచిన్ సివాచ్ (60 కేజీలు), లక్ష్య చహర్ (80 కేజీలు), జుగ్నూ (85 కేజీలు) తొలి రౌండ్‌లో 'బై' పొందగా... నిఖత్ జరీన్ (51 కేజీలు) తొలి రౌండ్‌లో అమెరికా బాక్సర్ జెన్నిఫర్ లొజానాతో ఆడుతుంది.

ప్రపంచ కప్ బెర్త్ లక్ష్యంగా...

- మహిళల ఆసియా కప్ బరిలో భారత మహిళల హాకీ జట్టు
- నేడు తొలి మ్యాచ్‌లో థాయ్‌లాండ్‌తో 'ఢీ'



హాంగ్జౌ (చైనా): సీనియర్ గోల్‌కీపర్ సవితా పూనియా... స్టార్ డ్రాగ్ ఫ్లికర్ దీపిక గైర్హాజరీలో.. ఆసియా కప్ మహిళల హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. నేటి నుంచి ఈనెల 14వ తేదీ వరకు జరిగే ఈ మెగా టోర్నీలో భారత జట్టు శుక్రవారం పూల్ 'బి'లోని తమ తొలి మ్యాచ్‌లో థాయ్‌లాండ్‌తో ఆడుతుంది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో భారత్ తొమ్మిదో స్థానంలో... థాయ్‌లాండ్ 30వ స్థానంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో భారత్ భారీ విజయంపై గురి పెట్టింది. పూల్ 'బి'లో భారత్, థాయ్‌లాండ్‌లతోపాటు జపాన్ (12వ ర్యాంక్), సింగపూర్ (31వ ర్యాంక్) జట్లున్నాయి. శుక్రవారం థాయ్‌లాండ్‌తో మ్యాచ్ తర్వాత... శనివారం జపాన్‌తో, సోమవారం సింగపూర్‌తో భారత్ ఆడుతుంది. పూల్ 'ఎ'లో చైనా, దక్షిణ కొరియా, మలేసియా, చైనీస్ తైపీ జట్లున్నాయి. లీగ్ దశ ముగిశాక రెండు పూల్‌ల నుంచి తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీఫైనల్ 'సూపర్-4' దశకు అర్హత సాధిస్తాయి. 'సూపర్-4' మ్యాచ్‌లు ముగిశాక టాప్-2లో నిలిచిన రెండు జట్లు ఫైనల్లో టైటిల్ కోసం పోటీ పడతాయి. ఆసియా కప్ విజేత జట్టుకు వచ్చే ఏడాది బెల్జియం-నెదర్లాండ్స్ వేదికగా జరిగే ప్రపంచ కప్ టోర్నమెంట్‌కు నేరుగా అర్హత లభిస్తుంది. చీలమండ గాయంతో టోర్నీ నుంచి తప్పుకున్న మాజీ కెప్టెన్, గోల్‌కీపర్ సవితా పూనియా స్థానంలో గోల్ కీపింగ్ బాధ్యతలు బిచ్చూదేవి, బన్సారి సోలంకి తీసుకుంటారు. దీపిక లేని లోటును డిఫెన్స్‌లో ఉదిత, నిక్కీ ప్రధాన్, మనీషా చౌహాన్, ఇషిక, సుమన్ దేవి భర్తీ చేయాల్సి ఉంటుంది. నేహా, కెప్టెన్ సలీమా టెటె, లాల్‌రెమ్‌సియామి, షర్మిలా దేవి, సునెలితా టొప్పో, వైష్ణవిలతో భారత మిడ్‌ఫీల్డ్ పటిష్టంగా ఉంది. ఫార్వర్డ్ శ్రేణిలో నవ్‌నీత్ కౌర్, సంగీత, ముంతాజ్ ఖాన్, బ్యూటీ డుంగ్‌డుంగ్, రుతుజా, సాక్షి సత్తా చాటాల్సి ఉంటుంది. ఈ టోర్నీ భారత చీఫ్ కోచ్ హరేంద్ర సింగ్‌కు కూడా పరీక్షగా నిలువనుంది. ఇటీవల యూరోపియన్ అంచె ప్రొ లీగ్‌లో భారత జట్టు నిరాశాజనక ప్రదర్శన కనబరిచింది. ప్రొ లీగ్‌లో భారత జట్టు 100 కంటే ఎక్కువ పెనాల్టీ కార్నర్‌లను సమర్పించుకోగా.. బెల్జియంతో జరిగిన పోరులో ఏకంగా 17 పెనాల్టీ కార్నర్‌లు ఉన్నాయి. 1985లో మొదలైన ఈ టోర్నీలో భారత జట్టు రెండుసార్లు (2004, 2017) చాంపియన్‌గా, రెండుసార్లు (1999, 2009) రన్నరప్‌గా నిలిచింది. మూడుసార్లు (1993, 2013, 2022) మూడో స్థానాన్ని పొందిన టీమిండియా ... రెండుసార్లు (1989, 2007) నాలుగో స్థానాన్ని దక్కించుకుంది.



ఐపీఎల్ టికెట్ ధరలు పెరిగాయి!

40% జీఎస్‌టీ ప్రభావం

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్ (జీఎస్‌టీ)లో కొత్తగా చేసిన మార్పు వల్ల ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టికెట్ల ధరలు మరింత పెరగనున్నాయి. స్టేడియంకు వెళ్లి మ్యాచ్‌లను ప్రత్యక్షంగా చూడాలనుకునే అభిమానులపై ఈ భారం పడనుంది. ఐపీఎల్ మ్యాచ్‌ల టికెట్లను 'విలాస వస్తువుల' కేటగిరీలో చేర్చిన ప్రభుత్వం వీటిపై 40 శాతం పన్ను విధించింది. ఇప్పటి వరకు దీనికి 28 శాతం పన్ను మాత్రమే ఉంది. ఉదాహరణకు రూ.500 టికెట్ జీఎస్‌టీతో కలిపి రూ. 640కి అందుబాటులో ఉండగా... అదే టికెట్ ఇప్పుడు రూ. 700కు లభిస్తుంది. ఐపీఎల్ టికెట్ ధరలను నిర్ణయించే అధికారం ఫ్రాంచైజీలకే ఉంది. మ్యాచ్‌లు జరిగే హోం గ్రౌండ్‌లను బట్టి ఇవి మారతాయి. అయితే ఐపీఎల్‌లో టికెట్ల ద్వారా (గేట్ రెవెన్యూ) వచ్చే మొత్తం ఫ్రాంచైజీల ఆదాయంలో చాలా చిన్న భాగం కావడం గమనార్హం. మరోవైపు భారత జట్టు అంతర్జాతీయ మ్యాచ్‌లపై పన్ను విషయంలో ఎలాంటి తేడా లేదు. ఇది 18 శాతంగానే కొనసాగనుంది. అది కూడా రూ.500 కంటే ఎక్కువ టికెట్ ఉంటేనే జీఎస్‌టీ వర్తిస్తుంది. అంతకంటే తక్కువ విలువైన టికెట్‌పై ఎలాంటి జీఎస్‌టీ ఉండదు.

ఇక ట్రోఫీ కూడా సరితూగేలా...

పురుషుల సింగిల్స్ విజేతతోపాటు మహిళల సింగిల్స్ చాంపియన్‌కూ ఒకే పరిమాణమున్న ట్రోఫీ అందజేయనున్న యూఎస్ ఓపెన్ నిర్వాహకులు



న్యూయార్క్: కొన్నాళ్ల కిందట గ్రాండ్‌స్లామ్ విజేతలకు ఇచ్చే ప్రైజ్‌మనీని సమం చేసిన నిర్వాహకులు ట్రోఫీల్లో మాత్రం అంతరాలు చూపుతున్నారు. కానీ ఇకమీదట సమానత్వం పాటించేందుకు సిద్ధమయ్యారు. తాజాగా యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ కొన్ని మార్పులతో జరుగుతున్న సంగతి తెలిసిందే. సింగిల్స్ స్పెషలిస్టులు, టాప్‌స్టార్లతో మిక్స్‌డ్ డబుల్స్ నిర్వహించారు. ఇప్పుడు మహిళల సింగిల్స్ విజేతకు ఇచ్చే ట్రోఫీని కూడా పురుషుల సింగిల్స్ విజేతకు దీటుగా ప్రదానం చేయనున్నారు. దీంతో మహిళలకు 'మినియేచర్' (చిన్న పరిమాణంలో) ట్రోఫీలనే వివక్షలకు ఈ యూఎస్ ఓపెన్‌తో తెరపడనుంది. రోలాండ్ గారోస్‌లో ఫ్రెంచ్ ఓపెన్ గెలిచిన అమెరికన్ స్టార్ కోకో గాఫ్ తాను అందుకున్న ట్రోఫీపై ఓ టిక్‌టాక్ రీల్ కూడా చేసింది. వివక్షాపూరితమైన ట్రోఫీ సైజ్ వీడియోను ఏకంగా 20 లక్షలకు పైగా వీక్షించారు. వ్యంగ్యంగా ఆమె పెట్టిన వీడియోకు అప్పట్లో లక్షల్లో లైక్‌లు వచ్చాయి. ఒకే టోర్నీ... ఒకే వేదిక... ఒకే ఈవెంట్ (సింగిల్స్)... అయినప్పుడు ట్రోఫీల్లో వ్యత్యాసమేంటనే చర్చ కూడా జరిగింది. అయితే ఇప్పుడు యూఎస్ ఓపెన్‌లో మహిళల సింగిల్స్ విజేతకు ఇచ్చే ట్రోఫీతో ఆ లింగ వివక్ష ట్రోఫీకి కాలం చెల్లనుంది. వైరల్ వీడియోతో వార్తల్లో నిలిచిన కోకో గాఫ్ ఇప్పుడు ట్రోఫీ పరిమాణం సమానం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేసింది. సాధారణంగా పురుషుల ట్రోఫీతో పోల్చితే ఏడున్నర అంగుళాలు చిన్నగా ఉండే మహిళల ట్రోఫీ ఇకపై సరితూడే సమానం అయ్యింది. దీనిపై యూఎస్ ఓపెన్ నిర్వాహకులు గర్వంగా ప్రకటించుకున్నారు. లింగ సమానత్వం మా డీఎన్‌ఏలోనే ఉందని టోర్నీ డైరెక్టర్ స్టేసీ అలెస్టర్ చెప్పుకొచ్చారు.

జావేద్ పక్షాన నిలబడ్డానికి మరో జావేద్ లేరు

తస్లీమా నస్రీన్ ఆవేదన

న్యూఢిల్లీ: ప్రముఖ కవి, రచయిత జావేద్ అక్తర్‌ను బెంగాల్ ఇస్లాం మత ఛాందసవాదులు వ్యతిరేకించడంపై బంగ్లాదేశ్ రచయిత్రి తస్లీమా నస్రీన్ తీవ్రంగా స్పందించారు. ఒకప్పుడు ముంబైలో సంప్రదాయ వాదులు తనపై బెదిరింపులకు పాల్పడితే.. జావేద్ అక్తర్ అండగా నిలిచారని, ఇప్పుడు బెంగాల్‌లో ఇస్లాం గ్రూపులు జావేద్‌ను వ్యతిరేకిస్తుంటే ఆయనకు మద్దతుగా నిలిచి ఛాందసవాదులను ఓడించడానికి మరో జావేద్ లేకుండా పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. భావ ప్రకటనా స్వేచ్ఛ కోసం నిలబడిన వ్యక్తికి ఇప్పుడు మద్దతుగా నిలబడటానికి ఎవ్వరూ లేకపోవడం విషాదమన్నారు. మరాఠీలోకి అనువదించిన ఆమె పుస్తకం ఆవిష్కరణ కార్యక్రమానికి ముంబైలో 2000లో తస్లీమా హాజరు కావాల్సి ఉంది. ఆ సమయంలో ముంబైలోని ముస్లిం ఛాందసవాదులు ఆమె నగరంలో అడుగు పెడితే విమానాశ్రయాన్ని తగలబెడతామని ప్రకటించారు. ఇబ్బందులను నివారించేందుకు ఆమె ముంబై ప్రయాణాన్ని విరమించుకున్నారు. కానీ, జావేద్ అక్తర్ ఆమెకు అండగా నిలిచారు. కార్యక్రమానికి రావాలని కోరారు. అంతేకాదు, షబానా అజ్మీ, మహేష్ భట్, మరాఠీ ప్రచురణకర్త అశోక్ సహానీతో కలిసి ఆమెను స్వాగతించడానికి విమానాశ్రయానికి కూడా వెళ్లారు. 'నాకు భారీ భద్రత ఏర్పాటు చేయమని ప్రభుత్వాన్ని కోరింది ఆయనే. ఆ రోజు సెక్షన్ 144 అమలులో ఉంది. విధ్వంసం సృష్టించడానికి ప్రయత్నించిన ఛాందసవాదులను అరెస్టు చేశారు'అని ఆమె గుర్తు చేసుకున్నారు. కానీ ఈరోజు కోల్‌కతాలో భావ ప్రకటన స్వేచ్ఛ, లౌకికవాదం, ప్రజాస్వామ్యం గురించి మాట్లాడేందుకు ఎవరూ లేకపోవడం తనను బాధించిందన్నారు. తనను కోల్‌కతా నుంచి బలవంతంగా బయటికి పంపినప్పుడు మౌనంగా ఉన్నట్టే ఇప్పుడూ ఉన్నారని తస్లీమా అసహనం వ్యక్తం చేశారు.



ఉత్తరభారతాన ఎడతెగని వర్షాలతో యమున పరవళ్లు తొక్కుతోంది. ఉత్తరప్రదేశ్‌లోని మథుర జిల్లాలో యమున వరద ఇలా జనావాసాలను ముంచెత్తింది

‘ఆన్‌లైన్ గేమింగ్’ పిటిషన్లన్నీ సుప్రీంకే

కేంద్రం వినతికి అంగీకరించిన అత్యున్నత న్యాయస్థానం

న్యూఢిల్లీ: ఆన్‌లైన్ గేమింగ్–2025 చట్టాన్ని సవాల్ చేస్తూ వివిధ హైకోర్టుల్లో దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టుకు బదిలీ చేయాలని కేంద్రం విజ్ఞప్తి చేసింది. అంతేకాదు, ఇప్పటివరకు రిట్ పిటిషన్లపై ఇచ్చిన అన్ని ఆదేశాలను నిలిపివేయాలని కూడా కోరింది. ఒకే సమస్యపై విరుద్ధమైన తీర్పులను నివారించడానికేనని స్పష్టం చేసింది. ఈ మేరకు కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ వేసిన పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్తో కూడిన ధర్మాసనం గురువారం అంగీకరించింది. ఆన్‌లైన్ గేమింగ్ చట్టాన్ని సవాల్ చేస్తూ కర్ణాటక, ఢిల్లీ, మధ్యప్రదేశ్ హైకోర్టుల్లో కేసులు దాఖలయ్యాయి. కర్ణాటక హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయకుండా ఆపాలని కేంద్రం కోరింది. ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ చట్టం డబ్బుతో ఆడే అన్ని ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌లను నిషేధించింది. దీని ప్రకారం డబ్బుతో ఆటలాడటం, ఆర్థిక లావాదేవీలు జరపడం బెయిల్‌కు సైతం వీల్లేని నేరాలవుతాయి. ఇందుకుగాను మూడేళ్ల జైలు, రూ.కోటి వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. నేరం పునరావృతమైతే జరిమాన రూ.2 కోట్ల వరకు ఉంటుంది. ప్రకటనలకు ప్రచారం చేస్తే రెండేళ్ల జైలు శిక్ష, రూ.50 లక్షల జరిమానా విధిస్తుంది. డబ్బుతో సంబంధం లేని గేమ్స్‌కు మాత్రమే చట్టబద్ధత ఉంది.

ఢిల్లీలో రూ. 24కే కిలో ఉల్లి

సాక్షి, న్యూఢిల్లీ: దేశ వ్యాప్తంగా పెరుగుతున్న ఉల్లి ధరలను కట్టడి చేసేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. దేశ రాజధాని ఢిల్లీ సహా, ఆర్థిక రాజధాని ముంబై, అహ్మదాబాద్ నగరాల్లో గురువారం నుంచి కిలో ఉల్లి రూ.24కే అందుబాటులోకి తెచ్చింది. నేషనల్ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (నాఫెడ్), నేషనల్ కోఆపరేటివ్ కన్జ్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌సీసీఎఫ్), కేంద్రీయ భండార్, మొబైల్ వ్యాన్‌ల ద్వారా ఉల్లి విక్రయాలను మొదలుపెట్టింది. ఒక్క ఢిల్లీలోనే 161 ప్రాంతాల్లో ఉల్లి అమ్మకాలు జరుగనున్నాయి. శుక్రవారం నుంచి రాయితీ ఉల్లి విక్రయాలు చెన్నై, గౌహతి, కోల్‌కతా సహా మరిన్ని నగరాలకు విస్తరించనున్నారు. డిసెంబర్ వరకు ఈ అమ్మకాలు కొనసాగనున్నాయి. ధరల స్థిరీకరణ నిధి పథకంలో భాగంగా 3 లక్షల టన్నుల ఉల్లిపా యల బఫర్ స్టాక్‌ను ఇందుకోసం కేంద్రం విడుదల చేసింది. కాగా, ఈ ఏడాది ఉల్లి ఉత్పత్తి 3.07 కోట్ల లక్షల టన్నులుంటుందని కేంద్రం అంచనా వేస్తోంది. ఇది గత ఏడాది కంటే 27శాతం అధికం. పెరిగిన టమాటా ధరను నియంత్రించేందుకు ఢిల్లీలో కేంద్రం కిలో రూ.30 చొప్పున విక్రయాలను మొదలుపెట్టింది.

నూర్ ఖాన్ ఎయిర్ బేస్ పునర్నిర్మాణం

ఆపరేషన్ సిందూర్‌లో దెబ్బతిన్న పాక్ వైమానిక స్థావరం

కరాచీ: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో ధ్వంసమైన నూర్ ఖాన్ ఖాన్ వైమానిక స్థావరాన్ని పాకిస్తాన్ తిరిగి నిర్మించుకునే పనిలో పడింది. ఇటీవల చైనాలోని తియాంజిన్‌లో జరిగిన ఎస్‌సీవో శిఖరాగ్రానికి పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ ప్రత్యేక జెట్ విమానం రావల్పిండిలోని ఈ స్థావరం నుంచే బయలు దేరిందని సమాచారం. భారత్ క్షిపణి దాడుల్లో తీవ్రంగా ధ్వంసమైన ప్రాంతానికి కొద్ది మీటర్ల దూరంలోనే మునీర్ ప్రయాణించిన విమానం రన్ వే మొదలవుతుంది. ఈ విషయాన్ని ఇంటెల్ ల్యాబ్‌లోని జియో ఇంటెలిజెన్స్ పరిశోధకుడు డామియన్ సిమోన్ ధ్రువీకరించారు. పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ మునీర్ వాడే గ్లోబల్ 6000 మిలటరీ రవాణా విమానం ఇక్కడే పార్కు చేసి ఉందని సిమోన్ తెలిపారు. ఆ ప్రాంతంలో గతంలో స్పెషలైజ్డ్ మిలటరీ ట్రక్కులు ఉండేవి. గగనతల, భూతల వ్యవస్థలతో కమ్యూనికేషన్‌ను కొనసాగించేందుకు వీటిని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లుగా వినియోగించే వారు. అయితే, భారత్ దాడుల్లో ఈ ట్రక్కులు, పక్కనున్న నిర్మాణాలు కూడా ధ్వంసమయ్యాయి. దెబ్బతిన్న వాటిని పూర్తిగా తొలగించేసి నాలుగు నెలల అనంతరం ఇప్పుడు తాజాగా ఆదే ప్రాంతంలో నూర్ ఖాన్ బేస్‌కు సంబంధించిన పునాదులు, గోడల నిర్మాణ పనులు మొదలైనట్లు సిమోన్ వివరించారు. గతంలో గోడల నిర్మాణం తీరు, ప్రస్తుత నిర్మాణ తీరును పోల్చితే ఈ విషయం అవగతమవుతోందన్నారు. వైమానిక కార్యకలాపాలకు అత్యంత కీలకమైన ఈ స్థావరాన్ని పూర్తి స్థాయిలో పునరుద్ధరించాలని పాకిస్తాన్ యోచిస్తున్నట్లు తెలుస్తుందని వివరించారు. బుర్రాక్స్ అని పిలుచుకునే 12వ నంబర్ స్క్వాడ్రన్ ఈ బేస్ నుంచే కార్యకలాపాలు సాగిస్తూంటుంది. ఈ విమానాలే పాక్ అధ్యక్షుడు, ప్రధానమంత్రి, సైన్యాధిపతులు, మంత్రులు తదితర వీఐపీల రవాణాకు వాతుంటారు. ఇటీవల పాక్ ప్రధాని షహబాజ్ ఓ కార్యక్రమంలో మేలో జరిగిన ఘటనను గుర్తుకు తెచ్చుకున్నారు. 'ఆ అర్ధరాత్రి దాటాక 2.30 గంటల సమయంలో జనరల్ మునీర్ నాకు ప్రత్యేకంగా ఫోన్ చేశారు. భారత్ మన దేశంపై క్షిపణులను ప్రయోగించింది. అందులో ఒకటి నూర్ ఖాన్ ఎయిర్‌పోర్టుపై పడిందని తెలిపారు'అని వివరించారు.

పోలీస్ స్టేషన్లలో సీసీటీవీలు పనిచేయడం లేదా?

రాజస్తాన్‌లో పరిస్థితిపై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ: రాజస్తాన్‌లోని పోలీస్ స్టేషన్లలో కెమెరాలు పనిచేయడం లేదని, కస్టడీ మరణాల కేసుల్లో సీసీటీవీ ఫుటేజీని పోలీసులు ఇవ్వడం లేదంటూ మీడియాలో వచ్చిన కథనాన్ని సుప్రీం కోర్టు గురువారం సుమోటోగా స్వీకరించింది. పిల్ వేయాలని జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం ఆదేశించింది. గత 8 నెలల్లో పోలీసు కస్టడీలో 11 మరణాలు సంభవించాయని హిందీ దినపత్రిక దైనిక్ భాస్కర్ వార్తను ధర్మాసనం ప్రస్తావించింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తమ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, రికార్డింగ్‌ను కనీసం ఏడాది పాటు ఉంచాలని 2020లో ఇచ్చిన తీర్పును గుర్తు చేసింది. పోలీస్ స్టేషన్ల తరహాలోనే ఇంటెలిజెన్స్, సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్, విచారణలు నిర్వహించే, అరెస్టు చేసే అధికారం ఉన్న ఇతర ఏజెన్సీ కార్యాలయాల్లోనూ సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. స్టేషన్‌లోని ఏ విభాగాన్ని కూడా బయట నిర్వహించరాదని, అన్ని ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల వద్ద కెమెరాలు తప్పనిసరని తెలిపింది. రాత్రి పూట దృశ్యాలను సైతం వీక్షించగలిగేలా అమర్చాలని, వీడియో, ఆడియో రెండింటినీ రికార్డు చేయాలని కోర్టు పేర్కొంది. పరమ్‌వీర్ సింగ్ సైని అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ తీర్పు వెలువరించింది. అంతకు ముందు, 2015లో డీకే బసు వర్సెస్ స్టేట్ ఆఫ్ వెస్ట్ బెంగాల్ కేసులోనూ మానవ హక్కుల ఉల్లంఘనలను తనిఖీ చేయడానికి అన్ని పోలీస్ స్టేషన్లు, జైళ్లలో సీసీటీవీలను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. కానీ, ప్రస్తుతం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి నివేదిక కోరగా.. కేవలం 14 మాత్రమే స్పందించాయి. వాటిలోనూ పోలీస్ స్టేషన్లలో సీసీటీవీల ఏర్పాటు, పనితీరు గురించిన సరైన వివరాలు లేకపోవడంపై ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

సోనియాపై చర్యలు తీసుకోవాలి

న్యూఢిల్లీ: భారత పౌరసత్వం పొందకమునుపే కాంగ్రెస్ అగ్ర నేత సోనియా గాంధీ ఓటరుగా మారారంటూ ఢిల్లీ కోర్టులో కేసు నమోదైంది. 1983లో సోనియా భారత పౌరురాలిగా మారగా అంతకు మూడేళ్లు ముందుగా 1980లోనే ఆమె న్యూఢిల్లీ నియోజకవర్గంలో ఓటరుగా నమోదు చేయించుకున్నారని పిటిషనర్ వికాస్ త్రిపాఠీ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ వైభవ్ చౌరాసియాకు తన లాయర్ ద్వారా పిటిషన్ అందజేశారు. '1982లో ఓటరు జాబితా నుంచి సోనియా పేరును అధికారులు తొలగించారు. 1983లో పౌరసత్వం వచ్చాక తిరిగి చేర్చారు. 1982లో ఎందుకు తొలగించారనే దానిపై రికార్డులు లేవు. అయితే, 1980లో ఓటరు జాబితాలో చేర్చేందుకు ఆమె ఏం ధ్రువీకరణలిచ్చారు? ఫోర్జరీ పత్రాలతోనే ఈసీని ఆమె మోసం చేశారు'అని పిటిషనర్ ఆరోపించారు. దీనిపై తగు విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నెల 10న కోర్టు కేసు విచారణ చేపట్టనుంది.

కోట నీలిమకు ఈసీ నోటీసు

న్యూఢిల్లీ: ఢిల్లీలోని రెండు నియోజకవర్గాల పరిధిలో ఓటు హక్కును కలిగి ఉన్న ఆరోపణలపై కాంగ్రెస్ నేత పవన్ ఖేడాకు రెండు రోజుల క్రితం నోటీసులు పంపిన ఎన్నికల కమిషన్(ఈసీ)తాజాగా ఆయన భార్య కోట నీలిమకూ ఇదే విషయమై నోటీసు జారీ చేసింది. ఈ విషయాన్ని న్యూఢిల్లీ అసెంబ్లీ నియోజకవర్గం ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి గురువారం ఎ'క్స్'లో వెల్లడించారు. తెలంగాణలో కాంగ్రెస్ నాయకురాలైన కోట నీలిమ తనకు, తన భర్తకు ఈసీ నోటీసు పంపిన విషయమై స్పందించలేదు. న్యూఢిల్లీ, జంగ్‌పుర అసెంబ్లీ నియోజకవర్గాల ఓటరు జాబితాల్లో పేరున్నందుకు మంగళవారం ఈసీ ఖేడాకు నోటీసు పంపడం తెల్సిందే. అయితే, ఆయన భార్య నీలిమ పేరు హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌తోపాటు న్యూఢిల్లీ అసెంబ్లీల పరిధిలోనూ ఓటరుగా నమోదై ఉంది. ప్రజాప్రాతినిధ్య చట్టం –1950 ప్రకారం ఒకటికి మించి ఓటరు జాబితాల్లో పేరు నమోదు చేయించుకోవడం శిక్షార్హం. దీనిపై ఈనెల 10వ తేదీ ఉదయం 11 గంటల్లోగా వివరణ ఇవ్వాలని ఈసీ పేర్కొంది.



భలేగా బ్యాట్మింటన్ ఆడుతున్న రోబో శునకం

ఏఐ సాయంతో షటిల్ పథాన్ని కనిపెట్టి కొడుతున్న రోబో

కొందరు బ్యాట్మింటన్ ఆడుతుంటే దూరంగా పడిన షటిల్‌ను వాళ్ల పెంపుడు శునకం పరుగెత్తుకెళ్లి నోటితో కరిచి తెచ్చివ్వడం చూస్తూనే ఉంటా. అయితే ఈ రోబో శునకం మాత్రం షటిల్‌ను తెచ్చివ్వడానికి బదులు షటిల్ బ్యాట్ పట్టుకుని ఆటకు సిద్ధమైంది. రోబోటిక్స్, కృత్రిమ మేధ, క్రీడాంశాల సమ్మేళనంగా రూపుదిద్దుకున్న ఈ కొత్త తరహా రోబో ఇప్పుడు రోబోటిక్ రంగంలో చర్చనీయాంశమైంది. బ్యాడ్మింటన్‌లో చకాచకా షటిల్‌తో షాట్స్ కొడుతుంటే టకాటకా తిరిగి షాట్స్ కొడుతున్న చిన్న రోబో శునకానికి 'ఏఎన్‌వైఎంఏఎ–ఎనిమల్'అని పేరు పెట్టారు. స్విట్జర్లాండ్‌లోని ప్రభుత్వరంగ విశ్వవిద్యాలయం అయిన ఈటీహెచ్, జ్యూరిచ్‌లోని పరిశోధకులు ఈ రోబో శునకాన్ని రూపొందించారు. మెషీన్ లెర్నింగ్, రోబోటిక్స్‌ల మేలు కలయికగా దీనిని తయారుచేశామని పరిశోధకులు చెప్పారు. మనిషి తరహాలో వేగంగా కదులుతూ షటిల్ గమనాన్ని గుర్తిస్తూ తిరిగి షాట్ కొట్టగలడం ఈ రోబో శునకం ప్రత్యేకత. వర్సిటీలోని రోబోటిక్స్ సిస్టమ్స్ ల్యాబ్‌లోని ప్రొఫెసర్ మార్కో హట్టర్ సారథ్యంలోని పరిశోధనా బృందం ఈ రోబోను సృష్టించింది.

ఇది ఎలా పనిచేస్తుంది?

ఈ రోబో శునకం బరువు 50 కేజీలుకాగా ఎత్తు 1.5 అడుగులు మాత్రమే. ఎదురుగా షటిల్‌కాక్ దూసుకొచ్చే విధానాన్ని విశ్లేషించి, దానికి అనుగుణంగా కాళ్లు కదపాల్సిన విధానాన్ని విశ్లేషించి ఈ రోబోకు ప్రోగ్రామింగ్ చేశారు. ఎదురుగా నిలబడిన ఆటగాడు ఎంత ఎత్తు నుంచి షటిల్‌కాక్ కొట్టాడు? కాక్ ఎంత ఎత్తు నుంచి దూసుకొస్తోంది? ఎంత వేగంతో వస్తోంది? అది ఏ దిశలో నేలను తాకొచ్చు? అనే పలు అంశాలపై తొలుత పరిశీలనచేసి ఓ అంచనాకొచ్చారు. తర్వాత కాక్ పథానికి తగ్గట్లు ఎనిమల్ రోబో శునకం నాలుగు కాళ్లను ఎటు వైపునకు కదపాలి. పరుగెత్తేలా లేదంటే ఇంకా పైకి లేచి కొడితే సరిపోతుందా? ఒకవేళ పరిగెడితే వెంటనే పడిపోకుండా స్థిరంగా నిలదొక్కుకోవడం ఎలా? అనే అనేక అంశాలపై ముందస్తు అంచనాప్రోగ్రామ్‌లను రాసుకొని వాటితో తొలుత పరీక్షలు జరిపి విజయవంతమయ్యారు. తర్వాత అన్నింటినీ కలిపి ఆటగాడు కొట్టిన కాక్‌ను వేగంగా తిరిగికొట్టడం, అది కూడా కోర్టుకి లోపల పడేలా షాట్ కొట్టడం వంటివి ప్రోగ్రామింగ్‌కు జతచేశారు. ఆట వేగానికి తగ్గట్లుగా రోబో శునకం నాలుగు కాళ్లు మాత్రమే కాదు ప్రత్యేక 'చేయి'సైతం చురుకుగా కదిలేలా పలు మార్పులుచేశారు. ఎట్టకేలకు మనిషి ఆటను సైతం ఎదిరించేలా స్థాయికి రోబోను సృష్టించారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఉత్తమ వర్సిటీగా ఐఐఎస్‌సీ

అగ్రస్థానంలో ఐఐటీ మద్రాస్

- ఎన్‌ఐఆర్‌ఎఫ్ పదో ఎడిషన్ ర్యాంకింగ్స్ విడుదల

సాక్షి, న్యూఢిల్లీ: నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌ఐఆర్‌ఎఫ్) 2025లో ఓవరాల్ విభాగంలో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మద్రాస్ అగ్రస్థానాన్ని దక్కించుకుంది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్‌సీ) బెంగళూరు ఉత్తమ విశ్వవిద్యాలయంగా నిలిచింది. ఎన్‌ఐఆర్‌ఎఫ్ పదో ఎడిషన్ ర్యాంకింగ్స్‌ను కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ గురువారం ప్రకటించారు. ఐఐటీ మద్రాస్ అగ్రస్థానంలో నిలవడం వరుసగా ఇది ఏడోసారి. ఉత్తమ వర్సిటీగా బెంగళూరు ఐఐఎస్‌సీ నిలవడం వరుసగా ఇది పదో సంవత్సరం. ఓవరాల్ విభాగంలో ఐఐఎస్‌సీ బెంగళూరు రెండో స్థానంలో నిలవగా.. తరువాతి స్థానాల్లో ఐఐటీ బాంబే, ఐఐటీ ఢిల్లీలు నిలిచాయి. ఉత్తమ వర్సిటీల్లో రెండో స్థానాన్ని జేఎన్‌యూ, మణిపాల్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ మూడో స్థానాన్ని దక్కించుకున్నాయి. ఎన్‌ఐఆర్‌ఎఫ్ ర్యాంకింగ్స్‌లో మొదటి మూడు స్థానాల్లో కర్ణాటకకు చెందిన ఓ ప్రైవేట్ వర్సిటీ నిలిచింది. గతేడాది మూడో స్థానంలో నిలిచి జామియా మిలియా ఇస్లామియా వర్సిటీ ఒక స్థానం పడిపోయి నాలుగో స్థానంలో నిలిచింది.

ఇంజనీరింగ్ కళాశాలల జాబితాలో తొమ్మిది ఐఐటీలు టాప్ టెన్‌లో నిలిచాయి. ఈ విభాగంలో ఐఐటీ మద్రాస్ వరుసగా పదో సంవత్సరం అగ్రస్థానంలో నిలిచింది. ఐఐటీ ఢిల్లీ, ఐఐటీ బాంబేలు రెండు, మూడు స్థానాలను నిలుపుకొన్నాయి. టాప్ టెన్ జాబితాలో నిలిచిన ఏకైక నాన్ ఐఐటీ తిరుచిరాపల్లిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ. మేనేజ్‌మెంట్ కళాశాలల్లో ఐఐఎం అహ్మదాబాద్ తన అగ్రస్థానాన్ని నిలుపుకొంది. ఐఐఎం బెంగళూరు, ఐఐఎం కోజికోడ్ తరువాతి స్థానాలను దక్కించుకున్నాయి. టాప్ 10 బీ స్కూల్స్‌లో ఏడు ఐఐఎంలు నిలవగా.. ఏకైక టెక్ సంస్థ ఐటీ ఢిల్లీ ఈ విభాగంలో చోటు దక్కించుకుంది. వైద్య కళాశాలల్లో న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. పరిశోధనా సంస్థల్లో ఐఐఎస్‌సీ బెంగళూరు అగ్రస్థానంలో, ఐఐటీ మద్రాస్ తరువాతి స్థానాల్లో నిలిచాయి. ఓపెన్ విశ్వవిద్యాలయాల్లో ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్‌యూనివర్సిటీ(ఇగ్నో) మొదటి స్థానంలో, కర్ణాటక స్టేట్ ఓపెన్ యూనివర్సిటీ మైసూరు రెండో స్థానంలో నిలిచాయి. ఎన్‌ఐఆర్‌ఎఫ్ పదో ఎడిషన్ తొమ్మిది విభాగాల్లో ర్యాంకులిచ్చింది.

మావోయిస్టులతో జరిగిన ఎదురు కాల్పుల్లో నేలకొరిగిన ఇద్దరు జవాన్లు

రాంచీ: జార్ఖండ్‌లోని పలాము జిల్లాలో గురువారం మావోయిస్టులతో జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. మనాటు పోలీస్‌స్టేషన్ ప్రాంతంలోని కేదాల్ గ్రామంలో మావోయిస్ట్ కమాండర్ శశికాంత్ గంజు బృందం సంచరిస్తోందన్న సమాచారం మేరకు బుధవారం అర్ధరాత్రి నుంచి బలగాలు గాలింపు చేపట్టాయి. ఈ సందర్భంగా మావోయిస్టులు వారిపై కాల్పులు జరిపారు. కాల్పుల్లో ముగ్గురు భద్రతా సిబ్బందికి గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స అందుతుండగానే కానిస్టేబుళ్లు శంతన్ మెహతా, సునీల్ రామ్ తుదిశ్వాస విడిచారు. మరొకరు చికిత్స పొందుతున్నారు. నక్సల్స్‌కు జరిగిన నష్టం వివరాలు తెలియలేదు. తప్పించుకున్న మావోయిస్టుల కోసం గాలింపు ముమ్మరం చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా, శశికాంత్ తలపై రూ.10 లక్షల రివార్డు ఉంది.

రూ. 500 కోట్లు ఇవ్వకుంటే చంపేస్తా!

మహిళా జడ్జికి ఆగంతకుడి బెదిరింపు

రెవా(మధ్యప్రదేశ్): మధ్యప్రదేశ్‌లోని రెవా జిల్లా మహిళా న్యాయమూర్తికి బెదిరింపు లేఖ అందింది. రూ.500 కోట్లు వెంటనే చెల్లించాలని, లేదంటే చంపేస్తామంటూ అందులో హెచ్చరించాడు. తియోంథర్ కోర్టు ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ మోహిని భదౌరియాకి రెండు రోజుల క్రితం స్పీడ్‌పోస్ట్‌లో ఈ లేఖ అందింది. తానొక భయంకరమైన నేరగాడినని, అడిగినంత ఇవ్వకుంటే ప్రాణాలు తీస్తానని అందులో ఆగంతకుడు బెదిరించాడని పోలీసులు తెలిపారు. పొరుగునే ఉన్న యూపీలోని బరగా వద్దకు స్వయంగా వచ్చి ఇవ్వాలని అందులో డిమాండ్ చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు లేఖలోని పేరు ఆధారంగా ఆ ఆగంతకుడిని యూపీలోని ప్రయాగ్‌రాజ్ జిల్లా లోహగారాకు చెందిన సందీప్ సింగ్‌గా తేల్చారు. 'హనుమాన్' అనే దొంగల ముఠాకు చెందిన వాడినని విచారణలో అతడు తెలిపాడని పోలీసులు వెల్లడించారు. దీనిపై మరింత లోతుగా దర్యాప్తు చేపట్టినట్లు ప్రయాగ్‌రాజ్ పోలీసులు తెలిపారు.

పోర్చుగల్‌లో ఘోర విషాదం

16 మంది మృతి, 21 మందికి గాయాలు



లిస్బన్: పోర్చుగల్ రాజధాని లిస్బన్‌లోని ప్రముఖ పర్యాటక విశేషం 'గ్లోరియా ఫునిక్యులర్' స్ట్రీట్ కార్ ఘోర ప్రమాదానికి గురైంది. ఒక బోగీ అదుపు తప్పి కిందు దూసుకొచ్చి పక్కనున్న భవనాన్ని ఢీకొనడంతో 16 మంది చనిపోయారు. 21 మంది గాయపడ్డారు. 140 ఏళ్లుగా నిర్వహించే ఈ స్ట్రీట్ కార్‌లోని రెండు బోగీలుంటాయి. విద్యుత్ మోటార్లతో బోగీలు కేబుల్‌తో అనుసంధానించి ఉంటాయి. ఇందులో ఒకటి పైకి వెళ్తుంటే, మరోటి కింది వస్తుంటుంది. ప్రయాణ సమయం మూడే మూడు నిమిషాలు. ప్రయాణ దూరం 265 మీటర్లు. పర్వత శిఖరం పైనుంచి కిందకు మెలికలు తిరుగుతూ వెళ్లివచ్చే కేబుల్ కారులో ప్రయాణాన్ని పర్యాటకులు ఎంజాయ్ చేస్తారు. ఒక్కో బోగీలో 41 మందే ప్రయాణించే వీలుంటుంది. బుధవారం కిందికి వచ్చే బోగీ అదుపు తప్పి పక్కనుండే భవనాన్ని అతి వేగంగా ఢీకొట్టింది. ఆ తీవ్రతకు బోగీ మొత్తం నామరూపాల్లేకుండా నుజ్జయింది. దీంతో, అందులోని 16 మంది చనిపోయారు. పలువురి ఆరోగ్య పరిస్థితి విష మంగా ఉందని చెబుతున్నారు. బ్రేక్ పనిచేయకపోవడం లేదా కేబుల్ తెగిపోవడం వల్ల ప్రమాదం ఘటన జరిగి ఉండొచ్చన్న వార్తలపై అధికారులు స్పందించలేదు. మృతుల్లో పోర్చుగల్ వారితోపాటు జర్మనీ, స్పెయిన్, ఫ్రాన్స్, ఇటలీ, స్విట్జర్లాండ్, కెనడా, మొరాకో, దక్షిణ కొరియా, కేప్‌వెర్డె తదితర దేశాలకు చెందిన వారు ఉన్నారు. స్థానికంగా 'ఎల్వడోర్ డా గ్లోరియా' అని పిలుచుకునే ఈ స్ట్రీట్ కారుకు విదేశాల్లో ఎంతో క్రేజ్ ఉంది. అందుకే ఇలా పలు దేశాల నుంచి పర్యాటకులు ఏటా వస్తుంటారు. ఘటన నేపథ్యంలో పోర్చుగల్ ప్రభుత్వం గురువారం జాతీయ సంతాప దినంగా ప్రకటించింది.

పాక్‌లో ఆత్మాహుతి దాడి

15 మంది మృతి, 30 మందికి గాయాలు



క్వెట్టా: పాకిస్తాన్‌లోని కల్లోలిత బలూచిస్తాన్‌లో జరిగిన ఆత్మాహుతి దాడిలో 15 మంది ప్రాణాలు కోల్పోయారు. 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రావిన్స్ రాజధాని క్వెట్టాలోని స్టేడియంలో మంగళవారం రాత్రి బలూచిస్తాన్ నేషనల్ పార్టీ(బీఎన్‌పీ) ర్యాలీ నిర్వహించింది. అదే సమయంలో పార్కింగ్ ప్రాంతంలో భారీ పేలుడు సంభవించింది. ఈ సభకు 120 మంది పోలీసులతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామని బలూచిస్తాన్ మంత్రి మహ్మద్ కకర్ చెప్పారు. అందువల్లే సభాప్రాంగణంలోకి బాంబర్ రాలేకపోయాడన్నారు. ర్యాలీకి 200 అడుగుల దూరంలో ఆత్మాహుతి దాడి జరిగిందని, అదే జనం ఉన్న చోటుకు బాంబర్ చేరుకునుంటే ప్రమాద తీవ్రత భారీగా ఉండేదన్నారు. ఘటనకు తమదే బాధ్యతంటూ ఇస్లామిక్ స్టేట్ తీవ్రవాద సంస్థ ప్రకటించుకుంది. 2021లో చనిపోయిన బలూచిస్తాన్ మాజీ ముఖ్యమంత్రి అతావుల్లా మెంగాల్‌ను సంస్మరించుకునేందుకు బీఎన్‌పీ ఈ ర్యాలీ చేపట్టింది. పేలుడు ఘటనను పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ తీవ్రంగా ఖండించారు. బలూస్తాన్‌లో అలజడి సృష్టించేందుకు ఉగ్రవాదులు కుట్రపన్నారని ఆరోపించారు. అఫ్గానిస్తాన్, ఇరాన్‌లతో సరిహద్దులు పంచుకుంటున్న బలూచిస్తాన్ పాకిస్తాన్‌లోని అతిపెద్ద, అత్యంత నిరుపేద ప్రావిన్స్. ఇస్లామిక్ స్టేట్, ఇతర వేర్పాటువాద గ్రూపులు తరచూ పాల్పడే హింసాత్మక ఘటనలకు సాధారణ పౌరులు బలవుతున్నారు. 2024 ఫిబ్రవరిలో ఇస్లామిక్ స్టేట్ సంస్థ బలూచిస్తాన్‌లోని ఎన్నికల కార్యాలయాలే చేపట్టిన బాంబుదాడుల్లో 20 మంది చనిపోగా డజన్ల కొద్దీ జనం గాయపడ్డారు. నవంబర్‌లో క్వెట్టాలోని రైల్వే స్టేషన్‌లో బలూచ్ లిబరేషన్ ఆర్మీ(బీఎల్‌ఏ) జరిపిన బాంబు దాడిలో 20 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. బలూచ్ రాజకీయ ఖైదీల విడుదల డిమాండ్‌తో మార్చిలో బీఎల్‌ఏ 400 మంది ప్రయాణికులతో వెళ్తున్న రైలును హైజాక్ చేయడం తీవ్ర సంచలనం రేపింది.

ఎనిమిదేళ్లు ఆలస్యం ఎందుకైంది?

జీఎస్టీ సంస్కరణలపై చిదంబరం సూటి ప్రశ్న

న్యూఢిల్లీ: జీఎస్టీలో కేంద్ర ప్రభుత్వం సంస్కరణలు తీసుకురావడం మంచి పరిణామమే అయినప్పటికీ ఈ ప్రక్రియ ఎనిమిదేళ్లు ఆలస్యమైందని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి పి.చిదంబరం అన్నారు. జీఎస్టీలో లోపాలున్నాయని, వాటిని సరిచేయాలని ఎనిమిదేళ్ల క్రితమే తాము చెప్పామని గుర్తుచేశారు. గత ఎనిమిదేళ్లు నడిచిన మార్గం సరైంది కాదని ప్రభుత్వం ఇన్నాళ్లకు గుర్తించిందని, ఇప్పుడు యూటర్న్ తీసుకుందని ఎద్దేశాచేశారు. ఈ మేరకు ఆయన గురువారం ప్రకటన విడుదల చేశారు. జీఎస్టీ హేతుబద్ధీకరణ, రేట్ల తగ్గింపును స్వాగతిస్తున్నామని వెల్లడించారు. ఈ చర్యలన్నీ గతంలోనే తీసుకొనే ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. గూడ్స్ సర్వీసెస్ ట్యాక్స్ అనేది ఎల్లప్పుడూ గుడ్ అండ్ సింపుల్ ట్యాక్స్‌గా ఉండాలని సూచించారు. దానివల్ల పేదలకు, మధ్య తరగతికి లాభం జరుగుతుందన్నారు. వాస్తవానికి జీఎస్టీ రూపకల్పనలోనే ఎన్నో లోపాలు ఉన్నాయని, వాటిని సరిదిద్దడం పట్ల కేంద్ర మంత్రులు, బీజేపీ నేతలు కూడా హర్షం వ్యక్తంచేశారని చిదంబరం పేర్కొన్నారు.

కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై నియమించిన మొదటి కమిషన్?

కేంద్ర - రాష్ట్ర సంబంధాలు

రాజమన్నార్ కమిటీ (1969)

కేంద్ర-రాష్ట్ర సంబంధాలను సమగ్రంగా అధ్యయనం చేయడానికి తమిళనాడు ప్రభుత్వం జస్టిస్ రాజమన్నార్ కమిటీని 1969లో నియమించింది. ఇందులో పి.సి. చంద్రారెడ్డి, డాక్టర్ లక్ష్మణ్ స్వామి మొదలియార్ సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ 1971 మే 27న తన అధ్యయన నివేదికను సమర్పించింది.

రాజమన్నార్ కమిటీ భారత్‌లోని ఏకకేంద్ర ధోరణులకు 4 కారణాలు తెలిపింది. అవి:

1. భారత రాజ్యాంగం కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేక అధికారాలు ఇవ్వడం.
2. కేంద్రం, రాష్ట్రంలో ఒకే రాజకీయ పార్టీ పాలన.
3. తగినన్ని ఆర్థిక వనరులు లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఆధారపడటం.
4. కేంద్ర ప్రణాళిక రూపకల్పన, ప్రణాళిక సంఘం అధీకృత పాలన.

సూచనలు

- కేంద్ర-రాష్ట్ర సంబంధాల విషయంలో తలెత్తే వివాదాలను పరిశీలించడానికి ఒక అంతర్రాష్ట్ర మండలిని ఏర్పాటు చేయాలి.
- రాష్ట్రాల అవసరాలకు సంబంధించిన బిల్లులను అంతర్రాష్ట్ర మండలి అనుమతితోనే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి.
- కేంద్ర, ఉమ్మడి జాబితాల్లోని పాలనా పరమైన అంశాలను పునఃపరిశీలించడానికి ఒక ఉన్నత స్థాయి సంఘాన్ని ఏర్పాటు చేయాలి.
- రాజ్యసభలో అన్ని రాష్ట్రాలకు సమాన ప్రాతినిధ్యం ఇవ్వాలి.
- రాజ్యసభకు 12 మందిని నియమించే రాష్ట్రపతి అధికారాన్ని రద్దు చేయాలి.
- కేంద్ర మంత్రి మండలిలో అన్ని రాష్ట్రాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలి.
- పార్లమెంట్ చేసే అన్ని రాజ్యాంగ సవరణలను 2/3వ వంతు మెజార్టీతో రాష్ట్ర శాసనసభ ఆమోదించాలి.
- పన్నుల విధింపునకు సంబంధించిన అవశేష అధికారాలను రాష్ట్రాలకు ఇవ్వాలి.
- ప్రణాళిక, ప్రణాళికేతర వ్యయం కింద రాష్ట్రాలకు అందించే ఆర్థిక సహాయం ఆర్థిక సంఘం సూచనలకు అనుగుణంగా ఉండాలి.
- రాష్ట్రాల్లో రాష్ట్రపతి పాలన విధించడానికి అవకాశమిచ్చే రాజ్యాంగ అధికరణలు 356, 357, 365లను రద్దు చేయాలి.
- రాష్ట్రాల్లో ఉన్నత స్థాయి (హైకోర్టు) న్యాయమూర్తుల తొలగింపు ప్రక్రియలో శాసనసభ అభిప్రాయాన్ని కూడా తీసుకోవాలి.
- అఖిల భారత సర్వీసులైన ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌లను రద్దు చేయాలి.

రాజమన్నార్ కమిటీ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించలేదు. ఈ కమిటీ సిఫార్సులపై దేశవ్యాప్తంగా తీవ్ర స్థాయిలో విమర్శలు వచ్చాయి. దేశంలో వేర్పాటువాద శక్తులు బలపడుతుంటే జాతి నిర్మాణం, జాతీయ సమైక్యత కోసం కృషి చేయడానికి; విద్య, వ్యవసాయం, మౌలిక సదుపాయాలు,ఉత్పత్తి రంగాలను బలోపేతం చేసి సామాన్య మానవుడి సమస్యలను తీర్చడానికి ప్రయత్నాలు చేయాల్సి ఉండగా.. కేవలం రాష్ట్రాలకు అనుకూలంగా, ప్రాంతీయతత్వాన్ని ప్రోత్సహించే విధంగా సిఫార్సులు చేయడం సరికాదని పేర్కొన్నారు.



సర్కారియా కమిషన్‌ను కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై నియమించిన మొదటి కమిషన్‌గా పేర్కొంటారు. ఇందిరాగాంధీ హయాంలో కేంద్ర ప్రభుత్వం రంజిత్‌సింగ్ సర్కారియా అధ్యక్షతన ఈ కమిషన్‌ను నియమించింది. ఇది కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై విస్తృత అధ్యయనం చేసి సమగ్ర నివేదిక సమర్పించింది. అనేక అంశాలపై లోతైన విశ్లేషణ, వివరణాత్మక పరిశీలన చేసింది. స్ఫూర్తివంతమైన సంబంధాలను నెలకొల్పడానికి, సమాఖ్య వ్యవస్థను బలోపేతం చేయడానికి దోహదపడే సూచనలిచ్చింది. దేశ సమగ్రత, ఐక్యతకు తోడ్పడే సిఫార్సులు చేసింది.

ఆనందపూర్ సాహెబ్ తీర్మానం (1973)

1973లో పంజాబ్‌లోని ఆనందపూర్ సాహెబ్ ప్రాంతంలో అకాలీదళ్ పార్టీ సమావేశమై కేంద్ర-రాష్ట్ర సంబంధాల విషయంలో ఒక తీర్మానం చేసింది. దీన్నే 'ఆనందపూర్ సాహెబ్ తీర్మానం' అంటారు. ఇందులో కేంద్ర ప్రభుత్వ పరిధి ప్రధానంగా రక్షణ, అంతర్జాతీయ సంబంధాలు, కమ్యూనికేషన్లు, కరెన్సీ తదితర అంశాల వరకే పరిమితం కావాలని, భారత్‌లో నిజమైన సమాఖ్య వ్యవస్థ స్ఫూర్తి తేవాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించారు.

సూచనలు

- పంజాబ్ నుంచి తీసుకున్న ప్రాంతాలను ఇతర రాష్ట్రాల్లో చేర్చినా, వాటిని తిరిగి పంజాబ్‌కు అప్పగించాలి.
- బహిరంగ ప్రదేశాల్లో మత్తు పానీయాలు సేవించడం, ధూమపానాన్ని నిషేధించాలి.
- పంజాబ్ వెలుపల నివసించే అల్ప సంఖ్యాక వర్గాలకు(సిక్కులు) అన్ని రకాల రక్షణలు కల్పించాలి. వారి పట్ల ఎలాంటి వివక్ష చూపకూడదు.
- రక్షణ, విదేశీ వ్యవహారాలు, తంతి-తపాలా, కరెన్సీ, నాణేలు, రైల్వేలు మినహా మిగతా పాలనా పరమైన అంశాలన్నింటినీ కేంద్ర ప్రభుత్వ పరిధి నుంచి తప్పించి రాష్ట్రాలకు బదిలీ చేయాలి.
- మాజీ సైనికులకు పునరావాస సౌకర్యాలు, ఉపాధి అవకాశాలు కల్పించాలి.

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ తీర్మానం (1977)

కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం 1977లో ఒక విజ్ఞాపన పత్రం సమర్పించింది. ముఖ్యాంశాలు..

- భారత రాజ్యాంగంలో 'యూనియన్' అనే పదాన్ని తొలగించి 'సమాఖ్య' పదాన్ని చేర్చాలి.
- నూతన రాష్ట్రాల ఏర్పాటు ప్రక్రియలో సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాల అభిప్రాయాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలి.
- కేంద్ర ప్రభుత్వ అధికార పరిధిని తగ్గించాలి.
- రాజ్యసభకు కూడా లోక్‌సభతో సమానంగా అధికారాలను బదలాయించాలి.
- రాష్ట్రపతి పాలన, ఆర్థిక అత్యవసర పరిస్థితి లాంటి అధికారాలను తొలగించాలి.
- జాతీయ అభివృద్ధి మండలి పేరును జాతీయ ఆర్థికాభివృద్ధి మండలిగా మార్పు చేసి దాని అస్తిత్వాన్ని బలోపేతం చేసి పరిరక్షించాలి.
- త్రి భాషా సూత్రాన్ని అమలు చేయడానికి గట్టి ప్రయత్నం చేయాలి.
- ఆదాయ పన్నుపై సర్వీస్ చార్జీలను ప్రత్యేక సందర్భాల్లోనే విధించాలి.
- ఆర్థిక సంఘంలో సభ్యులుగా ఆర్థిక నిపుణులనే నియమించాలి.
- దేశంలోని అన్ని రాష్ట్రాలతో సంప్రదించి ఇండియన్ ఇంజినీరింగ్ సర్వీస్, ఇండియన్ హెల్త్ సర్వీసు, ఇండియన్ ఎడ్యుకేషన్ సర్వీసులను ఏర్పాటు చేయాలి.
- మంత్రులపై విచారణ కమిషన్ ఏర్పాటు చేసే సందర్భంలో పార్లమెంట్ అనుమతి తీసుకోవాలనే నిబంధన విధించాలి.
- రాష్ట్రాల్లో శాసనమండలి ఏర్పాటు, రద్దు విషయంలో పార్లమెంట్ నిర్ణీత సమయంలోనే తన అభిప్రాయం వ్యక్తం చేయాలి.
- ప్రణాళిక సంఘం, ఆర్థిక సంఘం మధ్య విధుల విభజన హేతుబద్ధంగానే ఉంది కాబట్టి దీన్ని కొనసాగిస్తూ పరిపుష్టం చేయాలి.
- దేశ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా జాతీయ స్థాయి కార్యక్రమాలను ప్రాంతీయ భాషల్లో ప్రచారం చేయాలి.
- ఉమ్మడి జాబితాలో పేర్కొన్న అంశాలపై పార్లమెంట్ చట్టం చేసేటప్పుడు రాష్ట్రాలను తప్పనిసరిగా సంప్రదించాలి.
- కేంద్ర ప్రభుత్వ బలగాలను రాష్ట్ర ప్రభుత్వాల అనుమతి లేకుండా పంపించవద్దు.
- గవర్నర్ నియామకం చేపట్టేటప్పుడు సంబంధిత రాష్ట్ర ముఖ్యమంత్రిని విధిగా సంప్రదించే విధంగా రాజ్యాంగ సవరణ చేయాలి.
- టెలివిజన్, రేడియోలకు స్వయం ప్రతిపత్తి అవసరం లేదు కాబట్టి వాటి పనితీరును వికేంద్రీకరించాలి.
- అంతర్రాష్ట్ర మండలి వ్యవస్థను పునర్ వ్యవస్థీకరించాలి.
- అంతర్రాష్ట్ర మండలిని శాశ్వత ప్రాతిపదికపై ఏర్పాటు చేయాలి.
- రాష్ట్ర ప్రభుత్వాలకు కార్పొరేషన్ పన్నులో వాటా కల్పించాలి.
- భాషాపరమైన అల్ప సంఖ్యాక వర్గాల వారికి ప్రత్యేక కమిషన్ నియమించి అభివృద్ధిని సమీక్షిస్తూ ఉండాలి.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ పాలిటీ

సర్కారియా కమిషన్ (1983)

కేంద్ర - రాష్ట్ర సంబంధాలను అధ్యయనం చేయడానికి 1983 జూన్ 9న కేంద్ర ప్రభుత్వం రంజిత్‌సింగ్ సర్కారియా అధ్యక్షతన కమిషన్‌ను నియమించింది. ఇందులో బి.శివరామన్, ఎస్.ఆర్. సేన్ సభ్యులుగా; ఆర్.ఎం.సుబ్రహ్మణ్యం కార్యదర్శిగా; ఎల్.ఎన్. సిన్హా రాజ్యాంగ సలహాదారుడిగా వ్యవహరించారు. ఈ కమిషన్ 247 సిఫార్సులతో సుమారు 5000 పేజీల నివేదికను 1987 అక్టోబర్ 27న కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. కేంద్ర ప్రభుత్వం సుమారు 230 సిఫార్సులపై నిర్ణయాలు తీసుకొని 170 సిఫార్సులను అమలు చేసింది.

ముఖ్యమైన సిఫార్సులు

కేంద్ర - రాష్ట్ర ఆర్థిక సంబంధాలు

కార్పొరేట్ పన్నును కేంద్ర-రాష్ట్రాలు పంచుకునేలా రాజ్యాంగాన్ని సవరించాలని సర్కారియా కమిషన్ సిఫార్సు చేసింది. తగిన రీతిలో పన్ను, ఎక్సైజ్ సుంకాలు పంచుకోవడంలో మార్పులు చేయాలని పేర్కొంది. అధికరణ 269ని సవరించి ప్రభుత్వ ప్రసార సంస్థల్లో వ్యాపార ప్రకటనలపై పన్ను విధించి దాన్ని పూర్తిగా రాష్ట్రాలకు ఇవ్వాలని సూచించింది. వృత్తి పన్ను, వాణిజ్య పన్నుల పరిమితిని పెంచాలని, ఆదాయ పన్ను మీద అదనపు సుంకం, పరిమిత ప్రయోజనాలకు పరిమిత గడువునే విధించాలని సిఫార్సు చేసింది.

రైల్వే ప్రయాణికుల చార్జీలపై పన్ను ప్రాతిపదికగా రాష్ట్రాలకు గ్రాంటులు ఇవ్వాలని సిఫార్సు చేసింది. ఖనిజాల రాయల్టీ రేట్లను ప్రతి నాలుగేళ్లకు కాకుండా రెండేళ్లకే సమీక్షించాలని సూచించింది. ఆర్థిక సంఘం నిర్ణయాలు తీసుకునే ముందు రాష్ట్రాలను సంప్రదించాలని సలహా ఇచ్చింది. సిఫార్సులను అమలు చేయడంలో ఆలస్యం చేయకూడదని కూడా పేర్కొంది.

కేంద్ర - రాష్ట్ర శాసన సంబంధాలు

- కేంద్ర జాబితాలోని ఎంట్రీ 97ను సవరించి అవశిష్ట అంశాలను (పన్నులు కాకుండా) ఉమ్మడి జాబితాలోకి మార్చాలని సూచించింది. ఉమ్మడి జాబితా విషయంలో కేంద్ర ప్రభుత్వం దేశ ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకొని ఏదైనా నూతన చట్టాన్ని రూపొందించేటప్పుడు రాష్ట్రాలను తప్పక సంప్రదించాలని సూచించింది. ఈ విషయంలో మంచి సంప్రదాయాలను నెలకొల్పాలని పేర్కొంది.
- రాష్ట్ర విధానసభ, విధాన మండలి ఏర్పాటుకు లేదా రద్దుకు ఆమోదించిన తీర్మానాన్ని రాష్ట్రపతి సహేతుక కాల వ్యవధిలో అనుమతించాలని, కేంద్ర ప్రభుత్వ సూచనలతో పాటు పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలని సిఫార్సు చేసింది. పార్లమెంట్ దాన్ని ఆమోదించవచ్చు లేదా తోసిపుచ్చవచ్చు. ఆ శాసనం పార్లమెంట్ ఆమోదం పొందితే, కేంద్ర ప్రభుత్వం దాని అమలుకు చర్యలు తీసుకోవాలి. అవసరమైతే అధికరణ 169ని దీనికి అనుగుణంగా సవరించాలని సూచించింది.
- రాష్ట్రానికి సంబంధించిన బిల్లులను గవర్నర్ కేంద్రం పరిశీలనకు పంపించడం గురించి సర్కారియా కమిషన్ సవివరమైన సూచనలు చేసింది. నిర్ణీత కాలంలో బిల్లులను పరిశీలించడంతో పాటు సాధారణ పరిస్థితుల్లో బిల్లును ఆమోదించాలని, విధానపర లోపాలున్నాయని లేదా త్వరలో సమగ్ర బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబోతున్నామనే నెపంతో తిరస్కరించకూడదని కమిషన్ సూచించింది. బిల్లును తిరస్కరించడానికి కారణాలను సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేయాలి.

కేంద్ర - రాష్ట్ర పరిపాలనా సంబంధాలు

- అధికరణం 159ని సవరించి గవర్నర్ నియామకంలో రాష్ట్ర ముఖ్యమంత్రిని సంప్రదించేలా చూడాలని సర్కారియా కమిషన్ సూచించింది. గవర్నర్‌గా నియమించే వ్యక్తికి కింద పేర్కొన్న లక్షణాలు ఉండాలని కమిషన్ సిఫార్సు చేసింది.
  1. ఏదైనా ఒక రంగంలో ప్రముఖ వ్యక్తిగా ఉండాలి.
  2. రాష్ట్రేతర వ్యక్తి అయుండాలి.
  3. రాజకీయాల్లో ఎక్కువగా పాల్గొనని, ముఖ్యంగా.. ఆ ప్రాంత రాజకీయాలతో పెద్దగా సంబంధం లేని వ్యక్తి అయుండాలి.

  కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి చెందిన వ్యక్తిని ఇతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు గవర్నరుగా పంపవద్దని కూడా సర్కారియా కమిషన్ సూచించింది.
- గవర్నర్ నియామకంలో ఉప రాష్ట్రపతి, లోక్‌సభ స్పీకర్, ప్రధానమంత్రిని సంప్రదించడం మంచిదని కమిషన్ సూచన. గవర్నర్లను పదవీకాలం పూర్తయ్యే వరకూ కొనసాగించాలని, ఒకవేళ ముందే తొలగిస్తే.. ఏ కారణం వల్ల అలా చేస్తున్నారో తెలపాలని పేర్కొంది. తగిన వివరణ ఇవ్వడానికి గవర్నర్‌కు అవకాశం కల్పించాలని సిఫార్సు చేసింది.
- గవర్నర్ ఇచ్చిన వివరణను రాష్ట్రపతి, స్పీకర్, పదవీ విరమణ చేసిన ఉన్నత న్యాయమూర్తితో కూడిన సలహా సంఘం పరిశీలించాలని కమిషన్ పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ ముందు ఆ గవర్నర్ తొలగింపునకు సంబంధించి వ్యాఖ్య చేయాలని సూచించింది. అలాంటి వ్యక్తి పదవీ విరమణ తర్వాత గవర్నర్, ఉప రాష్ట్రపతి పదవులు తప్ప ఎలాంటి కేంద్ర, రాష్ట్ర పదవులను చేపట్టకుండా, రాజకీయాల్లోకి రాకుండా అనర్హత విధించాలని సూచించింది. పదవీ విరమణ ప్రయోజనాలు ఏర్పరచాలని తెలిపింది. అధికరణం 163లో ఉన్న గవర్నర్ వివేచనాత్మక అధికారాన్ని ఏ మాత్రం మార్చకూడదని, ఆ అధికారాన్ని ఎలా ఉపయోగించాలనే విషయంలో మార్గదర్శక సూత్రాలు ఏర్పర్చడం సాధ్యం కాని పని అని తెలిపింది.

Sivani is a wiser girl than Bhavani



విశేషణాలు (Adjectives)

వాడుకలో కొన్ని ముఖ్య నియమాలు

Rule 1:

కొన్ని క్రియలను adverbsతో modify చేయలేం. వీటిని verbs of incomplete predication అంటాం. అంటే వీటి అర్థం Complete అవడానికి ఏదైనా Complement అవసరం . ఈ క్రియలకు Adjectivesను complementగా వాడతారు.

Verbs: 'be' దాని రూపాలు (is, am, are, was, were), become, seem, appear, taste, smell, round, feel, turn, get, grow, keep, look, make, prove etc.

'Her voice sounds...' ఈ వాక్యానికి అర్థం లేదు. sounds how? అని ప్రశ్నిస్తే sweet, bitter, harsh. ఇలా ఏదో ఒక adjective complement అవసరం.

Ex: 1) She appears sad.
2) His statements sounds queer.
3) He feels sick.
4) The flowers smell sweet.
5) You have grown wise.
6) She looked dainty.
7) Seema is smart.

Rule: 2

కొన్ని adjectivesని comparative, superlative degreesలో చెప్పకూడదు. ఈ adjectives వాటికవే absolute conditionని తెలియజేస్తాయి.

Such adjectives are: perfect, excellent, unique, ideal, extreme, complete, eternal, supreme, etc.

Ex:1) I have never seen a more complete book on English figures of speech.('more' అవసరం లేదు)
2) Happiness is the chiefest aim of life. (chiefest తప్పు.'chief'అని రాయాలి)
3) Each person's fingerprints are most unique. ('most' అవసరం లేదు)
4) Most extreme poverty still exists in many parts of India ('most' అవసరం లేదు)

Rule: 3

-orతో అంతమయ్యే కింది comparatives లాటిన్ భాష నుంచి వచ్చాయి. వీటిని to తో ప్రయోగిస్తాం. thanతో కాదు.

Ex:1) Abdul is inferior to Amar in intelligence. (inferior than... అని రాయొద్దు)
2) Sunanda is senior to me.
3) All his friends are junior to him.
4) This incident took place prior to the fire accident.
5) The U turn is posterior to their deceptive win. (happened or existed later something else).

అలాగే -or తోనే అంతమయ్యే మరికొన్ని Comparative రూపాలు వాటి Comparative forceను కోల్పోతాయి. వాటిని మామూలు Positive Adjectives గానే వాడతాం. వీటిని Comparative, Superlative forms లేకుండానే ప్రయోగిస్తాం.

Ex:1) The interior walls of the house are painted white.
2) The exterior walls of the house are studded with mosai.
3) His words are of minor/major importance.

రెండు లేదా అంతకంటే ఎక్కువ వస్తువులను లేదా వ్యక్తులను పోల్చినప్పుడు thanను వాడుతాం . ఎంపిక చేసిన వాటి గురించి చెప్పేటప్పుడు ofను Comparative adjectivesగా తీసుకుంటాం.

Ex:1) Yogesh is more deceptive than Tabu.
2) Sivani is a wiser girl than Bhavani.

Note: Double comparative, double Superlativesను వాడొద్దు.

Ex:1) She is more wiser than her Sister(ఇది తప్పు. పై వాక్యంలో moreను తొలగించాలి)

కానీ సాహిత్యంలో Shakespeare లాంటి మహామహులు దీనికి మినహాయింపుగా అంగీకరించాలి.

Ex:1) The most Kindest Brutus.
2) The honester (in stead of 'more honest') attitude.

more hotter, most poorest ఇలా చాలా ప్రయోగాలు ఆయన సాహిత్యంలో మనకు కనిపిస్తాయి. మొత్తం మీద 'lesser'అనే ప్రయోగం వాడుకలో ఉంది. మంచి రచయితలు ఈ పదాన్ని స్వాగతిస్తున్నారు.

Ex:1) He chose the lesser of the two evils.

అలాగే Prefer, preferable అనే పదాలు Comparative force ని కలిగి ఉన్నాయి. వీటిని 'to'తో ప్రయోగిస్తాం.'than'తో కాదు. 'more' అనే పదాన్ని వీటితో వాడొద్దు.

Ex: 1) He has his own scheme he thinks preferable to that of his own brother.

ఎక్కడ 'fewer' అవసరమో అక్కడ 'less' వాడకూడదు. ఎందుకంటే 'less' quantityని, 'fewer' number ని denote చేస్తాయి. 'few' కు comparative.. fewer.

Ex:1) Fewer women wear hats these days.
2) There are fewer (not 'less') tigers than there were a hundred years ago.
3) I don't accept less than (not' fewer) a thousand for my each article. (here, a thousand rupees. Though 'rupees' are countable, indicating number, it is considered a Sum of amount).
4) This is a less bad (or less bad a) solution than I thought possible

'older' and 'oldest'లను persons, things రెండింటికీ వాడొచ్చు. కానీ elder and eldest వ్యక్తులకు మాత్రమే వాడాలి. ప్రత్యేకించి ఒకే కుటుంబ సభ్యులకు మాత్రమే.

'older, oldest' refer both to age and time while 'old, elder, eldest' refer to age only.

Ex:
1) Babu is older than Jagan.
2) Pandu is my elder brother.
3) Patricia is the eldest of the Vicar's family.
4) This is the oldest tree in the garden (not 'eldest tree')

In the sense of 'one who is older than another'.

5) Respect your elders.
6) He is elder to me (not 'elder than I').

'few' and 'a few' have different meanings. 'few' is negative and equivalent to hardly any, not many.

Ex: 1) Many are called but few are chosen.
2) Few people or persons can keep a secret.

'A few' is positive and equivalent to 'some'.

Ex:1) There are a few books in the old library.
2) I have a few friends.

'The few' denotes 'not many'. It has both a positive and a negative meaning.

Ex:1) The few are rich, the many are poor.
2) He lost the few thousands he had.
3) The money he lost was not much (Negative).

He lost all the money he had (Positive) ఇలాగే little, a little, the little ప్రయోగం కూడా.

'Little' means 'hardly any' or 'not much'.

It has a negative meaning.

Ex:1) There was little food left in the bowl.
2) There is little hope of his execution of promises made to the people.
3) 'A little' denotes 'some at least'. It has positive meaning.
4) Here is a little hope of his recovery.
5) I have a little money.
6) A little knowledge is always dangerous.

'the little' denotes 'the small quantity'. It has both a positive and a negative meaning.

Ex: 1) I spent the little money I had (నా దగ్గర ఉన్న కొంచెం డబ్బులు నేను ఖర్చు పెట్టేశాను).

It means:

The money I had wasn't much(negative).

I spent all the money I had (positive).

'Later' is the opposite of 'earlier' It refers to 'Time'.

Latest 'means ' recent', last up to now only'.

దీనికి మూడు రూపాలు:

'Late - later - latest.

'Last' mean 'final' or 'last-of all'

దీనికి 3 రూపాలు.

later - latter - last.

Practice Bits

1. Fill in the blank with suitable word.
There is no secret between her and ______
1) I 2) me
3) mine 4) he
2. Fill in the blank with correct pronoun.
______were you talking to?
1) To whom 2) Whom
3) Who 4) Whom
3. Supply suitable article.
He is______ heir of the property besides his cousin.
1) the 2) an
3) a 4) No article needed
4. He ______ (come) this morning.
Supply the correct verb form.
1) came 2) will come
3) has come 4) is coming.
5. There ______ many a flower in the garden.
1) is 2) are
3) was 4) were
6. He died ______ a fatal blow.
1) from 2) of
3) with 4) for
7. His ruling is not ______ than the ruling of the past.
1) more better 2) much better
3) better 4) more fairer
8. ______ you please help me do this?
1) Would 2) Will
3) Could 4) Can
9. He is born ______ very rich parents.
1) to 2) of
3) by 4) for
10. One of my friends ______ saved the life of a boy.
1) have 2) are saved
3) has 4) has been
11. I______ my bed. I will just come.
1) am making
2) am doing
3) am setting
4) am arranging
12. Dad, ______ Mr Sastry is on line for you. Come soon.
1) No article 2) a
3) the 4) one
13. He completed reading______ books he had.
1) a few 2) few
3) the few 4) some
14. If I had money, I ______ you.
1) will lend 2) will be lending
3) would have lent
4) could have lent
15. I am looking forward______ you very soon.
1) to meet 2) to meeting
3) meet 4) to be met

Key

1) 2	2) 2	3) 2	4) 3
5) 1	6) 1	7) 3	8) 3
9) 2	10) 3	11) 1	12) 2
13) 3	14) 4	15) 2	

'చాతుర్వర్ణ వ్యవస్థ' ఎక్కడ పేర్కొన్నారు?

భారతదేశంలో ఒక ప్రత్యేక రకమైన సామాజిక స్తరీకరణ (Social Stratification) కనిపిస్తుంది. దీన్ని 'కుల వ్యవస్థ'గా పేర్కొంటారు. ప్రపంచం మొత్తం మీద పరిశీలిస్తే కొన్ని ప్రాంతాల్లో కులం లక్షణాలు కనిపిస్తున్నప్పటికీ భారత్‌లోని కులవ్యవస్థ విశిష్టమైంది. హిందూ సామాజిక వ్యవస్థ కుల విధానంపై ఆధారపడి ఉంది. కులం అనేది ఏ మాత్రం సరళత లేని అంశంగా పరిణమించింది.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
సోషియాలజీ

కులం - కులతత్వం

కులం అనే పదం 'Caste' అనే పోర్చుగీస్ పదం నుంచి ఉద్భవించింది. కాస్ట్ అంటే..

1) వారసత్వం
2) వంశ పారంపర్యంగా కలిగేది

అనే అర్థాలున్నాయి.

కుల వ్యవస్థ భారతీయ సామాజిక వ్యవస్థకు ఒక 'మూలస్తంభం'గా ఉంది. హిందూ సమాజం మినహాయించి మరే ఇతర సమాజంలోనూ కులాలు కనిపించవు. వివిధ పరిశోధకులు కులానికి సంబంధించి భిన్న రకాల నిర్వచనాలు ఇచ్చారు.

'కొన్ని సమూహాలు లేదా కుటుంబాలు కలిసి ఒకే పేరుతో, ఒకే విధమైన వంశానుక్రమంతో ఉండి వంశపారంపర్యంగా ఒకే విధమైన పేరుతో గుర్తింపు పొందడాన్ని కులం అంటారు'
– హెర్బర్ట్ రిస్లీ

'కులం అంటే ఒక పరధీకృతమైన సమూహం (Closed Group)'
– టి.ఎన్. మదన్, డి.ఎన్. మజుందార్

'ఒక వర్గం (Single Group) కచ్చితంగా వారసత్వాన్ని పాటించినప్పుడు దాన్ని కులంగా పేర్కొనవచ్చు'
– సి.హెచ్. కూలే

ఎమ్.ఎన్. శ్రీనివాసన్, హట్టన్ కులం ఆవిర్భావం గురించి పేర్కొన్నారు.

కులం ఆవిర్భావం

భారతదేశంలో సాహిత్య రచన ఆర్యుల కాలంలో (క్రీ.పూ. 1500 నుంచి క్రీ.పూ. 500 మధ్య) జరిగింది. ఈ సాహిత్యాన్ని ప్రధానంగా 8 రకాలుగా గుర్తించవచ్చు. **అవి:**

1) వేదాలు
2) బ్రాహ్మణాలు
3) అరణ్యకాలు
4) ఉపనిషత్తులు

- వేదాంగాలు
- పురాణాలు
- ఉపవేదాలు
- ఇతిహాసాలు

వేదాలు, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులను 'శృతి సాహిత్యం' అంటారు. అంటే 'అతి పవిత్రమైనవి' అని అర్థం. వీటినే 'అపౌషీయాలు'గా పేర్కొంటారు. అంటే దేవతలు రాసి ప్రజలకు ఇచ్చారు అని అర్థం.

వేదం అంటే 'నాలెడ్జ్' అని అర్థం. వేదాలు నాలుగు. **అవి:**

1) రుగ్వేదం
2) యజుర్వేదం
3) సామవేదం
4) అథర్వణ వేదం

రుగ్వేదంలో పదో అధ్యాయంలో 1028 శ్లోకాలు ఉన్నాయి. ఈ అధ్యాయంలోనే 'పురుష సూక్తం' గురించి ఉంది. సమాజాన్ని వర్ణం ఆధారంగా బ్రహ్మ నాలుగు రకాలుగా సృష్టించాడని 'పురుష సూక్తం'లో పేర్కొన్నారు.

వర్ణం అంటే రంగు అని అర్థం. వర్ణం ఆధారంగా బ్రహ్మ కింద పేర్కొన్న సామాజిక వర్గాలను సృష్టించాడని రుగ్వేదంలో తెలిపారు.

1) బ్రాహ్మణులు (తెలుపు)
2) క్షత్రియులు (ఎరుపు)
3) వైశ్యులు (పసుపు)
4) శూద్రులు (నలుపు)



ఈ వర్గీకరణలో మొదటి 3 వర్ణాలకు చెందినవారిని 'ద్విజులు' అంటారు. అంటే రెండు సార్లు (తల్లి గర్భం నుంచి, ఉపనయనం నుంచి) జన్మించినవారని అర్థం. శూద్రులకు ఉపనయనం లేదు. వీరికి కర్మకాండలు చేసే అర్హత కూడా లేదు.

ఆర్యుల సాహిత్యంలోని వేదాంగాలను ఆరు రకాలుగా వర్గీకరించవచ్చు.

అవి: 1) శిక్ష, 2) నిరుక్త, 3) వ్యాకరణం, 4) జ్యోతిషం, 5) ఛందస్సు, 6) కల్ప

'కల్ప' అనేది యజ్ఞయాగాదుల గురించి తెలుపుతుంది. ఇందులో మూడు రకాల సూత్రాలు ఉన్నాయి. వీటిలో గృహ సూత్రం ప్రధానమైంది.

గృహ సూత్రం: రాజు మోక్షం సాధించడానికి చేయాల్సిన 16 పౌరుశ కర్మల గురించి పేర్కొంటుంది. వీటిలో 11వ కర్మ 'ఉపనయనం' గురించి వివరిస్తుంది. ఈ కర్మ నిర్వహిస్తే మోక్షం పొందొచ్చని భావిస్తారు.

- శూద్రులతో పాటు స్త్రీలకు కూడా ఉపనయనం లేదు.

వర్ణ వ్యవస్థ నిర్మితి, ఆచరణ, వివరణ అంతా సమాజంలో సామరస్యం సాధించడానికే ఏర్పాటైంది. కానీ చాతుర్వర్ణ వ్యవస్థలో పైవర్ణంవారు కింది వర్ణం అయిన శూద్రులను 'దాసులు'గా చూడటం ప్రారంభించారు. ఆ తర్వాత క్రమంగా వివిధ వృత్తులు ఏర్పడ్డాయి. కాలక్రమేణా బౌద్ధ, జైన మతాల ఆవిర్భావంతో సమాజంలో అనేక మార్పులు సంభవించాయి. అంతర్వర్ణ వివాహాలను అంగీకరించారు. అనులోమ, ప్రతిలోమ వివాహాలు కూడా జరిగాయి.

ఉన్నత వర్ణాలకు చెందిన పురుషుడు తక్కువ వర్ణాలకు చెందిన యువతిని వివాహం చేసుకోవడం 'అనులోమ వివాహం'. తక్కువ వర్ణంలోని పురుషుడు ఉన్నత వర్ణానికి చెందిన స్త్రీని వివాహం చేసుకోవడం 'ప్రతిలోమ (విలోమ) వివాహం'. ఈ విధంగా జరిగిన వివిధ రకాల వివాహాల కారణంగా 'వర్ణ సంకరం' ఏర్పడింది.

వర్ణ వ్యవస్థ పరివర్తన చెంది విస్తృతమవడం వల్ల జాతులు ఆవిర్భవించాయి. కాలక్రమేణా ఇవి కులాలుగా ఏర్పడ్డాయి. ఇలా ఏర్పడ్డ కులం తదనంతర కాలంలో అనేక ఉపకులాలుగా విభజితమైంది. ఈ విధంగా 'వర్ణ వ్యవస్థ' నుంచి 'కుల వ్యవస్థ' ఏర్పడింది.

కులం ఆవిర్భావ సిద్ధాంతాలు

హిందూ సమాజంలో కుల వ్యవస్థ ఒక ప్రత్యేక లక్షణం. ఇది ఎప్పుడు, ఏవిధంగా ప్రారంభమైందో స్పష్టంగా చెప్పలేనప్పటికీ కొంత మంది సామాజిక శాస్త్రవేత్తలు దీని పుట్టుక గురించి కొన్ని సిద్ధాంతాలు ప్రతిపాదించారు.

దైవాంశ సంభూత సిద్ధాంతం: దీని ప్రకారం కులవ్యవస్థ దైవాంశమైంది. హిందువులకు ప్రమాణం 'వేదం'. రుగ్వేదంలోని పురుష సూక్తంలో బ్రహ్మదేవుడు నాలుగు వర్ణాలను సృష్టించాడని పేర్కొన్నారు. భగవద్గీత కూడా అత్యంత ప్రాచీన గ్రంథం. హిందువులకు ప్రామాణికం. ఇందులో కృష్ణుడు తన వల్లే నాలుగు వర్ణాలు ఉద్భవించాయని చెప్పినట్లు పేర్కొన్నారు. విష్ణు పురాణం, వేదాల్లోనూ ఈ సిద్ధాంతం ప్రస్తావన ఉంది. దీన్ని శాస్త్రీయంగా అంగీకరించడానికి ఆధారాలు లేవు.

జాతి సిద్ధాంతం: ఈ సిద్ధాంతాన్ని హెర్బర్ట్ రిస్లీ అభివృద్ధి చేశాడు. ఇతడి ప్రకారం.. ఆర్యులు, ద్రావిడులు, మంగోలియన్ లాంటి వివిధ తెగల మధ్య సంఘర్షణలు తలెత్తినప్పుడు ప్రతి తెగ ప్రత్యేక లక్షణాలను కాపాడుకునే ఉద్దేశంతో ఒక సమూహంగా ఏర్పడి తర్వాత ఆ సమూహం 'కులం'గా మారింది. తమ వ్యక్తిత్వాన్ని కాపాడుకోవడానికి సమూహంలోని సభ్యులందరూ కట్టుబడి ఉండాల్సిన కొన్ని నియమాలను ఏర్పరచుకున్నారు. ఈ విధంగా అనేక కులాలు ఆవిర్భవించాయి.

వృత్తి సిద్ధాంతం: ఈ సిద్ధాంతాన్ని నెస్‌ఫీల్డ్ తెలిపాడు. ఇతడు కులం ఆవిర్భావానికి కారణం వృత్తి అని పేర్కొన్నాడు. వ్యవసాయం, పరిశ్రమల వల్ల జీవన క్రమంలో వచ్చిన మార్పుల ఆధారంగా కులాలు ఏర్పడ్డాయని ఈ సిద్ధాంతం వివరిస్తోంది. వ్యక్తులు నిర్వహించే వృత్తి ఆధారంగా ఒక స్థితి, ఒక ప్రత్యేకత ఏర్పడ్డాయి. లోహాల వినియోగం కంటే ముందు ఉన్న కులాలకు తక్కువ స్థాయి; లోహాలు, పరిశ్రమల ఆవిర్భావం తర్వాత ఉన్న వృత్తులకు 'ఉన్నత స్థాయి' ఉందని ఇతడు పేర్కొన్నాడు.

సంస్కార సిద్ధాంతం: దీన్ని ఎ.ఎం. హోకర్ట్ ప్రతిపాదించాడు. 'భారతదేశంలో మత సంస్కారాలకు అధిక ప్రాధాన్యం ఇస్తారు. ఇందులో భాగంగా మంత్రాలు చదవడం, ప్రదేశాన్ని శుభ్రం చేయడం, అలంకరించడం, మేళతాళాలు వాయించడం మొదలైన వాటి వల్ల కులాలు ఏర్పడ్డాయి' అని ఇతడు వివరించాడు.

భౌగోళిక సిద్ధాంతం: ఈ సిద్ధాంతాన్ని గిల్బర్ట్ ప్రతిపాదించాడు. దీని ప్రకారం.. భారతదేశం సువిశాలమైంది. వివిధ రకాల వాతావరణ పరిస్థితులు, వనరులను, సముద్ర తీర ప్రాంతాలు, నదీ మైదానాలు, మెట్ట ప్రాంతాలు, పర్వత ప్రాంతాలు లాంటివి ఉన్నాయి. ఇక్కడ నివసించే ప్రజలు ఆయా ప్రదేశాల్లోని పరిస్థితులకు అనుగుణంగా తమ జీవన విధానాన్ని సర్దుబాటు చేసుకొని జీవిస్తారు. వ్యవసాయం, పశుపోషణ, చేపలు పట్టడం ఈ విధంగానే ఏర్పడ్డాయి. ఇలాంటి జన సమూహాలే 'కులాలు'గా ఆవిర్భవించాయి.

సాంస్కృతిక సిద్ధాంతం: దీన్ని ఎస్.పి. రాయ్, అతడి అనుచరులు ప్రతిపాదించారు. దీని ప్రకారం సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవడానికి ఒక సమూహంలోని ప్రజలు ఆ సమూహాన్ని 'కులం'గా రూపొందించుకున్నారు.

మాదిరి ప్రశ్నలు

1. 'కులం' అనేది ఏ భాషా పదం నుంచి ఆవిర్భవించింది?
ఎ) ఫ్రెంచ్ బి) లాటిన్
సి) పోర్చుగీస్ డి) అరబిక్

2. 'కులవ్యవస్థ' దేని నుంచి ఉద్భవించింది?
ఎ) వర్ణ వ్యవస్థ బి) వర్గ వ్యవస్థ
సి) వృత్తి వ్యవస్థ డి) ఏదీకాదు

3. జతపరచండి.
1. జాతి సిద్ధాంతం ఎ) హెర్బర్ట్ రిస్లీ
2. వృత్తి సిద్ధాంతం బి) నెస్ ఫీల్డ్
3. సంస్కార సిద్ధాంతం సి) ఎ.ఎం. హోకర్ట్
4. భౌగోళిక సిద్ధాంతం డి) గిల్బర్ట్
ఎ) 1-ఎ, 2-బి, 3-సి, 4-డి
బి) 4-ఎ, 3-బి, 2-సి, 1-డి
సి) 1-ఎ, 2-డి, 3-బి, 4-సి
డి) 1-సి, 2-ఎ, 3-డి, 4-బి

4. వర్ణ వ్యవస్థ ప్రస్తావన ఏ 'వేదం'లో కనిపిస్తుంది?
ఎ) రుగ్వేదం బి) యజుర్వేదం
సి) సామవేదం డి) అధర్వణ వేదం

5. 'ఉపనయనం' ఏ వర్ణం వారికి వర్తించదు?
ఎ) తెలుపు బి) నలుపు
సి) ఎరుపు డి) పసుపు

6. 'చాతుర్వర్ణ వ్యవస్థ' ఎక్కడ పేర్కొన్నారు?
ఎ) వేదాలు బి) అరణ్యకాలు
సి) బ్రాహ్మణాలు డి) ఉపనిషత్తులు

7. కింద పేర్కొన్నవారిలో 'ద్విజులు' కాని వారు?
ఎ) బ్రాహ్మణులు బి) క్షత్రియులు
సి) వైశ్యులు డి) శూద్రులు

8. 'చాతుర్వర్ణ వ్యవస్థ'లో పై స్థాయి వారు?
ఎ) శూద్రులు బి) క్షత్రియులు
సి) బ్రాహ్మణులు డి) వైశ్యులు

9. 'ఉపనయనం' గురించి ఎందులో పేర్కొన్నారు?
ఎ) గృహ సూక్తం బి) శ్రేత సూక్తం
సి) సుళువ సూక్తం డి) ఏదీకాదు

10. 'కులవ్యవస్థ' ఎప్పుడు ఆవిర్భవించింది?
ఎ) 400 బి.సి. బి) 200 ఎ.డి.
సి) 1000 ఎ.డి.
డి) కచ్చితంగా చెప్పలేం

సమాధానాలు

1) సి; 2) ఎ; 3) ఎ; 4) ఎ; 5) బి; 6) ఎ; 7) డి; 8) సి; 9) ఎ; 10) డి.


A computer-intensive problem runs on..

BANK EXAMS
COMPUTER AWARENESS

CLASSIFICATION OF COMPUTERS

DIGITAL COMPUTER

A computer that performs calculations and logical operations with quantities represented as digits, usually in the binary number system.



(i) CLASSIFICATION BASED ON PURPOSE:

General purpose computers: These are designed to perform a range of tasks. They have the ability to store numerous programs, but lack in speed and efficiency.

Specific purpose computers: These are designed to handle a specific problem or to perform a specific task. A set of instructions is built into the machine.

(ii) CLASSIFICATION BASED ON SIZE AND PERFORMANCE WISE:


EMBEDDED COMPUTERS

It is a computer system with a dedicated function within a larger mechanical or electrical system, often with real-time computing constraints. Embedded systems are commonly found in consumer, cooking, industrial, automotive, medical, commercial and military applications such as microwave ovens, washing machines and dishwashers, include embedded systems to provide flexibility, efficiency and features.

MICRO COMPUTER OR PERSONAL COMPUTER

- **Desktop Computer:** a personal or micro-mini computer sufficient to fit on a desk.
- **Laptop Computer:** a portable computer complete with an integrated screen and keyboard. It is generally smaller in size than a desktop computer and larger than a notebook computer.
- **Palmtop Computer/ Digital Diary /Notebook /PDAs:** a hand-sized computer. Palmtops have no keyboard but the screen serves both as an input and output device.
- **Workstations**

A terminal or desktop computer in a network. In this context, workstation is just a generic term for a user's machine (client machine) in contrast to a"server" or "mainframe."



Mini Computer

It is a midsize computer in size and power, minicomputers lie between workstations and mainframes in general, a minicomputer is a multiprocessing system capable of supporting from 4 to about 200 users simultaneously.

Mainframe Computer

A very large and expensive computer capable of supporting hundreds, or even thousands, of users simultaneously. In some ways, mainframes are more powerful than supercomputers because they support more simultaneous programs. These are mainly used servers in banks.

Super Computer

The fastest and most powerful type of computer Supercomputers are very expensive and are employed for specialized applications that require immense amounts of mathematical calculations. For example, weather forecasting requires a supercomputer. Other uses of supercomputers include animated graphics, fluid dynamic calculations, nuclear energy research, and petroleum exploration.

ANALOG COMPUTER

An analog computer (spelt analogue in British English) is a form of computer that uses continuous physical phenomena such as electrical, mechanical, or hydraulic quantities to model the problem being solved

Hybrid Computer (Analog + Digital)

A combination of computers those are capable of inputting and outputting in both digital and analog signals. A hybrid computer system setup offers a cost effective method of performing complex simulations.

MODEL BITS

1. The product of two binary numbers (1011) and (1001) is____
1) 1011001 2) 1010100
3) 1100011 4) 100110
5) None of these

2. MS -DOS is usually supplied on a
1) Hard disk
2) floppy disk or diskettes
3) CD ROM 4) Cartridge tape
5) None of these

3. When a key is pressed on the keyboard, which standard is used for converting the keystroke into the corresponding bits?
1) EBCDIC 2) ASCII
3) ANSI 4) ISO
5) None of these

4. A thing present in real world in physical form is called ____
1) DBMS 2) Keywords
3) Modulation 4) Entity
5) None of these

5. Programming language built into user programs such as Word and Excel are known as____?
1) 4GLs
2)Visual programming languages
3) Object-oriented languages
4) Macro languages
5) None of these

6. A program that generally has more user-friendly interface than a DBMS is called a ____?
1) form 2) repository
3) back end 4) front end
5) None of these

7. Antivirus software is an example of____
1) a security utility
2) an operating system
3) business software
4) an office suite
5) None of these

8. System software is the set of programs that enables your computer's hardware devices and ____ software to work together.
1) application 2) processing
3) utility 4) management
5) None of these

9. In a ring topology, the computer in possession of the______ can trasmit data.
1) packet 2) token
3) access method 4) data
5) None of these

10. A computer-intensive problem runs on a ____.
1) supercomputer
2) mainframe 3) server
4) super PC 5) None of these

11. The term _____ designates equipment that might be added to a computer system to enhance its functionality.
1) peripheral device
2) system add-one 3) disk pack
4) digital device 5) None of these

12. A collection of interrelated files in a computer is a _____.
1) file manager 2) field
3) database 4) record
5) None of these

13. When installing _____, the user must copy and usually decompress program files from a CD-ROM or other medium to the hard disk.
1) programming software
2) applications software
3) applications hardware
4) system hardware
5) None of these

14. ____is the ability of an operating system to control the activities of multiple programs at the same time.
1) Multitasking 2) Streamlining
3) Multiuser 4) Simulation
5) None of these

15. Which of the following computer language is a mathematically oriented languages used for scientific problems?
1) FORTRAN 2) COBOL
3) LISP 4) PROLOG
5) APPLE

16. Which of the following terms is just the connection of personal networks that can be joined together?
1) Virtual private network
2) Internet 3) Intranet
4) Extranet 5) None of these

17. For large network which topology is used?
1) Star 2) Ring 3) Bus
4) Mesh 5) None of these

18. A special high-speed line used by large corporations to support digital communications is known as:
1) Satellite/ Air connection service lines
2) Cable modems
3) Digital subscriber lines
4) T1, T2, T3 and T4 lines
5) None of the above

19. A language that refers to the way people think mathematically is called as ____
1) Functional language
2) Cross-platform language
3) Event driven programming language
4) Object oriented language
5) None of these

20. When you are typing the text in a document, you would need to hit the enter key at the end of every ______.
1) line 2) sentence
3) paragraph 4) word 5) file

21. _____ displays each slide of the PPT as a thumbnail and is used to re-arrange them.
1) Slide Show 2) Slide Display
3) Slide Design 4) Slide Layout
5) Slide Sorter

22. If you want to find the Paste Special option, you would use the Clipboard group on the tab of PowerPoint _____
1) Home 2) Slideshow
3) Page Layout 4) Design
5) Insert

23. In a pull down menu if you see that a command appears faded, it means that _____
1) the command is not applicable to this document
2) the command is not accessible at the moment
3) there are no keystrokes equivalent to those commands.
4) None of these
5) All of these

KEY

1) 3 2) 2 3) 3 4) 4 5) 2
6) 4 7) 1 8) 1 9) 2 10) 1
11) 1 12) 3 13) 2 14) 1 15) 1
16) 3 17) 4 18) 4 19) 1 20) 3
21) 5 22) 1 23) 2